www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సాగుకు సున్నం..
రైతుకు దుఃఖం!
వ్యవ'సాయం' విస్మరించిన జగన్

పో.. పోరా.. శ్రీమంతుడా!
దత్తత వద్దు.. పల్లెలు బాగు చేయొద్దు

ఎన్ఆర్ఐలకు జగన్ మార్క్ బెదిరింపులు



సమగ్ర కథనాలు నేటి 'జన కేతనం'లో..

సోమవారం | 29-4-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 13 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: పంచమి ఉ. 7.58 తదుపరి షష్ఠి; నక్షత్రం: పూర్వాషాఢ తె. 4.42 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: మ. 2.22-3.57; దుర్ముహూర్తం: మ. 12.37-1.28, మ. 3.09-3.59; అమృతఘడియలు: రా. 11.55-1.30; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.5; సూర్యాస్తమయం: 6.31 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వంద బాదాడు.. వెయ్యి నొక్కాడు

జగన్ ఐదేళ్ల పాలన ఇదే: చంద్రబాబు

- తాడేపల్లి ప్యాలెస్‌ను బద్దలుకొడితే పేదల కడుపు నిండుతుంది
- క్లాస్‌వార్ అంటే అదీ!.. సీమలో 102 ప్రాజెక్టులు రద్దు చేశాడు
- జాబ్ కేలెండర్ ఇచ్చాడా?.. ఉద్యోగులకు న్యాయం చేశాడా?
- జే బ్రాండ్‌తో మహిళల మంగళసూత్రాలు తెంపేస్తున్నాడు
- ఆ నవరత్నాలు నవ మోసాలు.. వైసీపీ మేనిఫెస్టో అబద్ధాలపుట్ట
- మళ్లీ మోసపోతే రాష్ట్రాన్ని అమ్మేస్తాడు.. మేం రాగానే పింఛన్ 4 వేలు
- అంగన్‌వాడీ, హోంగార్డులు, పెన్షనర్లందరికీ అండగా ఉంటా
- మెగా డీఎస్సీపైనే తొలి సంతకం.. ఏటా 4 లక్షల ఉద్యోగాలు
- స్కిల్ పెంచేందుకు యువతకు శిక్షణ.. ఉద్యోగులకు న్యాయం
- 'సీమ' వలసల నివారణకు ప్రత్యేక ప్రణాళిక అమలు: బాబు



కర్నూలు జిల్లా గూడూరు సభకు హాజరైన జనం.. మేకపిల్లతో బాబు

కర్నూలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 'బటన్ నొక్కాను.. బటన్ నొక్కాను అంటూ బటన్‌రెడ్డి పదేపదే చెబుతున్నాడు. క్లాస్ వార్ అంటున్నాడు.. ఏది క్లాస్ వార్..? ఈ ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చింది పది రూపాయలు. రూ.వంద బాదేశాడు.. రూ.వెయ్యి నొక్కేశాడు.. తాడేపల్లి ప్యాలెస్‌ను బద్దలు కొడితే పేదల కడుపు నిండుతుంది.. క్లాస్ వార్ అంటే అదీ..' అని టీడీపీ అధినేత చంద్రబాబు విరుచుకుపడ్డారు. వైసీపీ నవరత్నాలు నవమోసాలని.. జగన్ ప్రకటించిన మేనిఫెస్టో అంతా అబద్ధాల పుట్టని ధ్వజమెత్తారు. 99.5 శాతం అమలు చేశామంటూ ప్రజలను మోసగిస్తున్నాడని.. మళ్లీ మోసపోతే రాష్ట్రాన్ని అమ్మేస్తాడని హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలనూ

మిగతా 14వ పేజీలో...

రిజర్వేషన్లపై జగన్‌ది తప్పుడు ప్రచారం

- 4% రిజర్వేషన్లపై సుప్రీంలో సొంత ఖర్చుతో పోరాటం చేసింది టీడీపీనే
- ఎన్డీయేతో ఉన్నప్పుడే విజయవాడ, కడపల్లో హజ్ హౌస్‌ల నిర్మాణం
- వైసీపీ పాలనలో అన్నీ అరాచకాలే
- ముస్లింలతో బాబు ఆత్మీయ భేటీ

కుల చిచ్చుకు జగన్ కుట్ర

కాపులు, దళితుల మధ్య గొడవలకు కుయుక్తులు: పవన్

- కాపు రిజర్వేషన్లను ఒప్పుకోని వ్యక్తితో ఆ వర్గం ఎమ్మెల్యేలు తిరుగుతున్నారు
- కాపులను తాకట్టుపెట్టే స్థాయి నాకుంటే ఓడిపోయేవాడినా?
- ఆ ఉద్యమం వైసీపీ నడిపించిందే!
- రిజర్వేషన్లు రావని తెలిసినా ఆ పార్టీ నేతలను ఎగదోశారు
- రైలును తగులబెట్టించారు
- ప్రత్తిపాడు, జగ్గంపేట సభల్లో పవన్



కిర్లంపూడి రోడ్‌షోలో పవన్ అభివాదం

కాకినాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల్లో కాపులకు, దళితులకు మధ్య చిచ్చు పెట్టాలనేదే సీఎం జగన్ కుయుక్తి అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో దున్నని భూమి, ఉండని ఇళ్లు.. అన్నీ జగన్ లాగేసుకుంటాడని స్పష్టం చేశారు. కాపుల రిజర్వేషన్ ఉద్యమం వైసీపీ కనుసన్నల్లో జరిగిందని ధ్వజమెత్తారు. ఆ పార్టీ కీలకనేతల కనుసన్నల్లో తుని రైలు దహనం ఘటన జరిగిందని మండిపడ్డారు. వైసీపీకి ఓటేస్తే మనల్ని మనమే కిరోసిన్ పోసుకుని తగలబెట్టుకున్నట్లని హెచ్చరించారు. ఆదివారం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం, జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడిలో జరిగిన ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. జగన్ ప్రభుత్వానికి అసలు ఓటెందుకు వేయాలని ప్రశ్నించారు. 'ఐదేళ్ల పాలనలో అవినీతిలో మునిగిపోయినందుకా.. మెగా డీఎస్సీ

మిగతా 14లో..

బ్యాంకు ఖాతాల్లోకే పింఛను

ఆధార్‌తో మ్యాప్ అయినవారికి నగదు బదిలీ.. బ్యాంకు ఖాతాలు లేకపోతే ఇంటి దగ్గరే

సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ.. పంచాయతీరాజ్ మార్గదర్శకాలు జారీ

అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లు లేకుంటే పింఛన్లు అందవు అన్నట్టుగా అవ్వా తాతలను ఇబ్బంది పెట్టిన జగన్ సర్కారు ఈసారి 'పద్ధతి' మార్చింది. పింఛన్ల పంపిణీ సజావుగా సాగాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు... ఆదివారం కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. మే, జూన్ నెలలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందీ లేకుండా పెన్షన్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం.. బ్యాంకు ఖాతాలు ఉన్న వారికి నగదు బదిలీ ద్వారా నేరుగా ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తారు. బ్యాంక్ అకౌంట్ ఆధార్‌తో మ్యాప్ అయిన లబ్ధిదారులందరికీ ఇది వర్తిస్తుంది. బ్యాంకు ఖాతాలు లేని వారు, దివ్యాంగులు, వయోవృద్ధులు, నడవలేక వీల్‌చైర్లకు పరిమితమైన వారికి... సచివాలయ ఉద్యోగులు ఇంటికే వెళ్లి పెన్షన్ పంపిణీ చేస్తారు. మే, జూన్ నెలల్లో పెన్షన్ల కోసం ఎవరూ సచివాలయాల వద్ద పడిగాపులు కాయకుండా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని శశిభూషణ్ ఆదేశించారు. నగదు బదిలీ జరిగే లబ్ధిదారుల పేర్లు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేసే సిబ్బంది మొబైల్ యాప్‌లలో కనిపించవన్నారు. నగదు బదిలీ ద్వారా పెన్షన్ పంపిణీ చేసే వారి వివరాలు గ్రామ, వార్డ్ సచివాలయాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. మే 1 తేదీన పంపిణీ ప్రారంభించి 5వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు.

పొన్నవోలుకు పదవి క్విడ్ ప్రో కో!

చార్జిషీట్లలో తండ్రి పేరు చేర్చినందుకు జగన్ మేలు.. చేర్పించింది కాంగ్రెస్ కాదు జగనే

వైఎస్ పేరు లేకుంటే బయటికి రావడం అసాధ్యమనే.. జగన్‌పై షర్మిల సంచలన ఆరోపణలు

విశాఖపట్నం/అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి 'క్విడ్ ప్రో కో'లో భాగంగానే అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ)పదవి ఇచ్చారని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు, సీఎం జగన్ సోదరి వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. సీబీఐ చార్జిషీటులో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు చేర్చడానికి పొన్నవోలు వేసిన పిటిషన్లే కారణమని.. జగన్ ఆదేశాల మేరకే ఆయన ఇలాచేశారని ఆరోపించారు. ఆదివారం ఉదయం విశాఖలోని స్టీల్‌ప్లాంటు సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షర్మిల మాట్లాడారు. వైఎస్ పేరును కాంగ్రెస్ పార్టీ సీబీఐ చార్జిషీటులో చేర్చిందని పులివెందుల సభలో జగన్ ఆరోపించినందుకే... తాను ఈ విషయాలు చెప్పాల్సి వస్తోందన్నారు. "జగన్ అక్రమాస్తుల కేసులో సీబీఐ చార్జిషీట్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరు చేర్చడానికి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వేసిన పిటిషన్లే కారణం. సీబీఐ తొలుత రాజశేఖర్‌రెడ్డి పేరు చేర్చలేదు. పొన్నవోలు చేర్పించేలా చేశారు. వైఎస్ పేరు సీబీఐ చార్జిషీట్‌లో లేకపోతే.. జగన్ జైలు నుంచి బయటకు రావడం అసాధ్యమని భావించారు. ట్రయల్ కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరేడు రోజుల్లోనే పొన్నవోలు సుధాకర్ రెడ్డిని అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ)గా నియమించారు. వీరిద్దరి మధ్య ఏ సంబంధమూ లేకపోతే అంత హడావుడిగా, తొందరగా ఎందుకు మేలు చేసినట్లు?" అని షర్మిల ప్రశ్నించారు. "చార్జిషీట్‌లో తండ్రి పేరును చేర్చేలా చేసిన వ్యక్తికి ఎవరైనా పదవి ఇస్తారా? నేనైతే ఇవ్వను. క్విడ్ ప్రోకోలో భాగంగానే పొన్నవోలుకు జగన్ పదవి ఇచ్చారు" అని తెలిపారు. వైఎస్ అంటే తనకు గౌరవమని పొన్నవోలు అబద్ధాలు చెప్పారని.. నిజంగా గౌరవముంటే చార్జిషీటులో వైఎస్ పేరు చేర్చాలని అన్ని కోర్టుల చుట్టూ తిరుగుతారా అని షర్మిల నిలదీశారు. తనను పొన్నవోలు సంస్కారం లేకుండా ఏకవచనంతో సంబోధిస్తూ... ఊగిపోతూ మాట్లాడారని ఆక్షేపించారు. తద్వారా జగన్ భక్తి, స్వామిభక్తి చాటుకున్నారన్నారు. తానెవరో జగన్‌కు తెలియదని పొన్నవోలు చెబుతున్నారని.. ముక్కూ ముఖం తెలియని వ్యక్తిని.. పైగా తండ్రిని దోషిగా చేస్తూ సీబీఐ చార్జిషీటులో పేరు చేర్చాలన్న వ్యక్తిని ఏఏజీగా అందలమెక్కిస్తారా అని ప్రశ్నించారు.

రుతురాజ్ షో

త్రుటిలో శతకం మిస్ 1 చెన్నై ఘనవిజయం

పేసర్ తుషార్‌కు నాలుగు వికెట్లు
సన్‌రైజర్స్‌కు మరో ఓటమి





తుషార్ దేశ్‌పాండే 4/27

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: కోల్‌కతా
కోల్‌కతా X ఢిల్లీ

చెన్నై: రెండు వరుస ఓటములతో డీలా పడిన చెన్నై సూపర్ కింగ్స్ అద్భుతంగా పుంజుకుంది. చెపాక్‌లో ఆల్‌రౌండ్ షోతో ఆధిపత్యం చూపుతూ సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 78 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. బ్యాటింగ్‌లో కెప్టెన్ రుతురాజ్ (54 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 98) త్రుటిలో శతకం కోల్పోగా.. బౌలింగ్‌లో పేసర్ తుషార్ దేశ్‌పాండే (4/27) రైజర్స్ వెన్నువిరిచాడు. అటు ఎస్ఆర్‌హెచ్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ నిరాశపరిచి, పట్టికలో నాలుగో స్థానానికి పడిపోగా.. సీఎస్‌కే మూడో స్థానానికి చేరింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 3 వికెట్లకు 212 పరుగులు చేసింది. డారిల్ మిచెల్ (32 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 52), శివమ్ దూబే (20 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 39 నాటౌట్) రాణించారు. ఉనాద్కట్, భువనేశ్వర్, నటరాజన్‌లకు ఒక్కో వికెట్ లభించింది. ఆ తర్వాత ఛేదనలో సన్‌రైజర్స్ 18.5 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. మార్‌క్రమ్ (32), క్లాసెన్ (20) మాత్రమే ఆకట్టుకున్నారు. పతిరన, ముస్తాఫిజుర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రుతురాజ్ నిలిచాడు.

బౌలర్ల హవా: ఫోర్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన రైజర్స్ జట్టు పేసర్ తుషార్ ధాటికి పవర్‌ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయింది. దీంతో ఏ దశలోనూ పోటీలోకి రాలేకపోయింది. మిడిలార్డర్‌లో మార్‌క్రమ్ కాస్త పోరాడినా.. 17 పరుగుల తేడాతో చివరి ఐదు వికెట్లు కోల్పోవడం దెబ్బతీసింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ హెడ్ (13), అన్మోల్‌ప్రీత్ (0) వికెట్లతో పేసర్ తుషార్ షాకిచ్చాడు. అలాగే మరో ఓపెనర్ అభిషేక్ (15)ను సైతం తన తర్వాతి ఓవర్‌లోనే అవుట్ చేయడంతో జట్టు పవర్‌ప్లేలో 53/3 స్కోరుతో నిలిచింది. అనంతరం సీఎస్‌కే బౌలర్లు పరుగులను పూర్తిగా నియంత్రించారు. దీంతో 7-11 ఓవర్ల మధ్య ఒక్క బౌండరీ కూడా రాలేదు. స్పిన్నర్ జడేజా తొమ్మిదో ఓవర్‌లో నితీశ్ (15) వికెట్ తీయగా, ఓపిగ్గా ఆడతున్న మార్‌క్రమ్‌ను పేసర్ పతిరన యార్కర్‌తో బౌల్డ్ చేయడంతో రైజర్స్ కష్టాలు ఆరంభమయ్యాయి. ఈ దశలో క్లాసెన్, సమద్ (19)ఆదుకునే ప్రయత్నం చేసినా.. భారీ షాట్లు ఆడలేకపోవడంతో రన్‌రేట్ పెరిగిపోయింది. దీంతో ఒత్తిడికి లోనైన క్లాసెన్ 16వ ఓవర్‌లో సిక్సర్‌కు ప్రయత్నించి పతిరనకు చిక్కాడు. అక్కడి నుంచి వరుస ఓవర్లలో సమద్, కమిన్స్ (5), షాబాజ్ (7), ఉనాద్కట్ (1)ల వికెట్లు టపటపా కోల్పోవడంతో 18.5 ఓవర్లలోనే రైజర్స్ ఆట ముగిసింది.

రుతురాజ్-మిచెల్ అండగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై ఇన్నింగ్స్‌లో కెప్టెన్ రుతురాజ్, డారిల్ మిచెల్ కీలక ఇన్నింగ్స్‌తో మెరిశారు. చివర్లో శివమ్ దూబే మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అయితే రైజర్స్ బౌలర్లు చివరి రెండు ఓవర్లలో 20 పరుగులే ఇవ్వడంతో చెన్నై స్కోరు 220లోపే ముగిసింది. ఓపెనర్ రహానె (9)ను మూడో ఓవర్‌లోనే భువనేశ్వర్ అవుట్ చేశాడు. కానీ మధ్య ఓవర్లలో రుతురాజ్‌కు అండగా డారిల్ మిచెల్ నిలిచాడు. ఈ సీజన్‌లో ఫామ్‌లేమితో ఇబ్బందిపడుతున్న మిచెల్ ఆరంభంలో నెమ్మదిగానే ఆడినా కుదురుకున్నాక బ్యాట్ ఝుళిపించాడు. తొలి 12 బంతుల్లో 11 రన్స్ చేసినా.. మొత్తంగా 29 బంతుల్లోనే ఐపీఎల్‌లో తొలి ఫిఫ్టీని పూర్తి చేశాడు. 27 బంతుల్లో సిక్సర్‌తో రుతురాజ్ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత వరుస ఫోర్లతో చెలరేగిన మిచెల్‌ను 14వ ఓవర్‌లో ఉనాద్కట్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో రెండో వికెట్‌కు 107 పరుగుల శతక భాగస్వామ్యం ముగిసింది. ఇక ఆ తర్వాత దూబే రాకతో చెన్నై రన్‌రేట్ ఎక్కడా తగ్గలేదు. 17వ ఓవర్‌లో అతడి రెండు సిక్సర్లతో 17 రన్స్ వచ్చాయి. తర్వాతి ఓవర్‌లోనూ అతడు 6,4తో మెరిశాడు. కానీ 19వ ఓవర్‌లో ఉనాద్కట్ కేవలం 8 పరుగులతో కట్టడి చేశాడు. అలాగే చివరి ఓవర్‌లో రుతురాజ్ సెంచరీ కోల్పోయినా.. ధోనీ (5 నాటౌట్) ఫోర్, దూబే సిక్సర్‌తో 12 పరుగులే వచ్చాయి.

ఐపీఎల్‌లో పరుగుల పరంగా హైదరాబాద్‌కు ఇదే అతిపెద్ద ఓటమి	ఈ లీగ్‌లో 150 మ్యాచ్‌లు గెలిచిన తొలి ప్లేయర్‌గా ఎంఎస్ ధోనీ	ఓ ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో ఎక్కువ క్యాచ్‌లు (5) పట్టిన ఫీల్డర్‌గా నబీతో సమంగా నిలిచిన మిచెల్

0 చెపాక్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఓడిన హైదరాబాద్

1 టీ20ల్లో ఎక్కువ (35) 200+ స్కోరు సాధించిన జట్టు చెన్నై సూపర్ కింగ్స్

2 ఒకే వేదికలో ఎక్కువ మ్యాచ్ (50)లు గెలిచిన రెండో జట్టుగా చెన్నై. వాంఖడేలో ముంబై 51 సార్లు గెలిచింది.

స్కోరుబోర్డు

చెన్నై: రహానె (సి) షాబాజ్ (బి) భువనేశ్వర్ 9, రుతురాజ్ (సి) నితీశ్ (బి) నటరాజన్ 98, మిచెల్ (సి) నితీశ్ (బి) ఉనాద్కట్ 52, దూబే (నాటౌట్) 39, ధోనీ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు : 9 ; మొత్తం (20 ఓవర్లలో) 212/3 ; వికెట్లపతనం :** 1-19, 2-126, 3-200 ; **బౌలింగ్ :** భువనేశ్వర్ 4-0-38-1, నితీశ్ కుమార్ 1-0-8-0, షాబాజ్ అహ్మద్ 3-0-33-0, నటరాజన్ 4-0-43-1, ఉనాద్కట్ 4-0-38-1, కమిన్స్ 4-0-49-0.

సన్‌రైజర్స్ : హెడ్ (సి) మిచెల్ (బి) తుషార్ 13, అభిషేక్ (సి) మిచెల్ (బి) తుషార్ 15, అన్‌మోల్‌ప్రీత్ (సి) మొయిన్ (బి) తుషార్ 0, మార్‌క్రమ్ (బి) పతిరన 32, నితీశ్ (సి) ధోనీ (బి) జడేజా 15, క్లాసెన్ (సి) మిచెల్ (బి) పతిరన 20, సమద్ (సి) సబ్ సమీర్ (బి) శార్దూల్ 19, షాబాజ్ (సి) మిచెల్ (బి) ముస్తాఫిజుర్ 7, కమిన్స్ (సి) మిచెల్ (బి) తుషార్ 5, భువనేశ్వర్ (నాటౌట్) 4, ఉనాద్కట్ (సి) మొయిన్ (బి) ముస్తాఫిజుర్ 2, **ఎక్స్‌ట్రాలు : 3 ; మొత్తం (18.5 ఓవర్లలో) 134 ఆలౌట్ ; వికెట్లపతనం :** 1-21, 2-21, 3-40, 4-72, 5-85, 6-117, 7-119, 8-124, 9-132 ; **బౌలింగ్ :** దీపక్ చాహర్ 3-0-22-0, తుషార్ దేశ్‌పాండే 3-0-27-4, ముస్తాఫిజుర్ 2.5-0-19-2, జడేజా 4-0-22-1, శార్దూల్ 4-0-27-1, పతిరన 2-0-17-2.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	9	8	1	0	16	0.694
కోల్‌కతా	8	5	3	0	10	0.972
చెన్నై	9	5	4	0	10	0.810
హైదరాబాద్	9	5	4	0	10	0.075
లఖ్‌నవూ	9	5	4	0	10	0.059
ఢిల్లీ	10	5	5	0	10	-0.276
గుజరాత్	10	4	6	0	8	-1.113
పంజాబ్	9	3	6	0	6	-0.187
ముంబై	9	3	6	0	6	-0.261
బెంగళూరు	10	3	7	0	6	-0.415

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

పాకిస్థాన్ జట్టు కోచ్‌లుగా కిర్‌స్టెన్, గిలెస్పీ



కరాచీ: పాకిస్థాన్ వన్డే, టీ20 జట్లకు గ్యారీ కిర్‌స్టెన్ (దక్షిణాఫ్రికా) కోచ్‌గా వ్యవహరించనున్నాడు. అలాగే టెస్టు ఫార్మాట్‌లో జేసన్ గిలెస్పీ (ఆస్ట్రేలియా) ఈ బాధ్యతలు తీసుకోనున్నాడు. ఇక న్యూజిలాండ్‌తో ఇటీవల ముగిసిన టీ20 సిరీస్‌కు తాత్కాలిక కోచ్‌గా వ్యవహరించిన అజర్ మహమూద్‌ను ఈ మూడు ఫార్మాట్లకూ అసిస్టెంట్ కోచ్‌గా నియమిస్తున్నట్టు పాక్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పేర్కొంది. వీరంతా రెండేళ్లపాటు పదవుల్లో ఉంటారు. వచ్చే నెల పాక్ టీమ్ ఇంగ్లండ్‌తో ఆడే నాలుగు టీ20ల సిరీస్‌కు గ్యారీ జట్టులో చేరనున్నాడు. గ్యారీ ప్రస్తుతం ఐపీఎల్‌లో గుజరాత్ జట్టుకు బ్యాటింగ్ కోచ్/మెంటార్‌గా ఉన్నాడు.



షూటింగ్‌లో మరో ఒలింపిక్ బెర్త్

స్కీట్‌లో మహేశ్వరికి రజతం

న్యూఢిల్లీ : పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ విభాగంలో భారత్‌కు మరో బెర్త్ లభించింది. దోహాలో జరిగిన షాట్‌గన్ ఒలింపిక్ చివరి క్వాలిఫికేషన్ టోర్నీ స్కీట్ విభాగంలో మహేశ్వరి చౌహాన్ రజత పతకం దక్కించుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో మహేశ్వరి 3-4తో ఫ్రాన్సిస్కా క్రొవేటో చేతిలో పరాజయంతో రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ రజత పతకం ద్వారా పారిస్ క్రీడల షూటింగ్ విభాగంలో భారత్‌కు 21వ బెర్త్ లభించింది. మహిళల స్కీట్‌లో మాత్రం రెండో కోటా స్థానమిది.

తొలి టీ20 మనదే

44 పరుగులతో ఓడిన బంగ్లా



రేణుక

సిల్హట్: పేసర్లు రేణుకా సింగ్ (3/18), పూజా వస్త్రాకర్ విజృంభించడంతో.. బంగ్లాదేశ్ టూర్‌లో భారత మహిళల జట్టు బోణీ చేసింది. ఆదివారం జరిగిన తొలి టీ20లో భారత్ 44 పరుగుల తేడాతో బంగ్లాపై నెగ్గింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 145/7 స్కోరు చేసింది. యాస్తిక (36), షఫాలీ వర్మ (31), హర్మన్‌ప్రీత్ (30) రాణించారు. రబయా 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో బంగ్లా ఓవర్లన్నీ ఆడి 101/8 స్కోరు మాత్రమే చేసింది. రేణుకా సింగ్ 3, పూజ 2 వికెట్లు పడగొట్టారు.

గుకేష్‌కు రూ.75 లక్షలు

● అందజేసిన సీఎం స్టాలిన్



చెన్నై (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించిన దొమ్మరాజు గుకేష్‌కు రూ.75 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అందజేశారు. ఇటీవల టొరంటోలో జరిగిన క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో విజేతగా నిలిచిన ఈ చెన్నై టీనేజర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌నకు క్వాలిఫై అయిన పిన్నవయస్సు ఆటగాడిగా రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. గుకేష్ తన తల్లిదండ్రులతో కలిసి సీఎం క్యాంప్ కార్యాలయంలో స్టాలిన్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా గుకేష్‌ను శాలువతో సత్కరించి ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం తరపున అతడికి రూ. 75 లక్షలతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో క్రీడామంత్రి ఉదయనిధి కూడా పాల్గొన్నారు.

దుమ్మురేపిన ధీరజ్

తెలుగు ఆర్చర్‌కు స్వర్ణ, కాంస్యాలు
ఒలింపిక్ చాంపియన్ కొరియాకు భారత్ షాక్
ఆర్చరీ వరల్డ్ కప్



ధీరజ్



దీపిక

షాంఘై : వరల్డ్ కప్ స్టేజ్-1లో తెలుగు ఆర్చర్లు అమోఘంగా రాణించారు. జ్యోతి సురేఖ ఏకంగా హ్యాట్రిక్ స్వర్ణాలతో ఔరా అనిపిస్తే..నేడు మరో తెలుగు కుర్రాడు ధీరజ్ బొమ్మదేవర పసిడి, కాంస్య పతకాలతో సత్తా చాటాడు. భారత రికర్వ్ పురుషుల జట్టు ఏకంగా ఒలింపిక్ చాంపియన్ దక్షిణ కొరియాకి షాకిచ్చి విజేతగా నిలవడం విశేషం. మిక్స్‌డ్ టీమ్‌లో ధీరజ్ జోడీ కాంస్యం అందుకోగా, వ్యక్తిగత విభాగంలో దీపికా కుమారి రజతం సాధించింది. ఆదివారం నాటి పోటీల్లో రికర్వ్ ఆర్చర్లు స్వర్ణం, రజతం, కాంస్యం సహా మూడు పతకాలు సొంతం చేసుకున్నారు. రికర్వ్ పురుషుల టీమ్ విభాగం ఫైనల్లో ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాదవ్ త్రయం 5-1తో కిమ్ ఊజిన్, కిమ్ జే డోక్, లీ ఊ సోక్‌తో కూడిన బలమైన దక్షిణ కొరియాను చిత్తు చేసి చారిత్రక బంగారు పతకం చేజిక్కించుకుంది. 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వరల్డ్ కప్ రికర్వ్ కేటగిరీలో భారత్ స్వర్ణం దక్కించుకుంది. 2010లో ఇదే షాంఘైలో జరిగిన ప్రపంచ కప్ స్టేజ్-4లో మనోళ్లు చివరిసారి పసిడి పతకాన్ని ముద్దాడారు. అలాగే ఈ విభాగంలో తిరుగులేని దక్షిణ కొరియాను మన ఆర్చర్లు మట్టికరిపించారు. జూన్‌లో అంటాల్యాలో జరిగే ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి ముందు కొరియాపై గెలుపు భారత ఆర్చర్ల ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేయనుంది. ఈ విజయం మన ర్యాంకింగ్ పాయింట్లనూ పెంచనుంది. ఇక..రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అంకితా భక్త్ జతగా ధీరజ్ 6-0తో మెక్సికో ద్వయం వాలెన్సియా/మతియాస్‌ను ఓడించి కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. రికర్వ్ మహిళల వ్యక్తిగత కేటగిరీ తుది పోరులో దీపికా కుమారి 6-0తో హాంగ్జౌ ఆసియా క్రీడల చాంపియన్ లిమ్ సిహ్ యోన్ (దక్షిణ కొరియా) చేతిలో ఓటమితో రజత పతకంతో సరిపెట్టుకుంది. స్టేజ్-1 ప్రపంచ కప్‌ను భారత్ కాంపౌండ్, మిక్స్‌డ్ విభాగాల్లో కలిపి ఐదు స్వర్ణ, రెండు రజత, ఒక కాంస్యం సహా మొత్తం ఎనిమిది పతకాలతో ముగించింది.

క్వార్టర్స్‌లో భారత మహిళలు

ఉబెర్ కప్ బ్యాడ్మింటన్

చెంగ్డూ (చైనా) : యువ షట్లర్లతో కూడిన భారత మహిళల జట్టు ఉబెర్ కప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఆదివారం సింగపూర్‌తో జరిగిన పోరులో మన అమ్మాయిలు 4-1తో విజయం సాధించారు. ఆసియా చాంపియన్ అయిన భారత్..తొలి పోరులో 4-1తో కెనడాను చిత్తు చేసిన విషయం విదితమే. సింగపూర్‌తో మొదటి సింగిల్స్‌లో అష్మితా చలిహా ఓడినా..దానిని నుంచి కోలుకున్న భారత్ అద్భుత ప్రదర్శన చేసింది. ఇక.. గ్రూప్ 'ఎ'లో చైనా 3-0తో కెనడాపై నెగ్గిన నేపథ్యంలో..భారత్‌తోపాటు ఆతిథ్య మహిళల జట్టుకూడా రౌండ్-8కు క్వాలిఫై అయింది. రెండు వరుస విజయాలతో ప్రస్తుతం చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో నిలిచింది. సింగపూర్‌తో.. మొదటి సింగిల్స్ మ్యాచ్‌లో 53వ ర్యాంకర్ చలిహా 15-21, 18-21తో వరల్డ్ నెం. 18 యో జియా మిన్ చేతిలో ఓడింది. అయితే డబుల్స్‌లో..జాతీయ చాంపియన్లు ప్రియ/శ్రుతి 21-15, 21-16తో హెంగ్/జిన్‌పై గెలవడంతో స్కోరు 1-1తో సమమైంది. అనంతరం రెండో సింగిల్స్‌లో ఇషా రాణి 21-13, 21-16తో ఇన్సిరా ఖాన్‌పై నెగ్గి భారత్ ఆధిక్యాన్ని 2-1కి పెంచింది. ఆపై సిమ్రన్/రితిక 21-8, 21-11తో టింగ్/జాన్‌ని చిత్తు చేయడంతో మనోళ్లు 3-1తో తిరుగులేని స్థితిలో నిలిచారు. మూడో సింగిల్స్‌లో అన్మోల్ 21-15, 21-13తో లీని ఓడించడంతో భారత్ ఆధిక్యం మరింత పెరిగింది. ఇక థామస్ కప్‌లో..డిఫెండింగ్ చాంపియన్ భారత పురుషుల జట్టు సోమవారం ఇంగ్లండ్‌ను ఢీకొంటుంది.

జాక్స్ విధ్వంసం

● అదరగొట్టిన కోహ్లీ
● బెంగళూరు 9 వికెట్ల గెలుపు
● గుజరాత్ చిత్తు



కోహ్లీ 70 నాటౌట్ 44 బంతుల్లో 6x4, 3x6

విల్ జాక్స్ 100 నాటౌట్ 41 బంతుల్లో 5x4, 10x6

2 ఐపీఎల్‌లో బెంగళూరుకు ఇది రెండో అత్యధిక ఛేదన. 2010లో పంజాబ్‌పై 204 పరుగులు స్కోరును ఛేజ్ చేసింది.

1 కేవలం 10 బంతుల్లోనే జాక్స్ 50 నుంచి 100 పరుగుల మార్క్‌ను అందుకోవడం ఐపీఎల్‌లో ఇదే ప్రథమం. అంతకుముందు గేల్ 13 బంతుల్లో ఈ ఫీట్ సాధించాడు.

అహ్మదాబాద్: విల్ జాక్స్ (41 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్స్‌లతో 100 నాటౌట్) వీరవిహారంతో.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వరుసగా రెండో విజయం సాధించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 9 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసింది. తొలుత గుజరాత్ 20 ఓవర్లలో 200/3 స్కోరు చేసింది. సాయి సుదర్శన్ (49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సలతో 84 నాటౌట్), షారుక్ (30 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 58) శ్రమ వృథా అయింది. ఛేదనలో బెంగళూరు 16 ఓవర్లలో వికెట్ నష్టానికి 206 పరుగులు చేసి గెలిచింది. కోహ్లీ (44 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 70 నాటౌట్) హాఫ్ సెంచరీ సాధించాడు. అలసటతో కొన్ని మ్యాచ్‌లకు దూరమైన మ్యాక్స్‌వెల్ మళ్లీ జట్టులోకొచ్చాడు. శతకంతో చెలరేగిన జాక్స్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

అలవోకగా బాదుతూ..: జాక్స్, కోహ్లీ రెండో వికెట్‌కు అజేయంగా 74 బంతుల్లో 166 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో బెంగళూరు సునాయాసంగా నెగ్గింది. ఛేదనలో ఓపెనర్లు కోహ్లీ, డుప్లెసి (24) ధనాధన్ ఆరంభాన్నిచ్చారు. అయితే, డుప్లెసిని కిషోర్ క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 40 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన జాక్స్ కుదురుకోవడానికి కొంత సమయం తీసుకొన్నా.. ఆ తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగి పోయాడు. 10 ఓవర్‌లో బౌండ్రీతో విరాట్ అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. టీమ్ స్కోరు వందకు చేరువైంది. చివరి 36 బంతుల్లో 53 పరుగులు కావాల్సి ఉండగా.. జాక్స్ ఒక్కసారిగా శివాలెత్తాడు. 15వ ఓవర్‌లో మోహిత్ బౌలింగ్‌లో 4,6,6,6,4తో ఏకంగా 29 పరుగుల పిండుకొన్న విల్.. ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. రషీద్ వేసిన ఆ తర్వాతి ఓవర్‌లో 6,6,4,6,6తో 29 పరుగులు రాబట్టిన జాక్స్ ఔరా అనిపించే రీతిలో సెంచరీ మార్క్ చేరుకోవడమే కాకుండా.. మరో 24 బంతులు మిగిలుండగానే జట్టును గెలుపు గీత దాటించాడు. 15వ ఓవర్లో హాఫ్ సెంచరీని చేరుకున్న జాక్స్ 16వ ఓవర్లో సెంచరీ చేయడం చూస్తే...అతని విధ్వంసం ఏ రీతిన సాగిందో అర్థమవుతుంది. ఓ దశలో 16 బంతుల్లో 16 పరుగులే చేసిన జాక్స్ తర్వాతి 25 బంతుల్లో 84 రన్స్ సాధించాడు.



సుదర్శన్ (49 బంతుల్లో 84 నాటౌట్)

ముందుగా షారుక్..: బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన షారుక్ ఖాన్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగా.. సాయి సుదర్శన్ తుది కంటా క్రీజులో నిలవడంతో గుజరాత్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. సుదర్శన్, షారుక్ మూడో వికెట్‌కు 45 బంతుల్లో 86 పరుగులతో ఆదుకొన్నారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్.. తొలి ఓవర్‌లోనే సాహా (5) వికెట్‌ను చేజార్చుకొంది. గిల్ (16), సుదర్శన్ జాగ్రత్తగా ఆడడంతో.. తొలి ఆరు ఓవర్లు ముగిసే సరికి గుజరాత్ 42/1తో నిలిచింది. అయితే, ఏడో ఓవర్‌లో మ్యాక్సీ బౌలింగ్‌లో గిల్ వెనుదిరిగాడు. ఈ దశలో షారుక్ రాకతో స్కోరుబోర్డు ఊపందుకొంది. అర్ధ శతకంతో ప్రమాదకరంగా మారిన షారుక్‌ను సిరాజ్ బౌల్డ్ చేసి జట్టుకు బ్రేక్ ఇచ్చాడు. అనంతరం మిల్లర్ (26 నాటౌట్)తో కలసి సుదర్శన్ 69 పరుగుల అభేద్యమైన భాగస్వామ్యం నెలకొల్పడంతో.. గుజరాత్ అనూహ్యంగా 200 మార్క్‌ను తాకింది.

స్కోరుబోర్డు

గుజరాత్: సాహా (బి) కర్ణ్ (బి) స్వప్నిల్ 5, గిల్ (సి) గ్రీన్ (బి) మ్యాక్స్‌వెల్ 16, సుదర్శన్ (నాటౌట్) 84, షారుక్ (బి) సిరాజ్ 58, మిల్లర్ (నాటౌట్) 26; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 200/3; వికెట్ల పతనం:** 1-6, 2-45, 3-131; **బౌలింగ్:** స్వప్నిల్ 3-0-23-1, సిరాజ్ 4-0-34-1, యశ్ 4-0-34-0, మ్యాక్స్‌వెల్ 3-0-28-1, కర్ణ్ శర్మ 3-0-38-0, గ్రీన్ 3-0-42-0.

బెంగళూరు: కోహ్లీ (నాటౌట్) 70, డుప్లెసి (సి/సబ్) శంకర్ (బి) సాయి కిషోర్ 24, జాక్స్ (నాటౌట్) 100; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 16 ఓవర్లలో 206/1; వికెట్ల పతనం:** 1-40; **బౌలింగ్:** అజ్మతుల్లా 2-0-18-0, సందీప్ వారియర్ 1-0-15-0, సాయి కిషోర్ 3-0-30-1, రషీద్ 4-0-51-0, నూర్ 4-0-43-0, మోహిత్ 2-0-41-0.

ప్రశ్నించకుంటే బానిసలమే!

» ఆర్టీసీని విలీనం చేస్తే.. పాలకమండలి, చైర్మన్ ఎందుకు?
» ఉద్యోగ సంఘాలు పతనావస్థకు చేరాయి
» ప్రభుత్వ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణరావు



కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 28: 'సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించకుంటే జీవితకాలం బానిసలుగా బతకాల్సి వస్తుంది. పతనావస్థకు చేరుకున్న సంఘాలను పటిష్ఠ పరిచేందుకే నా పోరాటం' అని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణరావు పేర్కొన్నారు. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల సమావేశాన్ని ఆదివారం కడప శివారులోని ఓ ఫంక్షన్ హాలులో సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రమేశ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ సంఘాలు పతనావస్థకు చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా 1వ తేదీన జీతాలు, పెన్షన్లు ఇచ్చే పరిస్థితుల్లో ప్రభుత్వాలు లేవన్నారు. వీరికోసం ఆర్థికపరమైన చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు. జడ్జీలు, ఎమ్మెల్యే. ఎంపీలకు నెలనెలా ఠంచన్‌గా 1వ తేదీనే జీతాలు తీసుకునేందుకు చట్టం ఉందన్నారు. ప్రభుత్వంలో ఉద్యోగులూ భాగస్వాములేనని, మరి వీరికెందుకు ఆ చట్టం చేయకూడదని ప్రశ్నించారు. ఇప్పటికే ఉద్యోగులకు వేలాదికోట్ల రూపాయిల బకాయిలు ఉన్నాయని, ఆదాయమే లేని రాష్ట్రంలో అప్పులు ఎలా కడతారో బేతాళ ప్రశ్నగా మిగిలిందని పేర్కొన్నారు. ప్రతి నెలా 5-6 వేల కోట్లు ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సి ఉందన్నారు. ఏడాదిగా 11వ పీర్సీ బకాయిలు, డీఏలు, జీపీఎఫ్‌తో పాటు బీమా ఏపీజీఎల్ఐ.. రెండేళ్లుగా సరెండర్ లీవులు చెల్లించలేదన్నారు. ప్రభుత్వానికి ఆదాయం పెంచేందుకు వీలు లేకుండా కేంద్ర నిబంధనలు ఉన్నాయని, పన్నులు వేసే అధికారమూ లేదని, ఇలాంటి సమయంలో ఉద్యోగుల సొమ్ము తిరిగిరాదని చెప్పారు. అభద్రతతో రోడ్డెక్కి ఆందోళన చేసే ధైర్యం లేకపోతే.. ఎన్నాళ్లు బానిస బతుకులని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి సవాలక్ష మెలికలతో ప్రతి లక్ష మంది ఉద్యోగుల్లో 2 వేల మందిని మాత్రమే రెగ్యులర్ చేసి మోసం చేసిందన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాల హక్కులను ప్రభుత్వం కాలరాసిందని విమర్శించారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయితే పాలకమండలి, చైర్మన్‌గిరీలు ఎందుకని ప్రశ్నించారు. ఉద్యోగ వ్యవస్థలో లోపాలు ఉంటాయన్నారు. కొన్ని సంఘాల భవనాలు ఇప్పుడు క్లబ్బులు, పబ్బులు, రియల్ ఎస్టేట్ ఆఫీసులుగా మారాయన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఉద్యోగుల హక్కులపై ప్రశ్నించినందుకు నాలుగేళ్లు నరకం అనుభవించానని, రోడ్ల మీద పడుకున్నానని, తనను పలకరించేందుకు ఏ ఉద్యోగీ రాలేని పరిస్థితులు వచ్చాయని తెలిపారు. తన భార్యాబిడ్డల కన్నీటి రోదన చెప్పలేనిదన్నారు. తన పోరాటం, తన భార్య బిడ్డల కన్నీటి రోదన వృధా కాకూడదన్నారు.

తొలిసారిగా 'సెంట్రల్ ఎక్స్ఛేంజ్'

» పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో తొలి అడుగు
» 80,111 ఫారం 12, 10123 ఫారం 12డీల మార్పిడి

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో భాగస్వాములైన ఉద్యోగులు, సిబ్బంది, అత్యవసర సేవల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించే దిశగా తొలి అడుగు పడింది. అందులో భాగంగా అమరావతి సచివాలయంలో తొలిసారిగా ఆదివారం తొలి విడత సెంట్రల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం జరిగింది. దీనిలో 80,111 ఫారం-12లు, 10,123 ఫారం-12డీల మార్పిడి జరిగింది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎంఎన్ హరీంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సెంట్రల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో 26 జిల్లాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు వారి జిల్లాల్లో సేకరించిన ఫారం-12, ఫారం-12 డీలతో హాజరయ్యారు. అందిన దరఖాస్తులకు అనుగుణంగా ఆయా జిల్లాల పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు ఖాళీ పోస్టల్ బ్యాలెట్‌లతో మే 3న తిరిగి ఈ సెంట్రల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి హాజరవుతారు. ఏ జిల్లాకు చెందిన పోస్టల్ బ్యాలెట్లను ఆ జిల్లా నోడల్ అధికారికి అందజేస్తారు. వాటిని సంబంధిత ఉద్యోగులకు అందజేసి, ఓటు వేసిన తరువాత మళ్లీ ఆ పోస్టల్ బ్యాలెట్‌లను మే 10న సెంట్రల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం ద్వారా ఆయా జిల్లాలకు పంపిస్తారు.

టీటీడీ ఈవో ధర్మారెడ్డి డిప్యుటేషన్ పొడిగింపు

తిరుపతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో ధర్మారెడ్డికి కేంద్ర ప్రభుత్వం డిప్యుటేషన్ గడువు పొడిగించింది. వచ్చే నెల 14తో ఆయన డిప్యుటేషన్ గడువు ముగియనుంది. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఐఏఎస్ అధికారులందరూ బిజీగా ఉంటారని, కాబట్టి ఎన్నికలు ముగిసే వరకూ టీటీడీ ఈవోగా ధర్మారెడ్డి డిప్యుటేషన్ గడువు పొడిగించాలని సీఎం జగన్ గత నెలలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు లేఖ రాశారు. ఈమేరకు ధర్మారెడ్డి డిప్యుటేషన్‌ను జూన్ 30 వరకూ పొడిగిస్తూ కేంద్ర కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఈ నెల 27న ఉత్తర్వులు జారీ చేసింది.

కాస్కో జగన్!

» ప్రజల ఆవేదన ఎలా ఉంటుందో చూపిస్తా: బాలకృష్ణ



తిరుపతి జిల్లా తడలో మాట్లాడుతున్న బాలకృష్ణ

తడ, ఏప్రిల్ 28: 'దళితులను వేధించావు. దళిత డ్రైవర్‌ని హత్యచేసి డోర్ డెలివరీ చేయించావు. అన్ని వర్గాల ప్రజలనూ వంచించావు. ఇక కాస్కో జగన్.. ప్రజల ఆవేదన ఎలా ఉంటుందో ఈ ఎన్నికల్లో చూపిస్తా. అపజయం పాల్జేసి నిన్ను జనం చేత ఛీ కొట్టిస్తా' అని సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హెచ్చరించారు. ఆదివారం తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో బాలకృష్ణ రోడ్‌షో నిర్వహించారు. అనంతరం ఆయన అక్కడ సభలోనూ, రాత్రి రేణిగుంట బహిరంగ సభలోనూ మాట్లాడారు. జగన్ ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబరు 303 అమలైతే మన భూములన్నీ మనవి కావని, వాటిని అమ్ముకోవాలన్నా, అప్పు చేయాలన్నా జగన్ అనుమతి కావాల్సిందేనన్నారు. భూములు మనవైతే, ఆస్తి పత్రాలపై ఆయన బొమ్మ వేయించుకొని తన వద్దనే ఆ డాక్యుమెంట్లను పెట్టుకుంటాడని, తద్వారా ఆ భూముల మీద జగన్‌కే సర్వ హక్కులూ ఉంటాయని జనం తెలుసుకోవాలన్నారు. 13లక్షల కోట్ల రూపాయల అప్పుచేసి 2.50 లక్షల కోట్లు జనానికి పంచానని చెబుతున్న జగన్ మిగిలిన 10 లక్షల కోట్లు ఏమయ్యాయో చెప్పాలన్నారు. తల్లిని, చెల్లిని మోసం చేసి, వారిని ఇంట్లో నుంచి బయటకు గెంటేయడమే కాకుండా సొంత బాబాయ్‌ని చంపిన వారికి అండగా ఉన్న ఘనత జగన్‌దేనని ఆరోపించారు. కోడికత్తి, గులకరాయి డ్రామాలు చూస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అవార్డులన్నీ మహానటుడైన జగన్‌కు ఇస్తే సరిపోతుందన్నారు. 'జగన్ రెడ్డీ ఇక నీ ఆటలు సాగవు. మొదలైన ఎన్నికల యుద్ధంలో ఓటమిని తట్టుకునేందుకు సిద్ధంగా ఉండు. నీ పొగరు అణిచే రోజు వచ్చింది. సునామీ యుద్ధం రాబోతుంది' అని బాలకృష్ణ అన్నారు. శ్రీకాళహస్తి వైసీపీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదనరెడ్డి ఇసుక దోపిడీతో పాటు భూకబ్జాలకు పాల్పడ్డాడంటూ ఆరోపణలు చేశారు.

సీఎస్, డీజీపీ జగన్ కోసం పనిచేస్తున్నారు

- ఆయన రుణం తీర్చుకోవడానికి తహతహలాడుతున్నారు
- కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకుడిని కలసిన కూటముల నేతలు

విజయవాడ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రభుత్వ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఎన్డీయే, ఇండియా కూటమి నేతలు విడివిడిగా కేంద్ర ఎన్నికల సంఘ పరిశీలకుడు రామ్మోహన్ మిశ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయనను విజయవాడలో ఆదివారం కలసి వినతిపత్రాలను అందజేశారు. అనంతరం ఎన్డీయే కూటమి నేతలు వర్ల రామయ్య, లంకా దినకర్, శివశంకర్ మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో అధికారుల తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. సీఎస్, డీజీపీ.. జగన్ రుణం తీర్చుకోవడానికి ఆరాటపడుతున్నారు. ఈ ఇద్దరి కంటే సీనియర్లు ఉన్నా వారికే జగన్ పోస్టింగ్‌లు ఇచ్చారు. దీనికి సంబంధించిన ఆధారాలను ఈసీకి అందజేశాం. వాటిని చూసిన ఆయన ఆశ్చర్యపోయారు. రాష్ట్రంలో సీఎస్, డీజీపీని తొలగిస్తేనే ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరుగుతాయని వివరించాం. ఐపీఎస్ అధికారి సునీల్.. జగన్ సేవలో తరిస్తున్నారు. 'ధనంజయ్ అన్న' అని జగన్ పిలవగానే ఆ అధికారి మేనిఫెస్టో సూపర్ అంటున్నారు. ఈ అధికారులపైనా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో ప్రజాస్వామ్య రక్షణకు కేంద్ర అధికారులను పంపాలి. సామాజిక మాధ్యమాల్లో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని వివరించాం. సీఎస్ తీసుకున్న నిర్ణయాల వల్ల వైసీపీకి మేలు జరుగుతుంది. అందుకే సీఎస్, డీజీపీలను మార్చాలని కోరుతున్నాం. పెన్షన్ల విషయంలో ప్రజలను ఇబ్బంది పెట్టడమే సీఎస్ ఉద్దేశంగా ఉంది. ఇలాంటి వారి వల్ల ప్రజాస్వామ్యం నిలబడదు' అని అన్నారు. ఇండియా కూటమి నేతలు నరహరశెట్టి నరసింహారావు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఈసీకి ఫిర్యాదు చేశాం. అధికార పార్టీ నేతలు డబ్బులు, మద్యం విపరీతంగా పంపిణీ చేస్తున్నారని ఈసీ దృష్టికి తీసుకెళ్లాం. ఎలాంటి ప్రలోభాలు లేకుండా ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరాం' అని తెలిపారు.

అభివృద్ధికి ప్రాధాన్యంలేని వైసీపీ మేనిఫెస్టో

- జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

గుంటూరు (కార్పొరేషన్), ఏప్రిల్ 28: వైసీపీ ఇటీవల విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వలేదని, ప్రజల సొమ్ముతో ఓట్లు దండుకునే పథకాల కొనసాగింపునకు ప్రాధాన్యం ఇచ్చారని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విమర్శించారు. ఆదివారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ఎన్నికల మేనిఫెస్టోలో సంపూర్ణ మద్య నిషేధాన్ని దశలవారీగా అమలు చేస్తామని చెప్పి.. మద్యం అమ్మకాలను 1.5 లక్షల కోట్లకు చేర్చారని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో నీటిపారుదల ప్రాజెక్టులకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యావంతుల్లో 25 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారని, ఉపాధి ఉద్యోగావకాశాల కల్పనకు, పారిశ్రామికాభివృద్ధికి మేనిఫెస్టోలో స్థానం కల్పించలేదన్నారు. 14 లక్షల కోట్లకు పైగా పెరిగిన అప్పుల భారానికి పరిష్కారం చూపలేదన్నారు. విశాఖ స్టీల్, కడప స్టీల్, విశాఖ రైల్వే జోన్, ప్రత్యేక హోదా ప్రస్తావన లేదన్నారు.

జగన్‌కు మళ్లీ అధికారమిస్తే జనం ఆస్తులు తాకట్టు: సీపీఐ

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను అడ్డుపెట్టుకుని వైసీపీ ప్రభుత్వం జగన్నాటకం ఆడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. ప్రజలు కష్టపడి సంపాదించుకున్న ఆస్తులకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలను హక్కుదారులకు ఇవ్వకుండా జిరాక్స్ కాపీలు మాత్రమే ఇవ్వాలంటూ సబ్ రిజిస్ట్రార్‌లకు ఆదేశాలివ్వడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్న అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ ఆస్తులు, సహజ వనరులన్నింటినీ తాకట్టు పెట్టి దాదాపు రూ.10 లక్షల కోట్లకుపైగా అప్పులు తెచ్చిన జగన్ కన్ను ఇప్పుడు ప్రజల స్థిరాస్తులపై పడిందని, వైసీపీకి మళ్లీ అధికారం ఇస్తే జనం ఆస్తులను తాకట్టు పెట్టేసినా ఆశ్చర్యం లేదని, జనం ఆస్తులపై జగన్ పెత్తనం పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎల్ఐసీని కాదని, క్రిటికల్ రివర్స్ అనే ప్రైవేటు సంస్థకు ప్రజల ఆస్తుల వివరాలు, వేలిముద్రలను అందిస్తే ప్రజల జీవితాలు ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు కష్టపడి సంపాదించుకున్న ఆస్తులపై జగన్ పెత్తనం తగదని ఆదివారం ఒక ప్రకటనలో రామకృష్ణ పేర్కొన్నారు.

చంద్రబాబు, రేవంత్ 420లు: సజ్జల

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నెరవేర్చలేనన్ని హామీలను ఇచ్చి పబ్బంగడుపుకుందామని అనుకునే 420 రాజకీయ నాయకులను ప్రజలు చీదరించుకుంటున్నారని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు నాయుడు గతంలో ఇచ్చిన అనేక హామీలను అమలు చేయలేదన్న విషయాన్ని ఈ ఐదేళ్లలో ప్రజలు మర్చిపోతున్నారనుకుంటే.. ఇప్పుడు పక్క రాష్ట్రంలోనూ అదే జరుగుతోంది. రైతు రుణ మాఫీ చేస్తామంటూ హామీ ఇచ్చారు. ఐదు నెలలయింది. ఇంత వరకూ కదలిక లేదు. మళ్లీ ఇప్పుడు ఆగస్టు అని అంటున్నారు. పార్లమెంటు ఎన్నికలు గట్టెక్కాలి కదా?' అంటూ పరోక్షంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించారు. పేరు ఎందుకులే గాని... అంటూనే ఆయన తెలంగాణ ప్రభుత్వంపైనా, సీఎం రేవంత్ రెడ్డిపైనా 420లంటూ విరుచుకుపడడం చర్చనీయాంశమయింది. సీఎం వైఎస్ జగన్ మాత్రం అమలు చేయగలిగిన వాటినే హామీలుగా ఇచ్చారన్నారు. ఇచ్చిన వాటిని అమలు చేశారని, అందుకనే ధీమాగా మాట్లాడగలుగుతున్నామని స్పష్టం చేశారు. కూటమి పార్టీలు ఇచ్చినట్లుగా హామీలు ఇవ్వమని కొందరు సూచించారని, వాటిని జగన్ నవ్వుతూ తిరస్కరించారని సజ్జల అన్నారు.




టీడీపీ నాయకుడు వన్నూరప్ప ఇంట్లోకి చొరబడిన తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి అనుచరులు, మీడియాతో మాట్లాడుతున్న బాధితుడు వన్నూరప్ప

టీడీపీవోళ్లు కనిపిస్తే నరికేస్తా!

- రాప్తాడు వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి సోదరుడి అరాచకం
- అర్ధరాత్రి టీడీపీ వర్గీయుల ఇళ్లలోకి చొరబడి దాడులు.. బెదిరింపులు
- అధికార పార్టీలో చేరాలని ఒత్తిళ్లు లేదంటే ఊరు విడిచి వెళ్లాలని హుకుం

అనంతపురం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజారెడ్డి అరాచకాలు, దౌర్జన్యాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఆత్మకూరు మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామం తోపుదుర్తిలో రాజారెడ్డి శనివారం అర్ధరాత్రి అరాచకానికి పాల్పడ్డారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా వారి ఇళ్లలోకి చొరబడి దాడులు చేశారు. గ్రామంలోని టీడీపీ దళిత నేత వన్నూరప్ప ఇంట్లోకి రాజారెడ్డి అనుచరులు చొరబడి.. వైసీపీలో చేరాలని, లేకపోతే చంపేస్తామని హెచ్చరించారు. వన్నూరప్ప నిరాకరించడంతో దాడికి దిగారు. పిడిగుద్దులు గుద్దుతూ ఎమ్మెల్యే ఇంటివద్దకు తీసుకెళ్లారు. "ఉంటే వైసీపీలో ఉండు.. లేదంటే మరో 13 రోజుల్లో నిన్ను చంపుతాం" అని బెదిరించారు. ఆ తర్వాత టీడీపీ బీసీ నేత బోయ లింగమయ్య ఇంటికి వెళ్లి "అన్న పిలుస్తున్నాడు.. రా.." అని హుకుం జారీ చేశారు. అయితే, తాను రానని లింగమయ్య స్పష్టం చేయడంతో విషయం రాజారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆవేశంతో ఊగిపోతూ వచ్చిన రాజారెడ్డి.. లింగమయ్య ఇంట్లోకి చొరబడి.. "ఉంటే వైసీపీలో ఉండాలి. లేదంటే ఊరు విడిచిపెట్టి వెళ్లాలి. పార్టీలో చేరకపోతే నరికిపారేస్తాం" అని బెదిరించారు. ఇదే సమయంలో మద్యం మత్తులో ఉన్న పలువురు వైసీపీ కార్యకర్తలు ఆ ఇంటిని చుట్టుముట్టారు. లింగమయ్య కుటుంబ సభ్యులు వారిని ప్రతిఘటించే ప్రయత్నం చేశారు. అర్ధరాత్రి ఎమ్మెల్యే సోదరుడి అరాచకంతో గ్రామస్థులు బెంబేలెత్తిపోయారు. దౌర్జన్యకాండ జరుగుతున్నంతసేపు ఇళ్ల నుంచి గ్రామస్థులు బయటకు రాలేదు. ఎమ్మెల్యే సోదరుడు బెదిరింపులకు తెగబడుతున్నా పోలీసుల నుంచి ఎలాంటి స్పందనా కనిపించలేదు. పోలీసులకు సమాచారం ఇచ్చినా నింపాదిగా ఆదివారం ఉదయం ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు ఆ గ్రామానికి వచ్చి.. తిరిగి వెళ్లిపోయారు. గ్రామంలో పోలీసు పికెట్ ఉన్నా స్పందించలేదు.

వారి నుంచి ప్రాణహాని: వన్నూరప్ప

రాప్తాడు ఎమ్మెల్యే సోదరుల నుంచి తనకు ప్రాణహాని ఉందని టీడీపీ దళిత నేత వన్నూరప్ప ఆందోళన వ్యక్తం చేశారు. రాజారెడ్డి అనుచరులు అర్ధరాత్రి తమ ఇంట్లోకి చొరబడి దాడి చేశారని, తనను బలవంతంగా ఎమ్మెల్యే ఇంటివద్దకు తీసుకెళ్లారని, ఉమారెడ్డి అనేవ్యక్తి మద్యం మత్తులో దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. 'నా కొడకా చంపుతాం.. టీడీపీ నా కొడుకులు ఊళ్లో కనబడకూడదు. పరిటాల వాళ్లు ఎలా వస్తారు?' అని రాజారెడ్డి బెదిరించారని అన్నారు. తనకు రక్షణ కల్పించాలని పోలీసులకు విన్నవించారు.

జనం సొమ్ముతో జగన్ భజన

- 'టైటిల్' పేరిట సర్కారు వంచన
- మోకరిల్లిన రెవెన్యూ, సర్వే అధికారులు
- చట్టం అమల్లోకి రాకముందే శాశ్వత భూ హక్కు పత్రాలు
- పాసుపుస్తకం నిండా సీఎం బొమ్మలే
- భూములు జగన్‌వా? రైతులవా?
- ఆర్ఓఆర్ చట్టం ఉల్లంఘన
- పాసుపుస్తకాలు చెల్లవన్న నిపుణులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

టైటిల్ చట్టం వల్ల రైతులకు దమ్మిడీ మేలు జరగలేదు. కానీ ముఖ్యమంత్రి జగన్ మాత్రం ప్రయోజనం పొందారు. టైటిల్ చట్టం ఆధారంగా రైతులకు అందిస్తున్న శాశ్వత భూ హక్కు పత్రాలు.. అవే పట్టాదారు పాసుపుస్తకాల నిండా జగన్ బొమ్మలే. ఆ పాసుపుస్తకం పేరు జగనన్న భూ హక్కు పత్రం. అందులో చిన్నగా రైతు ఫొటో ఒకటి ఉంటుంది. ఆ పాసుపుస్తకం పేరు చూస్తే అది జగన్‌దే అని అనిపిస్తుంది. సాంతం పరిశీలిస్తే జగన్ దయతో రైతుకు ఇచ్చిన హక్కుపత్రంలా ఉంది. టైటిల్ చట్టం కేంద్రంలో పెండింగ్‌లో ఉండగానే 2022లో జగన్ సర్కారు తీసుకొచ్చిన శాశ్వత భూ హక్కు పత్రాల నిండా ఆయన భజనే. రెవెన్యూ, సర్వేశాఖలు ఈ విషయంలో జగన్‌కు మోకరిల్లాయి. ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదార్ పాసుపుస్తకం చట్టం-1971 (ఆర్ఓఆర్-రికార్డ్ ఆఫ్ రైట్స్) అమల్లో ఉండగా, దాన్ని ఉల్లంఘించి మరీ జగన్ సేవలో ఆ రెండు శాఖలు తరించిపోయాయి. ఆర్ఓఆర్ చట్టాన్ని ఉల్లంఘించి ముఖ్యమంత్రి ఫొటోలతో పాసుపుస్తకాలను ముద్రించాయి. ప్రజాధనంతో జగన్‌కు భజన చేస్తూ రెవెన్యూ శాఖ అడ్డగోలుగా పాసుపుస్తకాలను ముద్రించింది. రైతులకు ఇచ్చిన పాస్‌పుస్తకాలను పరిశీలిస్తే రాష్ట్రంలోని భూములపై టైటిల్ జగన్‌దా? లేక రైతులదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాధనంతో జగన్ భజన

ఆర్ఓఆర్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ శాశ్వత భూ హక్కు పేరిట జగన్ ఫొటోలతో ముద్రిస్తున్న పాసుపుస్తకాలకు 25 కోట్లపైనే ఖర్చు పెడుతున్నారు. ముద్రణ బాధ్యతను చెన్నైలోని సెక్యూరిటీ ప్రెస్‌కు కాకుండా ఓ ప్రభుత్వ సలహాదారు సిఫారసు మేరకు ప్రైవేటు ప్రెస్‌కు అప్పగించారు. రెవెన్యూ రికార్డుల డేటా అంతా ఆ ప్రెస్ చేతిలో పెట్టారు. ప్రస్తుతం టైటిల్ చట్టం అమల్లోకి వచ్చినట్లు ప్రకటించినా, భూముల సర్వే పూర్తికాలేదు. మరోవైపు ఆర్ఓఆర్ చట్టాన్ని సర్కారు వెనక్కి తీసుకోలేదు. కాబట్టి ఆర్ఓఆర్ చట్టం ప్రకారమే పాసుపుస్తకాలు ఇవ్వాలి. రెవెన్యూ శాఖ ఉద్దేశపూర్వకంగా ఆ విషయాన్ని పక్కనపెట్టి జగన్ సేవలో తరించిపోయింది. ఎనిమిది పేజీలుండే పాసుపుస్తకం నిండా కలర్‌ఫుల్‌గా జగన్ ఫొటోలు కనిపించేలా డిజైన్లు చేయించింది. న్యాయ సలహా తీసుకోకుండానే వాటిని ముద్రించి రైతులకు పంపిణీ చేస్తోంది. ఆ పుస్తకాలకు అయ్యే పూర్తి ఖర్చు ప్రభుత్వమే భరిస్తోంది. అంటే.. ప్రజాధనంతో రెవెన్యూ శాఖ కొత్త పాస్‌పుస్తకాల పేరిట జగన్ భజనకు దిగింది. జగన్ సొంత సొమ్ముతో ఇస్తున్నట్లుగా పుస్తకం నిండా ఆయన ఫొటోలే వేసింది. గతంలో రెవెన్యూ, సర్వే అధికారులు ఎవరూ చేయని విధంగా అధికారులు పరిధులు దాటి వ్యవహరించారు. ముఖ్యమంత్రికి ఉన్న ఫొటోల పిచ్చి కారణంగా ఆయన్ను ప్రసన్నం చేసుకునేందుకు అధికారులు అడ్డగోలు చర్యలకు పాల్పడ్డారు.

ఆర్ఓఆర్ చట్టం ఉల్లంఘించి జగన్ సేవ

రాష్ట్రంలో భూముల నిర్వహణ, చట్టాల అమలు బాధ్యత రెవెన్యూ శాఖదే. బ్రిటిష్ కాలం నుంచి ఆ శాఖ సేవలకు ఓ పేరుంది. రాష్ట్రంలో భూ యజమానులు, సాగుదారులకు బ్యాంకు రుణాలు, ఇతర అవకాశాలు కల్పించేందుకు వీలుగా 1971లో ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదారు పాసుపుస్తక చట్టం (ఆర్ఓఆర్) తీసుకొచ్చారు. ఈ చట్టంలో కాలనుగుణంగా అనేక మార్పులు, సవరణలు చేశారు. కానీ దాని మూలం మాత్రం అలాగే ఉంది. ఈ చట్టం అమలుకు ఉద్దేశించిన రూల్స్ ప్రకారం సాగు భూమి ఉన్న ప్రతీ రైతుకు పాస్‌పుస్తకం ఇచ్చారు. ఆ పుస్తకం కవర్ పేజీ ప్రారంభంలో భూమి యాజమాన్య హక్కుపత్రం, పట్టాదారు పాసుపుస్తకం అని ఉంటుంది. దాని కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాచముద్ర ఉంటుంది. కింది భాగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రెవెన్యూ శాఖ అని ఉంటుంది. ఆర్ఓఆర్ చట్టం రూల్స్‌లోని సెక్షన్ 6ఏ ప్రకారం పాసుపుస్తకంలో రైతు ఫొటో మాత్రమే ఉండాలి. ఆ ఫొటోపై తహసీల్దార్ సీల్ ఉండాలి. అంతేతప్ప ఇతరుల ఫొటోలు ఉండటానికి వీల్లేదని ఆర్ఓఆర్ నిబంధనలు స్పష్టంగా చెబుతున్నాయి. గత పాలకులు వీటిని ఆచరించారు. గత ముఖ్యమంత్రులు ఎవరూ పాసుపుస్తకాలపై తమ ఫొటోలు ముద్రించాలని అనుకోలేదు. అలాంటి ఆలోచనలే చేయలేదు. ఎందుకంటే రైతులకు ఇచ్చే భూమి హక్కు పత్రాలు పద్ధతిగా, చట్టానికి లోబడే ఉండాలని భావించారు. కానీ జగన్ సర్కారు ఈ సంప్రదాయాన్ని ఉల్లంఘించింది. పాసుపుస్తకాలపై జగన్ కలర్ ఫొటోలు వేయాలనుకుంది. ఆర్ఓఆర్ చట్టం ప్రకారం ఇది సాధ్యంకానందున ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిల్ చట్టం ఆధారంగా కొత్తగా పాస్‌పుస్తకాలు ఇస్తోంది. ఆ పుస్తకం కవర్ పేజీలో పెద్దగా జగన్ ఫొటోను ముద్రించారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం అని పేరును చేర్చారు. కింద జగనన్న భూ హక్కు పత్రం అనే మరో టైటిల్‌ను చేర్చారు. పాసుపుస్తకం చివరి పేజీలో కలర్‌ఫుల్ నవరత్నాల లోగో, మధ్యలో పెద్దగా జగన్ ఫొటోను ముద్రించారు. ఇక పుస్తకంలోని ప్రతీ పేజీలో జగన్ బొమ్మలే వేశారు. మూడో పేజీలో చాలా చిన్న సైజులో రైతు ఫొటోను ముద్రిస్తున్నారు. ఘనత వహించిన రెవెన్యూ శాఖ ఆర్ఓఆర్ చట్టాన్ని చాపలా చుట్టేసి జగన్ ముందు మోకరిల్లింది. చట్టంతో సంబంధం లేకుండా అప్పటికి అమల్లోకి రాని టైటిల్ చట్టాన్ని దృష్టిలో పెట్టుకొని జగన్ బొమ్మలతో కలర్‌ఫుల్ పాసుపుస్తకాలు ముద్రించింది. ఇవి చెల్లవని రెవెన్యూ, న్యాయ నిపుణులు చెబుతున్నారు. జగన్ ఫొటోలున్న పుస్తకాలు చెట్టుబాటు కావాలంటే ఆర్ఓఆర్ చట్టాన్ని రద్దుచేయాలి. రెవెన్యూ శాఖ ఆ పని చేయకుండానే జగన్ ఫొటోలతో పాస్‌పుస్తకాలు ఇచ్చేసింది. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని రెవెన్యూ, న్యాయ నిపుణులు చెబుతున్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చుపెట్టి జగన్ భజన చేస్తూ ముద్రించిన కొత్త పాసుపుస్తకాలు చెల్లవని రెవెన్యూ శాఖ ఎందుకు గ్రహించలేకపోయింది?

గంగవరం పోర్టు కార్మికులతో చర్చలు

- యార్డులో ఉన్న కోల్ 40 శాతం 'ఉక్కు'కు తరలించేలోగా డిమాండ్ల పరిష్కారం: కలెక్టర్ హామీ
- మాట్లాడుకొని చెపుతామన్న కార్మిక నేతలు

విశాఖపట్నం, ఏప్రిల్ 28: అదానీ గంగవరం పోర్టులో ఉన్న రెండు లక్షల మెట్రిక్ టన్నుల కోల్‌లో 40 శాతం కన్వేయర్ ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంటుకు తరలించేలోగా కార్మికుల డిమాండ్లకు పరిష్కారం చూపుతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం ఎంప్లాయిస్ యూనియన్ నాయకులకు హామీ ఇచ్చారు. అదానీ గంగవరం పోర్టు కార్మికులతో ఆయన నగర పోలీస్ కమిషనరేట్‌లో సమావేశమయ్యారు. గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు, స్టీల్‌ప్లాంట్ యాజమాన్య ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... 'కార్మికుల సమ్మె కారణంగా గంగవరం పోర్టు నుంచి స్టీల్‌ప్లాంటుకు బొగ్గు సరఫరా కాకపోవడం వల్ల కర్మాగారం ఇబ్బందుల్లో పడుతోంది. అందువల్ల కోల్ రవాణాకు పోర్టు కార్మికులు సహకరించాలి' అని కోరారు. 'గత ఏడాది ఆగస్టులో జరిపిన చర్చల్లో ఒక ఒప్పందం కుదిరింది. దానిని పోర్టు యాజమాన్యం అమలు చేయలేదు. పైగా కార్మికులపై పోలీస్ కేసులు నమోదు చేయించింది. పలువురిని సస్పెండ్ చేసింది. మరికొందరికి షోకాజ్ నోటీసులు ఇచ్చింది' అని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీనిపై పోర్టు యాజమాన్య ప్రతినిధులను కలెక్టర్ వివరణ కోరినా వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కేసులు ఎత్తివేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌కు కలెక్టర్ సూచించారు. కేసులు బుక్ చేసిన పోలీస్ అధికారులతో మాట్లాడి ఎత్తివేతకు సాధ్యాసాధ్యాలను తెలియజేస్తాయని ఆయన వెల్లడించారు. అనంతరం గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ... కలెక్టర్ ప్రతిపాదనపై సోమవారం యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించి తమ అభిప్రాయాన్ని తెలియజేస్తామని చెప్పారు.

పురందేశ్వరి పిలిస్తే ప్రచారానికి వస్తా

- సినీనటి జయప్రద

తిరుమల, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పిలిస్తే ఎన్నికల ప్రచారానికి వస్తానని ప్రముఖ సినీనటి జయప్రద అన్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం ఆమె దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ఏపీకి ప్రత్యేకహోదా రావాలని, రైతులకు మంచి మద్దతు ధర రావాలని స్వామిని కోరుకున్నట్లు తెలిపారు.

ఆంధ్రులు గర్వించేలా అమరావతి నిర్మాణం



నీరుకొండలో జరిగిన రచ్చబండలో ప్రసంగిస్తున్న లోకేశ్

- రాజధాని రైతులకు వడ్డీతో సహా బకాయిలు చెల్లింపు
- రైతు కూలీలకు నెలనెలా పింఛన్లు
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచుతాం
- జగన్‌తో జాగ్రత్త.. మీ బిడ్డనంటూ ఆస్తులు నొక్కేసే ప్లాన్
- నీరుకొండ రచ్చబండలో లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 28: రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతులెవరూ అధైర్యపడొద్దు.. రాజధాని ఇక్కడే ఉంటుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన అమరావతి నిర్మాణ పనులను మొదలెడతాం. ఐదుకోట్ల ఆంధ్రులు సగర్వంగా తలెత్తుకునేలా అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలోని నీరుకొండలో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రచ్చబండలో లోకేశ్‌మాట్లాడుతూ అమరావతిపై రాజధాని రైతులకు అభయమిచ్చారు. రాష్ట్రం కోసం విలువైన భూములనిచ్చిన రైతుల పట్ల జగన్ చాల కర్కశంగా వ్యవహరించారన్నారు. దళిత రైతులకు బేడీలు వేయించారు.. మహిళా రైతులను బూటుకాళ్లతో తొక్కించారు. రైతులకు కౌలు డబ్బులు చెల్లించకుండా వేధింపులకు గురిచేశారు. జగన్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా రైతులు మాత్రం మొక్కవోని ధైర్యంతో ఉద్యమించారు. మరో నెలరోజుల్లో కూటమి ప్రభుత్వం రాగానే మీ కష్టాలన్నీ గట్టెక్కుతాయంటూ లోకేశ్ వారికి ధైర్యం చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రావల్సిన కౌలు బకాయిలను వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. రాజధాని కూలీలకు రూ.5 వేల పెన్షన్‌ను బకాయిలు లేకుండా ప్రతీ నెలా చెల్లిస్తామన్నారు. అమరావతిలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను చూస్తే చాలా బాధేస్తుందన్నారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని-జై అమరావతి అన్నదే తమ నినాదమన్నారు. మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాటలాడిన జగన్ ఎక్కడా ఒక్క ఇటుక ముక్క కూడా వేయలేదన్నారు. విశాఖలో భూ కుంభకోణాలు తప్ప ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదన్నారు. అమరావతి పనులను కొనసాగించి ఉంటే లక్ష మంది యువతకు ఉపాధి దొరికి ఉండేదన్నారు. జగన్ అండ్ కోతో రాజమౌళి సినిమా తీస్తే ఆస్కార్ అవార్డు గ్యారంటీగా వచ్చి ఉండేదన్నారు. జగన్ బస్సు యాత్ర సాగినంతసేపు నుదుటిపై బ్యాండేజి రోజురోజుకూ పెరుగుతూ పోయిందన్నారు. యాత్ర పూర్తికాగానే గాయం కాస్త ఆటోమేటిక్‌గా మాయమైపోయిందన్నారు. ఇక ఇటువంటి డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్న సంగతిని జగన్ తెలుసుకోవాలన్నారు. ఈ మధ్యకాలంలో జగన్ పదేపదే తాను మీ బిడ్డనంటూ పదేపదే చెబుతున్నాడు.. జాగ్రత్త! ప్రజల భూములను కొట్టేసేందుకే జగన్ ఈ నయా డ్రామాలు వేస్తున్నాడంటూ లోకేశ్ ప్రజలను హెచ్చరించారు. ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే కేవలం జెరాక్స్ కాపీలను మాత్రమే ఇస్తాడట! తన సొంత ఆస్తులేవో ప్రజలకు ఇచ్చినట్టు ప్రజల ఆస్తి పత్రాలపై జగన్ తన ఫొటోలు వేయించుకుంటున్నాడు. ఇదెక్కడి చోద్యమంటూ లోకేశ్ విస్మయం వ్యక్తం చేశారు. ప్రజలు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా విలువైన ఆస్తులను జగన్ లాక్కునే ప్రమాదముందన్నారు. ఆస్తుల విషయంలో ప్రజలందరూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను పెంచుతామన్నారు. వారికి ప్రభుత్వ పథకాలన్నింటిని వర్తింపజేస్తామన్నారు. జగన్ పాలనలో ధ్వంసమైన రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కేంద్ర సహకారం చాలా అవసరమన్నారు. తమ విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే తమ లక్ష్యమని వివరించారు. అందరం కలిసికట్టుగా కష్టపడి రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథం వైపు తీసుకువెడదామని లోకేశ్ అన్నారు.

30 నుంచి మళ్లీ యువగళం

- 7 రోజులు... 7 జిల్లాల్లో లోకేశ్ పర్యటన
- యువతతో ముఖాముఖి

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనపై ప్రజలను చైతన్యం చేస్తూ, యువగళం పేరుతో గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 3,132 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసిన టీడీపీ యువనేత లోకేశ్ ఈనెల 30 నుంచి రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం చేపట్టబోతున్నారు. జగన్ పాలనలో ధ్వంసమైన రాష్ట్ర పునర్నిర్మాణం కోసం యువతను సంసిద్ధం చేయడమే లక్ష్యంగా రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో వారం రోజుల పాటు ఆయన సుడిగాలి పర్యటన చేయనున్నారు. 30న ఒంగోలు, మే 1న నెల్లూరు, 2న రాజంపేట, 3న కర్నూలు, 4న నంద్యాల, 5న చిత్తూరు, 6న ఏలూరులో యువగళం సభలు జరగనున్నాయి. ప్రతి రోజూ సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు యువతతో సాగే ముఖాముఖి సమావేశాల్లో యువతీయువకుల సందేహాలను లోకేశ్ నివృత్తి చేయనున్నారు. యువగళం సభలకు భారీగా యువతీయువకులు హాజరయ్యే అవకాశం ఉండటంతో కూటమి ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి రోజూ ఓ పార్లమెంట్ కేంద్రంలో యువతతో నిర్వహించే ఈ ముఖాముఖి భేటీల్లో ప్రస్తుత ఎన్నికల్లో వారు నెరవేర్చాల్సిన బాధ్యతపై లోకేశ్ దిశానిర్దేశం చేయనున్నారు. జగన్ వైఫల్యాలను వివరించడంతో పాటు టీడీపీ ఇచ్చిన హామీలపై యువతకు లోకేశ్ అవగాహన కల్పిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.




ఎన్టీఆర్‌భవన్‌లో 'విజయం' వీడియో సాంగ్ ఆవిష్కరణ

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థుల విజయానికి దోహదపడేలా రూపొందించిన 'విజయం' వీడియో సాంగ్‌ను ఆదివారం ఎన్టీఆర్‌భవన్‌లో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు టీడీ జనార్దన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గీత రచయిత డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ, తెలుగు యువత మాజీ కార్యదర్శి బత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిపాటి పుల్లారావుతో ఆత్మీయ సమ్మేళనం

మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావుతో పార్టీ నాయకులు ఎన్టీఆర్‌భవన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిలకలూరిపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వంగవీటి రాధాకృష్ణ. వేదికపై సుందరపు విజయకుమార్, ప్రగడ నాగేశ్వరరావు, సీఎం రమేశ్

కూటమి విజయం ప్రజా విజయం

- విశాఖను దోచుకునేందుకే రాజధాని నాటకం: వంగవీటి

అచ్యుతాపురం(అనకాపల్లి జిల్లా), ఏప్రిల్ 28: కూటమి విజయం ప్రజా విజయమని తెలుగుదేశం పార్టీ నాయకుడు వంగవీటి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గ పరిధిలోని అచ్యుతాపురం జనసేన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ... 'జగన్‌రెడ్డి ఈ ఐదు సంవత్సరాల్లో బటన్ నొక్కుడు కార్యక్రమంతోపాటు తన స్వలాభం కోసం చాలా నొక్కాడు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ రాలేదు. ఒక్కరికి కూడా ఉపాధి కల్పించలేదు. విశాఖలో అన్ని వనరులు ఉన్నాయి. అక్కడ పాగా వేసి సర్వం దోచుకోవాలన్న దురాలోచనతో జగన్‌రెడ్డి పరిపాలనా రాజధాని చేస్తానన్నాడు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి' అని పిలుపునిచ్చారు.

ఎల్‌నినో బలహీనం

- మే తొలి వారానికి తటస్థ పరిస్థితులు!
- జూలై నెలాఖరుకల్లా పూర్తిస్థాయి లానినా
- నైరుతి రుతుపవనాలకు అనుకూలం
- ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ విశ్లేషణ

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అనేక దేశాల్లో కరువు, ఎండలు, రికార్డు స్థాయి ఉష్ణోగ్రతల నమోదుకు కారణమైన ఎల్‌నినో చివరి దశకు చేరుకుంది. గతేడాది అక్టోబరు నాటికి తీవ్రస్థాయికి చేరిన ఎల్‌నినో తర్వాత క్రమేపీ బలహీనపడుతూ వస్తోంది. ఈ ఏడాది మార్చి నాటికి ఎల్‌నినో పూర్తిగా బలహీనపడి తటస్థ దిశగా మార్పు చెందుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల తొలి వారం నాటికి తటస్థ పరిస్థితులకు చేరుకోనుంది. ఈ విషయాన్ని అమెరికా వాతావరణ శాఖకు చెందిన వాతావరణ అంచనా కేంద్రం తాజా నివేదికలో పేర్కొంది. ఎల్‌నినో కథ ముగిసిందని ఆస్ట్రేలియా వాతావరణ శాఖ కూడా వెల్లడించింది. తటస్థ పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపింది. అటు ఆస్ట్రేలియా, ఇటు అమెరికా వాతావరణ శాఖల నివేదికలను భారత్‌కు చెందిన ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ విశ్లేషించి తాజాగా నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం జూలై తర్వాత పూర్తిస్థాయి లానినా పరిస్థితులు ఏర్పడనున్నాయి. ఈ ఏడాది చివరికల్లా లానినా మరింత బలపడనుంది. ఎల్‌నినో చివరి దశకు రావడం త్వరలో రానున్న నైరుతి రుతుపవనాలకు అనుకూలమైన అంశమని నిపుణులు అంచనా వేస్తున్నారు.

నైరుతి సీజన్‌లో మంచి వర్షాలు

పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలను అంచనా వేసే సూచిక నినో (ఓషియానిక్ నినో ఇండెక్స్) 3.4 రాబోయే రెండు వారాల్లో 0.5 డిగ్రీలు అంతకంటే తక్కువకు చేరుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఆదేవిధంగా 'సదరన్ ఆస్లేషన్ ఇండెక్స్' కూడా దాదాపు ఇలాంటి అంచనాకు వచ్చింది. ఉష్ణ మండల పసిఫిక్ మహాసముద్రంలో పవనాలు సాధారణంగా ఉంటాయని అమెరికా వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో మే తొలి వారంలో ఎల్‌నినో బలహీనపడి తటస్థ పరిస్థితులకు చేరుకుంటుందని, దీని ప్రభావంతో భారత్‌లో నైరుతి రుతుపవనాల సమయంలో మంచి వర్షాలు కురుస్తాయని స్కైమెట్ పేర్కొంది. అసంగతమైన (ప్లస్ ఆర్ మైనస్‌ను లెక్కించే ఎనామిలిస్) సముద్ర ఉష్ణోగ్రతలకు సంబంధించి నినో 3.4 సూచిక ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు గల మూడు నెలల కాలంలో 'ప్లస్ 1.52 డిగ్రీలు సెల్సియస్' ఉండగా మార్చి ఒక్క నెలలో ప్లస్ 1.24కు తగ్గింది. ఇది ఈనెల 22 నాటికి మరింత తగ్గి ప్లస్ 0.7కు చేరుకుంది. ఇది ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలో స్థిరమైన శీతలీకరణను సూచిస్తోందని స్కైమెట్ వెల్లడించింది. అయితే ఇప్పటికీ మధ్య, తూర్పుపసిఫిక్ సముద్రంలో ఉపరితలం నుంచి 50 మీటర్ల లోతు వరకు జలాలు వేడిగా ఉంటున్నాయని మరికొద్ది రోజుల తర్వాత ఇవి చల్లబడే అవకాశం ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల తొలి వారంలో ఎల్‌నినో పూర్తిగా బలహీనపడి తటస్థ పరిస్థితులకు చేరుకుంటుందని అంచనా వేసింది. ఇదిలావుండగా ప్రస్తుతం క్షీణదశలో ఉన్న ఎల్‌నినో వచ్చేనెల నాటికి తటస్థ పరిస్థితులకు చేరుకున్నా వేసవి సీజన్‌లో దేశంలో అసాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ రిటైర్డు అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. దేశంలో కొద్దిరోజులుగా నెలకొన్న వేడి వాతావరణం, వడగాడ్పులు వీస్తుండడమే దీనికి నిదర్శనమన్నారు. అయితే పసిఫిక్ మహాసముద్రంలో మారిన పరిస్థితుల ప్రభావంతో ఆ దిశ నుంచి వచ్చే చల్లని గాలులతో నైరుతి ఆశాజనకంగా ఉంటుందన్నారు.

వ్యవసాయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడిగా సాయికుమార్

అమరావతి, ఏప్రిల్28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ ఉద్యోగుల సేవా సంఘం నూతన అధ్యక్షుడిగా పీవీ సాయికుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని వ్యవసాయ అధికారుల భవనంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు సంఘ నేతలు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా శ్యాంసుందర్, సహాధ్యక్షుడిగా నాగార్జునరావు, ఉపాధ్యక్షులుగా శ్రీమన్నారాయణ, మహేంద్రబాబు, లలిత్‌కుమార్, పాపారావు, భాస్కరరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శ్రీనివాస్, శివజ్యోతి, ప్రచార కార్యదర్శిగా జయరావు, కార్యదర్శులుగా ప్రభాకరరావు, సీతారామరాజు, సత్యనారాయణ, కొండబాబు, రాజేంద్రుడు ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు అధ్యక్షుడిగా ఉన్న ఎండీ ఇక్బాల్ ఈనెల30 పదవీ విరమణ చేయనుండటంతో ఈ ఎన్నిక జరిగింది.

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

జిల్లా సమగ్ర స్వరూప గ్రంథాల కోసం వ్యాసాలు

తెలంగాణ 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, భాష, సాహిత్యం మొదలైన అంశాలపై తెలంగాణ సారస్వత పరిషత్తు రూపొందించి ప్రచురిస్తున్న జిల్లా సమగ్ర స్వరూప గ్రంథాల పరంపరలో మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్ జిల్లాల సంపుటాలకు వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. ప్రధానంగా జిల్లా నైసర్గిక స్వరూపం, జిల్లా ప్రాచీన ఆధునిక చరిత్ర సంస్కృతి, పురావస్తు కట్టడాలు, సంగీత నృత్య నాటక చిత్రలేఖన శిల్ప కళల వికాసం, పద్యం, గేయం, వచన కవిత్వం, కథ, నవల, విమర్శ, అనువాదం, పరిశోధన, బాలసాహిత్యం, పత్రికలు, జానపద కళలు, తెలంగాణ ఉద్యమంలో జిల్లా కవులు కళాకారుల పాత్ర, విద్యారంగం, పరిశ్రమలు, వ్యవసాయం, సాగు తాగునీటి పథకాలు, పర్యాటక ప్రదేశాలు, ప్రాచీన ఆలయాలు జాతరలు, జానపద విజ్ఞానం, జిల్లాకు చెందిన సాహిత్య సాంస్కృతిక సంస్థలు, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, పండితులు, కళాకారులు, క్రీడారంగం... ఈ అంశాలపైనా, అంతేకాకుండా ఆ జిల్లాకు మాత్రమే ప్రత్యేకమైన ఇతర అంశాలపైనా వ్యాసాలు రాయాలి. ఆసక్తి ఉన్నవారు 9441046839 నెంబరులో గానీ rsuryaprakashrao@gmail.com మెయిల్ ద్వారా గానీ సంప్రదించాలి.

రాయారావు సూర్యప్రకాశరావు



యుద్ధ విరామం

నువ్వు నేను ఒకే క్షితిజ రేఖపై ఉన్నామంటావు
అందరం సోదరులం అనే మాట నీటిలో రాసావని తెలీలేదు.
ఆప్యాయంగా కౌగిలించావనే అనుకున్నా
వెనుక నెత్తురోడుతూ అడుగులు వేస్తున్న నా నీడను చూసేవరకు.

సరిహద్దులు కాలుదువ్వుతుంటే
లోపల కత్తులు, క్షిపణులు పోటాపోటీగా తయారవుతున్నాయి.

ఆధిపత్యపు కాన్సర్
అడుగడుగుకో భాగాన్ని ఆక్రమిస్తోంది
ఎర్రని కణజాలాన్ని విస్తరిస్తూ.

ఆకలి, నిద్ర కలుసుకునేలోపు
తెగిపడ్డ దేహాలు వాటిని ఎడం చేస్తున్నాయి

దేహాల డంపింగ్ యార్డులు
ఎర్రటి నేలలు
కొత్త రోదనాగీతం ఆలపిస్తుంటే
రాబందులు దావత్ చేసుకుంటున్నాయి.

అరిచి అరిచి గొంతు పెగుల్చుకున్న
శాంతి మంత్రాలు తాత్కాలిక
ఉపశమనపు గుళికలయ్యాయి.
యుద్ధకాంక్ష కాస్త విరామం ప్రకటించింది.

రాధకృష్ణ కర్రి
99519 16499

నిఘంటుకార సింహం

అమరం అంటే నామలింగాను శాసనం అనే నిఘంటువు. దీనికే అమరం/ అమరకోశం అని ప్రసిద్ధి. ఇది కేవలం నిఘంటువే కాదు, Thesarus కన్నా ఎన్నో రెట్లు ఉపయోగకరమైనది. దీని రచయిత అమరసింహుడు. ఈయన బౌద్ధుడు.

కోశాలన్నిటిలోనూ అమరకోశం అత్యంత దీప్తితో వెలుగుతున్నది. దానికి అమరసింహుడు అవలంబించిన వర్గీకరణ వ్యవస్థ, అమరంలో తొక్కిన నూతన మార్గాలు కారణం. అతని భాష్య మర్మజ్ఞత పండితలోకంలో అతడికి అగ్ర తాంబూలం ఇప్పించింది. అనంతమైన శబ్దరాశి లోంచి వాఙ్మయంలో తరచుగా వాడుకలో వున్న పదాల్ని ఎన్నుకోవడంలో అతని నిశిత దృష్టి సైతం అతడి కోశాన్ని సార్వజనీనం చేసింది. అమరకోశం కోశక్షేత్రంలో వటవృక్షమై నిలిచింది.

ఇంద్రశ్చంద్రః కాశకృత్స్నాపిశలీ శాకటాయనః
పాణిని అమర జైనేంద్రాః జయంతి అష్టాది శాబ్దికాః

- అనే శ్లోకాన్ని బట్టి అమరసింహుడు ప్రసిద్ధులైన శాబ్దికులలో ఒకడని తెలుస్తోంది. పాణిని, కాతకృత్స్నుడు లాంటి వాళ్ళ లాగా ప్రత్యేకంగా వ్యాకరణ శాస్త్రం నిర్మించినట్టు కనపడ్డం లేదు. కాగా, అతని నామలింగానుశాసనమే అతణ్ణి ప్రామాణిక శాబ్దికుణ్ణి చేసింది. ఇది సిద్ధ శబ్ద భాండాగారాన్ని పఠితలకు ఇచ్చి, వాళ్ళకు భాషా వ్యాకరణ పాటవాన్ని కలిగిస్తున్నది. వ్యాడి, కాత్యాయనుల విస్తృత కోశాలకంటే సంగ్రహంగా వుండి, విద్యాభ్యాసం చేసేవాళ్ళకు సూక్ష్మంలో మోక్షం కలిగేట్టుగా అమరసింహుడు తన నామలింగానుశాసనాన్ని నిర్మించాడు.


నామాలనీ లింగాలనీ తన కోశంలో చక్కగా సమన్వయం చేసి, అమరసింహుడు తన ప్రత్యేకతను ప్రదర్శించాడు. అందువల్ల నామలింగానుశాసనం అనేది సార్థక నామధేయం అయింది. అమరకోశంలో మరో ప్రత్యేకత - సునిశితమైన దృష్టితో చేసిన వర్గ విభజన. దీని వైశిష్ట్యాన్ని "సంక్షిప్తైః ప్రతిసంస్కృతైః సంపూర్ణముచ్యతే వర్గైః నామలింగాను శాసనమ్" అనే శ్లోక భాగం సూచిస్తున్నది. దీని వల్ల అవసరమైన విషయాలన్నీ ఇందులో వున్నాయని తెలుస్తోంది. అంతమాత్రాన ఇది ఎంతో విస్తారంగా వుండి విద్యార్థులకు భయం కలిగిస్తుందేమో అనుకోనక్కరలేదు. సంగ్రహంగా వుండే వర్గాల్లో అమరం చక్కగా విభజించి వుంది అని చెప్పాడు రచయిత. ఈ వర్గాలు ఒక క్రమంలో వుండి ధారణకు సహాయం చేస్తాయి.

ధన్వంతరిః క్షపణకః అమరసింహ శంకూ
భేతాళభట్ట ఘట కర్పర కాళిదాసాః
ఖ్యాతో వరాహమిహిరో నృపతేః సభాయాం
రత్నానివై వరరుచిః నవవిక్రమస్య

- అనే ఆర్యోక్తిని బట్టి అమరసింహుడు విక్రమార్కుడి సభకు అలంకారంగా ఉన్నట్టు (నవరత్నాలలో ఒకడని) తెలుస్తోంది. మెగస్తనీసును మౌర్య చంద్రగుప్తుడితో ముడిపెట్టి అల్లిన స్వకపోల కల్పనల సాలెగూళ్ళలో బ్రిటిష్ చరిత్రకారులు విక్రమార్కుడికి స్థానం కల్పించలేకపోయారు. విక్రమార్కుడు ప్రమర వంశీయుడు. శ్రీశైల ప్రాంతాల నుంచి తరలివెళ్ళి, ఉజ్జయినిని రాజధానిగా చేసుకున్నాడు. సాహస విక్రమార్కుడని ఆసేతు హిమాచలం కీర్తిని గడించాడు. ధర్మ నిర్వహణా పరాయణుడై పరిపాలన సాగించిన విక్రమార్కుణ్ణి ఇంగ్లీషు చరిత్రకారులు కల్పిత పురుషుడని కొట్టివేశారు. సముద్రగుప్త విక్రమాంకుడు రాసిన శ్రీకృష్ణ చరిత్రలో వుండే ప్రస్తావన మనకు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తుంది.

మృచ్ఛకటికం అనే నాటకం రచించినవాడు శూద్రక మహారాజు. ఆయన శకులను జయించి, తన విక్రమానికి చిహ్నంగా విక్రమ శకం స్థాపించాడు. అతడి సభలోనే మూడు నాటకాలు రాసిన కాళిదాసు మొదలైనవాళ్ళు ఉండేవాళ్ళు. ఈ విషయాన్ని సముద్రగుప్తుడు స్పష్టంగా చెప్పాడు. దీన్ని బట్టి విక్రమార్కుడు కల్పిత పురుషుడు కాడనీ, అతడి ఆస్థానంలో కాళిదాసు, అమరసింహుడు లాంటి కవి పండితులు ఉండేవాళ్ళనీ చెప్పవచ్చు. ఈ రకంగా అమరసింహుడు క్రీ.పూ. మొదటి శతాబ్దం వాడని నిర్ధారించవచ్చు.

అమరసింహుడు తన నామలింగాను శాసనాన్ని మూడు కాండలుగా విభజించాడు. మొదటి కాండలో 280, రెండో కాండలో 735, మూడో కాండలో 485.. వెరసి 1500 శ్లోకాలున్నాయి. ప్రతి కాండను కొన్ని వర్గాలుగా విభజించాడు. ప్రథమ కాండలో- స్వర్గ వర్గం, వ్యోమ వర్గం, దిక్ వర్గం, కాల వర్గం, ధీ వర్గం, వాక్ వర్గం, శబ్దాది వర్గం, నాట్య వర్గం, పాతాళ వర్గం, భోగి వర్గం, నరక వర్గం, వారి వర్గం అని 12 వర్గాలున్నాయి. ద్వితీయ కాండలో- భూ వర్గం, పుర వర్గం, శైల వర్గం, వనౌషధి వర్గం, సింహాది వర్గం, మనుష్య వర్గం, బ్రహ్మ వర్గం, క్షత్రియ వర్గం, వైశ్య వర్గం, శూద్ర వర్గం అని పది వర్గాలున్నాయి. తృతీయ కాండలో విశేష్య నిఘ్న వర్గం, సంకీర్ణ వర్గం, నానార్థ వర్గం, అవ్యయ వర్గం, లింగాది సంగ్రహ వర్గం అని ఐదు వర్గాలున్నాయి. ఇందులో వుండే నానార్థ వర్గంలో పదాలని కాంతాలు, ఖాంతాలు, గాంతాలు అని వర్ణక్రమంలో కూర్చాడు. ఇదంతా ఒక ప్రణాళికాబద్ధంగా (schematic) సాగిన రచన. తరువాత వచ్చిన నిఘంటు కారులు ఈ పద్ధతిలో (అకారాది క్రమం) కూర్చడం అమరాన్ని అనుసరించే చేశారు.



అమరసింహుడు పదాల్ని వర్గాల్లో వింగడించడంలో సైతం కొంత ప్రత్యేకత ప్రదర్శించాడు. ఉదాహరణకు- క్షత్రియ వర్గం చెబుతూ అందులో సైనిక విభాగం పేర్కొన్నాడు. కనక దానికి సంబంధించిన ఏనుగులు, గుర్రాలు, వాటి అవయవాల పేర్లు అన్నీ క్షత్రియ వర్గంలో చేర్చాడు. అలాగే వైశ్య వర్గంలో వ్యవసాయం, పశుపాలన మొదలైన వాటికి చెందిన ఆవులు, ఎద్దులు, గేదెలు- వీటికి చెందిన అవసరమైన శబ్దాల్ని వివరించాడు. విగిలిన జంతువుల గురించి సింహాది వర్గంలో చెప్పాడు. ఇలా మనుష్య వర్గం తీసుకుంటే మనుష్య జాతి, వ్యక్తి సామాన్యానికి సంబంధించిన పదాలే కనపడతాయి. ఇందులో- స్త్రీ పురుషులకు వుండే సంబంధ బాంధవ్యాలు, ఆకార విశేషాలు, అవయవాలు, వ్యాధులు, అలంకారాలు లాంటివి వున్నాయి. జాతి విశేషాలు, ప్రత్యేక సాంఘిక ఆచారాలు వుండే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు చెందిన పదాలకి వేర్వేరు వర్గాలు కేటాయించాడు. వారి వారి వృత్తులు, వాటి పదజాలం ప్రత్యేక వర్గాల్లో వున్నాయి. ఈ రకంగా అమరసింహుడు ప్రతి వర్గాన్ని శీర్షికకు తగినట్టుగా శబ్దాల్ని తీసుకుని ఒక చక్కటి వరుస క్రమ పరిచాడు.

ఇకపోతే- లింగాల విషయంలో సందేహాలకు తావులేని జ్ఞానం కలిగించడానికి అమరసింహుడు కొన్ని పద్ధతులు అవలంబించాడు. అతడు ఉపయోగించిన ప్రథమా విభక్తి రూపాలైన విడి విడి పదాలకు లింగం సులభంగానే తెలుస్తుంది. 'విష్ణుః నారాయణః కృష్ణః' అన్నప్పుడు ఇవి పులింగాలని పోల్చుకోవచ్చు. అలాగే 'రమా మంగళ దేవతా' అని వున్నప్పుడు ఇవి స్త్రీ లింగాలని తేలిగ్గా తెలుస్తాయి. 'వదనం తుండం ఆననం లపనం ముఖం' అని వున్న చోట ఈ పదాలన్నీ నపుంసక లింగాలని స్పష్టంగా తెలుస్తున్నది. ఈ విధమైన అమరిక వల్ల సామాన్యంగా లింగ జ్ఞానం కలుగుతూ వుంటుంది. 'తత్పరో హనుః' అన్నప్పుడు 'తత్పరః' అనే పులింగ విశేషణం వల్ల హను శబ్దం పులింగం అని పోల్చుకోవచ్చు. అలాగే 'కుతుః కృత్తేః స్నేహ పాత్రం సా ఏవ అల్పః కుతుపః పుమాన్' అని వున్న చోట స్త్రీ వాచకం ఐన 'సా' అనే పదంతో విశేషించడంతో 'కుతూః' అనే శబ్దం స్త్రీ లింగం అని సులభంగా గ్రహించుకోవచ్చు. ఇలా తెలిసిన లింగమైన పదం పక్కనే ఉండడంతో - అంటే - సాహచర్యం వల్ల కూడా లింగాన్ని పోల్చుకోవచ్చు. 'కబంధం ఉదకం పాథః' అన్నప్పుడు పాథః శబ్దానికి రూపభేదం ఉన్నా, ఉదకంతో వుంది కనుక అది నపుంసక లింగమే అవుతుంది.

ఈ ఉపాయాలు కాక, లింగ విషయంలో అవగాహనకు అమరసింహుడు ఇంకా కొన్ని చిట్కాలు ప్రయోగించాడు. ఒక పదం మూడు లింగాల్లోనూ ఉపయోగించతగిందైతే, దాని పక్కన 'త్రిషు' అని చేర్చాడు. స్త్రీ, పులింగాలలో ఉపయోగించే పదాల్ని 'ద్వయోః' అన్నాడు. కొన్ని శబ్దాలకు అవి ఏ లింగంలో వుండవో ఆ లింగాన్ని 'అస్త్రీ', 'ననా', 'ద్వయహీనం' అని తెలిపాడు. ఇంతేకాక కేవలం పులింగాలని 'పుంసి' అనీ, కేవలం నపుంసక లింగాలకు 'క్లీబే నపుంసకే' అని గుర్తులు చెప్పాడు. కొన్ని పదాలకు ద్వంద్వ సమాసం చేసి చెప్పాల్సిన చోట ఆ సమాసంలో ఒకే లింగానికి చెందిన పదాల్ని మాత్రమే గ్రహించాడు. లింగ సాంకర్యంతో సమాసాలు ప్రయోగించ లేదు. లింగభేదం వున్న పదాలు ఒకే పాదంలో వుంటే, 'తు', 'అథ' అని వాడి, వాటిని విడదీశాడు. ఇలా తాను పేర్కొన్న నామాల లింగ విషయంలో ఏమాత్రం అనుమానానికి తావివ్వకుండా లింగానుశాసన నిర్మాణం చేశాడు. ఇది అమరసింహుడి మహా వైయాకరణత్వాన్ని సూచిస్తుంది.

ఇది ఇలా వుంటే- లోకంలో వాడుకలో వుండే శబ్దాల్ని సైతం అమరసింహుడు పరిగణనలోకి తీసుకుని, వ్యవహార భాషను స్వీకరించాడు. అష్టాధ్యాయలో ఒక సూత్రం వున్నది (పాణిని - 2-4-56) - అది - 'అజేర్వ్యఘ ఞ పోః' అన్నది. పతంజలి తన మహాభాష్యంలో ఈ సూత్రం కింద ఒక కథ చెప్పాడు. ఇది ఒక రథం నడిపే సూతుడికీ, ఒక వ్యాకరణ శాస్త్రజ్ఞుడికీ మధ్య జరిగిన ఒక వింత సంభాషణ.

వైయా: కోస్య రథస్య ప్రవేతా? (ఈ రథం నడిపే వాడెవడు?)

సూతః: అహం ఆయుష్మన్! అస్యరథస్యప్రాజితా (ఆయుష్మంతుడా! ఈ రథాన్ని నడిపేవాణ్ణి నేనే.)

వైయా: అపశబ్దః. (ఓయ్! ప్రాజితా అనేది అపశబ్దం. అజ ధాతువుకు 'వీ' ఆదేశం వచ్చి ప్రవేతా అవుతుంది.)

సూతః: ప్రాప్తిజ్ఞో దేవానాం ప్రియః నత్విష్టిజ్ఞః. ఇష్యత ఏతద్రూపం. (మూర్ఖుడివైన నీకు సూత్రం వల్ల వచ్చే రూపం మాత్రమే తెలుసు. పెద్దలు అంగీకరించిన వ్యవహార రూపం తెలీదు.)

వైయా: అహో ను ఖలు అనేన దురుతేన బాధ్యామహే. (దుష్టుడైన ఈ రథ చోదకుడు నన్ను ఆక్షేపిస్తున్నాడు.)

సూతః: నఖలులేఞః సూతః, సువతే రేవ సూతః. యది సువతే కుత్సా ప్రయోక్తవ్యా దుస్సూతూనేతి వక్తవ్యం. (అయ్యా! వేఞ్ ధాతువుకు ఉత రూపం వచ్చి సూత శబ్దం కాదు. అది షూఞ్ నుంచి వస్తుంది. దాన్ని నిందార్థంలో వాడాలంటే 'దుస్సూతేన' అనాలి. అంతేకాని, 'దురుతేన' అని అనకూడదు.)

ఈ సంభాషణను బట్టి వ్యాకరణ శాస్త్రంలో సూత్రార్థం మాత్రమే తెలిస్తే చాలదనీ, వాడుకలో వుండే ప్రయోగాల్ని సైతం స్వీకరించాలనీ పతంజలి అన్నాడు. వ్యవహారంలో వున్న శబ్దాల్ని గ్రహించలేకపోతే, ఎంతటి వైయాకరణుడైనా నవ్వుల పాలౌతాడు. అమరసింహుడు ఈ మర్మాన్ని గ్రహించి - ప్రాజితా, సూత లాంటి శబ్దాల్ని తన కోశంలో చేర్చాడు. అమరకోశంలో 1500 శ్లోకాల్లో సుమారు 9000 పదాలున్నాయి. మచ్చుకి మనకు సూర్యుడికి 37, కిరణానికి 11, బ్రహ్మకు 20 పర్యాయ పదాలున్నాయి. ఇవి అమరసింహుడి భాషా మర్మజ్ఞతని విశదీకరిస్తాయి.

నేటి తరానికి అమరకోశం పరిచయం లేదు. పదాలకోసం నిఘంటువుల్ని ఆశ్రయిస్తారు. కాగా, వాటిలో పర్యాయ పదాలు, నానార్థాలు, లింగజ్ఞానం వుండవు. కంప్యూటర్లలో దొరికే పదాల అర్థాలు సమగ్రం కావు. వక్తలు, రచయితలు, కవులు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు- వీళ్ళకు గనక అమరం కంఠస్థం అయివుంటే- వీళ్ళ పదసంపద అపారంగా వెల్లివిరుస్తుంది. 'సింహో మృగేంద్రః పంచాస్యః హర్యక్షః కేసరీ హరిః' అన్న పాదం నోటికి వస్తే- సింహానికి మృగేంద్రమనీ, పంచాస్యమనీ, హర్యక్షమనీ, కేసరి అనీ, హరి అని వాడగలుగుతాం- ఏ పునరుక్తీ లేకుండా. వైజ్ఞానికమైన వర్గీకరణతో శబ్ద హర్మ్యాన్ని నిర్మించిన అమరుడు నిజంగా అమరుడే.

అప్పరుసు విజయరామారావు
91770 86363

నాగలి కూడా ఆయుధమే..!

దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కొమ్మవరపు విల్సన్ రావు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే' పరిచయ సభ రాపోలు సీతారామరాజు అధ్యక్షతన ఏప్రిల్ 30 సాయంత్రం 6 గంటలకు అంతర్జాల వేదికపై జరుగుతుంది. సభలో గుడిపాటి, యం. నారాయణ శర్మ, పి. శ్రీనివాస గౌడ్, గౌతమ్ లింగా, విల్సన్ రావు కొమ్మవరపు పాల్గొంటారు. వివరాలకు: 89854 35515.

రాపోలు సీతారామరాజు

అం.ప్ర.ర.సం అధ్యక్ష, గౌరవాధ్యక్షుల ఎన్నిక

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం నూతన అధ్యక్షులుగా సి. భవానీదేవి, గౌరవ అధ్యక్షులుగా పాపినేని శివశంకర్ ఎన్నికయ్యారు. ఏప్రిల్ 23న గుంటూరు బృందావన్ గార్డెన్స్ లో అన్నమయ్య గ్రంథాలయం ఆవరణలో జరిగిన ఈ ఎన్నిక సమావేశంలో చలపాక ప్రకాష్, వెలువోలు నాగ రాజ్యలక్ష్మి, బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బాపట్లకు చెందిన సి.భవానీ దేవి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సచివాలయం ముఖ్య కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. కవయిత్రిగా, కథా, నవలా, వ్యాసరచయిత్రిగా, అనువాదకురాలిగా తెలుగు సాహిత్యరంగంలో సేవలు అందించారు.

చలపాక ప్రకాష్

గంగ్ర హనుమంతరావు సాహిత్య పురస్కారం

ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయిలో కవిత్వేతర ప్రక్రియలకు అందించే గంగ్ర హనుమంతరావు స్మారక పురస్కారానికి ఈ సంవత్సరం తెలంగాణ విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యులు లక్ష్మణ చక్రవర్తి 'షట్చక్రం' పుస్తకం ఎంపికైంది. ఈ అవార్డు ప్రదానోత్సవం ఈ నెల చివరి వారంలో ఉంటుంది.

గాజుల రవీందర్

'మాతృ వందనం' సత్కార సభ

డెబ్బై ఏళ్ల పైబడిన రచయిత్రుల షష్టిపూర్తి కలాలకు సత్కారం 'మాతృవందనం' కార్యక్రమం పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, సితాస్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో ఏప్రిల్ 30 ఉ.10గంటలకు హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళామందిరంలో జరుగుతుంది. సభాధ్యక్షులు తంగెడ కిషన్ రావు, ఉపాధ్యక్షులు కవిత దర్యాని రావు, విశిష్ట అతిథి కె. రజనీ ప్రియ, గౌరవ అతిథి మామిడి హరికృష్ణ, ఆత్మీయ అతిథి భట్టు రమేష్, నిర్వహణ అయినంపూడి శ్రీలక్ష్మి, నల్లమోతు నాగరాణి. ఈ ఏడు మాతృ వందనం స్వీకరిస్తున్న రచయిత్రులు: తెన్నేటి మాణి క్యాంబ, గౌరి తంగవేలు, బీనాదేవి, అరవింద, ఆకెళ్ళ విశాలాక్షి, శ్రీలక్ష్మి ఉంగుటూరి, బుగ్గారపు సులోచన, ఉమాదేవి ఆచంట, ద్రోణం రాజు సుబ్బలక్ష్మి, డి. సుజాత దేవి, శోభారావు కేతవరపు, విజయలక్ష్మి ధార, కె. వరలక్ష్మి, మన్నె లలిత, లలితా దేవి మాడభూషి, ముదిగొండ మల్లీశ్వరి, సత్యవాణి, బి. ఉమాదేవి జంధ్యాల, సత్యవాడ సోదరీ మణులు, రఘునాథమ్మ, సూర్యకుమారి, ముది గొండ సీతా రావమ్మ, మున్నంగి లలిత కళ, ఓల్గా, మరు దాడు అహల్యమ్మ, చాడా లలితాదేవి, దివాకర్ల రాజేశ్వరి, అరుణ వ్యాస్, పద్మజ వాణి, శోభా దేవి రేవూరి, కోండ్ మీనా, పాప ఎర్రంశెట్టి, ఉప్పలపాటి కుసుమ, సంధ్య గోళ్ళమూడి, జి.వి. రాజేశ్వరి, జి. భవాని కృష్ణమూర్తి, అఖిలేశ్వరి, ఆర్. సుమన్ లత, కె.వి. కుమారి, జానకీ ప్రభల, పుట్టపర్తి నాగపద్మిని, తిరుమల నీరజ, సి. భవానీ దేవి, బి. లీలారెడ్డి.

శ్రీలక్ష్మి ఐనంపూడి

హార్దికాహ్వానం

నిన్ను మనసులోకి ఆహ్వానిస్తాను
కానీ కొన్ని షరతులతో

లోపలికి వస్తూనే
తలుపుకు ఎడం వైపున
నన్ను నేను చెక్కుకున్న
తుడిపి తుడిపి రాసుకున్న
అస్తిత్వపు పలక తగిలించి ఉంది జాగ్రత్త

కుడివైపున
దిక్కుల దాకా పరుచుకుని
అపుడపుడూ ముడుచుకునే
అభిరుచుల అత్తిపత్తి ఉంది
అదేపనిగా ముట్టుకోకు

ఆ పక్కనే
ఇప్పుడిప్పుడే కలల మొగ్గలేసుకుని సన్న ఆశల తీగ
హృది కిటికీని అల్లుకుంటోంది
ఒక్క దోసెడు ప్రోత్సాహం చిలకరిస్తే
ముందు ముందు ఆ పరిమళాలు
నిన్నూ అలుముకుంటాయి

కాస్త ముందుకు వస్తే
వీలైనన్ని ఎత్తులకు ఎగురుతూ
అలా ఇలా
సరదాగా సందడి చేస్తుంటుంది
నా స్వేచ్ఛా పిట్ట

దానికోసం పంజరాన్ని మాత్రం పట్టుకుని రాకు

చప్టామీద చిన్ననాటి స్నేహం కూర్చోనుంది
పాత మంచం పైన కన్నవాళ్ళు
అలసి సేదదీరుతున్నారు
వసారాలో అయినవాళ్ళు
అదీ ఇదీ మాట్లాడుతూ ఉంటారు

చూసుకో..
అటూ ఇటుగా వెళ్తే
అనుమానపు అగాధాలున్నాయి
సమాంతరంగా సంయమనంతో అడుగులేయాలి

అప్పుడప్పుడు
సమస్యల మంచు కురుస్తుంది
పరస్పర చర్చల సెగడు
వెలిగించుకునే వెసులుబాటుంది

చిట్టి పొట్టి వైరుధ్యాలతో
అక్కడక్కడా తడుస్తుంది
అయినా సర్దుబాట్ల గాలీ వెలుతురు
కావాల్సినంత ఉంది

అంతగా అడిగావు కాబట్టి
ఎద తలుపైతే తెరుస్తాను
కానీ నీకోసం నాకు సంబంధించినవేవీ ఖాళీచేయను
పాతవేవీ పోగొట్టుకోను

ఒకటి మాత్రం హామీ ఇవ్వగలను
నిబంధనలు పాటించి వొస్తే
నువ్వు నిరాశచెందవు
వెన్నెల రాత్రి ఆరుబయట ఆకాశం కింద



వెల్లకిలా పడుకున్న అనుభూతి
నిన్ను చుట్టుముడుతుంది
హక్కుల్ని ఇవ్వడం లోని ఆనందం
అనుభవం లోకి వస్తుంది

అలాగే..
ఉమ్మడి ఆశయాల కౌగిలింతలు అదనం

దారల విజయ కుమారి
91772 92275

"లోకం చూపే జాలిలో శాడిజం ఉంటుంది"

అనిశెట్టి రజిత రుద్రమ ప్రచురణల నుంచి ప్రధాన సంపాదకులుగా ఇటీవల వెలువరించిన గ్రంథం 'భారత దేశంలో వితంతు వ్యవస్థ'. కొమర్రాజు రామలక్ష్మి, తమ్మెర రాధిక, చందనాల సుమిత్రలు ఈ సంకలనానికి సంపాదకులు. ఇందులో సామాజిక సాహిత్య వ్యాసాలు, సంస్కర్తల వ్యక్తిత్వాలు, వితంతు స్త్రీల కథనాలు, నివేదికలూ ఉన్నాయి. దేశం ఎంత ముందుకి వెళుతుందని చెప్పుకుంటున్నా స్త్రీల స్థాయి విషయానికి వస్తే ఏదో ఒక డొంక పట్టుకు ఆమెను వెనక్కు లాగడం మతం పేరున చేసినప్పుడు ఆ చిక్కు ముడులు విప్పకుండా ముందుకు వెళ్లడం జరగదు. ఈ వ్యవస్థ విధివంచితులని ముద్ర వేస్తున్న స్త్రీల పరిస్థితిని సమాజం ముందుకు తేవాలన్న ఆలోచనతో ఈ పుస్తకాన్ని తెచ్చారు. ఈ సంకలనం గురించి అనిశెట్టి రజితను పలకరిద్దాం.

ఈ పుస్తకంలో వివిధ రచయితలు తొలి దశ నుంచి తెలుగు సాహిత్యంలో ఉన్న వితంతు సందర్భాలను, పాత్రలను గురించి వ్యాసాలు రాశారు. నేటి తెలుగు సాహిత్యం వితంతు వ్యవస్థను ఎలా చూస్తుంది?

అచ్చంగా వివిధ భాషా ప్రాంత రచయితల రచనల్లో ఉన్నట్టుగానే ఆది నుండి వితంతు వ్యవస్థను భారతీయ సమాజం కాపాడుకుంటూ వస్తున్నది. మతాన్ని బలమైన పునాదిగా చేసుకొని ఆచార సంప్రదాయాలను పవిత్ర శాసనాలుగా అనుసరించాలంటూ ఒక క్రూరమైన వ్యవస్థను నిర్మించి కొనసాగిస్తున్నది మన సమాజం. ఈ విషయంలో సాహిత్యం మానవీయంగా ప్రగతిశీలంగానే ఉండి ఉన్నది ఉన్నట్లుగా చిత్రిస్తూ వస్తున్నది. గతానికి సంబంధించి అదొక సాహసమే.



అనిశెట్టి రజిత | పలకరింపు

భర్తను కోల్పోయిన కొందరు సెలబ్రిటీ స్త్రీలు విషయంలో ఈరోజు సామాజిక మాధ్యమాలలో వితంతు ఆచారాల ఆంక్షలు లేనితనాన్ని చూస్తున్నాం. ఏ వర్గం స్త్రీలని ఈ వితంతు వ్యవస్థ దూరం పెడుతుంది?

సెలబ్రిటీలు ఎవరు? వారు మన సమాజం మొత్తానికి ప్రతినిధులు కాదు కదా. వారున్న రంగాల్లో వారు వేరుగా ఉంటే కుదరదు. ఎప్పటిలా ఉండాల్సిందే. అక్కడ అంతగా పాటించవలసిన నిబంధనలు ఉండవు. చూసీ చూడనట్టు ఉంటారు. వారు అవసరాన్ని అనుసరించి పైపైన అలా కనిపిస్తున్నా లోలోన వారు ఏమి ఎదుర్కోరని, మానసికమైన డిస్టర్బెన్స్ ఉండదని అనుకోలేము.

వితంతు వ్యవస్థ అనేది కేవలం వస్త్రధారణ, పూలు, బొట్టు, గాజులు వంటి భౌతిక అలంకరణకు మాత్రమే పరిమితమైనది కాదు. అది ఒక సజీవమైన అస్తిత్వాన్ని నిండా రసాయనాలు పోసి కడిగి మేకప్ వేసి శవప్రాయం చేసే దౌర్జన్యపు వ్యవస్థ. స్వల్పమైన తేడాలతో దాని ప్రభావాన్ని పూర్తిస్థాయి అని అంచనా వేయలేము. ఆంక్షల రాతి గోడల లోపల జరిగేవన్నీ అందరికీ కనిపించాలనీ లేదు. అది అనుభవించే వారికే తెలుస్తుంది.

ప్రస్తుత సోషల్ మీడియా కాలంలో భక్తి, సనాతన ధర్మం, సంస్కృతి అంటూ స్త్రీ కట్టు బొట్టుపై మరోసారి పునరాలోచన చేయాలని వస్తున్న వ్యాఖ్యలు రేపు అదే స్త్రీ వితంతువయ్యాక జరగబోయే దానికి ఆజ్యం పోస్తున్నట్టేనా?

ఇప్పుడు సోషల్ మీడియానే సమస్తం అనుకుంటున్నారు కొందరు. స్త్రీ కట్టుబొట్టుల గూర్చిన పునరాలోచన ఒత్తిడి ఒకటే కాదు, స్త్రీని బ్రాహ్మణీయ పితృస్వామ్యం, పితృస్వామ్య భూస్వామ్యం, కులస్వామ్యం, మత భావనలు అన్నీ దేహపు ముద్దగా, సొంత ఆస్తిగా, విలాసాలకు సాధనంగా చేసుకొని, శతాబ్దాలుగా బొమ్మను చేసి ఆడుకుంటున్నాయి. ధర్మాన్ని మతాన్ని ఉల్లంఘించి కూడా స్త్రీల పట్ల దాష్టీకం చేస్తున్నాయి. ఈ విషగాలులు ఎప్పుడు వీచినా ప్రమాదకరమైనవి, నేరపూరితమైనవి. ముందు ముందు పరిస్థితి ఇంకా భయానకం కానున్నది. పెనం మీద నుండి పొయ్యిలోకి పడిపోతామా అని నిరాశతో అంటున్నది కాదు.

లౌకిక ప్రజాస్వామ్య భారతదేశంలో కేవలం హిందూ సంప్రదాయంలో వితంతు వ్యవస్థపై పుస్తకం తీసుకురావడం పై మీ వ్యాఖ్య?

మొదట నేను స్పష్టం చేయాల్సింది స్త్రీలను మతాల కులాలపరంగా విభజించుకుని వర్గీకరించుకొని ఈ సంకలనం వేయాలన్న స్పృహ లేకపోవడం. అయితే ఒక ప్రారంభం కావాలని దీనిపై వివిధ సెక్షన్లలో ఒక చర్చ రావాలని ఒక ఆశతో నాలో వేదనకు ఒక అవుట్‌లెట్‌గా ఈ బాధ్యతను చేపట్టాను.

రెండో మాట- ఇంకా ఎంతో చేయాలని ఉన్నా ఆ పరిశోధన చేయలేకపోవడం కలెక్టివ్ వర్క్ వైఫల్యమే. ఈ సంకలనంలోని సాహిత్య వ్యాసాల విభాగం దానికి ఒక ఉదాహరణ. ప్రయత్నం కొంత జరిగినా రావాల్సిన స్పందన రాకపోవడం ఒక కారణం.

హిందూ వ్యవస్థలో స్త్రీకి ఉన్న అన్ని ప్రివిలేజెస్ అంగీకరించి వితంతు ఆచారాల దగ్గరకు వచ్చేసరికి కేవలం తృణీకరణే వారిని ఇబ్బంది పెడుతుందా? మరే ఇతర కారణాలు ఉన్నాయా?

హిందూమత వ్యవస్థలో అనే కాదు, ఈ అసమ వ్యవస్థలో ఏ స్త్రీకీ ఏ ప్రివిలైజస్ లేవు. డబ్బు పరంగా వచ్చే కొన్ని సౌకర్యాలు కులం వర్గం పరంగా వచ్చే కొన్ని సౌలభ్యాలు ఏ విధంగానూ ప్రివిలైజస్ అని మినహాయించ లేము అన్నది ఒక అవగాహన. స్త్రీలందరూ ఎన్నో రూపాల్లో అవమానాలు అణిచివేతలు అనుభవిస్తూనే ఉన్నారు. ఇక భర్త చనిపోతే ఆయా స్త్రీలను పోల్చుకోవలసి వస్తే రూపంలో కొన్ని తేడాలు ఉన్నా సారంలో వారి పట్ల ఆచార వ్యవహార క్రూరత్వం ప్రదర్శించడంలో తేడాలు ఉండవు.



సాధారణ గృహిణులు, మధ్యతరగతి మహిళలే ఎక్కువగా ఈ వితంతు వ్యవస్థకు బలి కాబడుతున్నారనుకోవచ్చా?

ఒక సెక్షన్ వర్గం స్త్రీలు అని అనుకోలేము. సోషల్ స్టిగ్మా, సోషల్ సెగ్లెట్ అంతటా వ్యాపించి ఉన్నప్పుడు ఆచార సాంప్రదాయాల ముసుగులో బంధించడం అనేది అందరికీ ఓపెన్‌గా కనిపించేది కాదు, గుట్టుగా ఒకింత రట్టుగా వారి కుటుంబాల లోపల జరిగేది. ఇదంతా తమ పట్ల జరుగుతుంటే ఒక బండి చక్రం విరిగిపోతే ఒకే చక్రంతో జీవితపు బండిని ఎలా ఈడాలా అని నిస్పృహలో స్త్రీలు కూరుకుపోతారు. అప్పటిదాకా ఉన్న అస్తిత్వం కోల్పోయినతనం బాధిస్తుంది. ఇతరుల సానుభూతి నామమాత్రమే. లోకం చూపే జాలిలో శాడిజం ఉంటుంది.

ఇంటర్వ్యూ **మానస ఎండ్లూరి**

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆత్మవిశ్వాసం అండగా.

పసి వయసులో పోలియో... ఆమె కాలు కదలనివ్వలేదు. కానీ పట్టుదలతో చదివి... ఆత్మవిశ్వాసంతో నిలబడింది. నేడు తనలాంటి ఎంతోమందికి దిక్సూచిగా మారి... ఆత్మస్థైర్యం నింపి... ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. సామాజిక కార్యకర్తగా, రచయిత్రిగా, అథ్లెట్‌గా... ఎన్నో హృదయాలను గెలుచుకున్న అమితా పటేల్ విజయ గాథ ఇది.

స్ఫూర్తి



"కష్టాలు అందరికీ వస్తాయి. సవాళ్లు ఎదురవుతాయి. వాటిని అధిగమించి ముందుకు సాగితేనే జీవితం. ఇది నాకు చిన్నప్పుడే బోధపడింది. అందుకు కారణం నా వైకల్యం. నాకు ఏడాదిన్నరప్పుడు పోలియో మహమ్మారి సోకిందని వైద్యులు నిర్ధారించారు. ఇక అప్పటి నుంచి మా అమ్మానాన్నలకు కంటి మీద కునుకులేదు. అలాగని వారు బాధపడుతూ... నన్ను బాధ పెట్టలేదు. వైకల్యాన్ని మరిచిపోయేలా నాకంటూ ఒక మెరుగైన జీవితం ఇవ్వాలనుకున్నారు. దానికి తగ్గట్టుగానే నన్ను ఎంతో అపురూపంగా పెంచారు. గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ సమీపంలోని జోధ్‌పూర్ మా ఊరు. ఊహ తెలిసినప్పటి నుంచీ వైకల్యంతో పోరాడుతున్నాను. దీనివల్ల ఎన్నో ఇబ్బందులు, అవహేళనలు. అన్నిటినీ తట్టుకొని నిలబడ్డానంటే అందుకు మా అమ్మానాన్నల ప్రేమ, మార్గదర్శనం, ప్రోత్సాహం కారణం.

బడికి వెళ్లలేక...

నా పరిస్థితి ఏంటో నాకు బాల్యంలోనే అర్థమైంది. చక్రాల కుర్చీ లేనిదే అడుగు బయటకు పెట్టలేను. ఈ వైకల్యాన్ని జయించాలంటే నన్ను నేను నిరూపించుకోవాలి. నాకంటూ ఒక ప్రత్యేకత ఉండాలి. వీటన్నిటికీ పునాది విద్య ఒక్కటేనని అమ్మానాన్నలు చెప్పారు. వారి అండతో ఉన్నత చదువులు చదవాలని కలలు కన్నాను. కానీ బడికి వెళ్లడమే గగనమైపోయింది. కష్టపడి వెళ్లినా... తరగతి గదుల్లో కూర్చోవడం, తిరిగి బయటకు రావడం... ఇలా ప్రతిదీ సమస్యగానే మారింది. పాఠశాలల్లో నాలాంటి వికలాంగులకు ఎక్కడికైనా వీల్‌చైర్‌లో వెళ్లగలిగేలా సరైన సౌకర్యాలు ఉండేవి కావు. మరి నా చదువుకు మార్గం ఏమిటి? ఈ ఆలోచన మా ఇంట్లోవాళ్లను కొన్నాళ్లు సందిగ్ధంలో పడేసింది. అయితే నా ప్రతిభాపాటవాల మీద వాళ్లకు ఎంతో నమ్మకం. చివరకు స్థానిక గ్రామ పంచాయత్ స్కూల్లో చేరాను.

భవిష్యత్తుకు పునాది...

చదువుకోవాలన్న నా దృఢ సంకల్పానికి, నా భవిష్యత్తుకు, నాపై అమ్మానాన్న పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడానికి ఆ పాఠశాలలోనే పునాది పడింది. క్రమంగా పదో తరగతి, హెచ్ఎస్‌సీ, బీఏ, ఆ తరువాత ఎల్ఎల్‌బీ



పూర్తి చేశాను. నా విద్యాభ్యాసంలో ప్రతి మైలు రాయినీ ఎనలేని అంకితభావంతో అధిగమించాను. అదే సమయంలో నాలాంటివారికి అండగా నిలబడి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని నిర్ణయించుకున్నాను. దాంతో పాటు సామాజిక అంశాల మీద కూడా పరిజ్ఞానం పెంచుకున్నాను.

ప్రతిచోటా తిరస్కరణలే...

మొదటి నుంచి నా కాళ్లపై నేను నిలబడాలన్న తపన. అందుకే చదువు అవ్వగానే అమ్మానాన్నకు భారం కాకుండా మంచి ఉద్యోగంలో స్థిరపడాలనుకున్నాను. వృత్తి విద్య, కంప్యూటర్ కోర్సులు చాలా నేర్చుకున్నాను. నా వైకల్యం వల్ల కార్పొరేట్ కంపెనీల నుంచి తిరస్కరణలే ఎదురైంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తే... వ్యవస్థీకృత అడ్డంకులు ఎదురయ్యాయి. ఇక్కడే నా జీవితం అనుకోని మలుపు తిరిగింది. ఉద్యోగ ప్రయత్నాలకు మార్గం మూసుకుపోవడంతో సొంత వ్యాపారం ప్రారంభించాలని అనుకున్నాను.

సరికొత్త అధ్యాయం...

ఈ నేపథ్యంలోనే 1992లో నా జీవితంలో ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలికాను. కంప్యూటర్ కోర్సులు నేర్పే ఇనిస్టిట్యూట్ ఒకటి నెలకొల్పాను. అది కూడా మా ఇంట్లోని ఒక గదిలో. వైకల్యం ఉన్నవారితో పాటు ఏ ఆధారం లేని యువతను సాధికారత దిశగా నడిపించాడానికి అది నేను వేసిన తొలి అడుగు. కేవలం కంప్యూటర్ విద్య మాత్రమే కాకుండా... వారిలో ఆత్మవిశ్వాసం నింపి, భవితకు భరోసా కల్పించేందుకు ప్రాధాన్యం ఇచ్చాను. వికలాంగులకు ఉచిత విద్య అందిస్తున్నాను. దాంతోపాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తున్నాను. ముఖ్యంగా నాలాంటివారికి పెళ్లిళ్లు అవ్వడం చాలా కష్టం. అందుకే... నా దగ్గరకు విద్య అభ్యసించే అలాంటి విద్యార్థుల పెళ్లి బాధ్యత కూడా నేనే తీసుకున్నాను. 'దివ్యాంగ్ రోజ్‌గార్ మేళా, దివ్యాంగ్ జీవన్‌సాథీ' లాంటి కార్యక్రమాలు నిర్వహించి వారికి మంచి జీవితాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాను.

వారి గుండెల్లో నేను...

నా కృషివల్ల ఇన్నేళ్లుగా వేలమంది ప్రయోజనం పొందారు. అనేకమంది బాగా స్థిరపడ్డారు. అన్నిటికీ వించి వారి గుండెల్లో నాకు స్థానం ఇచ్చారు. నాకు... నా విద్యార్థులకు మధ్యనున్నది భావోద్వేగాల బంధం. ఇంతకు మించిన సంతృప్తి నాకు ఎక్కడ దొరుకుతుంది! సామాజిక కార్యకర్తగానే కాకుండా... నాకంటూ ఒక జీవితం ఉంది. నేను మంచి అథ్లెట్‌ను కూడా. జావెలిన్ త్రోలో చాలా పతకాలు సాధించాను. కవిత్వం రాస్తాను. మన సామర్థ్యానికి, వేరొకరికి స్ఫూర్తిగా నిలవడానికి వైకల్యం అనేది అవరోధం కాదని ఈ సమాజానికి నిరూపించడమే నా ఏకైక లక్ష్యం. అందులో కొంతవరకు విజయం సాధించాని గర్వంగా చెప్పగలను."



పంతం కోసం ఎందాకైనా...

వివాదాలు చుట్టుముట్టినా, వైఫల్యాలు ఎదురైనా... 'తగ్గేదిలే' అనే స్వభావం మీసా భారతి సొంతం. తెరవెనుక రాజకీయ వ్యవహారాల్లో చాతుర్యం, ముక్కు మీద కోపం... ఇవీ ఆమె గురించి వినిపించే విశేషణాలు. పాటలీపుత్ర నుంచి మూడోసారి పోటీకి దిగిన లాలూగారి పెద్దమ్మాయి... ప్రధాని మోదీని జైల్లో పెట్టిస్తామంటూ చేసిన వ్యాఖ్యలు బిహార్‌లో ఎన్నికల ప్రచారాన్ని వేడెక్కించాయి.

"రామ్ కృపాల్ యాదవ్ అంటే మాకు ఎంతో గౌరవం ఉండేది. కానీ మమ్మల్ని మోసం చేసి బిజెపిలో చేరారు. ఆ సంగతి తెలియగానే... గడ్డిని ముక్కలు చేసే యంత్రంతో అతని చేతులు నరికెయ్యాలనుకున్నాను. నాకు ఎదురుపడితే అదే చేసేదాన్ని..." 2014 లోక్ సభ ఎన్నికల ప్రచారంలో మీసా భారతి ఆగ్రహంతో అన్న మాటలివి. ఆమె తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు రామ్ కృపాల్ కుడి భుజం. లాలూ పార్టీ అయిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) తరఫున పట్నా నుంచి ఎంపీగా కూడా గెలిచారు. కానీ 2009లో పట్నా నుంచి లాలూ స్వయంగా పోటీ చేయడంతో... రామ్ కృపాల్‌కు అవకాశం దక్కలేదు. 2014లో తనకు పాటలీపుత్ర పార్లమెంట్ సీటు ఇవ్వాలని లాలూను ఆయన కోరారు. కానీ అప్పటికే ఆ స్థానం మీద లాలూ తొలి సంతానమైన మీసా భారతి కన్నుపడింది. ఎందుకంటే... ఆమె భర్త శైలేష్ సొంత ఊరు దానాపూర్. అది పాటలీపుత్ర పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో ఉంది. చివరకు ఆమెనే అభ్యర్థిగా లాలూ ప్రకటించారు. దాంతో ఆర్‌జెడికి రామ్ కృపాల్ రాజీనామా చేసి, బిజెపిలో చేరారు. మీసాను ఓడించారు. కేంద్ర మంత్రి అయ్యారు. 2019 ఎన్నికల్లోనూ రామ్ కృపాల్ చేతిలో మీసా ఓటమి పాలయ్యారు. ఈ పరాజయాలను మీసా చాలా వ్యక్తిగతంగా తీసుకున్నారని చెబుతారు ఆమె సన్నిహితులు. పార్టీకి కంచుకోటల్లాంటి వేరే స్థానాలేవైనా ఎంచుకొనే వెసులుబాటు ఆమెకు ఉంది. అదీగాక... రెండు విడతలుగా రాజ్యసభ సభ్యురాలుగా కూడా ఆమె కొనసాగుతున్నారు. ఎంపీగా ఆమె హోదాకు ఎలాంటి ఢోకా లేదు. అయితే "ఎప్పటికైనా రామ్ కృపాల్‌ను ఓడించి తీరుతాను" అని మీసా పంతం పట్టారు. అందుకే ఈసారి కూడా పాటలీపుత్ర నుంచి... రామ్ కృపాల్‌కు ప్రత్యర్థిగా ఆమె బరిలోకి దిగారు. ఇటీవలే ఆ పార్లమెంటరీ స్థానానికి పోలింగ్ ముగిసింది. ఈ విడత ప్రచారంలో మీసా తన వ్యాఖ్యలకు మరింత పదునుపెట్టారు. ప్రధానమంత్రి మోదీపై విపక్షాలు ఎన్నో విమర్శలు చేస్తూ ఉండొచ్చు. కానీ "మా కూటమి అధికారంలోకి వస్తే మోదీతో సహా బీజేపీ నాయకులందర్నీ జైల్లో పెట్టిస్తాం" అనే ధైర్యం చేసింది బహుశా మీసాయే కావచ్చు. ఆమె వ్యాఖ్యలపై బిజెపి వర్గాలు తీవ్రంగా విరుచుకుపడ్డాయి. దాంతో తన మాటలకు ఆమె వివరణ ఇస్తూ "ఎలక్టోరల్ బాండ్స్ గురించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మీదే నేను మాట్లాడాను. మా ప్రభుత్వం వస్తే వాటి మీద విచారణ జరిపించి, దోషులకు శిక్ష వేయిస్తామన్నాను. నా మాటలు వక్రీకరించారు" అంటూ సమర్థించుకున్నారు.

హార్వర్డ్ వివాదం...

మాటలతో, చేతలతో వివాదాల్ని కొనితెచ్చుకోవడం మీసాకు కొత్తేం కాదు. 2015 మార్చిలో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఇండియన్ కాన్ఫరెన్స్‌లో తాను ప్రసంగించానని సూచించే కొన్ని ఫొటోలను ఫేస్‌బుక్‌లో, ట్విట్టర్‌లో మీసా భారతి పెట్టారు. వాటిని బిహార్‌లోని వార్తాపత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. దీని గురించి హార్వర్డ్ విశ్వవిద్యాలయం వర్గాలను జాతీయ మీడియా వాకబు చేసినప్పుడు... "మీసా భారతి ఇండియా కాన్ఫరెన్స్‌లోని ఏ ప్యానెల్‌లోనూ వక్త కాదు. ఆమె ప్రేక్షకురాలుగా, టిక్కెట్టు కొనుక్కొని హాజరయ్యారు" అని ఇ-మెయిల్ ద్వారా స్పష్టం చేశారు. ఆమె తన సోషల్ మీడియాలో కొన్ని ఫొటోలు అప్‌లోడ్ చేశారనీ, అవి తప్పుదారి పట్టించే విధంగా ఉన్నాయనీ, దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామనీ తెలిపారు. దరిమిలా... తప్పుడు సమాచారంతో మీసా భారతి ప్రజలను మోసం చేశారంటూ బీజేపీ నాయకుడొకరు ముజఫర్‌నగర్ కోర్టులో కేసు వేశారు. దాంతో మీసా నష్టనివారణ చర్యలకు దిగారు. "హార్వర్డ్ వర్సిటీలో జరిగిన ఇండియన్ కాన్ఫరెన్స్‌కు వెళ్లాను. పోడియం దగ్గర కొన్ని ఫొటోలు తీసుకున్నాను. నా స్నేహితులకు షేర్ చేశాను. వాటిని స్థానిక మీడియా సంపాదించి, దాని చుట్టూ కథ అల్లింది. నేను ప్యానల్‌లో ఉన్నానని ఎప్పుడూ చెప్పలేదు. సదస్సు తరువాత... ప్యానలిస్టులతో నా అభిప్రాయాలను వ్యక్తిగతంగా పంచుకున్నానంతే. ఎవరో ఔత్సాహికులు, అభిమానులు నేను వక్తనంటూ వాటిని సర్క్యులేట్ చేసి ఉంటారు. ఈ వ్యవహారం నా దృష్టికి రాగానే... వాటిని తొలగించేలా చేశాను. తప్పుడు ప్రచారాన్ని నేను ఎప్పుడూ కోరుకోలేదు. నా మీద అక్కసుతో కొందరు చేస్తున్న ఆరోపణలు ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా ఉన్నాయి" అంటూ ఎదురుదాడికి దిగారు.

అమ్మ వెనుక చక్రం తిప్పి..

"మీసా చాలా కోపిష్టి. అనుకున్నది జరగాలంటుంది. ఎవరి మీదైనా కోపం పెంచుకుంటే... వారి అంతు చూడాల్సిందే" అని ప్రైవేటు సంభాషణల్లో ఆమె మేనమామ సాధుయాదవ్ వాపోయారనే కథ ఒకటి ప్రచారంలో ఉంది. నాడు దాణా కుంభకోణం కేసు నేపథ్యంలో... బిహార్ ముఖ్యమంత్రి పదవికి లాలూ రాజీనామా చేయడంతో... ఆ బాధ్యతలను ఆయన భార్య రబ్రీదేవి చేపట్టారు. మూడు విడతలుగా ఆమె సీఎం పదవిని నిర్వహించిన కాలంలో... పాలనా వ్యవహారాలన్నీ మీసాభారతి చేతుల మీదుగానే సాగాయి. అమ్మ వెనుక ఆమె చక్రం తిప్పి, అధికార యంత్రాంగాన్ని గుప్పిట్లో పెట్టుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో... తన తల్లి రబ్రీని కలుసుకోడానికి కూడా మేనమామ సాధు యాదవ్‌ను మీసా అనుమతించలేదు. ఆ తరువాత సాధు యాదవ్ ఆర్జేడీని విడిచిపెట్టాల్సి వచ్చింది. మీసా మీద, ఆమె భర్త మీద బినామీ ఆస్తులు, మనీ ల్యాండరింగ్, లెక్కచూపని ఆస్తులకి సంబంధించి అనేక ఆరోపణలున్నాయి. ఈడీ దర్యాప్తులు, ఆస్తులపై దాడులు, కీలకమైన పత్రాల స్వాధీనం లాంటివి జరిగాయి. "ఇలాంటి వాటికి బెదిరేది లేదు. ఇదంతా కుట్ర" అంటారు మీసా. లాలూ సీఎంగా ఉండగా... ఆమెకు అర్హత లేకపోయినా ఎంబిబిఎస్ సీటును పొందారంటూ అప్పట్లో విపక్షాలు గగ్గోలుపెట్టాయి. తను చదివిన పాట్నా మెడికల్ కాలేజీ అండ్



హాస్పిటల్ (పిఎంసిహెచ్)లో... గైనకాలజీలో టాపర్‌గా ఆమె నిలవడం, ఇన్ని విమర్శల మధ్య డాక్టర్ చదువు పూర్తి చేసినా... ఎప్పుడూ ప్రాక్టీస్ చేయకపోవడం... ఇలా ప్రతిదీ చర్చనీయాంశమే అయింది. వీటన్నిటినీ ఆమె కొట్టిపారేస్తారు. "నా పేరే ఒక అణచివేతపై ధిక్కారానికి ప్రతీక" అంటారామె. ఎమర్జెన్సీ సమయంలో... 'అంతర్గత భద్రతా నిర్వహణ చట్టం' (మీసా) కింద లాలూ ప్రసాద్ అరెస్టయ్యారు. సుమారు రెండేళ్ళు జైల్లో ఉన్నారు. ఆ సమయంలో... 1976 మేలో జన్మించిన తన పెద్ద కుమార్తెకు... మీసా చట్టం కింద దేశంలో జరిగిన అణచివేతకు గుర్తుగా 'మీసా భారతి' అని పేరు పెట్టారు. కాగా... లాలూ-రబ్రీ హయాంలో బిహార్‌లో ఆటవిక పాలన నడిచిందనీ, పేదలు, వెనుకబడ్డ వర్గాలవారు, ఓబీసీల మీద అత్యాచారాలు, అణచివేతలు తీవ్రంగా సాగాయనీ విపక్షాల ఆరోపణ. దీనికి పరోక్షంగానైనా మీసా భారతి మద్దతు ఉందనే వాదనా ఉంది. ఒక అణచివేతపై ధిక్కారానికి చిహ్నంగా చెప్పుకొనే వ్యక్తే... మరో అణచివేతకు దోహదం చేయడం... మీసా కథలోని రాజకీయ వైచిత్రి.

ఆనందమే ఆరోగ్యం!

ఇపుడున్న పోటీ ప్రపంచంలో ఆనందం వెతుక్కున్నా దొరకనిది అయ్యింది. అయితే రొటీన్‌కి భిన్నంగా కాస్త ఆలోచిస్తే ఆనందం దొరక్కపోదు. ముఖ్యంగా ఆనందంగా ఉండటానికి ఇలాంటి టిప్స్ పాటించండి.

- మీ చుట్టూ నెగటివ్ పీపుల్ కాకుండా పాజిటివ్‌గా ఆలోచించేవాళ్లు ఉండేట్లు చూసుకోండి. అంటే పాజిటివ్ మైండ్స్‌తో కలసి తిరగటం వల్ల మంచి అలవాట్లు, అభిరుచులు కలుగుతాయి. అలా పాజిటివ్ ఎన్విరాన్‌మెంట్‌లో ఉంటే ఒత్తిడి తగ్గుతుంది. దీనివల్ల సంతోషంగా ఉండే అవకాశాలెక్కువ.
- ఏదైనా మీరు చేసిన తప్పులను యాక్సెప్ట్ చేయండి. మీ తప్పులనే మీరు ఒప్పుకోవటం అంటే మీలోని మీరు జయించటమే. నెగటివిటీకి నీట్‌గా తుడిచేయటమే. అంతేనా ఎక్కువగా మాట్లాడకుండా ప్రశాంతంగా ఉండండి. మనసు ప్రశాంతంగా ఉంటే మీరూ సంతోషంగా ఉండగలరు.
- మంచి ఆహారం తినటం, వ్యాయామం, చేసే పని మరింత బాగా చేయటం వల్ల ఫీల్‌గుడ్ ఉంటుంది. పర్ఫెక్ట్ డైట్ వల్ల ఎనర్జిటిక్‌గా ఉంటారు. తద్వారా మంచి నిద్ర పడుతుంది. దీనివల్ల ఆనందం కలుగుతుంది.
- ఎక్కువ సమయం మీతో మీరు గడపండి. ఏమీ పని



లేకుంటే సెల్ఫ్‌కేర్ తీసుకోవాలి అంటారు. పుస్తకం చదవటం, జిమ్‌కు వెళ్లటం, ఒంటరిగా తిరగటం, విశ్రాంతి తీసుకోవటం.. లాంటివి చేయటం వల్ల మైండ్ ప్రశాంతంగా ఉంటుంది. దీంతో ఆనందం సొంతమవుతుంది.

- కంప్యూటర్ స్క్రీన్, ఫోన్‌లో ఇంటర్నెట్ చూడటం లాంటివి అధికంగా చేస్తే ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయి. అందుకే డిజిటల్ డిటాక్స్ చేయాలి. నెట్ సమయాన్ని తగ్గించుకుని నిజమైన ప్రపంచంలో బతకాలి. అప్పుడే ఆనందం వెల్లివిరుస్తుంది.
- ఇతరుల పట్ల దయ, జాలి, మర్యాద లాంటివి ఇవ్వటంతో పాటు క్షమించే గుణం అలవరుచుకోవటం మంచిదే. దీనివల్ల మీలో నెగటివ్ ఎమోషన్స్ తగ్గిపోతాయి. ఎనర్జిటిక్‌గా ఫీల్ అవుతారు. కొత్త వస్తువులు, కొత్త ప్రదేశాలు తిరగటం వల్ల కూడా గ్రేట్‌గా ఫీల్ అయ్యే అవకాశాలెక్కువ.

నవ్య | చిత్రజ్యోతి

వినోదం ప్రధానంగా



'బలగం, ఓం భీమ్ బుష్' చిత్రాలతో సక్సెస్‌ను అందుకొన్నారు నటుడు ప్రియదర్శి. ఇప్పుడు ఆయన హీరోగా కొత్త చిత్రం ఖరారైంది. నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బేనర్స్‌పై జాన్వీనారంగ్ నిర్మిస్తున్నారు. 'సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ రొమాంటిక్ స్టోరీలో ప్రియదర్శి పాత్ర పూర్తి స్థాయి వినోదాన్ని పంచుతుంది. స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. ప్రీ ప్రొడక్షన్ పూర్తి చేసి జనవరిలో సెట్స్‌పైకి తీసుకెళ్తాం. త్వరలో టైటిల్ ప్రకటిస్తాం' అని మేకర్స్ తెలిపారు.

భయపెడుతున్న అదా శర్మ



చాలా రోజుల తర్వాత హీరోయిన్ అదా శర్మ తెలుగులో ఓ సినిమా చేస్తున్నారు. ఆ చిత్రం పేరు 'సీడీ'(క్రిమినల్ ఆర్ డెవిల్). కృష్ణ అన్నం దర్శకత్వంలో రూపుదిద్దుకొన్న ఈ సినిమాను మే 10న విడుదల చేయనున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో అదా శర్మ యాక్షన్ సీక్వెన్స్, భయపెట్టే చూపులతో ప్రేక్షకులు కచ్చితంగా థ్రిల్ ఫీలవుతారు. ట్రైలర్‌లో విజువల్స్, రీరికార్డింగ్ .. అద్భుతంగా ఉన్నాయి. విశ్వంత్, 'జబర్దస్త్' రోహిణి, భరణీశంకర్, రమణ భార్గవ్, మహేశ్ విట్టా ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మాటలు: ముద్దుకృష్ణ, సినిమాటోగ్రఫీ: సతీశ్ ముత్యాల ,సంగీతం: ఆర్.ఆర్. ధ్రువన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: గిరిధర్.

బంగారంలా ఉండాలంటే...



అనారోగ్య సమస్యల కారణంగా సినిమాలకు కాసింత విరామం ఇచ్చారు సమంత. 'ఖుషీ' తర్వాత సమంత ఏ మూవీకి అంగీకరించలేదు. 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ 'హనీ బన్నీ' వెబ్‌సిరీస్‌లో నటించారు. సమంత నటించే మరో చిత్రం ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం సమంత పుట్టిన రోజు. ఈ సందర్భంగా అభిమానులకు తీపి కబురును అందిస్తూ.. తను నటించబోతున్న నెక్స్ట్ సినిమా అప్‌డేట్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె షేర్ చేశారు. ఈ సినిమా టైటిల్ 'మా ఇంటి బంగారం'. "బంగారంలా ఉండాలంటే ప్రతీ వస్తువు మెరవాల్సిన పని లేదు" అని పేర్కొంటూ ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను షేర్ చేశారు సామ్. ఈ సినిమాతో ఆమె నిర్మాతగా మారుతుండటం విశేషం. ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమాను ఆమె నిర్మిస్తున్నారు. ఇందులో సమంత ఓ వైలెంట్ గృహిణి పాత్రలో కనిపించనున్నట్లు ఈ మోషన్ పోస్టర్‌ను చూస్తుంటే తెలుస్తోంది.

మనసుకు హత్తుకునే అనుబంధం



సముద్రఖని ప్రధాన పాత్రధారిగా తెరకెక్కుతోన్న ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. ధనరాజ్ కీలకపాత్ర పోషిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. పృథ్వీ పోలవరపు నిర్మిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'సముద్రఖని అన్నయ్య సహాయం లేకపోతే ఈ సినిమా చేయలేను. తండ్రీ కొడుకుల అనుబంధాన్ని మనసుకు హత్తుకునేలా ఆవిష్కరిస్తుంది ఈ చిత్రం' అన్నారు. సముద్రఖని మాట్లాడుతూ 'ధనరాజ్‌కు తల్లిదండ్రులు లేరు. సొంతంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాడు. అతనిపై నమ్మకంతో ఈ సినిమాకు దర్శకత్వం వహించమని చెప్పాను' అన్నారు. ధనరాజ్ మాట్లాడుతూ 'పిల్లలు అంతా తమ తండ్రితో కలసి చూడాల్సిన చిత్రం ఇది' అన్నారు.

ఇది బుల్లెట్ తెచ్చిన సక్సెస్



రవి వర్మ, సంజనా సింగ్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'బుల్లెట్'. చౌడప్ప దర్శకత్వం వహించారు. ఎంసి రావు, బి గోపాల్, ఎమ్ వి మల్లిఖార్జున రావు, కోసూరి సుబ్రమణ్యం, మని నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది. దర్శకుడు చౌడప్ప మాట్లాడుతూ "మంచి చిత్రాలను ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని ఈ చిత్రం సాధించిన విజయంతో మరోసారి రుజువైంది" అని చెప్పారు. చిత్ర నిర్మాత గోపాల్ మాట్లాడుతూ "ఈ మూవీ కోసం టీమ్ అంతా ఎంతో కష్టపడింది. ఈ విజయం మా కష్టానికి తగిన ప్రతిఫలం" అని అన్నారు. హీరో రవి వర్మ మాట్లాడుతూ "ఈ కాలంలో ఓ సినిమా విజయోత్సవ వేడుక జరుపుకోవడం అరుదు. అలాంటి భాగ్యాన్ని మాకు అందించిన ప్రేక్షకులకు రుణపడి ఉంటాం" అని అన్నారు.

రాజు యాదవ్ ఆట పాట..



నటుడు గెటప్ శ్రీను హీరోగా నటిస్తున్న చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కే ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి నిర్మిస్తున్నారు. మే 17న విడుదలవుతోంది. ఆదివారం చిత్ర బృందం 'దిస్ ఈజ్ మై దరిద్రం' అంటూ సాగే గీతాన్ని సుడిగాలి సుధీర్ చేతుల మీదుగా విడుదల చేసింది. కాసర్ల శ్యామ్ సాహిత్యానికి హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరాలు సమకూర్చారు. రాహుల్ సిప్లిగంజ్, మంగ్లీ ఆలపించారు. లవ్ కామెడీతో పాటు హృదయానికి హత్తుకనే భావోద్వేగాలు సినిమాలో ఉన్నాయని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయిరామ్ ఉదయ్, ఎడిటర్: బొంతల నాగేశ్వర్‌రెడ్డి.

రాజ్‌నాథ్‌కు పోటీగా 251 సార్లు జైలుకు వెళ్లొచ్చిన వ్యక్తి

లఖ్‌నవూ, ఏప్రిల్ 28: అతనో నిత్య విద్యార్థి నాయకుడు. తన 40ఏళ్ల నాయకత్వ కెరీర్‌లో 251 సార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. ఇన్ని సార్లు జైలుకు వెళ్లి వచ్చినా... అతనిపై ఒక్కటంటే ఒక్క క్రిమినల్ కేసు కూడా లేదు. అన్నీ ఏదో ఒక పోరాటంలో, నిరసన ప్రదర్శనలో పాల్గొని జైలుకు వెళ్లిన సందర్భాలే. అతని పేరు రవిదాస్ మహ్రోత్రా. లఖ్‌నవూ లోక్‌సభ నియోజకవర్గంలో సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) తరఫున పోటీ చేస్తున్నాడు. ఇంతకీ ఇక్కడ రవిదాస్ ప్రధాన ప్రత్యర్థి ఎవరంటే.. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. అయినప్పటికీ రవిదాస్ తన విజయం పట్ల ధీమాగా ఉన్నాడు. రవిదాస్ 26 ఏళ్ల వయస్సులో లఖ్‌నవూ యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేశాడు.



నవాబులు, నిజాంల అరాచకాలపై మాట్లాడరేం?

» కర్ణాటక ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్‌పై మోదీ నిప్పులు

బెంగళూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): దేశానికి చెందిన రాజులు, మహారాజులను అవమానిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ.. బుజ్జగింపు రాజకీయాల కోసం నవాబులు, నిజాంలు, సుల్తాన్‌లు, బాద్షాలు చేస్తున్న అరాచకాలపై మౌనంగా ఉన్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్ణాటకలోని బెళగావి, ఉత్తర కన్నడ జిల్లా శిరసి, దావణగెరె, బళ్లారి జిల్లా హోసపేట బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. "ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని దేశ చరిత్ర, స్వాతంత్ర్య పోరాటాలకు సంబంధించిన పుస్తకాలను కాంగ్రెస్ రాయించింది. కాంగ్రెస్ యువరాజు నేటికీ ఆ పాపాలను కొనసాగిస్తున్నారు. పేదల భూములు, ఆస్తులను రాజులు, మహారాజులు కబ్జా చేశారని రాహుల్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో ఛత్రపతి శివాజీ, కిట్టూరు రాణి చెన్నమ్మ వంటి మహానుభావులను కాంగ్రెస్ అవమానించింది. అదే సమయంలో దేశ చరిత్రలో నవాబులు, నిజాంలు, సుల్తాన్‌లు, బాద్షాలు చేసిన దౌర్జన్యాలపై ఒక్కమాట కూడా మాట్లాడకుండా ఆయన నోటికి తాళం వేసుకున్నారు" అని మోదీ ధ్వజమెత్తారు. ఎన్నో దేవాలయాలను అపవిత్రం చేసి, ధ్వంసం చేసిన మొఘలు చక్రవర్తి ఔరంగజేబు అఘాయిత్యాలు రాహుల్‌కు గుర్తుకురాలేదని ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తిని ప్రశంసించే వారితో కాంగ్రెస్ సంతోషంగా పొత్తులు పెట్టుకుంటోందని ఆరోపించారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తర్వాత శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిదని ఆరోపించారు. బెళగావిలో ఆదివాసీ మహిళపై జరిగిన దారుణాన్ని, చిక్కోడిలో జైన సన్యాసి హత్యను ప్రస్తావించారు. ఇటువంటి ఘటనలు జరగడం సిగ్గుచేటని, ఇవి కర్ణాటక ఆత్మగౌరవాన్ని దిగజారుస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్ వయనాడ్ సీటులో గెలవడానికి నిషేధిత ఉగ్ర సంస్థ పీఎఫ్ఐ మద్దతు తీసుకుంటోందని మోదీ ఆరోపించారు.



మార్చి 28న బీజేపీలో చేరిన దమయంతి, భర్తృహరి, సిద్ధాంత్(బీజేపీ కండువాలు కప్పుకొన్నవారు ఎడమ నుంచి)

'జంపింగ్' బలం!

బీజేడీ మాజీ నేతలకు బీజేపీ టికెట్లు

» ఒడిశాలో అధిక ఎంపీ స్థానాలపై కన్ను

» 24 ఏళ్లుగా సీఎం పదవిలో నవీన్

» ఆయనకు తొలిసారి గట్టి పోటీ



ఒడిసాలో పాలక బిజూ జనతాదళ్ (బీజేడీ) నుంచి వచ్చి చేరిన నేతలనే బీజేపీ నమ్ముకుంది. లోక్‌సభకు, ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఏకకాలంలో జరుగుతున్న ఎన్నికల్లో వారికే పెద్దపీట వేసింది. ముఖ్యంగా శాసనసభ కంటే లోక్‌సభ స్థానాలే ఎక్కువ గెలుచుకోవాలని గట్టి పట్టుదలతో ఉంది. సీఎం నవీన్ పట్నాయక్‌కు తొలి నుంచీ చేదోడువాదోడుగా ఉండి పార్టీ బలోపేతానికి తోడ్పడిన భర్తృహరి మెహతాబ్, సిద్ధాంత్ మొహాపాత్ర, అనుభవ్ మొహంతి, ఆకాశ్‌దాస్ నాయక్, అరిందమ్ రాయ్, ప్రియదర్శి మిశ్రా, దంబారు సిసా, ప్రదీప్ పాణిగ్రాహి, ప్రశాంత జగదేవ్ వంటి సీనియర్ నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో అత్యధికులు లోక్‌సభకు పోటీచేస్తున్నారు. మరికొందరు ఎమ్మెల్యేలు, నేతలు కూడా బీజేపీలోకి క్యూకట్టి అసెంబ్లీ బరిలో దిగారు. బీజేడీ అధినేత నవీన్ 2000వ సంవత్సరం నుంచి 24 ఏళ్లుగా అప్రతిహతంగా సీఎంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇన్నేళ్ల తర్వాత తొలిసారి ఆయనకు గట్టి పోటీ ఎదురవుతోంది. నిన్నమొన్నటిదాకా ఆయనతో పాటు ఉండి బీజేడీని బలోపేతం చేసిన నేతలు ఇప్పుడు బీజేపీ తరఫున బరిలో దిగడమే దీనికి కారణం. నీతి నిజాయితీలకు మారుపేరుగా నిలిచిన నవీన్ ప్రభుత్వంపై గత నాలుగేళ్లుగా తీవ్ర అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. సంస్థాగతంగా బీజేడీ బలహీనపడుతోందన్న వాదన పార్టీ నేతల్లోనే వినిపిస్తోంది. ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్న బీజేపీలోకి పలువురు నాయకులు చేరిపోయారు. రాష్ట్రంలో 21 లోక్‌సభ స్థానాలకు గాను గత ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా 8 స్థానాల్లో గెలిచింది. అసెంబ్లీలో మాత్రం 23 సీట్లకే పరిమితమైంది. 12 ఎంపీ స్థానాలు గెలిచిన బీజేడీ.. అసెంబ్లీకి వచ్చేటప్పటికి 147 సీట్లకు గాను ఏకంగా 112 గెలుచుకుంది. ఒడిశాలో మే 13 నుంచి నాలుగు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. 1998 నుంచి 2009 వరకు ఒడిసాలో బీజేడీ, బీజేపీ కలిసి నడిచాయి. 2009లో తెగతెంపులు చేసుకున్నాయి. మోదీ ప్రధాని అయ్యాక నవీన్ పట్నాయక్ ఆయనతో సన్నిహితంగా ఉంటున్నారు. పార్లమెంటులో కీలక బిల్లులకు మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో 15 ఏళ్ల తర్వాత మళ్లీ పొత్తు పెట్టుకోవాలని భావించారు. అయితే బీజేపీ రాష్ట్ర శాఖ అంగీకరించలేదు. బీజేడీ సంస్థాగతంగా బాగా బలహీనపడిందని.. ఈ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని అధిష్ఠానానికి నివేదికలు పంపారు. దీంతో పాటు, 15 లోక్‌సభ సీట్లను బీజేపీకి కేటాయించాలన్న డిమాండ్‌కు నవీన్ అంగీకరించకపోవడంతో పొత్తు కుదరలేదు.

- సెంట్రల్ డెస్క్

ఎన్నికల్లో ఏఐ హవా!

విరివిగా వాడుతున్న అభ్యర్థులు, పార్టీలు


■ అభ్యర్థుల తరఫున ఓటర్లకు ఏఐ ఫోన్ కాల్స్

■ ప్రజల్లో చొచ్చుకుపోయేందుకు ఏఆర్ టెక్నాలజీ

■ దివంగత నేతలు కూడా ప్రజల ముందు ప్రత్యక్షం!







ఎండలు మండిపోతున్నాయి..! ప్రచారానికి సమయం లేదు..! ఓటర్లందరినీ కలిసేందుకు సుడిగాలి పర్యటనలకు చాన్సే లేదు..! సోషల్ మీడియా ప్రచారంతో హోరెత్తించాలన్నా.. ఓటర్లు విసిగిపోయారు..! టీవీలు, పత్రికలు, సోషల్ మీడియా, వెబ్‌సైట్లలో యాడ్స్ ఇచ్చినా.. అవి తమ నియోజకవర్గ ఓటర్లందరికీ చేరుతాయా? అనే అనుమానం. దాంతో ఇప్పుడు రాజకీయ పార్టీలు కృత్రిమ మేధ (ఏఐ), ఆగ్మెంటెడ్ రియాల్టీ(ఏఆర్), ఇతర అధునాతన సాంకేతికతలను వినియోగిస్తున్నాయి. అభ్యర్థులు టెక్నాలజీ సాయంతో దూసుకుపోతున్నారు.

నేరుగా ఓటర్లకు ఫోన్‌కాల్స్

గత ఎన్నికల వరకు అభ్యర్థుల ప్రచారం సోషల్ మీడియా పోస్టులతో దూసుకుపోయింది. ఈసారి వారు ఏఐ సాంకేతికతతో ఏకకాలంలో వందల మంది ఓటర్లకు ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు. అభ్యర్థుల తరఫున ఏఐ.. ఓటర్లతో అభ్యర్థి మాటలను అనుకరిస్తూ(ధ్వన్యనుకరణ) మాట్లాడుతోంది. వారి సమస్యలను తెలుసుకుంటోంది. అభ్యర్థి పట్ల ఓటర్ల ప్రశ్నలకు సమాధానాలు చెబుతోంది. వాగ్దానాలు నెరవేర్చలేకపోవడానికి కారణాలుచెబుతూ.. ఈసారి గెలిపిస్తే పక్కాగా పనులు చేస్తామంటూ హామీ ఇస్తోంది. ఫోన్లో అవతలివైపు ఉన్న ఓటరు మానసిక స్థితిని అంచనావేస్తూనే.. తనకే ఓటువేసేలా ఒప్పిస్తోంది. అజ్మీర్‌కు చెందిన ఏఐ ఆధారిత సంస్థ 'పాలిమాథ్ సొల్యూషన్స్' ఈ తరహా సేవలను ప్రారంభించింది. ఇలా ఎన్నికల ప్రచారంలో ఏఐని వినియోగించడంలో బీజేపీ ముందంజలో ఉంది. ఇటీవల కాశీ తమిళ సంఘం కార్యక్రమంలో ప్రధాని మోదీ హిందీ ప్రసంగం ఏకకాలంలో పలు భారతీయ భాషల్లో ఆయన గొంతుతోనే తర్జుమా అయింది. ఏఐ ఆధారిత సాంకేతికతతో అది సాధ్యమైంది. ఈసారి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఏఆర్ సాంకేతికత హవా ఊపందుకుంది. దీని వాడకంలో తమిళనాడులోని అధికార పార్టీ డీఎంకే ముందంజలో ఉంది. ఆ పార్టీ దివంగత నేత కరుణానిధిని ఏఆర్ టెక్నాలజీతో ఓటర్ల ముందుకు తీసుకెళ్తున్నారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌ను.. ఆయన పరిపాలనను ఏఆర్ టెక్నాలజీ ద్వారా కరుణానిధి పొగడ్తలతో ముంచెత్తే వీడియోలు ఇప్పుడు అక్కడి ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. డీఎంకే ప్రధాన ప్రత్యర్థి పార్టీ ఏఐఏడీఎంకే.. ఏఆర్ టెక్నాలజీని వాడుకునేంతలా పోటీ పెరగడం గమనార్హం..! అన్నాడీఎంకే దివంగత నాయకురాలు జయలలిత వీడియోలను ఆ పార్టీ ఏఆర్ ద్వారా ఓటర్ల ముందుకు తీసుకెళ్తోంది. ఇక పలు పార్టీలు తమ ముఖ్యనేతల ప్రసంగాల లింకులను క్విక్ రెస్పాన్స్(క్యూఆర్) కోడ్ రూపంలో ఓటర్లకు అందజేస్తున్నాయి. (సెంట్రల్ డెస్క్)

నాణేనికి మరో పార్శ్వం

ఏఐ, ఏఆర్ సాంకేతితతో ప్రయోజనాలున్నా కొన్ని రాజకీయ పార్టీలు వాటిని ప్రత్యర్థులపై దుష్ప్రచారానికి వాడుతున్నాయి. డీప్‌ఫేక్ వీడియోలే ఇందుకు ఉదాహరణ. ఒక నాయకుడు మాట్లాడిన మాటలను తప్పుదోవ పట్టించేలా హావభావాలతో సహా ట్యాంపరింగ్‌చేయడమే డీప్‌ఫేక్. సదరు నేత గొంతుతో అదే పిచ్‌లో ఏమాత్రం తేడాలేకుండా వాయిస్‌ను మార్చేస్తారు. ఇటీవల తెలంగాణ పర్యటన సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రసంగాన్ని డీప్‌ఫేక్ చేసి.."ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను ఎత్తేస్తాం" అని ఆయన అన్నట్టుగా డీప్‌ఫేక్ చేశారని బీజేపీ ఆరోపిస్తోంది. ఈమేరకు ఈసీకి ఫిర్యాదు చేసింది. ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్, ప్రధాని మోదీ వీడియోలనూ డీప్‌ఫేక్ చేశారనే ఆరోపణలు రావడం గమనార్హం..! రణ్‌వీర్ సింగ్ ఓ పార్టీకి మద్దతిస్తున్నట్లు వచ్చిన డీప్‌ఫేక్ వీడియోపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడమేకాకుండా..ఎక్స్‌లో వివరణ ఇవ్వాల్సి వచ్చింది. ప్రముఖ న్యూస్ చానళ్లలో వార్తలు వచ్చినట్లుగా ఆయా వార్తా సంస్థల లోగోలతో క్రియేట్ చేస్తున్న డీప్‌ఫేక్ వీడియోలు ప్రత్యర్థి పార్టీలను ఇరకాటంలో పారేస్తున్నాయి. దీంతో వివరణలు ఇచ్చుకోలేక ప్రత్యర్థిపార్టీలు తంటాలు పడుతున్నాయి.

రంగంలోకి సునీత

ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ సతీమణి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ బయటకు వచ్చే అవకాశాలు లేకపోవడంతో ఆయన సతీమణి సునీత స్వయంగా ఎన్నికల ప్రచారంలోకి దిగారు. 'జెయిల్ కా జవాబ్ ఓట్ సే' (జైలుకు జవాబు ఓటే) అంటూ సాగే పాటతో శనివారం ఆమె తూర్పు ఢిల్లీలో, ఆదివారం పశ్చిమ ఢిల్లీలో నిర్వహించిన రోడ్ షోలకు భారీ స్పందన లభించింది. ఇప్పటి వరకు ఇండియా కూటమి ఢిల్లీలో, రాంచీలో నిర్వహించిన ఎన్నికల సభల్లో పాల్గొన్న సునీతా కేజ్రీవాల్.. పోలింగ్ సమీపిస్తుండటంతో ప్రత్యక్షంగా ప్రజల్లోకి వచ్చారు. ఢిల్లీలోని ఏడు స్థానాలకు మే 25వ తేదీన పోలింగ్ జరగనుంది. కేజ్రీవాల్ కన్నా ఏడాది ముందు 1994లో ఐఆర్ఎస్‌కు ఎంపికైన సునీతా కేజ్రీవాల్ 22 ఏళ్లు ఆదాయపన్ను శాఖలో పని చేశారు. 2016లో ఆదాయపన్ను అప్పీలేట్ ట్రిబ్యునల్‌లో కమిషనర్ హోదాలో ఉండగానే స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు. విద్యాధికురాలు కావడం, హిందీ, ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడుతుండటంతో యువతతోపాటు వివిధ వర్గాల ప్రజలు ఆమె ప్రసంగాలను ఆసక్తిగా వింటున్నారు. కాగా, ఆప్ ప్రచారంలో భాగంగా తీసుకొచ్చిన 'జెయిల్ కా జవాబ్ ఓట్ సే' పాటను ఎన్నికల సంఘం నిషేధించింది. ఇదిలా ఉండగా, సునీతా కేజ్రీవాల్ ఢిల్లీలోనే కాక పంజాబ్, గుజరాత్ , హరియాణాల్లో కూడా ప్రచారం చేస్తారని మంత్రి ఆతిషీ తెలిపారు.

బీజేపీ మళ్లీ వస్తే స్వేచ్ఛ ఉండదు: ఖర్గే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. దేశంలో ప్రజలు స్వేచ్ఛగా బతికే హక్కును కాంగ్రెస్ కల్పించిందని, ఆ హక్కును లాగేసుకోవాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు ఉన్న తేడాను ప్రజలు గమనించాలని సూచించారు. కాంగ్రెస్ ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించిందని గుర్తుచేశారు. దీనివల్ల కొన్ని కోట్లమంది యువతకు ఓటేసే అవకాశం దక్కిందని తెలిపారు. అటవీ హక్కుల చట్టం-2006ను పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామని, దీనికోసం నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు.

దేవెగౌడ మనవడి అశ్లీల వీడియోలపై సిట్

బెంగళూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం హాసన్ సిటింగ్ ఎంపీ, జేడీఎస్ నాయకుడు ప్రజ్వల్ రేవణ్ణపై వస్తున్న 'అశ్లీల పెన్‌డ్రైవ్' ఆరోపణలపై కర్ణాటక ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఏడీజీపీ బీకే సింగ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశామని రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వర్ ఆదివారం ప్రకటించారు. కాగా.. అశ్లీల వీడియోల అంశం హల్‌చల్ చేస్తున్న సమయంలోనే ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు వెళ్లిపోవడం మరిన్ని అనుమానాలకు దారితీస్తోంది. అయితే సిట్ దర్యాప్తులో భాగంగా ఆయన్ని వెనక్కి తీసుకువచ్చి విచారిస్తామని పరమేశ్వర్ తెలిపారు. మరోవైపు.. ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు సంబంధించి పలు వీడియోలు ప్రస్తుతం రాష్ట్రమంతటా వైరల్‌గా మారాయి. ప్రజ్వల్ రేవణ్ణ పలువురు మహిళలతో అశ్లీలంగా ఉన్న వీడియోలు వెలుగులోకి వచ్చాయి. దీంతో బాధిత మహిళలు న్యాయం చేయాలని టీవీ చానళ్లు, మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రజ్వల్ అశ్లీల వీడియోలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ నాగలక్ష్మి చౌదరి సీఎంకు లేఖ రాశారు. ఈ విషయమై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆదివారం బెంగళూరులో మాట్లాడుతూ.. ప్రజ్వల్ దేశం విడిచి పారిపోవడం సిగ్గుచేటన్నారు. కాగా.. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కావాలని మార్ఫింగ్ వీడియోలను ప్రచారం చేశారని ప్రజ్వల్ రేవణ్ణ ఆరోపించారు. ఇదిలా ఉండగా, లైంగిక వేధింపులు, నిర్బంధం ఆరోపణలపై మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ, ఆయన కుమారుడు హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై ఆదివారం హోలినరసిపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫిర్యాదుదారు రేవణ్ణ సతీమణి భవాని బంధువుగా పేర్కొన్నారు. తాను వంటమనిషిగా పనిచేయడం ప్రారంభించిన నాలుగు నెలల తర్వాత రేవణ్ణ తనను వేధించారని, ఆయన కుమారుడు ప్రజ్వల్ తన కుమార్తెకు వీడియో కాల్స్ చేసి అసభ్యంగా మాట్లాడేవారని ఆమె ఆరోపించారు.

కాంగ్రెస్‌కు మరో షాక్!

ఢిల్లీ పీసీసీ అధ్యక్షుడు అర్విందర్ రాజీనామా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్‌ను కష్టాలు వీడటం లేదు. పార్టీ సీనియర్ నేత, ఢిల్లీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అర్విందర్ సింగ్‌లవ్లీ తన పదవికి ఆదివారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపారు. పార్టీని వీడటానికి గల కారణాలను అందులో వివరించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంపై అనేక ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)తో పొత్తుకు కాంగ్రెస్ ఢిల్లీ యూనిట్ అంగీకరించలేదని, అయినా హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి పని చేశామని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ తరఫున పోటీ పడుతున్న కొందరు అభ్యర్థులు ఆప్‌ను ఆకాశానికి ఎత్తేయటం కాంగ్రెస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయని.. ఈశాన్య ఢిల్లీ నుంచి కాంగ్రెస్ టికెట్ మీద పోటీ పడుతున్న కన్హయ్య కుమార్‌పై విమర్శలు గుప్పించారు. విద్య, వైద్యం, మౌలిక సౌకర్యాల పరంగా ఢిల్లీలో జరిగిన అభివృద్ధి కాంగ్రెస్ మాజీ సీఎం షీలాదీక్షిత్ హయాంలోనే జరిగిందని, ఆప్ హయాంలో అదం తా దెబ్బతిన్నదన్నారు. ఢిల్లీలోని 7సీట్లలో 4 ఆప్ తీసుకొని 3కాంగ్రెస్‌కు ఇవ్వటంపై అసంతృప్తి వ్యక్తం చేశా రు. ఒక స్థానంలో తన పేరు బలంగా వినిపించినా సీనియర్ల కోసం స్వచ్ఛందంగా పోటీ నుంచి వైదొలిగానని తెలిపారు. 3స్థానాల్లో రెండింట ఢిల్లీతో సంబం ధంలేని వ్యక్తులకు (కన్హయ్య కుమార్, ఉదిత్ రాజ్) సీట్లు కేటాయించడం సరికాదన్నారు. డీపీసీసీ అధ్యక్షుడి హోదాలో పార్టీ పదవుల నియామకాలను చేపట్టేందుకు ఢిల్లీ పార్టీ ఇంచార్జి తనకు అనుమతివ్వలేదని.. ఆయనే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని లవ్లీ ఆరోపించారు. లవ్లీ షీలాదీక్షిత్ మంత్రివర్గంలో మంత్రిగా ఉన్నారు. లవ్లీ రాజీనామాను పార్టీ హైకమాండ్ ఆమోదించిందని పార్టీ ఢిల్లీ ఇంచార్జి దీపక్ బబారియా తెలిపారు. కాగా లవ్లీ బీజేపీలో చేరి తూర్పు ఢిల్లీనుంచి పోటీ చేయవచ్చన్న వార్తల నేపథ్యంలో ఏపార్టీలో చేరడంలేదని ఆయన వివరణ ఇ చ్చారు.

2.9లక్షల కోట్లు..400 గేట్లు

దుబాయ్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద విమానాశ్రయం

ఆమోదం తెలిపిన దేశాధినేత



ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు లోపలి భాగం(నమూనా)

దుబాయ్, ఏప్రిల్ 28: ప్రపంచ వాణిజ్య కేంద్రంగా ఉన్న దుబాయ్ కిరీటంలో మరో మణి చేరనుంది. నూతనంగా మరో విమానాశ్రయాన్ని నిర్మించనున్నట్టు పాలకుడు షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ఆదివారం ప్రకటించారు. ఇది ప్రపంచంలో అతి పెద్ద విమానాశ్రయం కానుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న విమానాశ్రయానికి ఇది అయిదు రెట్లు పెద్దదిగా ఉండనుంది. 35 బిలియన్ డాలర్ల (రూ.2.9లక్షల కోట్లు) వ్యయంతో దీన్ని నిర్మించనున్నారు. వచ్చే పదేళ్లలో దీన్ని పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న ఎయిర్ పోర్టు ప్రపంచంలో అత్యంత రద్దీ ఉన్న విమానాశ్రయాల్లో ఒకటిగా పేరు పొందింది. రద్దీ పెరుగుతుండడం, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కొత్తది నిర్మించాలని నిర్ణయించారు. ప్రస్తుత ఎయిర్ పోర్టులో రెండు రన్‌వేలు ఉండగా, కొత్త దాంట్లో అయిదు సమాంతర రన్‌వేలను నిర్మిస్తారు. 400 ఎయిర్‌క్రాఫ్ట్ గేట్లు ఏర్పాటు చేయనున్నారు. ఏటా 26 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా సౌకర్యాలు కల్పించనున్నారు. దుబాయ్ దక్షిణ ప్రాంతంలో దీన్ని నిర్మిస్తారని, దీనిని అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయంగా పిలుస్తారని దేశాధినేత ప్రకటించారు.

ఆర్మేనియాకు ఆయుధాలిస్తే ఊరుకోం

భారత్‌కు అజెర్‌బైజాన్ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: ఆర్మేనియాకు ఆయుధాలను సరఫరా చేస్తే చూస్తూ ఊరుకోబోమని అజెర్‌బైజాన్ దేశం భారత్‌ను హెచ్చరించింది. ఫ్రాన్స్, గ్రీస్ దేశాలను ఉద్దేశించి కూడా ఇదే తరహాలో హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు భారత్ నుంచి ఆయుధాలు కొనుగోలు చేయడంపై ఆర్మేనియా ఆసక్తి చూపుతోంది. భారత్ నుంచి ఆయుధాలు కొనుగోలు చేస్తున్న దేశాల్లో ఆర్మేనియా మొదటి స్థానంలో ఉంది. బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణులు కొనుగోలు చేయడంపైనా ఆసక్తి చూపుతోంది. 'పినాక' మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్లు కొనుగోలు చేయడానికి 2022లో ఒప్పందం కుదిరింది. పినాక రాకెట్ లాంచర్లను కొనుగోలు చేసిన తొలి దేశం కూడా ఆర్మేనియాయే కావడం గమనార్హం. ఆర్మేనియాకు ఆయుధాలు సరఫరాను భారత్ చాలా కాలం రహస్యంగానే ఉంచింది. అయితే కొన్ని కంపెనీలు తమ వార్షిక నివేదికల్లో అమ్మకాల వివరాలను పేర్కొనడం తప్పనిసరి కావడంతో అవి బయటపడ్డాయి. హైదరాబాద్‌కు చెందిన జెన్ టెక్నాలజీస్ సంస్థ ఆర్మేనియాకు 41.5 మిలియన్ డాలర్ల (రూ.345 కోట్లు)విలువ చేసే యాంటీ డ్రోన్ సిస్టంలను సరఫరా చేసింది.

గుజరాత్ తీరంలో 602 కోట్ల డ్రగ్స్

» దేశంలోకి చేరవేసేందుకు పాకిస్థానీల కుట్ర

» బోటు స్వాధీనం.. 14 మంది అరెస్టు

అహ్మదాబాద్, ఏప్రిల్ 28: దేశంలోకి మాదకద్రవ్యాలను చేరవేసేందుకు పాకిస్థానీలు పన్నిన కుట్రను భారత తీర ప్రాంత రక్షక దళం భగ్నం చేసింది. శనివారం రాత్రిపూట గుజరాత్ తీరంలో భారీ ఆపరేషన్ నిర్వహించి ఓ బోటును పట్టుకుంది.. అందులో నుంచి ఏకంగా రూ.602 కోట్ల విలువైన 86 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని, 14 మంది పాకిస్థానీలను అదుపులోకి తీసుకుంది. ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు తీర ప్రాంత రక్షక దళం, గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)తో కలిసి అరేబియా తీరంలో మాటేశాయి. శనివారం రాత్రి సముద్రంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బోటు కదలికలను గుర్తించి అప్రమత్తమయ్యాయి. కోస్టు గార్డు నౌక రాజ్‌రతన్, హెలికాప్టర్లతో ఆ బోటును ముట్టడించాయి. ఈక్రమంలోనే బోటులోని వారు కాల్పులు జరిపి తప్పించుకునేందుకు ప్రయత్నించగా.. భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరుపుతూ చాకచక్యంగా బోటు లోపలికి ప్రవేశించాయి. అందులోని 14 మందిని అదుపులోకి తీసుకొని, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ఇదిలా ఉండగా, గుజరాత్, రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రగ్స్ తయారీ ల్యాబ్‌లపై ఏటీఎస్, ఎన్‌సీబీ శుక్రవారం సాయంత్రం సంయుక్తంగా దాడులు జరిపి రూ.300 కోట్ల విలువైన మెఫెడ్రోన్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు 13 మందిని అరెస్టు చేశాయి. అహ్మదాబాద్ ప్రాంతానికి చెందిన మనోహర్‌లాల్ ఎనానీ, రాజస్థాన్‌కు చెందిన కుల్దీప్ సింగ్ రాజ్‌పురోహిత్ వివిధ ప్రాంతాల్లో మెఫెడ్రోన్ డ్రగ్ తయారీ యూనిట్లను నడుపుతున్నట్లు ఏటీఎస్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ నేపథ్యంలోనే రాజస్థాన్‌లోని సిరోహి, జోధ్‌పూర్, గాంధీనగర్ ప్రాంతాలతో పాటు గుజరాత్‌లోని అమ్రేలీ జిల్లాలోని భక్తినగర్‌లో ఏకకాలంలో ఎన్‌సీబీతో కలిసి దాడులు చేసింది. వీటిల్లో 22 కిలోల మెఫెడ్రోన్, 124 కిలోల లిక్విడ్ మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నామని.. వీటి విలువ రూ.300 కోట్లు దాకా ఉంటుందని అధికారులు వెల్లడించారు.

విదేశీ విద్యార్థుల కోసం అదనంగా 25% సీట్లు

విద్యాసంస్థలకు యూజీసీ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: విదేశీ విద్యార్థుల కోసం అదనంగా 25% సీట్లను పెంచుకోవచ్చని ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ సూచించింది. ప్రస్తుతం అనుమతించిన సీట్లకు అదనంగా వీటిని పెంచుకోవచ్చని తెలిపింది. వీటిని సూపర్‌న్యూమరరీ సీట్లుగా వ్యవహరిస్తారని, వీటిని కేవలం విదేశీ విద్యార్థులకు మాత్రమే రిజర్వు చేయాలని స్పష్టం చేసింది. యూజీ, పీజీ కోర్సులకు ఇది వర్తిస్తుందని తెలిపింది. స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం కింద ఎంపికయిన విద్యార్థులకు ఈ సూపర్‌న్యూమరరీ కోటా వర్తించదు. స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో సీట్లు మిగిలితే వాటిని కూడా విదేశీ విద్యార్థులకే ఇవ్వాల్సి ఉంటుంది. ఓపెన్, డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) కోర్సుల్లో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి అనుమతి లేదని యూజీసీ తెలిపింది.

7న రాజమండ్రికి ప్రధాని.. అనకాపల్లిలో సభ

అమరావతి, రాజమహేంద్రవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారం నిమిత్తం 7వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. రెండు రోజులపాటు ఆయన రాష్ట్రంలో పలు సభల్లో పాల్గొననున్నారు. 7వ తేదీ మధ్యాహ్నం రాజమండ్రి, సాయంత్రం అనకాపల్లి సభల్లో పాల్గొంటారు. మరుసటి రోజు 8న మధ్యాహ్నం పీలేరు సభలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం విజయవాడలో చంద్రబాబు, పవన్, పురందేశ్వరితో కలసి రోడ్ షోలో ప్రధాని మోదీ పాల్గొంటారు.

1 నుంచి భువనేశ్వరి ఎన్నికల ప్రచారం


అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ.. ఎన్నికల ప్రచారం చేయనున్నారు. మే 1న కడప, 2న పాణ్యం, 3న దర్శిలో ఎన్నికల ప్రచార సభల్లో ఆమె పాల్గొననున్నారు.

నేడు మంగళగిరిలో బ్రాహ్మణి పర్యటన

టీడీపీ యువనేత నారా లోకేశ్ విజయాన్ని కాంక్షిస్తూ, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి సోమవారం మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. తాడేపల్లి మండలం నులకపేట చైతన్య తపోవన్ శ్రేయో మండపంలో స్త్రీశక్తి, మహిళామిత్ర, డ్వాక్రా మహిళలతో ఆమె సమావేశం కానున్నారు.

లోకం తీరు







కొల్లు.. తాటిముంజెలతో చిల్..!

సమ్మరోత్సాహంతో..



గడగడ తాగేస్తా.. గద్దెనెక్కేస్తా..



కూల్‌డ్రింక్‌తో చల్లబడ్డ యార్లగడ్డ



బొండా.. అలుపే లేకుండా..



కాగిత.. కొబ్బరిబొండాంతో కూల్ ఇక..

ఎండలు మండిపోతున్నాయి.. సూరీడు సుర్రుమంటున్నాడు.. వడగాలులు దడ పుట్టిస్తున్నాయి.. అయినా సమరోత్సాహంతో ముందుకు కదులుతున్నారు ప్రధాన పార్టీల అభ్యర్థులు. గొంతెండిపోతున్నా.. చెమట చిర్రెత్తిస్తున్నా.. ముఖం కమిలిపోతున్నా.. కాళ్లు వాస్తున్నా.. నొప్పులు పుడుతున్నా.. ఏమాత్రం వెనకడుగు వేయక ప్రచారం చేస్తున్నారు. పక్షం రోజుల్లో ఎన్నికలు జరగనుండగా, ఇక ఏమాత్రం విశ్రాంతి లేకుండా ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకూ ప్రచారంలో మునిగితేలుతున్నారు. ఇప్పటికే ఉష్ణోగ్రతలు సగటున 41 డిగ్రీలకు తక్కువ కాకుండా నమోదవుతున్నాయి. ఇలాంటి వాతావరణంలో విజయవాడ నగరంలో ప్రచారం అంటే.. దిమ్మతిరిగి పోవాల్సిందే. ఇక కొండ ప్రాంతాల్లో పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. వందల సంఖ్యలో మెట్లు ఎక్కలేక, దిగలేక అభ్యర్థులు అష్టకష్టాలు పడుతున్నారు. దీంతో ప్రచారాల్లో చన్నీళ్లు తాగడం, మజ్జిగ, కొబ్బరినీళ్లు, కూల్‌డ్రింక్స్ సేవించడం వంటి సీన్లే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఏసీలకు అలవాటు పడిన వారికి మండుటెండల్లో ప్రచారాలు కాస్త కష్టమే అయినా.. ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకోవడానికి కష్టమైనా ఇష్టమేనంటూ చాలామంది అభ్యర్థులు చెమటోడుస్తూనే ఉన్నారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



ఫేస్ వాష్.. వసంత క్షణాల్లో రిఫ్రెష్..




సుజనా.. చెమట చిందేనా..



రాజా.. మజ్జిగతో మజా..

ఓట్ల వేటలో రూ. కోట్లు



ఒక్కసారిగా రూ.7 వేలకు పెరిగిన ఓటు రేటు

'రండి బాబూ రండి.. సొంత పార్టీ నాయకులైతేనేం.. పార్టీ మారి పక్క పార్టీలోకి పోయినవారైతేనేం.. ఓటు అమ్ముకునేవారైతేనేం.. ఆఫర్ ఓకే చేయండి.. మొదటి విడతగా అడిగినంత అందుకోండి.. రెండు విడతలో మరోసారి జేబు నింపుకోండి..' రెండు జిల్లాల్లో వైసీపీ నాయకులు బహిరంగంగానే పెడుతున్న బేరాలివి. సాధారణంగా ఎన్నికల ముందు డబ్బు పంపిణీ జరుగుతుంటుంది. గెలుపు మీద ఆశలు వదులుకున్నారో లేక ఇక లాభం లేదు అనుకున్నారో పక్కా ప్రణాళికతో విడతలవారీగా ఇప్పటి నుంచే రూ.కోట్లు వెదజల్లేస్తున్నారు.

వైసీపీ తొలి విడత డబ్బు పంపిణీకి సన్నాహాలు

రూ. 1,500 నుంచి రూ. 2 వేలు ఇచ్చేందుకు ఏర్పాట్లు

- ప్రత్యర్థి ఇచ్చే దాన్నిబట్టి రెండో విడతలో మరోసారి..
- కొన్నిచోట్ల టీడీపీ ద్వితీయశ్రేణి నేతలను కొనే ప్రయత్నాలు
- మరికొన్నిచోట్ల టీడీపీలోకి వెళ్లిన సొంతవారిపై గురి
- రూ.లక్షల్లో రేట్లు కట్టి తెరవెనుక బేరసారాలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వాస్తవానికి ఎన్నికల ప్రచారం ముగిశాక నగదు పంపిణీపై అన్ని పార్టీలు దృష్టిసారిస్తాయి. కానీ, వైసీపీ నేతలు ఎన్నికలకు ముందే తొలి విడత నగదు పంపిణీ పూర్తి చేయాలన్న ఉద్దేశంతో అడుగులు వేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి, వైసీపీకి నడుమ పోటాపోటీగా ఉన్న స్థానాల్లో తొలి విడతగా ఒక్కో ఓటరుకు రూ.1,500 నుంచి రూ.2 వేలు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. సోమవారం నుంచి మొదలుపెట్టి నాలుగైదు రోజుల్లో ఈ పంపిణీ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని ఇప్పటికే పార్టీ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. రెండో విడత నగదు ఎంత మొత్తం ఇవ్వాలనేది నిర్ణయించాలని వైసీపీ నేతలు భావిస్తున్నారు. దీంతో ఈసారి ఓటు రేటు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది. వైసీపీ నేతల బరితెగింపుతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటు రేటు రూ.7 వేల పైచిలుకు పలికేలా కనిపిస్తోంది. ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మైలవరం, గన్నవరం, గుడివాడ, విజయవాడ తూర్పు అసెంబ్లీ స్థానాల్లో అయితే ప్రలోభాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇక్కడ నగదుతో పాటు అదనంగా గిఫ్ట్ కూపన్లు, చిన్నపాటి బంగారు, వెండి ఆభరణాలు, కుంకుమ భరిణెలు పంచేందుకు వైసీపీ నేతలు సిద్ధం చేస్తున్నారు. మైలవరంలో ఓటుకు రూ.4 వేల వరకు ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ద్వితీయ శ్రేణి నాయకులపై కన్ను

టీడీపీలో గ్రామ, డివిజన్ స్థాయిలో బలమైన నాయకులకు వైసీపీ నేతలు ఎర వేస్తున్నారు. విజయవాడ తూర్పు, సెంట్రల్, మచిలీపట్నం, గన్నవరం, గుడివాడ, మైలవరం, పెడన నియోజకవర్గాల్లో ఈ తరహా తతంగం జరుగుతోంది. పెడనలో వైసీపీ అభ్యర్థి టీడీపీ నాయకుల ఇళ్లకు వెళ్లి రహస్యంగా సమావేశమవుతున్నారు. ఈ ఎన్నికల వరకు తటస్థంగా ఉండాలని, వారిని ఆర్థికంగా ఆదుకునే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇస్తున్నారు. గన్నవరంలో అయితే, చిత్రమైన పరిస్థితి నెలకొంది. వైసీపీ క్యాడర్ గంపగుత్తగా టీడీపీలో చేరుతుండటంతో దిక్కుతోచక సొంత పార్టీ నాయకులకే భారీ ఎత్తున ఆఫర్లు ఇస్తున్నారు. మచిలీపట్నంలో వంద ఓట్లు ఉన్న నాయకుడి రేటు రూ.10 లక్షలు పలుకుతోంది. విజయవాడ నగరంలో ప్రలోభాలు కాస్త ఖరీదుగా ఉంటున్నాయి. డివిజన్ స్థాయి నాయకులు తటస్థంగా ఉంటే.. వారికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఇచ్చేందుకు వైసీపీ నాయకులు సిద్ధమవుతున్నారు. 'ఎన్నికలకు వారం రోజుల వరకు మీ పార్టీ అభ్యర్థితోనే తిరగండి. కానీ పోలింగ్‌కు ఇంకో వారం ఉందనగా, మీరు ఇంటి గడప దాటకూడదు. మీ తరఫున ఎన్ని ఓట్లు ఉంటే ఓటుకు రూ.10 వేల చొప్పున ఇస్తాం' అని విజయవాడ నగరంలోని పలువురు టీడీపీ నాయకులకు ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ అభ్యర్థుల్లో ఓటమి భయం ఏ స్థాయిలో ఉందో ఈ ప్రలోభాలు చాటుతున్నాయని ఓ టీడీపీ నాయకుడు వ్యాఖ్యానించారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు టీడీపీలో కాస్త బలమైన నాయకులను లక్ష్యంగా చేసుకుని పావులు కదుపుతున్నారు. కాసులు ఎరవేసి లోబర్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఓ డివిజన్ స్థాయి నాయకుడికి రూ.10 లక్షలు ఎర వేయడంతో పాటు ఎన్నికల అనంతరం వీఎంసీలో కాంట్రాక్టు పనులు ఇప్పిస్తామని వైసీపీ నాయకులు హామీ ఇచ్చారు. ఈ ఆఫర్‌ను సదరు నాయకుడు తిరస్కరించారు. పెనమలూరులో ఓ బీసీ నాయకుడిని లోబర్చుకునేందుకు అధికార పార్టీ నాయకులు సుమారు రూ.20 లక్షలు ఖర్చు చేశారు. వాస్తవానికి సదరు నాయకుడికి అంత సీన్ లేదని, కానీ బీసీ నాయకులు టీడీపీని ఖాళీ చేసేస్తున్నారనే ప్రచారానికి పనికొస్తుందని ఆ నాయకుడిని కట్టలతో కొన్నట్టు తెలుస్తోంది.

డబ్బు అందలేదని ప్రచారం బాయ్‌కాట్

విపక్షాలకు చెందిన నాయకుల కొనుగోలుతో పాటు సొంత పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలకూ వైసీపీ నేతలు పెద్ద ఎత్తున నగదు ఖర్చు చేస్తున్నారు. ఒక్కరోజు ప్రచారానికి వైసీపీ నేతలు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారని సమాచారం. గుడివాడ, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లోని వైసీపీ అభ్యర్థులు.. రోజువారీ ప్రచారం నిర్వహించే కార్యకర్తలకు నామినేషన్ల చివరి రోజైన ఈనెల 25 తర్వాత నుంచి డబ్బు చెల్లింపు నిలిపివేశారు. దీంతో ఆ మూడు నియోజకవర్గాల్లో వైసీపీ కార్యకర్తలు ప్రచారానికి వచ్చేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. దీంతో రెండు రోజులుగా ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ ప్రచారంలో జనాలు పలచబడ్డారన్న ప్రచారం జరుగుతోంది.

అడుగొడుగున..



బెజవాడ.. బ్లేజ్‌వాడను తలపిస్తోంది. అడుగు బయటకు వేయాలంటే ఎండకు భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో బయటకొచ్చిన వారు గొడుగులతో కాస్త ఉపశమనం పొందుతున్నారు. నగరంలోని బందరురోడ్డులో ఆదివారం సీన్ ఇదీ..

బ్యాంకు ఖాతాల్లోకే..

ఈనెల పింఛన్ అకౌంట్లలో జమ చేసేలా ఏర్పాట్లు

- ఖాతాల్లేని, నడవలేని స్థితిలో ఉంటే ఇంటి వద్దకు..
- మే 3లోపు పింఛన్లు అందజేసేందుకు సన్నాహాలు
- సచివాలయాలకు రావొద్దు : కలెక్టర్ సూచన

వన్‌టౌన్, ఏప్రిల్ 28 : ఈనెల పెన్షన్లను నేరుగా ఖాతాల్లో కానీ, ఇళ్లకు వచ్చి కానీ అందజేస్తామని కలెక్టర్ ఢిల్లీరావు స్పష్టం చేశారు. సామాజిక పెన్షన్ పొందడం కోసం ఎవరూ సచివాలయాలకు రావొద్దని సూచించారు. క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 17 రకాల పెన్షన్లకు సంబంధించి 2.36 లక్షల మంది లబ్ధిదారులున్నారన్నారు. వారందరికీ మే 1న పెన్షన్లను పంపిణీ చేస్తామని తెలిపారు. ఇంటింటికీ వెళ్లడంతో పాటు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పంపిణీ చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. డీబీటీ విధానంలో మే 1వ తేదీ ఉదయం 8 గంటల తరువాత అకౌంట్‌లో నగదు జమ అవుతుందన్నారు. అకౌంట్‌లో డబ్బు పడని వారికి 3వ తేదీ తరువాత ఇళ్లకే వెళ్లి అందజేస్తామని స్పష్టం చేశారు. నడవలేని వారు, బయటకు రాలేనివారు ఇళ్ల వద్దే ఉండాలన్నారు. సచివాలయాల సిబ్బంది వచ్చి పెన్షన్ అందజేస్తారని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆందోళన చెందుతూ ఎండల్లో పెన్షన్ కోసం సచివాలయాలకు రావొద్దన్నారు. మే 1 నుంచి మూడు రోజుల్లో పెన్షన్ పంపిణీ పూర్తవుతుందన్నారు. ఒకవేళ ఏదైనా ఇబ్బంది ఎదురైతే, మరుసటి రోజు మిగిలిన వారందరికీ జమ చేస్తామన్నారు.

అధికారులు VS ప్రొఫెసర్లు

కృష్ణా యూనివర్సిటీలో రచ్చకెక్కిన వివాదాలు

- ప్రభుత్వ పెద్దలు వేధిస్తున్నారంటూ ఓ ప్రొఫెసర్ లేఖ
- రేపు రిలేదీక్ష చేస్తానని పిలుపు
- ఆయన వెంటే మరికొంతమంది అధ్యాపకులు



కృష్ణా యూనివర్సిటీ

> కృష్ణా యూనివర్సిటీ అధికారులు, ప్రొఫెసర్ల మధ్య యుద్ధం రచ్చకెక్కింది. వర్సిటీలో తనను వేధిస్తున్నారని, అదేమని అడిగితే ప్రభుత్వ పెద్దల సూచనలతోనే ఇదంతా జరుగుతోందం టున్నారని, తాను ఈ నెల 30న యూనివర్సిటీ ఎదుట శాంతియుత పోరాటం చేస్తానని సీనియర్ ప్రొఫెసర్ ఎంవీ బసవేశ్వరరావు యూనివర్సిటీ అధికారులకు శనివారం లేఖ రాయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఆయన రాసిన లేఖలోని వివరాలు..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : 'అధ్యాపకులంతా కష్టపడి పనిచేస్తేనే యూనివర్సిటీ ఇంతటి స్థాయికి చేరుకుంది. కొంతకాలంగా కొంతమంది ప్రొఫెసర్లను వేధింపులకు గురిచేస్తున్నారు. అందులో నేను ఉన్నాను. వేధింపులపై ప్రశ్నిస్తే ప్రభుత్వ పెద్దల సూచనల మేరకే ఈ చర్యలు తీసుకుంటున్నామని యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. ఆ ప్రభుత్వ పెద్దలు ఎవరో బయటపెట్టడం లేదు. నన్ను ఎందుకు ఇంతగా వేధింపులకు గురిచేస్తున్నారో తెలియడం లేదు. పరిపాలనాపరంగా అధ్యాపకులు ఏమైనా తప్పులు చేస్తే వాటిని సరిచేసుకునేందుకు అవకాశం కూడా ఇవ్వడం లేదు. తమకు నచ్చిన వారికి పదోన్నతులు ఇస్తూ, నచ్చని వారిని తొక్కి పెడుతున్నారు. లంచం ఇవ్వలేదనే కారణంతో నాకు పదోన్నతి రాకుండా చూశారు. కొంతకాలంగా ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుని యూనివర్సిటీ సంపద తరిగిపోయేలా చేశారు. పరిశోధనా విభాగంలోని విద్యార్థులకు సంబంధించిన సమస్యలను పట్టించుకోవడం లేదు. నన్ను నూజివీడు పీజీ సెంటరుకే పరిమితం చేసి, కృష్ణా యూనివర్సిటీకి రానివ్వడం లేదు. యూనివర్సిటీలో ఉద్యోగ నియామకాల్లో అవినీతి జరిగి ఇప్పటికే ప్రతిష్ఠ దిగజారింది. యూనివర్సిటీలో జరుగుతున్న భవనాల నిర్మాణంలో నాణ్యత లోపించిందని చెప్పిన వారిని సంబంధిత బాధ్యతల నుంచి తొలగించారు. వివిధ కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని ప్రశ్నించిన వారిని సంబంధిత కమిటీలో నుంచి తొలగించిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. వర్సిటీలో జరుగుతున్న తప్పులను, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఉపకులపతికి వివరించాలని ఆయన అపాయింట్‌మెంట్ కోసం ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా ఇవ్వలేదు. ఈ అక్రమాలను నిలువరించాలని కోరుతూ ఈ నెల 30వ తేదీన యూనివర్సిటీ ఎదుట శాంతియుత పోరాటం చేస్తాను.' అని ప్రొఫెసర్ బసవేశ్వరరావు లేఖ రాశారు. ఈ నెల 30న యూనివర్సిటీ ఎదుట శాంతియుత పోరాటం చేస్తానని బసవేశ్వరరావు ప్రకటించగా, ఆయనతో పాటు మరికొంతమంది అధ్యాపకులు దీక్షలో పాల్గొనేందుకు సమాయాత్తమవుతున్నారు.


పీజీ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ నియామకంలోనూ..

కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని నూజివీడు పీజీ సెంటరులో ఎంబీఏ, ఎంకాం నాల్గో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24 నుంచి ప్రారంభమయ్యాయి. వీటి నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్‌గా నూజివీడు పీజీ సెంటరులో తాత్కాలిక పద్ధతిపై పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్వీఎం వర్ధన్‌కు బాధ్యతలు అప్పగించడం వివాదాస్పదమవుతోంది. నూజివీడు పీజీ సెంటర్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ 56 రోజుల వ్యవధిలో 21 రోజులే వచ్చారని అక్కడ పనిచేసే అధ్యాపకులు చెబుతున్నారు. ఎక్కువ రోజులు ఆయన కృష్ణా యూనివర్సిటీలోనే ఉండటంతో నూజివీడు పీజీ సెంటరులో పాలన గాడి తప్పిందంటున్నారు. పీజీ పరీక్షలను అన్ని జాగత్తలతో నిర్వహించాల్సి ఉండగా, కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న అధ్యాపకుడికి ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది చెబుతున్నారు. పరీక్షల నిర్వహణలో ఏమైనా పొరపాట్లు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు.

ఉండేదెవరు ఊడేదెవరు..?

నేడే నామినేషన్ల ఉపసంహరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్నికల సమరాంగణంలో అంతిమంగా నిలిచేదెవరో సోమవారం తేలిపోనుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులను పక్కనపెడితే, గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థుల్లో చాలా మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం ఉంది. ఇలాంటి వారంతా ప్రధాన పార్టీల అభ్యర్థులతో తెరవెనుక బేరాలు కుదుర్చుకుంటున్నారు. తమ సామాజిక వర్గాల వారీగా ఎన్ని ఓట్లు ఉన్నాయో చెబుతున్నారు. దీంతో కొన్ని ఓట్లయినా పడకపోతాయా అని ప్రధాన పార్టీ అభ్యర్థులు వారితో బేరాలు కుదుర్చుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా నామినేషన్ల స్వీకరణ సందర్భంగా 332 నామినేషన్లు దాఖలయ్యాయి. స్క్రూటినీ నాటికి జిల్లా ఎన్నికల యంత్రాంగం విడుదల చేసిన గణాంకాల ప్రకారం 106 నామినేషన్లు ఆమోదం పొందాయి. మిగిలిన వాటిలో 70 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇంకా 156 అదనపు సెట్లుగా రావటంతో పక్కన పెట్టారు. చివరిగా 106 నామినేషన్లు ఆమోదం పొందటంతో వీటిలో ఉపసంహరణకు ఎన్ని ప్రతిపాదనలు వస్తాయనేది వేచి చూడాలి.


దుగ్గిరాలపాడులో పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న వసంత

ఒక్క చాన్స్ ఇస్తే సర్వనాశనం చేశాడు

» సీఎం జగన్ పాలనపై వసంత ఫైర్

జి.కొండూరు, ఏప్రిల్ 28 : ఒక్కచాన్స్ ఇచ్చిన పాపానికి ఏపీకి రాజధాని లేకుండా చేయడమే కాకుండా సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మండిపడ్డారు. దుగ్గిరాలపాడు, గంగినేనిపాలెం, తెల్లదేవరపాడు, సున్నంపాడు, చెర్వుమాధవరం గ్రామాల్లో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండుటెండలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామాల్లో ప్రజలు పెద్దఎత్తున బ్రహ్మరథం పట్టారు. ఈసందర్భంగా వసంత మాట్లాడుతూ, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అమరావతితో పాటు సీపీఎస్ రద్దు, మద్యపాన నిషేధంతో పాటు పలు విషయాల్లో జగన్ మాట తప్పి మడమ తిప్పారని దుయ్యబట్టారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే మన అమరావతి రాజధాని మన దగ్గరే ఉంటుందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పతకాన్ని పూర్తి చేయించేందుకు కృషి చేస్తానన్నారు. సూపర్‌సిక్స్ పథకాల బ్రోచర్లను పంచిపెట్టారు. విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)కి తనకు సైకిల్ గుర్తుపై చెరో ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని, చంద్రబాబును సీఎం చేయాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. దుగ్గిరాలపాడులో వైస్ సర్పంచ్ కోపూరు రాంబాబు, ఆడెపు శ్రీనివాసరావు, ఉండిమోదుగుల సాంబ శివరావు, ఉండిమోదుగుల సురేష్ తదితరులు పెద్ద ఎత్తున టీడీపీ తీర్థం తీసుకున్నారు.


టిడ్కో లబ్ధిదారులతో మాట్లాడుతున్న వెనిగండ్ల రాము

గ్రామాల్లో తాగు, సాగునీటి కొరత తీరుస్తా : వెనిగండ్ల



గుడివాడ, ఏప్రిల్ 28 : గ్రామాల్లో తాగు, సాగునీటి ఇబ్బందులు తొలగిస్తానని, ముఖ్యంగా దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తానని కూటమి టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం గుడివాడ మండలం పాత మల్లాయిపాలెం, దొండపాడు, పట్టణంలోని 33వ వార్డులో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి కాలనీప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని మంత్రిగా పనిచేసినా.. సొంత ప్రయోజనాలు చూసుకుని, ప్రజా సమస్యలు గాలికి వదిలేశారన్నారు. నియోజకవర్గానికి ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేని అసమర్థ నేతగా గుడివాడ చరిత్రలో నిలిచిపోయాడన్నారు. గ్రామంలోని శ్రీహజరత్ అవులియా ఖాదరీ బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

టిడ్కో లబ్ధిదారుల సమస్యలు పరిష్కరిస్తా..

కూటమి అధికారంలోకి రాగానే టిడ్కో లబ్ధిదారుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని వెనిగండ్ల రాము హామీ యిచ్చారు. ఏలూరురోడ్డులోని ప్రజావేదిక కార్యాలయంలో టిడ్కో లబ్ధిదారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. టిడ్కో గృహాల్లో అన్ని మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. పట్టణంలో పండ్ల వర్తక సంఘ నాయకులు నైనాల చిన్న, పిడుగు శ్రీనుల ఆధ్వర్యంలో 100మంది వ్యాపారులు రాము సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పిన్నమనేని బాబ్జీ, లింగం ప్రసాద్, దారం నరసింహారావు, మడక అరవింద్, మజ్జి శ్రీనివాసరావు, వడ్డే గిరి తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న రవీంద్ర, కొనకళ్ల

కూటమితోనే జిల్లా అభివృద్ధి : కొనకళ్ల, రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 28 : కృష్ణాజిల్లా అభివృద్ధి ఎన్డీఏ కూటమితోనే సాధ్యమని మాజీ ఎంపీ, కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. సర్కారుతోటలో ఆదివారం చిల్లిముంత వెంకన్న బృందం తెలుగుదేశం పార్టీలో చేరగా వారికి మాజీ మంత్రి, మచిలీపట్నం ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ అపూర్వ కలయికతో కృష్ణాను మోడల్ జిల్లాగా రూపొందిస్తామన్నారు. కొల్లురవీంద్ర మాట్లాడుతూ, బందరు ప్రజలు పిచ్చోళ్లని ఎమ్మెల్యే పేర్ని నాని ముద్ర వేయడం దురదృష్టకరమన్నారు. స్వాతంత్ర పోరాటంలో బందరుకు ఒక ప్రత్యేకత ఉందని, జెండా వీరుడు తోట నరసయ్యనాయుడు, జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య, ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య, ఎన్టీ రామారావు వంటి మహనీయులు తిరుగాడిన ఈ నేలపై పుట్టిన ప్రజలకు దేశభక్తి, సేవా తత్పరతలు ఉన్నాయని అన్నారు. తనకు అవకాశం ఇస్తే మచిలీపట్నాన్ని సుందరనగరంగా తీర్చిదిద్దుతానన్నారు. జనసేన జిల్లా కార్యదర్శి బండి రామకృష్ణ మాట్లాడుతూ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు రాష్ట్ర ప్రజలను వైసీపీ నాయకుల చెరనుంచి విముక్తి కలిగించేందుకు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమిగా ఏర్పడినట్టు చెప్పారు. కార్యక్రమంలో కొనకళ్ల బుల్లయ్య, మోటమర్రి బాబా ప్రసాద్, బత్తిన దాసు తదితరులు పాల్గొన్నారు.


నాగాయలంకలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి శ్రేణులు

వైసీపీ నుంచి జనసేనలోకి చేరికలు

నాగాయలంక, ఏప్రిల్ 28 : మండలంలోని పలు గ్రామాల వైసీపీ నాయకులు జనసేన పార్టీలో చేరారు. ఆదివారం అవనిగడ్డలో టీడీపీ, బీజేపీ బలపర్చిన జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ ఇంటి వద్ద వక్కపట్లవారిపాలెం సర్పంచ్ అంబటి శ్యాంప్రసాద్ తన అనుచరులతో జనసేనలో చేరారు. బుద్ధప్రసాద్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సర్పంచ్‌తోపాటు వైసీపీ నాయకులు బోగిరెడ్డి సురేష్, అంబటి గోవిందరావు, వక్కపట్ల శ్రీహరి, చెన్ను వెంకటేశ్వరరావు, అంబటి వెంకటరమణ, చెన్ను శివయ్య, పద్యాల కృష్ణబాబు జనసేనలోకి చేరారు. భావదేవరపల్లి గ్రామానికి చెందిన ఎమ్మెల్యే ముఖ్య అనుచరులు ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, బండే రామకృష్ణ, వర్రే సుబ్రహ్మణ్యం, నంగేగడ్డ గ్రామానికి చెందిన కోసూరు నారాయణరావుతోపాటు ఏటిమొగ, మర్రిపాలెం గ్రామాల నుంచి సుమారు 200 మంది కార్యకర్తలు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తొలుత వేకనూరు నుంచి కూటమి నేతలు, కార్యకర్తలు బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు.





విలీనం పేరుతో.. వెన్ను విరిచారు!

» పెన్షన్ కోరితే దాన్ని లేకుండా చేశారు
» గతంలో సాధించుకున్న వాటినీ రద్దు చేశారు..
» సర్వీసు రూల్స్ అమలు కాని పరిస్థితి.. సిబ్బందికి తీవ్ర అన్యాయం
» కొత్త బస్సులు లేవు.. స్పేర్లు లేవు.. అన్నీ అద్దెవే
» పెన్షన్, బీమా పథకాలకు తిలోదకాలిచ్చారు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశామని వైసీసీ ప్రభుత్వం డబ్బా కొడుతోంది.. ఉద్యోగులను ఉద్ధరించామని చెబుతూనే సమస్యల సుడిగుండంలోకి నెట్టేసింది. విలీనం వల్ల దక్కాల్సినవి దక్కక పోగా.. గతంలో సాధించుకున్నవి కూడా కోల్పోవాల్సి రావటంతో ఆర్టీసీ ఉద్యోగులు మానసిక క్షోభ అనుభవిస్తున్నారు.

● పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) కోసం ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వంలో విలీనం కోరుకుంటే.. నేడు ఓపీఎస్ అమలు కాక.. ఇటు సీపీఎస్ అమలు కాక.. కేవలం ప్రావిడెంట్ ఫండ్‌పై వచ్చే పెన్షన్ మాత్రమే గతయింది. ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్నపుడు ఆర్టీసీ కార్మికులంతా ఎంటీడబ్ల్యూ యాక్టు పరిధిలోకి వచ్చేవారు. విలీనానంతరం ట్రాఫిక్, మెయింటినెన్స్ సిబ్బంది ఎంటీడబ్ల్యూ యాక్టు పరిధిలో వస్తారని ప్రభుత్వం జీవో ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం ఎంటీడబ్ల్యూ యాక్టు పరిధిలో ఉన్న రాయితీలు, హక్కులన్నీ కల్పించాల్సి ఉండగా ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు.

● ప్రభుత్వంలో విలీనం పేరుతో ప్రజా రవాణా సంస్థ (పీటీడీ)ని ఏర్పాటు చేసింది. కేంద్ర ప్రభుత్వ ఈక్విటీ లేకపోవటం వల్ల కేవలం ఆర్టీసీ కార్మికులు మాత్రమే పీటీడీలో విలీనమయ్యారు. ఆర్టీసీగా అలానే ఉంది. పీటీడీ ఏర్పాటైనా ప్రభుత్వ సర్వీసు రూల్సు వర్తింపచేయటం లేదు. జనవరి 1, 2020 నుంచి ఆర్టీసీ ఉద్యోగులను పీటీడీలో విలీనం చేసినపుడు క్యాడర్ స్ట్రెంగ్త్‌కు సంబంధించి వివిధ కేటగిరీల నార్మ్స్ పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయించారు. ఫలితంగా ఆర్టీసీ ఉద్యోగుల కుదింపుతో పరిపాలనా వ్యవహారాలు అస్తవ్యస్తంగా మారాయి. తరచుగా బస్సుల ఫెయిల్యూర్లకు ఆజ్యం పోసింది. పీటీడీ ఉద్యోగులకు సర్వీసు రూల్స్ బదులుగా ఏపీఎస్ఆర్టీసీ రిక్రూట్‌మెంట్ రెగ్యులేషనర్స్ కొనసాగించని కారణంగా తీవ్ర నష్టం జరుగుతోంది. ఆర్టీసీ ఉద్యోగులను పీటీడీలో విలీనం చేసిన తర్వాత వారికి ఉన్న రిక్రూట్‌మెంట్ రెగ్యులేషన్స్ స్థానంలో సర్వీసు రూల్స్‌ను ఉద్యోగ సంఘాలు, కింది స్థాయి అధికారులతో చర్చించకుండా ఏకపక్షంగా అమలు చేశారు. దీంతో సంస్థలోని 95 శాతం మందికి న్యాయంగా రావాల్సిన పదోన్నతుల అవకాశాలను పోగొట్టుకున్నారు. పీటీడీ ఉద్యోగులు మాత్రం తాము విలీనమైనప్పటి నుంచి పదవీ విరమణ అయ్యే వరకు ఆర్టీసీ రిక్రూట్‌మెంట్ రెగ్యులేషన్స్ కొనసాగించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు.

● విలీనానికి ముందు కార్మికులకు వైద్య సేవలు రిఫరల్ హాస్పిటల్స్ ద్వారా ఎక్కువ ప్రయోజనాలను పొందేవారు. పీటీడీలో విలీనం పేరుతో ఈహెచ్ఎస్ ద్వారా అపరిమిత ప్రయోజన అవకాశాలు పోగా.. అసలు ఈహెచ్ఎస్ కూడా పనిచేయని పరిస్థితి ఏర్పడింది. విలీనమైన నాలుగేళ్లుగా సరెండర్ లీవు చెల్లింపులు జరగటం లేదు. ఆర్టీసీ సర్వీసు రెగ్యులేషన్-30 అనుసరించి పనిచేస్తున్న ఉద్యోగుల క్రమబద్ధీకరణలో తీవ్ర అన్యాయం జరిగింది. ఆర్టీసీలో పనిచేస్తూ మెడికల్ అన్‌ఫిట్ కారణంగా రిటైన సిబ్బంది కుటుంబసభ్యులకు కారుణ్య నియామకలు ఇవ్వటానికి 2015 సంవత్సరంలో ఇచ్చిన సర్క్యులర్‌ను అనుసరించి దరఖాస్తుచేసుకున్న వారిని అనర్హులుగా తిరస్కరిస్తూ ఇబ్బందులు పెట్టారు. వీలీనం పేరుతో గతంలో ఆర్టీసీ ఉద్యోగులకు ఉన్న ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ వంటి పెన్షన్, బీమా పథకాలను ఏకపక్షంగా రద్దు చేశారు. డబ్బులను ఒకేసారి కాకుండా దశలవారీగా చెల్లిస్తూ ఇబ్బందులు పెడుతున్నారు. విలీనం తర్వాత చనిపోయిన, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సంబంధించి సెటిల్మెంట్స్ ప్రభుత్వం దగ్గర వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి.

● సంస్థలోని అత్యాధునిక బస్సులకు కావాల్సిన నాణ్యమైన మెటీరియల్స్, టూల్స్ అన్ని గ్యారేజీలకు పంపిణీ జరగటం లేదు. ఆర్టీసీ సిబ్బందికి గతంలో ప్రతి సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్ ఇచ్చేవారు. చెప్పులు, షూ అలవెన్సులు ఇచ్చేవారు. విలీనం తర్వాత ఇవన్నీ ఆగిపోయాయి.

● విలీనానికి ముందు ఇచ్చిన సర్క్యులర్ నెంబర్ 1/2019 పక్కన పెట్టి.. జీఓ నెంబర్ 70,71లను తీసుకువచ్చి కిందిస్థాయిలో పనిష్మెంట్లు, సస్పెండ్లు వంటివి ఎక్కువగా తీసుకురావటం జరిగింది. విలీనం తర్వాత ఆర్టీసీలో కొత్తబస్సులను తీసుకురాలేదు. గతంలో ప్రతి ఏడాది 500 నుంచి 1000 కొత్త బస్సులు కొనేవారు. ప్రస్తుతం ఒక్క కొత్త బస్సు కొనలేదు. బస్సులు లేకపోవటం వల్ల వందలాది రూట్లను రద్దు చేశారు. విలీనానికి ముందు ఉన్న బస్సుల సంఖ్యతో పోల్చుకుంటే ప్రస్తుతం పావు వంతు బస్సులు తగ్గిపోయాయి. కాలం తీరిన బస్సులు తిరుగుతున్నాయి. విలీనానికి ముందు ఆర్టీసీ ఉద్యోగులకు నాలుగు సంవత్సరాలకు పీఆర్సీ ఉండేది. విలీనం తర్వాత ఐదు సంవత్సరాలకు పీఆర్సీ ఉంటోంది. ఈ కారణంగా 2021 పీఆర్సీని కోల్పోవటం వల్ల ఆర్టీసీ ఉద్యోగులకు తీవ్ర నష్టం జరిగింది.


అపార్టుమెంట్‌వాసులతో చిన్ని ఆత్మీయ సమావేశం

సార్వత్రిక ఎన్నికల్లో కూటమిదే విజయం

» విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) ధీమా

భవానీపురం/మొగల్రాజపురం/వన్‌టౌన్, ఏప్రిల్ 28 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలోను, రాష్ట్రంలోను ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు కొలువుదీరుతాయని, మూడోసారి ప్రధానిగా మోదీ, సీఎంగా చంద్రబాబు గెలవనున్నారని విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) ధీమా వ్యక్తం చేశారు. భవానీపురం 41వ డివిజన్‌లోని క్యాలిబర్ ఉత్సవ్, అమ్మపాద టవర్స్ అపార్టుమెంట్ వాసులతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని ఎమ్మెల్యేగా సుజనా, ఎంపీగా తనను గెలిపించాలని ఆయన కోరారు. క్యాలిబర్ ఉత్సవ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.పుల్లయ్య, మాజీ కార్పొరేటర్ ఖాద ర్, అమ్మపాద టవర్స్ అధ్యక్షుడు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● తూర్పునియోజకవర్గం 8వ డివిజన్ పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్‌లో రాధామాధవ్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశంలో కేశినేని చిన్ని పాల్గొన్నారు. వైసీపీ మ్యానిఫెస్టో అంతా అంకెల గారడీనే అన్నారు. అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి కల్పనే ధ్యేయంగా పనిచేసే టీడీపీ అధికారంలోకి రావాలంటే ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



● వైసీపీని వీడి మైనార్టీ సోదరులు టీడీపీలోకి రావడంతోనే కూటమి విజయం సాధించినట్టు అని కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఆదివారం పశ్చిమ నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో సీనియర్ నేత ఎంఎస్ బేగ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ అకాడమీ డైరక్టర్ వజీద్‌ఖాన్, వైసీపీ మైనార్టీ సెల్ నాయకులు హలాన్ ఖాన్ తదితర మైనార్టీ సోదరులు టీడీపీలోకి కేశినేని శివనాథ్ సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారనడానికి నిదర్శనం చంద్రబాబుపై నమ్మకంతో టీడీపీలోకి మైనార్టీలు రావడమేనన్నారు. ఎంఎస్ బేగ్ మాట్లాడుతూ, మైనార్టీ హక్కులకు రక్షణ కల్పించలేని జగన్‌రెడ్డి మైనార్టీల వ్యతిరేకి అని విమర్శించారు. రానున్న ఎన్నికలలో ప్రజల తీర్పుకు తాడేపల్లి ప్యాలెస్ బద్దలవుతుందని చెప్పారు. షేక్ సదాని, షేక్ నాజర్ తదితరులు పార్టీలో చేరారు.


చిన్ని, ఎంఎస్ బేగ్‌ల సమక్షంలో టీడీపీలో చేరికలు

ఉల్లంఘనలు గుర్తించండి

» ఎన్నికల విజయవంతానికి మైక్రో అబ్జర్వర్లే కీలకం » ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 632 మంది » ఈవీఎంలు, వీవీప్యాట్లపై శిక్షణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు విజయవంతం కావాలంటే.. మైక్రో అబ్జర్వర్ల విధులు అత్యంత కీలకమని ఎన్టీఆర్ జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకురాలు మంజూ రాజ్‌పాల్, నరేంద్రర్ సింగ్ బాలిలు అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో సూక్ష్మ పరిశీలకుల సేవలు అత్యంత కీలకమన్నారు. సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) ఎన్నికల విధులకు సంబంధించి పూర్తి అవగాహన కలిగి ఉండటంతో పాటు.. నిబద్ధత, నిస్పక్షపాతంగా నిర్వహిస్తేనే ఎన్నికలను విజయవంతం చేయగలమని చెప్పారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మైక్రో అబ్జర్వర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావుతో పాటు జిల్లా సాధారణ పరిశీలకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో తు.చ తప్పకుండా అమలు చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్లు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని చెప్పారు. శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ప్రతి అంశంపైనా దృష్టి కేంద్రీకరించాలన్నారు. పోలింగ్ ప్రక్రియలో గుర్తించిన సమస్యాత్మక



ఉల్లంఘనలను తక్షణం తమ దృష్టికి తీసుకు రావాలని ఆదేశించారు. ప్రతి అంశాన్ని రిపోర్టింగ్ చేయాలని నిర్దేశించారు. మాక్ పోలింగ్ సందర్భంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ పార్టీ, పోలింగ్ ఏజంట్లు, పోలింగ్ భద్రతా సిబ్బంది తదితరాలకు సంబంధించి నిశిత పరిశీలన జరపాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు మాట్లాడుతూ, ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 878 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా ఉన్నాయని, ఆయా కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 632 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించటం జరిగిందన్నారు. మాక్ పోలింగ్, పోలింగ్ మెటీరియల్, పోలింగ్ పార్టీ, ఏజంట్లు, సీక్రెసీ ఆఫ్ ఓటింగ్ (సీఓఓ), పోలింగ్ స్టేషన్ లే అవుట్, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, 17ఏ రిజిస్టర్, ఓటింగ్ మెషీన్ సీలింగ్ తదితర అంశాలలో మైక్రో అబ్జర్వర్లు కీలకంగా వ్యవహరించాలన్నారు. హోమ్ ఓటింగ్‌లో ఎలాంటి అంశాలను పరిశీలించాలన్న దానిపై పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తామని, ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడతానని, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగేందుకు దోహదపడతానని, నిస్పక్షపాతంగా పనిచేస్తానని, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు కృషి చేస్తానని, ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని మైక్రో అబ్జర్వర్లతో దిల్లీరావు ప్రతిజ్ఞ చేయించారు.

ఈవీఎంలపై ప్రత్యేక శిక్షణ

మైక్రో అబ్జర్వర్లకు ఈవీఎంలపై ప్రత్యేకంగా శిక్షణ కల్పించారు. ఈవీఎంలో కంట్రోల్ యూనిట్, బ్యాలట్ యూనిట్లను ఎలా అనుసంధానం చేస్తారు? వీవీ ప్యాట్ ఎలా పనిచేస్తుంది. ఈవీఎంకు, వీవీ ప్యాట్ ఎలా అనుసంధానం చేయాలి అన్నదానిపై శిక్షణ ఇచ్చారు. మాక్ పోలింగ్ నిర్వహణ, అనంతరం దాని డేటాను క్లియర్ చేసిందీ లేనిదీ పరిశీలించటం, ఖచ్చితంగా సీల్ వేసిందీ లేనిదీ తదితర అంశాలపై సమగ్రంగా శిక్షణ కల్పించారు.


ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్న కూపన్లు

ప్రలోభాల పర్వం!

» కుక్కర్ల పంపిణీకి తెరతీసిన వైసీపీ
» గుట్టుచప్పుడు కాకుండా కూపన్ల ముద్రణ
» ఎన్నికల అధికారుల తనిఖీల్లో బట్టబయలు
» స్వాధీనం.. పోలీసులకు ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 28 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వైసీపీ నేతలు అడ్డదారులు తొక్కుతున్నారు. అభ్యర్థులను గెలిపించుకోవాలని అక్రమాలకు తెగబడుతున్నారు. గతంలో వలంటీర్లు, ఆర్పీలకు కుక్కర్లు పంపిణీ చేసి వార్తల్లోకెక్కారు. తాజాగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కుక్కర్ల పంపిణీకి రంగం సిద్ధం చేశారు. సెంట్రల్ నియోజకవర్గంలో పంపిణీ చేసేందుకు గాను భారీ ఎత్తున కూపన్లను ముద్రించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించి సిద్ధం చేసిన కూపన్లను ఎన్నికల అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. స్థానిక తోటవారి వీధిలోని లక్ష్మీ క్వాలిటీ ప్రింటింగ్ ప్రెస్‌లో కూపన్లు ముద్రిస్తున్నట్టు సమాచారం అందుకున్న ఎన్నికల అధికారులు ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించి వైసీపీ ఎన్నికల గుర్తు 'ఫ్యాను'తో ముద్రించిన సుమారు ఆరువేల కూపన్లను స్వాధీనం చేసుకున్నారు. వెంటనే అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు కూపన్లను అప్పగించి ఫిర్యాదు చేశారు. అలాగే ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులకు కూపన్ల ముద్రణకు ఆర్డర్ ఎవరు ఇచ్చారు అనే విషయమై పోలీసులు విచారిస్తున్నారు.

అలకలు.. బుజ్జగింపులు!

» కాంగ్రెస్‌లో దూరంగా ఆశావహులు
» పీసీసీ తీరుతో పెరుగుతున్న దూరం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఉన్న కొద్ది మంది నేతలను కాపాడుకుంటే చాలు అన్న భావనలో పార్టీ నాయకత్వం ఉంది. పని చేసిన చోట సీటు ఇవ్వకపోవడంతో దూరంగా ఉంటున్నారు సీనియర్లు. కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఇది. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ రాష్ట్ర విభజన తర్వాత కొద్దిరోజులుగా కళకళలాడుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి కనిపించింది. పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టిన తర్వాత సందడి వాతావరణం నెలకొంది. నాయకులు, కార్యకర్తల రాకపోకలతో కొత్త పరిణామం ఆంధ్రరత్న భవన్‌లో కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ఎన్నికల్లో ఖరారు చేసిన సీట్లు కొంతమందికి సంతృప్తిని, మరికొంతమందికి అసంతృప్తిని కలిగిస్తున్నాయి. సీట్లు ఆశించిన సీనియర్లకు ఈసారి భంగపాటు తప్పలేదు. అధిష్టానం ఖరారు చేసిన అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని పైకి చెబుతున్నా కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. మనం చేసేది ఏముందిలే అన్న భావన సీనియర్లలో కనిపిస్తోంది.

పీసీసీ తీరుతో పెరుగుతున్న దూరం

ఇండియా కూటమి కాంగ్రెస్‌తోపాటు వామపక్షాలు ఉన్నాయి. దీనితో ఉమ్మడి కృష్ణా జిల్లాలో కొన్ని సీట్లను వామపక్షాలకు కేటాయించాల్సి వచ్చింది. విజయవాడలో పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలతో పాటు కృష్ణా జిల్లాలో గన్నవరం సీటును వామపక్షాలకు కేటాయించారు. వామపక్షాలకు సీట్లు కేటాయించిన నియోజకవర్గాల్లో సీనియర్లు పోటీ చేయాలని భావించారు. పార్టీ తీసుకున్న నిర్ణయంతో వారికి అవకాశం దక్కలేదు. విజయవాడ ఎంపీ సీటు కోసం ఐదారుగురు పోటీపడ్డారు. అధిష్టానం సీటును వల్లూరి భార్గవ్‌కు కేటాయించింది. పార్టీలో కీలకంగా పనిచేస్తున్న పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, నగర కమిటీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహరావు, ఎన్టీఆర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు బొర్రా కిరణ్‌కు అవకాశం దక్కలేదు. ఇందులో బొర్రా కిరణ్‌ను మైలవరం అభ్యర్థిగా ఎంపిక చేశారు. సుంకర పద్మశ్రీని విజయవాడ తూర్పు నుంచి పోటీ చేయించాలని పార్టీ భావించింది. పేరును ప్రకటించినప్పటికీ పోటీకి ఆమె దూరంగా ఉన్నారు. నరసింహరావు పేరును అటు అసెంబ్లీకి గానీ, ఇటు పార్లమెంటుకు గానీ పరిశీలనలోకి తీసుకోలేదు. ఉమ్మడి జిల్లాలో ఉన్న పరిస్థితిని పీసీసీకి వివరించాలని సీనియర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. పీసీసీ ప్రతినిధులు ఆ అవకాశం ఇవ్వకపోవడంతో అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాల తర్వాత సుంకర పద్మశ్రీ పార్టీ కార్యాలయం వైపు చూడడం మానేశారు. ఆమె అభిప్రాయాలను ఎక్స్ వేదికగా పంచుకుంటున్నారు. కొంతమంది పార్టీ కార్యాలయానికి వచ్చి కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పటికీ తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.



కాంగ్రెస్ 'తూర్పు' ఇన్‌చార్జిగా బ్రహ్మం


తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా కాంగ్రెస్ పార్టీ నడిపల్లి బ్రహ్మంను నియమించింది. తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి సుంకర పద్మశ్రీ నిరాకరించడంతో నగర కమిటీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహరావు పేరును పరిగణనలోకి తీసుకుంటారని భావించారు. 2019 ఎన్నికల్లో పోటీ చేసిన పొనుగుపూటి నాంచరయ్యను తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఈ నియోజకవర్గంలో కమ్మ, కాపు సామాజికవర్గాల ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఈ అంశాలను పరిశీలించి తొలుత కమ్మ సామాజికవర్గానికి చెందిన పద్మశ్రీకి అవకాశం ఇచ్చారు. కాపు ఓటర్లను దృష్టిలో పెట్టుకుని నరసింహరావును ప్రకటిస్తారని భావించారు. పార్టీ మాత్రం ఇక్కడ బీసీ కార్డును ప్రయోగించింది. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన నాంచారయ్య బీసీ సామాజికవర్గానికి చెందినవారు. పైగా ఈ నియోజకవర్గం నుంచి ఒకసారి పోటీ చేశారు. ఈ నేపథ్యంలోనే నాంచారయ్య వైపు పార్టీ మొగ్గుచూపిందని తెలుస్తోంది.


వైద్యసేవలందిస్తున్న రమేశ్ ఆసుపత్రి వైద్యులు

ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

పామర్రు, ఏప్రిల్ 28 : గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు విజయవాడ రమేశ్ ఆసుపత్రి ఎల్లవేళలా కృషి చేస్తుందని ఆసుపత్రి సీనియర్ జనరల్ మేనేజర్ కోనేరు కోటేశ్వరరావు అన్నారు. బీఎస్ రెడ్డి కల్యాణ మందిరంలో ఆదివారం రమేశ్ ఆసుపత్రి యాజమాన్యం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆరోగ్యశ్రీ పథకంలో పేదలకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్నామన్నారు. రమేశ్ ఆసుపత్రి వైద్యులు గ్రామాలకు వచ్చి అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగ పరచుకోవాలని కోరారు. వైద్యశిబిరంలో మొత్తం 201 మందికి వివిధ రకాల వైద్యసేవలందించారు. ఆసుపత్రి వైద్యనిపుణులు అమరకాంత రాజ్, కె.భరత్‌చంద్ర, జి.మమత, పీబీ ప్రశాంత్‌బాబు, లక్ష్మీసింధూర, మధుకృష్ణ టి.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.50

టీడీపీలో చేరికలు

విద్యాధరపురం, ఏప్రిల్ 28: ఎన్నికల వేళ ఇతర పార్టీల నుంచి పలువురు టీడీపీలో చేరుతున్నారు. ఆదివారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 38వ డివిజన్‌కు చెందిన ఆళ్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) వారికి కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని వారికి ఆయన సూచించారు



కేశినేని చిన్ని సమక్షంలో టీడీపీలో చేరిన 38వ డివిజన్ నాయకులు

ప్రజల ఆస్తులపై జగన్ కన్ను

● అందుకే ల్యాండ్ టైటిలింగ్ చట్టం
● ఆస్తులకు రక్షణ కావాలంటే కూటమికి ఓటేయండి: గద్దె అనురాధ

పటమట: ప్రభుత్వ కార్యాలయాలు, భూములు, సచివాలయాలనతాకట్టు పెట్టిన జగన్‌కు చివరకు ప్రజల ఆస్తులపై కన్ను పడిందని దాని కుట్రలో భాగమే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను పెడుతున్నారని జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ ఆరోపించారు. 11వ డివిజన్‌లో తంగెళ్లమూడివారి వీధి, యలమంచిలి కుటుంబయ్య పార్కు ప్రాంతాల్లో ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్, ఎంపీగా కేశినేని శివనాథ్(చిన్ని)ని గెలిపించాలని ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. మన ఆస్తులకు రక్షణ కావాలంటే కూటమికి మద్దతిచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. గద్దె హేమాన్షు, కోనేరు రాజేష్, పామర్తి కిషోర్, దేవరపల్లి ఆంజనేయులు, మీసాల నాగేంద్ర, కోనేరు రాధాకృష్ణ, పాలడుగు దుర్గాప్రసాద్, బి.మురళి పాల్గొన్నారు.

కూటమికి మద్దతివ్వండి

● సిక్కు పెద్దలను కోరిన గద్దె అనురాధ



సిక్కు పెద్దలతో మాట్లాడుతున్న గద్దె అనురాధ

భారతీనగర్: రాష్ట్ర అభివృద్ధి కోసం సిక్కులందరూ రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి మద్దతివ్వాలని జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ కోరారు. 4వ డివిజన్ పరిధిలోని గురుద్వారాలో సిక్కులను ఆదివారం ఆమె కలిశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించాలని సిక్కు పెద్దలను కోరారు.

గద్దె మళ్లీ గెలిస్తే మూడో రిజర్వాయర్ నిర్మాణం

గుణదల: 5వ డివిజన్ పరిధిలోని ఫలిమ్ కాలనీలో ఇంటింటికి వెళ్లి గద్దె అనురాధ ఓట్లు అభ్యర్థించారు. గద్దె రామ్మోహన్ ఈ ప్రాంతవాసుల దాహార్తిని తీర్చేందుకు రెండు వాటర్ ట్యాంకులు నిర్మించారని, మరో మారు ఆయన్ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే మూడో రిజర్వాయర్ నిర్మిస్తారని అనురాధ హామీ ఇచ్చారు. నందిపాటి దేవానంద్, గుమ్మడి గురుప్రసాద్, జాస్తి సతీష్, అలిబిల్లి రామకృష్ణ, కోడూరు సుబ్రహ్మణ్యం, యలమంచలి రాజేష్, వెంకటేశ్వరరెడ్డి, పి.సాయి, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

నేను చేసిన అభివృద్ధిని చూసి ఓటేయండి

తూర్పుకాపుల ఆత్మీయ సమావేశంలో కూటమి 'తూర్పు' అభ్యర్థి గద్దె రామ్మోహన్

కృష్ణలంక, ఏప్రిల్ 28: "నలభైఏళ్ల రాజకీయ జీవితంలో నాకు తెలిసి ఎవరికీ చెడు చేయలేదు. భవిష్యత్తులోనూ చేయను. నియోజకవర్గంలో నేను చేసిన అభివృద్ధిని చూసి ఓటేయండి." అని ఓటర్లను టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తూర్పు నియోజకవర్గ అభ్యర్థి గద్దె రామ్మోహన్ కోరారు. కృష్ణలంక 21వ డివిజన్ పరిధిలో ఆదివారం తూర్పుకాపులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శివనాథ్(చిన్ని)ని సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన పథకాల వల్లే జగన్‌కు 2019 ఎన్నికల్లో ఓట్లు వేశారని, ఇప్పుడ రాజశేఖరరెడ్డి ఎక్కడా కనిపించడం లేదని, మొత్తం జగనే కనిపిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం విక్రయిస్తున్నారని, ఇసుకను బ్లాక్ మార్కెటింగ్‌కు తరలించుకుపోయి జగన్ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు హయాంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగుండేదన్నారు. భవన నిర్మాణ రంగం వారికి చేతినిండా పని ఉండేదన్నారు. జగన్ అధికారంలోకి వచ్చి రియల్ ఎస్టేట్ రంగాన్ని దెబ్బ తీశారన్నారు. యువతకు ఉద్యోగాలు లేవని, ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా రాకపోవడంతో చదువులు పూర్తైనా సర్టిఫికెట్లు కళాశాల యాజమాన్యాల బీరువాల్లో ఉన్నాయన్నారు. అమరావతి రాజధానిగా ఉన్నప్పుడు వ్యాపారాలు బాగా జరిగేవన్నారు. జగన్ పాలనలో నగరంలో ఎక్కడ చూసినా టూలెట్ బోర్డులే కనిపిస్తున్నాయన్నారు. చంద్రబాబు నిర్మించిన భవనాల్లో నుంచి జగన్ ఈ ఐదేళ్లు పాలించారన్నారు. జనసేన పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు, మాజీ కార్పొరేటర్ చందన సురేష్, టీడీపీ నేతలు గొరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, పెరుమాళ్ల గురునాథం, జనసేన నాయకులు కొప్పూరి కిరణ్‌బాబు, పోతిరెడ్డి అనిత, పోతిరెడ్డి రమణ, ముళ్లపూడి నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు పోతిరెడ్డి శంకర్, గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పక్కన జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, పోతిరెడ్డి అనిత, ముళ్లపూడి నాగేశ్వరరావు

జగన్ దొంగ అని సొంత చెల్లే చెబుతోంది: గద్దె రామ్మోహన్

మాచవరం: సీఎం జగన్ దొంగ అని, ఆయనకు హత్యలు చేసే మనస్తత్వం ఉందని సొంత చెల్లి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బహిరంగంగా చెబుతోందని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తూర్పు నియోజకవర్గ అభ్యర్థి గద్దె రామ్మోహన్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే విజన్ ఉన్న నేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. 6వ డివిజన్‌లోని నిమ్మతోట, బాలభాస్కర్‌నగర్ కొండ ప్రాంతాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జగన్ ప్రకటించిన మేనిఫెస్టోతో ఆయన ఎంత మోసకారో ప్రజలకు అర్థమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4 వేలు పింఛన్ అందిస్తామని తెలిపారు.

అమరావతికి మద్దతుగా ప్రజల తీర్పుండాలి

పటమట: పార్టీలకు అతీతంగా విజయవాడ ప్రజలు రాజధాని అమరావతిని కాపాడుకునేందుకు ఆలోచించి ఓటు వేయాలని గద్దె రామ్మోహన్ కోరారు. 12వ డివిజన్‌లో సంజయ్‌గాంధీ కాలనీ ప్రాంతంలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. చంద్రబాబు కృషితో ఏర్పడిన హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాల యువత ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు సమదూరంలో ఉండేలా రాజధాని అమరావతిని అభివృద్ధి చేస్తే, జగన్ మూడు రాజధానులు చిచ్చుపెట్టి ఆనందిస్తున్నారని అన్నారు. నగరం ప్రశాంతంగా ఉండాలంటే ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా కేశినేని చిన్నికి సైకిల్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో బీజేపీ నేత పోతంశెట్టి నాగేశ్వర రావు, పరిశీలకుడు వెలగపూడి శంకరబాబు, శాయన సత్యనారాయణ, పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, మారం చిన్నతల్లి, నీరజ, జక్కుల సుబ్బారావు, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరిస్తా: సుజనా చౌదరి

చిట్టినగర్, ఏప్రిల్ 28: క్రైస్తవుల సమస్యలు పరిష్కరిస్తానని, వారి అభ్యున్నతికి పాటుపడతానని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనా చౌదరి హామీ ఇచ్చారు. ఆదివారం కలరా హాస్పిటల్ సమీపంలోని జోసెఫ్ స్కూల్ చర్చి ప్రాంగణంలో ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. పలువురు చర్చి పెద్దలతో మాట్లాడారు. గెలిచిన వెంటనే క్రైస్తవులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించి పశ్చిమ అభివృద్ధికి పాటుపడతానని ఆయన హామీ ఇచ్చారు. చర్చి నిర్వాహకుడు జహర్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



జోసెఫ్ స్కూల్ చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న సుజనా చౌదరి

సుజనా గెలుపు కోసం కుమార్తె, కోడలు ప్రచారం

విద్యాధరపురం: సుజనా చౌదరి గెలుపు కోసం ఆయన కోడలు యలమంచిలి స్నేహ, కుమార్తె నాగచాందిని ఆదివారం 40వ డివిజన్ పరిధిలోని భవానీపురం డాల్ఫిన్ బార్, కోళ్ల ఫాం రోడ్డులో ప్రచారం చేశారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పొనుగుపాటి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సుజనా చౌదరిని గెలిపించాలని కోరుతూ ఓట్లను అభ్యర్థించారు. మాజీ మేయర్ తాడి శకుంతల, గాడు గణేష్, గంగవరపు సురేష్, మన్నం నారాయణ, వినోద్, వెంకటాద్రి, వెంకటేశ్వరరావు, మల్లికార్జున, వంశీ, ప్రసాద్ పాల్గొన్నారు. కేశినేని శివనాథ్(చిన్ని), సుజనా చౌదరిలను భారీ మెజారిటీతో గెలిపించాలని సుజనా చౌదరి తనయుడు కార్తీక్ 39వ డివిజన్ పరిధి విద్యాధరపురంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



40వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న సుజనా కుమార్తె నాగచాందిని, కోడలు స్నేహ, తాడి శకుంతల

చెత్త ప్రభుత్వమిది

● కేశినేని శ్రీదేవి విమర్శ

చిట్టినగర్: చెత్తపై పన్ను వేసిన చెత్త ప్రభుత్వమిదని, చెత్తపై పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) సోదరి కేశినేని శ్రీదేవి అన్నారు. ఆదివారం 49వ డివిజన్‌లో ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని, పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరిని గెలిపించాలని ప్రజలను కోరారు. తెలుగుయువత రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, జిల్లా మహిళ సంఘం అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, డివిజన్ అధ్యక్షుడు బడుగు వెంకన్న, లంకె శ్రీనివాసరావు, బెవర సురేష్, నాగమోహన్, కొమ్మాజి కామాక్షి, అల్లా బాలాజి, సాంబశివరావు పాల్గొన్నారు.



టైలర్‌పేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కేశినేని శ్రీదేవి

అభివృద్ధికి, అవినీతికి మధ్య ఎన్నికలు

● ఆలోచించి ఓటేయండి..ఓటర్లతో గద్దె రాజేష్, క్రాంతికుమార్

మాచవరం: అభివృద్ధికి, అవినీతికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓట్లు వేయాలని ఓటర్లను గద్దె గద్దె రాజేష్, గద్దె క్రాంతి కుమార్ కోరారు. 2వ డివిజన్ ఆంజనేయస్వామిగుడి ప్రాంతంలో టీడీపీ నేతలతో కలిసి వారు ఎన్నికల ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా గద్దె రామ్మోహన్, ఎంపీగా కేశినేని చిన్నిని గెలిపించాలని కోరారు.

వైసీపీ మేనిఫెస్టోను నమ్ముకుంటే నట్టేట మునిగినట్టే

గుణదల: వైసీపీ మేనిఫెస్టోను నమ్ముకుంటే మరోమారు ప్రజలు నట్టేట మునిగినట్టేనని టీడీపీ యువనాయకుడు గద్దె రాజేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 3వ డివిజన్ పరిధిలోని గుణదల పాత పంచాయతీ కార్యాలయం ప్రాంతంలో ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఆయన ఓట్లు అభ్యర్థించారు. తాడి బాబూరావు, యలమంచిలి పండు, పూలదాసు మారుతీమోహన్, ఈశ్వర్ పేరేపి, గుణమాల రాజశేఖర్, బండి కోమలి, మురారి బాలాజీ ప్రసాద్, గోవిందరాజు భాస్కర్, శ్యామ్, తాడి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పొంగుతున్న డ్రెయినేజీలపై సమాధానం చెప్పలేక
ముఖం చాటేస్తున్న వైసీపీ నాయకులు

● టీడీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు

రాణిగారితోట, ఏప్రిల్ 28: "18వ డివిజన్‌లో కొత్త టెక్నాలజీతో డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేశామంటూ ప్రజాధనాన్ని వైసీపీ నాయకులు వృథా చేశారు. ఏ వీధిలో చూసిన డ్రెయినేజీలు పొంగి పొర్లుతున్నాయి. కోట్ల రూపాయలతో డివిజన్‌ను అభివృద్ధి చేశామని గొప్పలు చెబుతున్న వైసీపీ నేతలు ఎన్నికల ప్రచారంలో పొంగుతున్న డ్రెయినేజీలపై స్థానికులకు సమాధానం చెప్పలేక ముఖం చాటేస్తున్నారు." అని టీడీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు విమర్శించారు. ఆదివారం డివిజన్‌లోని సంగుల పేరయ్య వీధిలో టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారం చేశారు. ఆ వీధిలో నూతనంగా పైపపై పైపులు వేసి డ్రెయినేజీ నిర్మించినా పొంగుతోందని, కలుషిత మంచినీరు వస్తోందని స్థానికులు చెప్పడంతో వాటిని పరిశీలించారు. డ్రెయినేజీ పైపలైన్ పేరుతో కమిషన్లు జేబులో వేసుకున్న కార్పొరేటర్ మళ్లీ డ్రెయినేజీ సమస్యను తీర్చడానికి రోడ్లు తవ్వుతారా అని దుర్గారావు ప్రశ్నించారు.

పారిశ్రామికాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

సత్యనారాయణపురం: వైసీపీ హయాంలో పరిశ్రమలు రాకపోవడంతో యువతకు ఉద్యోగాలు లేవని, ఉద్యోగం కోసం పక్కరాష్ట్రాలు, విదేశాలకు వెళ్లాల్సి వస్తోందని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రం పారిశ్రామికంగా ముందుకు వెళ్లేదని, ఈ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) సతీమణి కేశినేని జానకీలక్ష్మి పిలుపునిచ్చారు. 30వ డివిజన్ లైబ్రరీ వీధి, వశిష్టా అపార్టుమెంట్, కళ్లేపల్లివారి వీధి, రఘునాథ వారి వీధిలో ఆదివారం కూటమి సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు సతీమణి బొండా సుజాతతో కలిసి ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, డివిజన్ అధ్యక్షుడు సూర్యనారాయణ, గొట్టుముక్కల శేషంరాజు లక్కంరాజు శ్రీనివాస రాజు, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు

30వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న కేశినేని చిన్ని సతీమణి జానకీలక్ష్మి, బొండా సుజాత



హామీల అమలులో జగన్ విఫలం

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 28: వైసీపీ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపరచిన హామీలను అమలు చేయడంలో సీఎం జగన్ పూర్తిగా విఫలమయ్యారని సీపీఎం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి సీహెచ్ బాబూరావు విమర్శించారు. 58వ డివిజన్‌లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. "మరోసారి ప్రజలను మోసగించడానికి వైసీపీ ముందుకు వస్తోంది. అమరావతి రాజధానిని నాశనం చేసి విజయవాడ అభివృద్ధిని సీఎం జగన్ దెబ్బతీశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేక పోయారో వైసీపీ ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలి." అని బాబూరావు డిమాండ్ చేశారు. కేవీ భాస్కరరావు, కె.దుర్గారావు పాల్గొన్నారు.



58వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బాబూరావు

చిన్నారి వైద్య చికిత్సకు ఆర్థిక సాయం

పాతరాజరాజేశ్వరి పేట, ఏప్రిల్ 28: ప్రమాదవశాత్తు మెట్ల మీద నుంచి పడిపోయిన చిన్నారి అంకిత్ చికిత్స నిమిత్తం దీవెన ఫౌండేషన్ విజయవాడ నగర పోలీసులు ముందుకు వచ్చారు. నగరానికి చెందిన నరేష్, పావని దంపతుల ఏడాదిన్నర చిన్నారి అంకిత్ ఇటీవల మెట్లమీద నుంచి పడి నడుము విరిగి ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటికే చిన్నారికి చాలా ఖర్చవడంతో కుటుంబ సభ్యులకు దీవెన ఫౌండేషన్ సభ్యుడు కానిస్టేబుల్ భీమరాజు రూ.15,500 అందజేశారు. చిన్నారి తల్లి పావని కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత బూత్ కమిటీలదే

వన్‌టౌన్, ఏప్రిల్ 28: కూటమి పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని)ల గెలుపునకు బూత్ కమిటీలు బాధ్యత తీసుకోవాలని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి) అన్నారు. ఆదివారం ఆయన బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఓటర్లకు సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రచారం చేయాలని ఆయన సూచించారు. సుజనాకు కమలం గుర్తు, కేశినేని చిన్నికి సైకిల్ గుర్తుపై ఓటేసేలా అవగాహన కల్పించాలన్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ ప్రారంభం

భవానీపురం, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికలకు రెండు వారాల ముందే ఓటర్ స్లిప్పుల పంపిణీని అధికారులు ప్రారంభించారు. 44వ డివిజన్‌లో 57వ పోలింగ్ కేంద్రం పరిధిలో ఆదివారం బీఎల్వో, విద్యాశాఖ సెక్రటరీలు ఇద్దరూ డోర్ నెంబర్ల వారీగా పేర్లు అడిగి ఓటరు స్లిప్పులను ఓటర్లకు అందజేశారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

సత్యనారాయణపురం, ఏప్రిల్ 28: చిత్తరంజన్ శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 7వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని గ్రంథాలధికారి సంపత్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు పుస్తక పఠనం, కథలు వినడం, పుస్తక సమీక్షలు, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, జనరల్‌నాలెడ్జ్, క్విజ్, స్పోకెన్ ఇంగ్లీషు, చెస్, క్యారమ్స్ అంశాల్లో శిక్షణ నిర్వహించడంతో పాటు ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యాయామంతో సర్వైకల్ స్పాండిలైటిస్ నియంత్రణ

పటమట, ఏప్రిల్ 28: రోజూ వ్యాయామంతో వెన్నెముక(సర్వికల్ స్పాండిలైటిస్) సమస్యను తగ్గించుకోవచ్చని న్యూరోసర్జన్ అమీన్ అన్నారు. సమభావన విత్రమండలి 98వ సమావేశం కోనేరు నరేంద్రబాబు అధ్యక్షతన ఆదివారం బెంజి సర్కిల్ వద్ద వాసవ్య మహిళా మండలిలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ అమీన్ మాట్లాడారు. అసాధారణ భంగిమలో ఎక్కువ సేపు కూర్చోవద్దని, ఖాళీగా కూర్చోకుండా ఏదో ఒక వ్యాపకం పెట్టుకోవాలని సూచించారు. విత్రమండలి గౌరవాధ్యక్షుడు టి.శోభనాద్రిరావ్, డాక్టర్ పీఆర్‌కే ప్రసాద్, కోనేరు భీమేశ్వరరావు, ఎం.అంజయ్య పాల్గొన్నారు. అమీన్‌ను సమభావన మిత్ర మండలి సభ్యులు సత్కరించారు.

ఆకతాయిలకు అడ్డాగా ఏడో డివిజన్

మొగల్రాజపురం, ఏప్రిల్ 28: మొగల్రాజపురం ఏడో డివిజన్ అకతాయిలకు అడ్డాగా మారింది. ఇటీవల కరెంటు బావి రోడ్డు, కొండప్రాంతంలో పలు చోట్ల మెట్లమార్గాల వద్ద, సీఎస్ఐ చర్చి పరిసర ప్రాంతాల్లో పగలు, రాత్రీ తేడా లేకుండా ఇళ్ల ముందు నిలిసిన ద్విచక్రవాహనాల్లో పెట్రోలు చోరీ చేయడం, అద్దాలు పగలగొట్టడం చేస్తున్నారు. ఆదివారం ఉదయం సీఎస్ఐ స్కూలు పక్కన పార్క్ చేసిన ఓ కారు అద్దాలను పదకొండు గంటల సమయంలో ధ్వంసం చేశారు. ఆకతాయిల చేష్టలపై స్థానికంగా ఉంటున్న ప్రజా సంఘాల నాయకులు క్రాంతికుమార్, మురహరి, శ్రీను, కిరణ్ రాజేష్, సాగర్, మోజి తదితరులు మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లిఫ్ట్ మెకానిక్ ఆత్మహత్య

వన్‌టౌన్, ఏప్రిల్ 28: ఆర్థిక ఇబ్బందులు తాళలేక కృష్ణలంకకు చెందిన కాటూరి నరేంద్ర(36) అనే లిఫ్ట్ మెకానిక్ శనివారం రాత్రి ఇంటిలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య కాటూరి గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణలంక కాటూరి వారి వీధిలో కాటూరి నరేంద్ర భార్య ఇద్దరు పిల్లలతో ఉంటున్నాడు. నరేంద్ర కొంతకాలం నుంచి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. శనివారం ఉదయం భార్య గంగమ్మ డ్యూటీ నిమిత్తం తాను పనిచేసే ఆస్పత్రికి వెళ్లింది. సాయంత్రం పిల్లలు ట్యూషన్‌కు వెళ్లారు. ట్యూషన్ నుంచి వారు ఇంటికి వచ్చి చూడగా నరేంద్ర ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు, బంధువుల సమక్షంలో ఫ్యాన్‌కు వేలాడుతున్న మృతదేహాన్ని పోలీసులు కిందకు దించి, ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పురుగుల మందు తాగిన కూలీ చికిత్స పొందుతూ మృతి

కుటుంబ కలహాల కారణంగా కృష్ణలంక వారధి వద్ద పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుంటూరు జిల్లాకు చెందిన కూలీ శనివారం రాత్రి మరణించినట్లు కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా చుండూరు మండలం చినపరిమి గ్రామానికి చెందిన దాసరి రవి(36) కూలీపనులు చేస్తుంటాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మూడురోజుల క్రితం భార్యభర్తలు గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన రవి సొంతూరు నుంచి వారధి వద్ద ఉన్న సాయిబాబా గుడి వద్దకు వచ్చి పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటికి అతను స్పృహతప్పి కిందపడడంతో స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను శనివారం రాత్రి చనిపోయాడు. పోలీసులు మృతుడి వద్ద ఉన్న గుర్తింపు కార్డుల ద్వారా అతని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య ఝాన్సీరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ధైర్యంగా ఓటేయండి: నార్త్‌జోన్ ఏసీపీ డి.ప్రసాద్


అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 28: ఓటర్లు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, అందుకు పూర్తి భరోసా పోలీసు శాఖ కల్పిస్తోందని నార్త్‌జోన్ ఏసీపీ డి.ప్రసాద్ అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లో ఆదివారం లూనాసెంటర్, డాబాకొట్లు, లెనిన్ సెంటర్, యార్డ్‌రోడ్డు ప్రాంతాల్లో 100 మంది సిబ్బందితో ఆయన స్ట్రీట్ వాక్ చేసి ప్రజలతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను ధైర్యంగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా ప్రజలను భయపెట్టేలా ప్రవర్తించినా తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సీఐలు దుర్గాప్రసాద్, గురుప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

నలంద డిగ్రీ కళాశాలలో సక్సెస్ మీట్

లబ్బీపేట, ఏప్రిల్ 28: ఏ కళాశాల అయినా మంచి విద్య అందించి, విద్యార్థులకు ఉపాధి చూపించినపుడే కళాశాల అభివృద్ధి పథంలో ఉంటుందని మలేషియా ఆర్కిటెక్ట్ ప్రిన్సిపాల్ ఉడత రమేష్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులు 223 ప్లేస్‌మెంట్లు సాధించిన సందర్భంగా యాజమాన్యం విద్యార్థులను అభినందిస్తూ నలంద సక్సెస్ మీట్-2024 కార్యక్రమాన్ని ఆదివారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించింది. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విజన్‌తో విద్యనందిస్తున్నామని నలంద విద్యాసంస్థల ఛైర్మన్ ఎ.విజయబాబు అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు, ఉద్యోగాలు సాధించిన వారికి పతకాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ పాల్గొన్నారు.



టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు



వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ మోహన్

గన్నవరం గెలిచేదెవరు..?

పసుపు జెండా కంచు కోటలో ఎన్నిక ఏకపక్షమేనా.!

- టీడీపీ ఆవిర్భావం తర్వాత 9 సార్లు ఎన్నికలు
- 6 సార్లు టీడీపీదే విజయం
- బోణీ కొట్టని వైసీపీ
- వంశీ అవినీతి.. అరాచకాలతో విసిగిన జనం

కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య.. కాకలుతీరిన రాజకీయ దురంధరుడు కాకాని వెంకటరత్నం వంటి ఉద్దండులను గెలిపించిన నియోజకవర్గం గన్నవరం. టీడీపీ ఆవిర్భవించాక పసుపు జెండాకు కంచుకోటగా మారింది. మొత్తం 9 సార్లు పోటీ చేస్తే 6 సార్లు విజయకేతనం ఎగురవేసింది. రెండు పర్యాయాల నుంచి ఇక్కడ పాగా వేయాలని చూస్తున్న వైసీపీని ప్రజలు పట్టించుకోవడం లేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పరుగులు పెట్టిన అభివృద్ధి నేడు వైసీపీ పాలనలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు తయారైంది. పైగా గత ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలుపొందిన వంశీ ఈ ఎన్నికల్లో వైసీపీ తరపున బరిలో నిల్చున్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వ ఒంటెద్దు పోకడలను వ్యతిరేకిస్తూ టీడీపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిత్వాన్ని అందుకున్న యార్లగడ్డ వెంకట్రావు వంశీని ఓడించాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ మేరకు వాడవాడలా, ఇంటింటికీ తిరుగుతూ ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు.

విజయవాడ - ఆంధ్రజ్యోతి: 1955లో ఏర్పడిన గన్నవరం నియోజకవర్గం నుంచి ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. అవిభక్త కమ్యూనిస్టు పార్టీ తరపున రెండు సార్లు, సీపీఎం తరపున ఒకసారి ఆయన గెలిచారు. ముసునూరు రత్నబోస్, దాసరి బాలవర్ధనరావు, వల్లభనేని వంశీమోహన్ రెండేసి సార్లు, వెలివెల సీతారామయ్య, కాకాని వెంకటరత్నం, టీఎస్ ఆనందబాయి, ఎం.బాలకృష్ణారావు, గద్దె రామ్మోహన్, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఒక్కోసారి గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థులను గెలిపించడంలో గన్నవరం నియోజకవర్గ ప్రజలది ప్రత్యేక పంథా. ప్రస్తుతం విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహనరావు, సీనియర్ రాజకీయ నేత ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఈ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచారు. అలాంటి నియోజకవర్గంలో నేడు విద్వేష రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. టీడీపీ జెండాతో గెలిచి వైసీపీ పంచన చేరిన వంశీ ఈ విద్వేష రాజకీయాలకు నాంది పలికారు. ప్రతిపక్ష నేత కుటుంబ సభ్యులను మహిళలని కూడా చూడకుండా బూతులు తిట్టడం.. వారి వ్యక్తిత్వాన్ని హననం చేసేలా వ్యాఖ్యలు చేయడం.. ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలపైన... ఆ పార్టీ నేతలపైన దాడులకు తెగబడటం వంటి దిగజారుడు రాజకీయాలకు వంశీ హయాంలోనే బీజాలు పడ్డాయి. ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా వల్లభనేని వంశీ బరిలో ఉంటే యార్లగడ్డ వెంకట్రావు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలంలోని కొన్ని ప్రాంతాలు (అంబాపురం, పిర్యాదీ నైనవరం, పాతపాడు, నున్న, ఎనికేపాడు, నిడమానూరు, డోన్ ఆత్కూరు, గూడవల్లి, ప్రసాదంపాడు, రామవరప్పాడు) ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత 9 సార్లు ఎన్నికలు జరిగితే 6 సార్లు టీడీపీని గెలిపించిన చరిత్ర నియోజకవర్గ ప్రజలది. మరో రెండు సార్లు స్వతంత్ర్య అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. మొత్తం మీద ఒక్కసారి మాత్రమే కాంగ్రెస్ గెలవగా, వైసీపీ అసలు బోణీయే చేయలేదు. ఓ రకంగా గన్నవరం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట లాంటిది.



దొంగల దోపిడీ..

ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో మైనింగ్ మాఫియా చెలరేగిపోయింది. పోలవరం కాల్వ కట్టలు, బ్రహ్మయ్యలింగం చెరువు మట్టిని వంశీ అనుచరులు దోచుకున్నారు. కోట్లాది రూపాయల విలువైన మట్టి, గ్రావెల్‌ను తవ్వి సొమ్ము చేసుకున్నారు. ప్రభుత్వ భూముల కబ్జాలతో చెలరేగిపోయారు. అభివృద్ధి పూర్తిగా అటకెక్కింది. ఇవన్నీ వంశీకి ప్రతికూలంగా మారనున్నాయి. మరోవైపు యార్లగడ్డ వెంకట్రావుపై ప్రజల్లో సానుభూతి ఉంది. అవినీతికి దూరంగా ఉంటారన్న పేరుంది. గత ఎన్నికల్లో ఓటమిపాలైనా నియోజకవర్గాన్ని వీడకుండా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ వచ్చారు. ఇవన్నీ వెంకట్రావుకు సానుకూల అంశాలు. నియోజకవర్గంలో టీడీపీ సానుభూతిపరులు అధికంగా ఉండటంతో ఈసారి వెంకట్రావు గెలుపు నల్లేరు మీద నడకేనని విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో వంశీ గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. దొంగ ఇళ్ల పట్టాలతోను, దోచుకున్న డబ్బులు వెదజల్లుతూ గెలుపు కోసం ఆపసోపాలు పడుతున్నారు.

గన్నవరం నియోజకవర్గ విజేతలు వీరే..

సం..	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ
1955	పుచ్చలపల్లి సుందరయ్య	సీపీఐ	వెలివెల సీతారామయ్య	కాంగ్రెస్
1962	పుచ్చలపల్లి సుందరయ్య	సీపీఐ	కేఎస్ ప్రకాశరావు	కాంగ్రెస్
1967	వెలివెల సీతారామయ్య	కాంగ్రెస్	మానికొండ సూర్యావతి	సీపీఎం
1968 (ఉ.ఎ)	కాకాని వెంకటరత్నం	కాంగ్రెస్	ఎ.శ్రీమన్నారాయణ	సీపీఎం
1972	టీఎస్ ఆనందబాయి	కాంగ్రెస్	ఎ.శ్రీమన్నారాయణ	సీపీఎం
1978	పుచ్చలపల్లి సుందరయ్య	సీపీఎం	డా.లంక వెంకటేశ్వరరావు	కాంగ్రెస్
1983	ముసునూరు రత్నబోస్	టీడీపీ	కొమ్మినేని శేషగిరిరావు	కాంగ్రెస్
1985	ఎం.బాలకృష్ణారావు	టీడీపీ	కేపీ రెడ్డయ్య	కాంగ్రెస్
1989	ముసునూరు రత్నబోస్	కాంగ్రెస్	ఎం.బాలకృష్ణారావు	టీడీపీ
1994	గద్దే రామ్మోహనరావు	స్వతంత్ర	దాసరి వెంకటబాలవర్ధనరావు	టీడీపీ
1999	దాసరి వెంకట బాలవర్ధనరావు	టీడీపీ	ముద్దరబోయిన వెంకటేశ్వరరావు	కాంగ్రెస్
2004	ముద్దరబోయిన వెంకటేశ్వరరావు	స్వతంత్ర	దాసరి వెంకట బాలవర్ధనరావు	టీడీపీ
2009	దాసరి వెంకట బాలవర్ధనరావు	టీడీపీ	ముద్దరబోయిన వెంకటేశ్వరరావు	కాంగ్రెస్
2014	వల్లభనేని వంశీమోహన్	టీడీపీ	డాక్టర్ దుట్టా రామచంద్రరావు	వైసీపీ
2019	వల్లభనేని వంశీమోహన్	టీడీపీ	యార్లగడ్డ వెంకట్రావు	వైసీపీ

కీలక నియోజకవర్గం

కృష్ణాజిల్లాలో గన్నవరం కీలక నియోజకవర్గంగా ఉంది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఇక్కడే ఉంది. ఎయిర్‌పోర్టుకు సమీపంలోనే హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ పార్క్, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ వారి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ, డెంటల్ కాలేజీ ఉన్నాయి. ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. విజయ డెయిరీ ఇటీవల ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన యూనిట్ కూడా ఈ నియోజకవర్గంలోనే ఉంది. వీటితోపాటు టూల్ డిజైనింగ్‌కు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌టీటీఎఫ్ ఇన్‌స్టిట్యూట్, అంపాపురంలో కృష్ణా జిల్లా లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీ డ్రైవింగ్ స్కూల్, వీరపనేనిగూడెంలో ఇండస్ట్రియల్ పార్క్, మల్లవల్లిలో మెగా ఫుడ్‌పార్క్, మోడల్ ఇండస్ట్రియల్ పార్క్ వంటి ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి.

ఎందరో ప్రముఖులు..

నియోజకవర్గం నుంచి ఎందరో ప్రముఖులున్నారు. రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దొండపాటి సాంబశివరావు స్వగ్రామం గొల్లనపల్లి. పదో తరగతి వరకు ఇక్కడే జెడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న ఆయన ఆ తర్వాత సివిల్స్ రాసి ఐఏఎస్ అయ్యారు. కలెక్టర్‌గా పలు జిల్లాల్లో పనిచేశారు. కోనేరు రంగారావు భూ సంస్కరణల సిఫార్సుల కమిటీలోనూ ఆయన పనిచేశారు. టీటీడీ ఈవోగా అందరికీ సుపరిచితమయ్యారు. సీఎంవో కార్యాలయంలో పనిచేసిన మరో ఐఏఎస్ అధికారి రాజమౌళిది ఆత్కూరు గ్రామం. గన్నే వెంకట్రావు.. ఈయన మాజీ అధ్యాపకులు, ఆర్థిక విశ్లేషకులు. కాట్రగడ్డ రవీంద్ర.. ఈయన కూడా మాజీ అధ్యాపకులు, ఉచిత ఇంగ్లీషు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ పేరుపొందారు. జుజ్జవరపు బసవయ్య.. ఈయన జాతీయ డప్పు కళాకారుడు. డప్పులపై వివిధ రకాల శబ్దాలను సృష్టించడంలో దిట్ట.



భలే చిత్రం

తల్లీ.. రెండు బోండావివ్వమ్మా..!

అదే చేత్తో సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు కూడా వేయమ్మా..

ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ.. వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ ప్రచారాన్ని వేగవంతం చేశారు. ఉదయం 7 గంటల నుంచే తమ మందీ మార్బలంతో పార్టీ జెండాలు చేబూని రోడ్లపైకి వస్తూ కనిపించిన ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నగరంలో ఎండలు అల్లాడిస్తున్నా వెనక్కి తగ్గకుండా తమ ప్రచారాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు తన ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశారు. ఉదయం పూట ఓ టిఫిన్ బండి వద్ద ఆగి టిఫిన్ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు చేపట్టే సంక్షేమ పథకాలను ఆమెకు వివరించారు. మరోవైపు పార్టీ కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో డ్యాన్సులు చేస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీ గాల్లో కలిసిపోవడం తప్పదని, తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని వారు ఆకాంక్షిస్తున్నారు. బొండా ఉమాతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడుగుతున్నారు. ప్రచార వాహనంలో వినిపించే పార్టీ గీతాలకు అనుగుణంగా వారు లయబద్ధంగా డ్యాన్సులు చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే పనిలో పడ్డారు.



జెండా మోయడానికి సిద్ధం!

- ఏ పార్టీ అన్నది అనవసరం
- కూలీలే కార్యకర్తలుగా..
- అన్ని పార్టీల్లోనూ పెరుగుతున్న రాజకీయ కూలీలు

గుణదల: వేసవి వచ్చిందంటే సహజంగా నిర్మాణ రంగంలో పనులు వేగంగా జరుగుతుంటాయి. ఈపనులపై ఆధారపడి జీవించేవారికి డబ్బుకు కొరత ఉండదు. పలు శీతల పానీయాల కంపెనీల్లో సైతం వేసవిలో పనులు ఎక్కువగా ఉంటుండటంతో పర్మనెంట్‌తో పాటు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకుని పనులు చేయించుకుంటారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు రావడంతో కూలీపనులపై ఆధారపడి జీవించే వారంతా రాజకీయ నేతల వెంట తిరిగేందుకు ఆసక్తి కనబరుస్తున్నా రు. ఏ పార్టీ నాయకుడన్నది ముఖ్యం కాదు డబ్బులు ఎంత ఇస్తారు.. రాత్రికి చేతిలో మందుబాటిల్ పెడతారా లేదా..? పగలు తిండి ఖర్చులు ఇస్తారా లేదా అన్నది మా త్రమే వారు ఆలోచిస్తున్నారు. అలా ఇచ్చేవారికే జైకొట్టడమే తరువాయి. కూలీ పనులకు వెళ్లేవారిలో చాలామంది ఈ తరహా పనికి సిద్ధపడుతుండటంతో రాజకీయ నేతల పనిమరింత సులభమైంది. టికెట్ తెచ్చుకునే ముందు అధిష్టా నం వద్ద మంది బలం చూపించుకోవడం మొదలు, ఇంటింటికీ ఎన్నికల ప్రచారానికి, నామినేషన్ వేసేటప్పుడు మంది మార్బలంతో ర్యాలీగా వెళ్లడానికి, ఆయా పార్టీల అధినేతలు వచ్చినప్పుడు చేసే హంగామా.. ఇలా ఒకటేంటి అనేక సందర్భాల్లో కూలీలే కార్యకర్తల్లా తయారైపోతున్నారు. మార్చి, ఏప్రిల్, మే వరకు ఇలా కూలీలకు నేతలే అండదండగా నిలుస్తుంటారు. డబ్బుకు డబ్బు, తిండికి తిండి, సాయంత్రానికి చేతిలో మందు బాటిల్. ఇక ఏ రాజకీయ పార్టీ అయితేనేం అన్న ఆలోచనలో కూలీలంతా రాజకీయ నేతల నివాసాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

కూలీల కొరతతో నత్తనడకన పనులు

భవన నిర్మాణ రంగంపై ఆధారపడే కూలీలంతా సహజంగా నగరంలోని బెంజిసర్కిల్, ఇబ్రహీంపట్నం రింగ్, రామవరప్పాడు వంతెన సెంటర్ ఇలా పలుచోట్ల పనికి వెళ్లేందుకు సిద్ధమై పని ఇచ్చేవాళ్ల కోసం ఎదురు చూస్తుంటారు. అలాంటిది బెంజిసర్కిల్, ఇబ్రహీంపట్నం, రామవరప్పాడు వంతెన సెంటర్ల వద్ద కూలీ పనులకు వెళ్లేవారే కంటికి కనిపించడం లేదు. కూలీ పనులు చేయడానికి అంతగా ఆసక్తి కనబర్చకపోవడంతో నగరంలో నిర్మాణ రంగంలో పనులు దాదాపు నిలిచిపోయాయనే చెప్పవచ్చు.

అందరి చూపు రాజకీయ ఉపాధిపైనే..

నేతలంతా ఎన్నికల ప్రచారానికి వెళ్లడానికి ఎండ లేని సమయం చూసుకుని బయ లుదేరుతున్నారు. దీంతో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో రాజకీయ నేతల వెంట వెళ్లడం వల్ల కూడా ఎండ దెబ్బ తక్కువగా ఉంటుందన్న ఆలోచనతో కూలీల చూపంతా రాజకీయ ఉపాధి పైనే ఎక్కువ. ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించడానికి వాహనాలు ఏర్పాటు చేస్తుండటంతో మరింత సౌలభ్యంగా ఉంటుంది.



ఒకే కుటుంబం.. ముగ్గురు ఎమ్మెల్యేలు..!

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గుడివాడ నియోజకవర్గానికి ఎమ్మెల్యేలుగా వ్యవహరించారు. అది కేవలం రావి కుటుంబానికే సాధ్యమైంది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 1983, 1985 ఎన్నికల్లో గుడివాడ నుంచి గెలిచి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్టీఆర్ గుడివాడను వదులుకోవడంతో 1985లో జరిగిన ఉప ఎన్నికలు, 1994 సాధారణ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా రావి శోభనాద్రిచౌదరి గెలుపొందారు. 1999లో రావి హరిగోపాల్ (టీడీపీ) నుంచి గెలుపొంది ప్రమాణస్వీకారం చేయకుండానే రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన సోదరుడు రావి వెంకటేశ్వరరావు 2000లో జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపొందారు. ఇలా ఒకే కుటుంబం నుంచి తండ్రి, ఇద్దరు కొడుకులు ముగ్గురూ ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించడం విశేషం.



నందమూరి కుటుంబానికీ సాధ్యం కాలేదు

అన్న ఎన్టీఆర్ గుడివాడ నుంచి 2 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. కానీ ఆయన కుమారుడు నందమూరి హరికృష్ణ 1999లో అన్న తెలుగుదేశం పార్టీ తరుపున పోటీ చేసి పరాజయం పాలయ్యారు.

పాములలంక బ్రిడ్జి నిర్మించాకే ఓట్లడుగుతానన్న

ఎమ్మెల్యే కైలే ఎక్కడ?

- గత టీడీపీ ప్రభుత్వ పనులను నిలిపేసిన వైసీపీ ప్రభుత్వం
- రివర్స్ టెండరింగ్ అంటూ ఐదేళ్లుగా సాగతీత
- ఓట్లు అడిగేందుకు ఎమ్మెల్యే పాములలంక వస్తే నిలదీసేందుకు ఎదురుచూస్తున్న గ్రామస్థులు

పాములలంక వెళ్లేందుకు కృష్ణానదీపాయలో బ్రిడ్జి నిర్మిస్తా.. ఆ తరువాతే ఓట్లు అడిగేందుకు వస్తా అంటూ బీరాలు పలికిన ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఎక్కడంటూ ఆ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మూడేళ్ల క్రితం జరిగిన ఓ గ్రామసభలో ఎమ్మెల్యే కైలేను బ్రిడ్జి నిర్మాణం గురించి అక్కడి ప్రజలు అడిగారు. బ్రిడ్జి నిర్మించే బాధ్యత తనదేనని,ఆ తరువాతే ఇక్కడికి ఓట్లు అడిగేందుకు వస్తానని విస్పష్టంగా ప్రకటించారు. కానీ ఇంతవరకు టెండర్లు కూడా పిలవలేదు. మళ్లీ ఎన్నికలు రానే వచ్చేశాయి. మరి ఎన్నికల ప్రచారానికి అనిల్‌కుమార్ పాములలంకకు వస్తారా.. లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ వస్తే గట్టిగా నిలదీసేందుకు అక్కడి ఓటర్లు రెడీగా ఉన్నారు. రివర్స్ టెండరింగ్‌కు వెళ్లకుంటే నాలుగేళ్ల క్రితమే బ్రిడ్జి నిర్మాణపనులు పూర్తయ్యేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.- తోట్లవల్లూరు





కృష్ణానదీ పాయ వద్ద వల్లభనేని కనస్ట్రక్షన్స్ చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు (ఫైల్‌ఫొటో)

పాములలంక వెళ్లేందుకు కృష్ణానదీపాయలో బ్రిడ్జి నిర్మాణం ఎన్నికల నినాదంగా మారిపోయింది. 2014 నుంచి 2024 వరకు మూడు ప్రభుత్వాలు మారినా ఈ బ్రిడ్జి నిర్మాణానికి నోచుకోలేకపోయింది. 2014లో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులు రూ.13.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే డీవై దాస్ కరకట్టపై శంకుస్థాపన చేసి దీన్ని పూర్తి చేయించే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. కొన్నాళ్లకే ఎన్నికలు రావటం టీడీపీ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగింది. ఆ తరువాత అప్పటి టీడీపీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన కృషితో నాటి సీఎం చంద్రబాబు నాయుడు రూ.30 కోట్లు నిధులు మంజూరు చేశారు. వల్లభనేని కనస్ట్రక్షన్స్ సంస్థ టెండర్ దక్కించుకుంది. చీఫ్ ఇంజనీర్ (పీఆర్) డీ రవీంద్ర సారథ్యంలో బ్రిడ్జి నమూనా తయారు చేసి నదీపాయలో పిల్లర్ల నిర్మాణానికి మార్కింగులు కూడా ఇచ్చారు. అనేకమంది ఇంజనీర్లు వచ్చి రైతుల నుంచి భూ సేకరణ పనులు చేపట్టారు. 2018 డిసెంబర్‌లో బ్రిడ్జి నిర్మాణ సామగ్రిని, యంత్రాలను వల్లభనేని కనస్ట్రక్షన్ సంస్థ పాములలంక రేవుకు చేర్చింది. షెడ్లు నిర్మించి కార్మికులను తీసుకొచ్చారు. ఇలా 2019 మార్చి వరకు పనులు చేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావటంతో నిర్మాణ పనులకు బ్రేక్ వచ్చింది. 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో బ్రిడ్జి నిర్మాణానికి అధికార పార్టీ పెద్దలు మోకాలడ్డారు. 2019 సెప్టెంబర్ 10న తోట్లవల్లూరు ఎంపీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రెస్‌మీట్ పెట్టి పాములలంక బ్రిడ్జిపై రివర్స్ టెండరింగ్‌కు వెళుతున్నామని ప్రకటించారు. దీంతో వల్లభనేని కనస్ట్రక్షన్స్ సంస్థ తట్టాబుట్ట సర్దేసుకుని వెళ్లిపోయింది. కొన్నాళ్లకు తాను సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డిని కలిసి రూ.30 కోట్లు మంజూరు చేయించానని, పంచాయతీరాజ్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులిచ్చారని, త్వరలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడతామని వెల్లడించారు. దాంతో పాములలంకలో వైసీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే చిత్రపటానికి పాలభిషేకం కూడా చేశారు. అయితే ద్వివేది ఇచ్చిన ఉత్తర్వులు టీడీపీ హయాంలో మంజూరైన ఎస్సీ కార్పొరేషన్ నిధులు కొనసాగిస్తూ ఇచ్చారే తప్ప రివర్స్ టెండరింగ్ అంటూ లేదు ఏమీ లేదు. దీంతో ప్రజలు అవాక్కయ్యారు. ఈ మాత్రం దానికి పనులు ఆపడం దేనికంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజలను మోసగిస్తున్నారు.. శీలం రాముడు



పాములలంక బ్రిడ్జిని గత మూడు ప్రభుత్వాలు నిర్మించలేక పోయాయి. వరదలు వస్తే ప్రజలు ప్రమాదకరమైన పడవ ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. ఒక ప్రభుత్వం మంజూరు చేసిన వర్కుని మరో ప్రభుత్వం కొనసాగించకపోవటమే ఈ దుస్థికి కారణం. ఈ నేతలతో మోసపోతూనే ఉన్నాం.

99% మోసం



» హామీల్లో 99శాతం నెరవేర్చామన్న జగన్
» హోదా సహా పెద్ద హామీలన్నీ ఒక్క శాతమేనట

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"మనందరి ప్రభుత్వం 99శాతం హామీలు అమలుచేసింది. మేనిఫెస్టోలో పెట్టిన వాటిలో దాదాపుగా అన్నీ పూర్తిచేశాం. అక్కడక్కడ చిన్నాచితక హామీలు మాత్రమే చేయలేకపోయాం. మన ప్రభుత్వం వల్ల అందరికీ మేలు జరిగింది".. 2019 ఎన్నికల మేనిఫెస్టోపై జగన్ మాటిదీ. ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలుచేసి చూపించామని ఘనంగా ప్రకటించుకున్నారాయన. కానీ ఆ 99శాతం లెక్క ఎలా తీశారు? ఏ హామీకి ఎంత వెయిటేజీ ఇచ్చారు? ఆ ఒక్కశాతంలోనే మహిళలకు చేసిన ప్రధాన వాగ్దానం.. మద్యనిషేధం ఉంది. యువతకు చెప్పిన మెగా డీఎస్సీ భరోసా ఉంది. నిజానికి, ఇలాంటి హామీలే 2019 ఎన్నికల్లో జగన్‌కు అధికారాన్ని కట్టబెట్టాయి. అయితే, అంత పెద్ద హామీలను జగన్ చిన్నవిగా మార్చేశారు. ఒక్కో హామీకి ఒక్క శాతం కూడా తన అంచనాలో వెయిటేజీ ఇవ్వలేదు. మొత్తం కలిపినా కేవలం ఒక్క శాతమేనని, అసలు అవి కూడా ఒక హామీలేనా? అన్నట్టు కూరలో కరివేపాకులా తీసిపారేశారు.

అమలు చేసిన 99శాతం ఏంటి?

వైసీపీ ఇచ్చిన హామీల్లో నెరవేర్చిన వాటికంటే నెరవేర్చనవే ఎక్కువ ఉన్నాయి. ఆ నెరవేర్చినవి కూడా పెద్దగా ప్రభుత్వంపై భారం పడనివే. తెలుగుదేశం ప్రభుత్వంలో సామాజిక పెన్షన్లను ఒకేసారి రూ.వెయ్యి పెంచితే, జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో నాలుగు విడతలుగా రూ.వెయ్యి పెంచింది. అది కూడా చివరి ఏడాది వరకూ పెంచుతూనే ఉంది. ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం ఉండని అర్చకులకు రిటైర్‌మెంట్ విధానాన్ని ఈ ప్రభుత్వం రద్దుచేసింది. ఆర్టీసీలో ఎక్కువ ప్రయోజనాలు పొందే కార్పొరేషన్ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి వారికి ఇచ్చే ఆర్థిక ప్రయోజనాలను కుదించింది. చేయూత, కాపునేస్తం, అమ్మఒడి పథకాలను ఐదేళ్లు ఇస్తామని హామీ ఇచ్చి, నాలుగేళ్లు ఇచ్చి చేతులు దులుపుకొంది. కేంద్రం ఇచ్చే రూ.6వేలతో కలిపి రైతుభరోసా అమలుచేస్తోంది. 2.3లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని, కేవలం 5వేల ఉద్యోగాలు ఇచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ వంద శాతం ఇస్తామని హామీ ఇచ్చి, ఏటా మూడు త్రైమాసికాలు పెండింగ్ పెడుతోంది. వసతి దీవెన నగదు ఏటా రెండు విడతలకుగాను ఒక్క విడతే ఇచ్చింది. ఏటా 5లక్షలు చొప్పున 25లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి, ఐదేళ్లలో 5లక్షల ఇళ్లు కూడా కట్టలేకపోయింది. ఇలా ఏ హామీని సక్రమంగా అమలుచేయని జగన్ ప్రభుత్వం 99శాతం హామీల అమలు అని ఎలా ప్రకటించుకుందో ఎవరికీ అంతుపట్టడం లేదు. పోనీ జగన్ చెప్పినట్లుగా 99శాతం హామీలు నెరవేర్చారు అనుకుంటే అమలుచేసిన హామీల్లో దేనికెంతో జగన్ స్పష్టంగా చెప్పి ఉండాల్సింది. అలా చెప్తే అసలు గుట్టు బయటపడుతుంది కాబట్టే 99శాతం అని పాట పాడుతున్న ఆయన వాటిలో చేసినవేంటి అనేది మాత్రం చెప్పడం లేదు.

చిన్నబోయిన మద్య నిషేధం



సంపూర్ణ మద్య నిషేధం హామీ 2019 ఎన్నికల్లో అత్యంత కీలకంగా పనిచేసింది. మద్యం లేకుండా చేస్తానన్న జగన్ హామీ మహిళలను ఆకట్టుకుంది. మద్యంతో కుటుంబాలు ఛిద్రమౌతున్న నేపథ్యంలో దాని నుంచి బయటపడొచ్చని లక్షలాది మంది మహిళలు ఆశించారు. అలాంటి హామీని అధికారంలోకి రాగానే జగన్ తుంగలో తొక్కారు. ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేపట్టి నిషేధిస్తుందని ప్రకటించిన ఆయన.. దశల వారీగా అమ్మకాలు పెంచారు. ఉమ్మడి ఏపీలోనూ లేనివిధంగా 1.24లక్షల కోట్ల మద్యాన్ని విక్రయించిన తొలి సీఎంగా రికార్డుకెక్కారు. మద్యనిషేధం చేశాకే ఓట్లు అడుగుతానన్న జగన్ మాటతప్పి, మళ్లీ ఓట్లు అడుగుతున్నారు. ఇప్పుడు ఈ హామీని అతి చిన్న హామీగా తీసిపారేశారు. అసలు ఇది హామీనే కాదన్నట్టుగా ఒక శాతంలో పడేశారు.

మొత్తం జీతాలు ఇస్తున్నారా?

ఏపీఎస్ఆర్టీసీ సిబ్బంది 2020 జనవరి నుంచి విలీనమైనా 2022 సెప్టెంబరు నుంచే 49 వేల మందికి ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు వస్తున్నాయి. అయితే ఆర్టీసీ ఆదాయం నుంచి సుమారు రూ.125 కోట్లు ప్రతినెలా ప్రభుత్వం తీసుకుంటోంది. సిబ్బంది జీతాలకు నెలకు రూ.285 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఆ రూ.125 కోట్లు పోను ప్రతి నెలా రూ.160కోట్లు మాత్రమే చెల్లిస్తోంది. అయితే ప్రతినెలా 300 కోట్లు చొప్పున ఏడాదికి 3,600 కోట్లు తానే భరిస్తున్నట్లు జగన్ చెప్పారు. 'మీరిచ్చేది ఎక్కువ చేసి చెబుతారు. మా నుంచి తీసుకునేది కూడా చెప్పాలిగా. దీన్ని అబద్ధం గాక మరేమంటారు' అంటూ ఆర్టీసీ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

ఒక్క వారంలో ఓపీఎస్ అన్నావే!



'అధికారంలోకి వచ్చాక ఒక్క వారంలో సీపీఎస్ రద్దు చేస్తానన్నా. దాని గురించి నాకు వదిలేయండి. ఒక్క వారంలో అయిపోతుంది' అని 2019 ఎన్నికల సమయంలో బహిరంగంగా అనేకసార్లు ప్రకటించిన జగన్ దానిపై మాట తప్పారు. నాలుగున్నరేళ్లు దానిపై మౌన వ్రతం చేశారు. ఇక ఎన్నికలు వస్తున్నాయన్న తరుణంలో పాత పెన్షన్ విధానం(ఓపీఎస్) స్థానంలో గ్యారెంటీడ్ పెన్షన్ విధానం(జీపీఎస్) తెరపైకి తెచ్చారు. ఓపీఎస్సే కావాలని రోడ్డెక్కిన ప్రభుత్వ ఉద్యోగులపై నిర్దాక్షిణ్యంగా కేసులు పెట్టించారు. ఓపీఎస్ డిమాండ్‌తో విజయవాడలో భారీ ర్యాలీ చేసిన ఉద్యోగ సంఘాల నేతలపై ఉక్కుపాదం మోపారు. చివరికి 'అవగాహన లేక అప్పట్లో ఓపీఎస్ హామీ ఇచ్చాం' అని ఒక్క మాటతో తేల్చేశారు. లక్షలాది మంది ఉద్యోగులకు ఇచ్చిన ఓపీఎస్ హామీని ఒక్క శాతంలో ఒక మూలన పడేశారు.

జాబ్ కేలెండర్ ఎక్కడ?

గత ఎన్నికల్లో మరో ఆకర్షణీయమైన హామీ జాబ్ కేలెండర్. ఏటా జనవరి 1న జాబ్ కేలెండర్ విడుదల చేస్తామని మేనిఫెస్టోలో జగన్ పెట్టారు. కానీ ఐదేళ్లలో ఒక్కసారి కూడా జాబ్ కేలెండర్ విడుదల కాలేదు. ఒక ఏడాది జూన్‌లో జాబ్ కేలెండర్ విడుదల చేసినా దానిని పూర్తిచేయలేదు. కనీసం ఎన్నికల సంవత్సరంలోనూ జాబ్ కేలెండర్ ప్రస్తావన తేలేదు. ప్రభుత్వంలో 2.3 లక్షల ఖాళీలు భర్తీ చేస్తానన్న జగన్ అధికారంలోకి వచ్చాక ఏపీపీఎస్సీ ద్వారా ఇచ్చిన ఉద్యోగాలు కేవలం 5వేలు. గ్రూప్2 ఉద్యోగం ఒక్కటీ ఇవ్వని తొలి ప్రభుత్వం కూడా ఇదే. ఇక మెగా డీఎస్సీ వేసి 23వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తానన్న జగన్... ఎన్నికల ముందు హడావిడిగా 6,100 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వగా, కోడ్ వల్ల అది ఆగిపోయింది. లక్షలాది మంది నిరుద్యోగులకు సంబంధించిన ఇంత పెద్ద హామీని జగన్ ఆ నెరవేర్చని ఒక్క శాతం హామీల్లో పెట్టి, ఇది హామీయే కాదన్నట్టుగా అప్రాధాన్యంగా మార్చేశారు.

25లక్షల ఇళ్లు ఎక్కడ కట్టావు?

'ఐదేళ్లలో 25లక్షల పక్కా ఇళ్లు కట్టిస్తాం. ఒక్కో కుటుంబానికి రూ.2లక్షల నుంచి రూ.5లక్షల లబ్ధి చేకూరుస్తాం' అని 2019 మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన వైసీపీ అందులో ఐదోవంతు కూడా నెరవేర్చలేకపోయింది. ఐదేళ్లలో పట్టుమని 5లక్షల ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తిచేయలేదు. ఎన్నికలకు ముందు ప్రభుత్వమే ఇళ్లు కట్టిస్తుందని చెప్పి, తర్వాత వృద్ధులకు మాత్రమే ప్రభుత్వం కట్టించి ఇస్తుందని, మిగిలినవారు ఎవరికి వారు కట్టుకోవాలని మాట మార్చింది. పలు పథకాల కింద కేంద్ర ప్రభుత్వమే పెద్దఎత్తున ఇళ్లు మంజూరుచేసినా వాటిని లబ్ధిదారులకు ఇచ్చి కట్టుకునేలా చేయడంలోనూ విఫలమైంది. ఇళ్ల స్థలాలు ఇచ్చి చేతులు దులుపుకొంది.

పోలవరం, ప్రత్యేక హోదా



రాష్ట్రానికి జీవనాడిగా భావించే పోలవరం ప్రాజెక్టు, రాష్ట్రం దిశ మార్చేస్తుందనుకున్న ప్రత్యేక హోదా హామీలను జగన్ అత్యంత చిన్న హామీలుగా మార్చేసి పక్కనపెట్టారు. పోలవరంపై అనేకసార్లు అసెంబ్లీ సాక్షిగా టార్గెట్లు ప్రకటించిన ఆయన చివరికి మాట తప్పారు. ఇక తమవల్ల కాదనుకున్నారో ఏమోగానీ ఎప్పటికి పూర్తిచేస్తామో నిర్దిష్టంగా చెప్పలేం అని ప్రకటించేశారు. ఇక ప్రత్యేక హోదాపై ప్రతిపక్ష నేతగా రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టిన అధికారంలోకి వచ్చిన జగన్.. రెండో రోజే కాడి వదిలేశారు.

జగన్ సార్.. మానవత్వం ఏమైంది?

» వీక్లీ ఆఫ్‌లు ఇస్తామని ప్రతిపక్షంలో హామీ
» అధికారంలోకి వచ్చాక ఖాకీలకు మస్కా
» జగన్ సర్కారు తీరుపై పోలీసులు రుసరుస

అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): 'పోలీసులకు ఒక్క రోజైనా సెలవు లేకపోతే ఎలా? 365 రోజులూ విధి నిర్వహణలోనే ఉంటే కుటుంబంతో గడిపేది ఎప్పుడు? కొంచెమైనా మానవత్వంతో ఆలోచించకపోతే ఎలా? మనందరి ప్రభుత్వం రాగానే వారంలో ఒక్కరోజు పోలీసులకు కచ్చితంగా సెలవు ఇచ్చి తీరుతాం' అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఖాకీలకే మస్కా కొట్టారు. వారంలో ఒక రోజు కానిస్టేబుల్ నుంచి సీఐ వరకూ సెలవు లభించేలా రాష్ట్ర పోలీసు శాఖ కమిటీ సిఫారసులను జిల్లాల ఎస్పీలకు 2019 చివర్లో పంపింది. రెండు, మూడు జిల్లాల్లో ఎస్పీలు అమలు చేయగానే పోలీసు అధికారుల సంఘం నుంచి సత్కారాలు, భజనలు చేయించుకున్న జగన్ 2020 మార్చి నుంచి తూచ్ అనేశారు. కరోనా లాక్‌డౌన్ ప్రభావంతో ఆ రెండు, మూడు జిల్లాల్లోనూ రద్దు చేయగా మిగిలిన ప్రాంతాల్లో అమలే కాలేదు. అసలు నిజం ఇది అయితే.. తాజా మేనిఫెస్టోలో పోలీసులకు వీక్లీ ఆఫ్‌లు ఇచ్చామంటూ అబద్ధాలు అచ్చేశారు. జగన్ అబద్ధాలు చెప్పడం పట్ల ఖాకీలు కారాలు, మిరియాలు నూరుతున్నారు. కొంచెమైనా మానవత్వం ఉందా? అని ప్రశ్నిస్తున్నారు.

అన్నీ తానే చేసినట్లుగా..!

» శ్రుతి మించిన జగన్ సొంత గొప్పలు
» చంద్రముఖి, వదల బొమ్మాళీ డైలాగులను ఏ మాత్రం పట్టించుకోని జనం
» తాడిపత్రి, కందుకూరు, వెంకటగిరిలో ప్రచార సభలు


అనంతపురం జిల్లా తాడిపత్రిలో సీఎం సభకు పలుచగా జనం

అనంతపురం, వెంకటగిరి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి)/ కందుకూరు: రాష్ట్రంలో ఇంతకుముందు ఉన్న ఏ ప్రభుత్వమూ చేయని విధంగా... అన్నీ తానే చేసినట్లుగా సీఎం జగన్ గొప్పలు పోయారు. సాధ్యంకాని హామీలతో చంద్రబాబు ఎన్నికల ప్రచారానికొస్తున్నారని, బాబును నమ్మడమంటే పులి నోట్లో తలకాయ పెట్టడమేనని, చంద్రముఖిని నిద్రలేపడమేనని.. వదల బొమ్మాళీ... వదల అంటూ ఆయన చెప్పిన డైలాగులకు జనం నుంచి స్పందన లేదు. దేవుడి దయతో గత మేనిఫెస్టోలో పెట్టిన 99 శాతం పథకాలు అమలు చేశామని అబద్ధాలు చెప్పుకొచ్చారు. ఆదివారం అనంతపురం జిల్లా తాడిపత్రి, నెల్లూరు జిల్లా కందుకూరు, తిరుపతి జిల్లా వెంకటగిరిలో జరిగిన సభల్లో ఆయన ప్రసంగాలు సొంత గొప్పలతో నిండిపోయాయి. 2.31 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశానని, మహిళా సాధికారతను తానే సాధించినట్లు గొప్పలుపోయారు. ఎన్డీయే కూటమిని 2014లో గెలిపిస్తే... ప్రత్యేక హోదా తీసుకురాలేదని అన్నారు.

హెలిప్యాడ్ వద్ద యువకుడి హల్‌చల్

ఇటీవల విజయవాడ ర్యాలీలో గులకరాయి ఘటన మరువకముందే తిరుపతి జిల్లా వెంకటగిరిలో సీఎం తిరుగుప్రయాణమవుతుండగా, హెలిప్యాడ్ వద్దకు ఓ యువకుడు దూసుకొచ్చాడు. గమనించిన పోలీసు అధికారులు అతడిని గట్టిగా పట్టుకున్నారు. హెలిప్యాడ్ నుంచి దూరంగా తీసుకొచ్చి బాంబ్‌స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జగన్‌తో సెల్ఫీ కోసం ఆయన ఉన్న హెలిప్యాడ్ వద్దకు పరుగు తీశానని పెంచలయ్య.. పోలీసులకు తెలిపినట్లు సమాచారం.

మండే ఎండలో.. నడి రోడ్డుపై...

జగన్ తాడిపత్రి పర్యటన... ప్రజల ఓపికకు పరీక్ష పెట్టింది. పట్టణ నడిబొడ్డున సభ ఏర్పాటు చేయడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. ట్రాఫిక్‌లో ఇరుక్కున్న వారి పరిస్థితి మరీ దయనీయం. మండే ఎండలో.. ఎటూ వెళ్లలేక నరకం చూశారు. జగన్ సభకు హాజరైన ఆ పార్టీ కార్యకర్తలు జగన్ ప్రసంగం మొదలుపెట్టగానే వెనుదిరిగిపోయారు. సీఎం సభను విజయవంతం చేయాలని మండలస్థాయి నాయకులకు రూ.30 లక్షలు ఎమ్మెల్యే అభ్యర్థి అందించినట్లు సమాచారం. ఇక కందుకూరులో పట్టణాన్ని పోలీసులు తమ చేతుల్లోకి తీసుకుని ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

'మహీధరన్న ఏడీ.. పిలుచు రండి!'

కందుకూరు సీటును వేరే వారికి కేటాయించడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే మహీధరరెడ్డి కొంతకాలంగా పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో కందుకూరు వచ్చిన జగన్‌ను మర్యాదపూర్వకంగా హెలిప్యాడ్ వద్ద కలిసి.. వెనుదిరిగారు. జగన్ కారు ఎక్కుతూ మహీధరరెడ్డి గురించి ఆరా తీశారు. ఆయన వెళ్లిపోయారని ఎవరో చెప్పడంతో కారు ఆపారు. మహీధరన్నను వెతికి తీసుకుని రావాలని తన సెక్యూరిటీని పరుగు పెట్టించారు. మొహమాటం మీద కారు ఎక్కిన మహీధర్‌తో 'మహీ ద గ్రేట్..' అని వ్యాఖ్యానించినట్లు విశ్వసనీయ సమాచారం. తాను ఏం గ్రేట్ అని మహీధరరెడ్డి అనగా 'అడగ్గానే టికెట్ త్యాగం చేసి పార్టీ విజయం కోసం కృషి చేస్తున్నావ'ని అన్నారట. 'బుర్రా (బుర్రా మధుసూదన్ యాదవ్, కందుకూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి) పికప్ అయ్యాడా' అని అడగ్గా, మహీధరరెడ్డి ముక్తసరిగా స్పందించారని సమాచారం.

కేతిరెడ్డి మనసు వెన్నట: తాడిపత్రి సిట్టింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట కటువవని, మనసు మాత్రం వెన్న అని సీఎం జగన్ తాడిపత్రి సభలో కితాబు ఇచ్చారు.

బిజినెస్

బ్యాంకు రుణాల జోరుకి కళ్లెం తప్పదు : ఎస్ అండ్‌పీ

న్యూఢిల్లీ: ప్రస్తుతం దేశం బలమైన వృద్ధిపథంలో ముందు కు సాగుతున్న క్రమంలో బ్యాంకుల రుణవృద్ధి, లాభదాయకత, ఆస్తుల నాణ్యత అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తెలిపింది. అయితే డిపాజిట్లు అదే వేగంలో వృద్ధి చెందకపోవడం వల్ల రుణవృద్ధికి బ్యాంక్‌లు కళ్లెం వేసుకోక తప్పని పరిస్థితి నెలకొన్నదని పేర్కొంది. 2024 ఆర్థిక సంవత్సరవంలో రుణవృద్ధి 16 శాతం ఉండగా కొత్త ఆర్థిక సంవత్సరంలో అది 14 శాతానికే పరిమితం కావచ్చునని అంచనా వేసింది. సుమారుగా అన్ని బ్యాంకుల రుణ-డిపాజిట్ నిష్పత్తి క్షీణించిందని సంస్థ డైరెక్టర్ నికితా ఆనంద్ అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	350	విజయవాడ	350
వరంగల్	352	గోదావరి	350
చిత్తూరు	453	విశాఖపట్నం	400
		దజను గుడ్లు రూ.48	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127	గోదావరి	133
వరంగల్	127	విజయవాడ	133
కరీంనగర్	127	గుంటూరు	135
మహబూబ్‌నగర్	127	ఒంగోలు	135
కర్నూలు	127	చిత్తూరు	130
విశాఖపట్నం	125		

ఎలాన్ మస్క్ ఆకస్మిక చైనా పర్యటన



ప్రధాని లీ కియాంగ్‌తో భేటీ

బీజింగ్: అమెరికన్ కుబేరుడు, టెస్లా కంపెనీ సీఈఓ ఎలాన్ మస్క్ ఆదివారం ఆకస్మికంగా చైనా సందర్శించారు. ఆయన చైనా ప్రధాని లీ కియాంగ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశం వివరాలు వెల్లడి కాలేదు. అయితే చైనా ప్రభుత్వానికి చెందిన భవనాలు, ఎగ్జిబిషన్ కేంద్రాల వద్ద టెస్లా కార్ల పార్కింగ్‌ను నిషేధిస్తూ విధించిన ఆంక్షలను తొలగించమని ఆయన చైనా ప్రధానిని కోరినట్టు సమాచారం. దీనికి తోడు స్వయం నియంత్రిత (అటానమస్) విద్యుత్ కార్లను చైనా మార్కెట్‌లో ప్రవేశపెట్టే విషయం, చైనాలో టెస్లా వ్యాపార విస్తరణ గురించి చర్చించినట్టు సిన్హువా వార్తా సంస్థ తెలిపింది. బిజీ షెడ్యూల్ పేరుతో గత ఆదివారం భారత పర్యటన రద్దు చేసుకున్న మస్క్ వారం తిరక్కుండానే ప్రైవేట్ విమానంలో చైనా పర్యటనకు వెళ్లడం విశేషం. 2020లో 700 కోట్ల డాలర్ల పెట్టుబడితో చైనాలోని షాంఘైలో టెస్లా ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేసింది. చైనా ప్రీమియం ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్‌లో టెస్లాది అగ్రస్థానం. అయితే ఇటీవల స్థానిక కంపెనీల నుంచి తీవ్ర పోటీ ఎదురవుతోంది. షాంఘైలో తయారయ్యే టెస్లా ప్రీమియం ఎలక్ట్రిక్ కార్ల ధరలు ఆరు శాతం తగ్గించినా, చైనా ఈవీ కంపెనీలతో పోటీపడలేకపోతోంది. దీంతో డ్రైవర్‌లేకుండా రోబోలు నడిపే మరింత అధునాతనమైన ఈవీలను టెస్లా చైనామార్కెట్‌లో ప్రవేశపెట్టి తన మార్కెట్‌ను కాపాడుకోవాలని భావిస్తున్నట్టు సమాచారం.

ఎఫ్ఐయూ తాజా అలర్ట్ సూచీలు జారీ

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్, ఉగ్రవాద చర్యలకు ఫైనాన్సింగ్ వంటి కార్యకలాపాలను అడ్డుకునేందుకు ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ) బరిలోకి దిగింది. పెట్టుబడి మార్కెట్లు, బీమా కంపెనీలు, ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ఇంటర్మీడియేటరీలు, క్రిప్టో సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా అక్రమ నిధులు తరలి వెళ్లడాన్ని నిలువరించేందుకు తాజా "అలర్ట్ సూచీ"లు విడుదల చేసింది. మనీలాండరింగ్ చర్యల నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద 2022-23లో జారీ చేసిన ఈ మార్గదర్శకాలను ఇటీవలే ప్రచురించారు. దీని కింద ఆర్థిక సంస్థలు, ఇంటర్మీడియేటరీలన్నీ అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించిన నివేదికలను (ఎస్‌టీఆర్) ఎఫ్ఐయూకి అందచేయాల్సి ఉంటుంది. ఎఫ్ఐయూ వాటిని విశ్లేషించి తగు కార్యాచరణ కోసం దర్యాప్తు, గుఢచర్య సంస్థలకు అందచేస్తుంది. ఈ అలర్ట్ సూచీలు స్టాక్ ఎక్స్ఛేంజిలు, డిపాజిటరీల వంటి మార్కెట్ మౌలిక వసతుల సంస్థలకు ఎదురయ్యే ముప్పు గురించి హెచ్చరిస్తూ ఉంటాయి.

మూడేళ్లలో రూ.3,000 కోట్ల పెట్టుబడి

అపోలో హాస్పిటల్స్

న్యూఢిల్లీ: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) వ్యాపార విస్తరణకు సిద్ధమవుతోంది. ఇందుకోసం వచ్చే మూడేళ్లలో రూ.3,000 కోట్లు ఖర్చు చేస్తామని కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) కృష్ణన్ అఖిలేశ్వరన్ చెప్పారు. ఏహెచ్ఈఎల్ అనుబంధ సంస్థ అపోలో హెల్త్‌కం ఈక్విటీలో 12.1 శాతం వాటా కోసం రూ.2,475 కోట్లు చెల్లించేందుకు అంతర్జాతీయ పీఈ సంస్థ అడ్వంట్ ఇంటర్నేషనల్ ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో రూ.890 కోట్లను ఏహెచ్ఈఎల్ వ్యాపార విస్తరణ కోసం, మరో రూ.860 కోట్లను అపోలో హెల్త్ అనుబంధ సంస్థ అపోలో 24/7 విస్తరణ కోసం వినియోగిస్తామని అఖిలేశ్వరన్ తెలిపారు. ఏహెచ్ఈఎల్‌కు అందే రూ.890 కోట్లను ఇతర హాస్పిటల్స్ కొనుగోలు లేదా ఏహెచ్ఈఎల్ విస్తరణ కోసం ఖర్చు చేస్తామన్నారు. అపోలో 24/7లో కీమెడ్ విలీనం పెద్ద మైలురాయి అన్నారు. దీంతో అపోలో ఫార్మసీల సంఖ్య 70,000కు పెరుగుతుందన్నారు.

భారత్‌కు భారీగా పెరిగిన చైనా ఎగుమతులు

న్యూఢిల్లీ: చైనా పెద్ద ఎత్తున తన సరుకులను భారత్‌లో కుమ్మరిస్తోంది. గత 15 సంవత్సరాలుగా చైనాకు మన ఎగుమతులు 1,600 కోట్ల డాలర్లు మించడం లేదు. అయితే ఇదే సమయంలో చైనా నుంచి మన పారిశ్రామిక వస్తువుల దిగుమతులు 7,030 కోట్ల డాలర్ల నుంచి 10.100 కోట్ల డాలర్లకు పెరిగినట్టు గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) తెలిపింది. ప్రస్తుతం మన దేశ పారిశ్రామిక వస్తువుల దిగుమతుల్లో చైనా వాటా 30 శాతం. పదిహేనేళ్ల క్రితం ఇది 21 శాతం మాత్రమే. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నా, చైనా నుంచి దిగుమతులు భారీగా పెరగడం విశేషం. ఇది మన ఆర్థిక వ్యవస్థకుగానీ, దేశ భద్రతకుగానీ ఏ మాత్రం మంచిది కాదని జీటీఆర్ఐ తెలిపింది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని చైనా దిగుమతులపై ఆధారపడడం తగ్గించుకునేందుకు వేరే దేశాల నుంచి దిగుమతుల కోసం ప్రభుత్వం, పారిశ్రామిక సంస్థలు దృష్టి పెట్టాలని జీటీఆర్ఐ సంస్థ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాస్తవ చెప్పారు.

22,725 పైన బుల్లిష్

(ఏప్రిల్ 29-మే 3 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 22420 (+273)

నిఫ్టీ గత వారం 22198-22625 పాయింట్ల మధ్యన కదలాడి 273 పాయింట్ల లాభంతో 22420 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22725 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

1 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22471, 22332, 22409, 22316 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 22725 బ్రేక్‌డౌన్ స్థాయి : 22125

నిరోధ స్థాయిలు: 22625, 22725, 22825 (22525 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 22225, 22125,

కన్సాలిడేషన్‌కు అవకాశం

స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశం ఉంది. ఇప్పటికే గరిష్ఠ స్థాయిలకు చేరిన సూచీలకు, ఆ స్థాయిలో నిలదొక్కుకునేందుకు బలం అవసరం. దీంతో కొంత కన్సాలిడేషన్ జరిగే అవకాశం కనిపిస్తోంది. క్యూ4 ఫలితాలతో బ్యాంకింగ్, ఫైనాన్స్ కంపెనీల షేర్లలో బుల్లిష్‌నెస్ ఉండొచ్చు. మదుపరులు అంతర్జాతీయ సంకేతాలను జాగ్రత్తగా గమనించాలి. యుద్ధం నేపథ్యంలో అప్రమత్తత తప్పనిసరి. నిఫ్టీకి ఈ వారం 22,500 వద్ద మద్దతు దొరికే అవకాశం ఉంది. అప్‌ట్రెండ్ కొనసాగినా 22,700 వద్ద రెసిస్టెన్స్ ఎదురు కావచ్చు.

ఈ వారం స్టాక్ రికమండేషన్స్

హావెల్స్ : ఈ స్టాక్‌కి అనేక సానుకూల అంశాలు కనిపిస్తున్నాయి. గత ఐదు రోజుల్లో సగటు వాల్యూమ్స్ మూడు రెట్లు పెరిగాయి. గతంలో నమోదైన రూ.1,591 ఆల్‌టైమ్ హైని కూడా బ్రేక్ చేసింది. రూ.1,640 వద్ద అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను క్రాస్ చేసింది. శుక్రవారం ఏకంగా 5.09 శాతం పెరిగి రూ.1,640 వద్ద ముగిసింది. రూ.1,680/1,729 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.1,630/1,610 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.1,600ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కోల్గేట్ పామోలివ్: నిఫ్టీతో పోలిస్తే ఈ కౌంటర్ మెరుగ్గా ట్రేడవుతోంది. డెలివరీ వాల్యూమ్స్ కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఈ కంపెనీ షేర్లు దీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతుండటం విశేషం. ఇటీవలే ఈ కంపెనీ షేర్లు రూ.2,815 వద్ద ఆల్‌టైమ్ హైని బ్రేక్ చేశాయి. క్యూ4 ఆర్థిక ఫలితాలు బాగుంటాయనే అంచనాలు, ఈ కౌంటర్‌కు మరో సానుకూల అంశం. శుక్రవారం 1.96 శాతం లాభంతో రూ.2,855 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్లో రూ.2,920/2,950 టార్గెట్‌తో రూ.2,850 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.2,810ని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

యాక్సిస్ బ్యాంక్: క్యూ4లో ఈ బ్యాంకు మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే రూ.5,362 కోట్ల నష్టాల నుంచి రూ.7,599 కోట్ల లాభం నమోదు చేసింది. మొండి బకాయిలు కూడా తగ్గాయి. నిఫ్టీతో పోలిస్తే గత ఏడాది కాలంలో యాక్సిస్ బ్యాంకు షేర్లే వేగంగా పెరిగాయి. జీవిత కాల గరిష్ఠ స్థాయి తర్వాత కన్సాలిడేషన్ జరిగి బ్రేకౌట్ స్థాయికి చేరింది. మదుపరులు రూ.1,190/1,225 లక్ష్యంతో రూ.1,120/1,100 వద్ద ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.1,080ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జీఎంఆర్ ఇన్‌ఫ్రా: గత రెండు వారాలుగా ఈ కౌంటర్లో మూమెంటమ్ కనిపిస్తోంది. స్వల్పకాలిక అడ్డంకిని కూడా అధిగమించింది. జీవిత కాల గరిష్ఠ స్థాయిని అధిగమించేందుకూ సిద్ధంగా ఉంది. నిఫ్టీతో పోలిస్తే జోరు ప్రదర్శిస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్స్ గణనీయంగా పెరిగాయి. సైడ్‌వేస్‌లో చలిస్తున్నప్పటికీ మదుపరులు ఈ స్టాక్‌ను వదులుకునేందుకు ఇష్టపడడం లేదు. రూ.95/106 లక్ష్యంతో మదుపరులు ఈ కౌంటర్లో రూ.88 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.85ని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇంజనీర్స్ ఇండియా: సుదీర్ఘ కాలంగా ఈ కంపెనీ షేర్లు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్నాయి. కౌంటర్లో దిద్దుబాటు దాదాపుగా ముగిసింది. ఇటీవల ఈ కౌంటర్లో డెలివరీ వాల్యూమ్స్ పెరుగుతున్నాయి.

గత వారం 6.67 శాతం లాభంతో రూ.236 వద్ద స్వల్పకాలిక అడ్డంకిని అధిగమించింది. రూ.265/290 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్లో రూ.235 వద్ద పొజిషన్లు తీసుకునే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.231ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

నిరోధ స్థాయిల్లో పరీక్ష

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్‌గానే ప్రారంభమైనా 22620 వద్ద కరెక్షన్‌లో పడింది. చివరికి గత వారం కన్నా 270 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల నడుమన ముగిసింది. టెక్నికల్‌గా గత రెండు నెలలుగా సైడ్‌వేస్ ధోరణిలో 22700, 21700 పరిధికే పరిమితమై ఉంది. ఇదిలా ఉండగా గత వారం మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1920 పాయింట్లు, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 700 పాయింట్లు లాభపడి జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో ఉన్నాయి. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ ఎగువకే ఉన్నప్పటికీ నిఫ్టీ మరోసారి జీవితకాల గరిష్ఠ స్థాయిలకు చేరువవుతోంది. ప్రపంచ మార్కెట్ల తీరును బట్టి ఈ వారంలో మార్కెట్ పాజిటివ్‌గానే ప్రారంభమై జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణిలో ప్రారంభమైతే నిరోధ స్థాయిలు 22500, 22650 వద్ద నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ఆ పైన మరో నిరోధం 22800. ఇక్కడ నుంచే మార్కెట్ గతంలో 1000 పాయింట్ల మేరకు కరెక్షన్‌కు లోనయింది. మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో నిలదొక్కుకోవాలి. మానసిక అవధి 23000.

బేరిష్ స్థాయిలు: నిరోధ స్థాయి 22500 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే బలహీనపడే ఆస్కారం ఉంటుంది. మద్దతు స్థాయి 22300. ఇక్కడ కూడా విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 22000.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం మైనర్ రికవరీ సాధించిన ఈ సూచీ 620 పాయింట్ల మేరకు లాభపడి 48200 వద్ద ముగిసింది. ఇప్పుడు ఇటీవల తాకిన గరిష్ఠ స్థాయిల్లో పరీక్ష ఎదుర్కొనేందుకు సమాయత్తం అవుతోంది. అయితే జీవితకాల గరిష్ఠ స్థాయి 49000 కన్నా చాలా దిగువన ఉంది. పాజిటివ్ ధోరణిలో ట్రేడయితే నిరోధ స్థాయి 48600 కన్నా పైన నిలదొక్కుకోవాల్సి ఉంది. ఆ పైన నిరోధం 49000. బలహీనపడితే దిగువన మద్దతు స్థాయిలు 48000, 47600.

పాటర్న్ : మార్కెట్ మధ్యకాలిక ఓవర్‌బాట్ స్థితిలో ఉంది. గత వారం 50 డీఎంఏ వద్ద కోలుకుంది. భద్రత కోసం 22650 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.


సోమవారం స్థాయిలు	
నిరోధం	22,500, 22,555
మద్దతు	22,400, 22,345

www.sundartrends.in

ఏపీ ఎన్నికల ప్రత్యేకం-2024

ప్రజా అజెండా

జన కేతనం






కౌంట్ డౌన్ 14 రోజులు

ఆంధ్రజ్యోతి
సోమవారం ◇ 29-4-2024

వ్యవసాయాన్ని పండుగ చేస్తామన్నారు. విత్తనం నుంచి విక్రయం వరకు రైతుకు ప్రతి దశలో తోడుగా ఉంటామన్నారు. ఆర్బీకేల ద్వారా రైతు ఇంటికే సేవలు అందిస్తామని చెప్పారు. కౌలు రైతులతో సహా ప్రతి రైతు కుటుంబానికీ పెట్టుబడి సాయమందిస్తామని నమ్మబలికారు. పంట నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ, మద్దతు ధర, గ్రామ స్థాయిలో శీతలీకరణ గిడ్డంగులు, సహకార డెయిరీల పునరుద్ధరణ, ఉచిత బోర్లు.. ఇంకా ఎన్నెన్నో చెప్పారు. జగన్ పాదయాత్రలోనూ, 2019 ఎన్నికల మేనిఫెస్టోలోనూ రైతులకు హామీలు కురిపించారు. అధికారంలోకి వచ్చాక రైతన్నలను నట్టేట ముంచారు. మద్దతు ధర లేదు. ఉచిత బోర్లు లేవు. పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం చెల్లించలేదు. రాయితీ పథకాలకు కత్తెర వేశారు. ఏ హామీని కూడా పూర్తిగా నిలబెట్టుకోలేదు. అరకొర సాయం అందిస్తూ గొప్పలు చెప్పుకోవడమే కానీ రైతన్నలను ఆదుకోవడం లేదు. జగన్ సర్కారు నిర్వాకంతో వ్యవసాయ రంగం కుదేలైంది. పెట్టుబడులు పెరిగాయి. అతివృష్టి, అనావృష్టితో రైతులు దెబ్బతిన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక ఎందరో రైతులు సాగుకు స్వస్తి చెప్తున్న పరిస్థితి. గత నాలుగేళ్లుగా ఏటా 10-15 లక్షల ఎకరాల సాగు తగ్గుతూ రాగా, ఈ ఏడాది తీవ్ర వర్షాభావం, తుఫాన్ దెబ్బకు ఏకంగా 40 లక్షల ఎకరాల్లో సాగు తగ్గింది. అయితే రైతుల కోసం ఐదేళ్లలో రూ.లక్షా 85 వేల కోట్లు ఖర్చు చేశామని గొప్పలు చెబుతున్నారు.

- ఎన్నికల ముందు ఎన్నో హామీలు.. అధికారంలోకి వచ్చాక అరకొర సాయం
- రైతు భరోసాపై నాలుక మడత.. ఏటా 13,500 ఇస్తామని 7,500లే
- కేంద్ర సాయం 6 వేలూ ఆ ఖాతాలోకే.. రాయితీ పథకాలకు అంటకత్తెర
- పెరిగిన పెట్టుబడి.. దక్కని 'మద్దతు'.. దిగుబడులపై విపత్తుల దెబ్బ
- పంట నష్టపరిహారం అంతంతే.. రుణభారంతో రైతన్నల బలవన్మరణాలు
- ఏటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం.. మాటలకే 'రైతు పక్షపాత' ప్రభుత్వం



ఇదీ జగన్ మాట

'చంద్రబాబు రుణమాఫీ చేస్తానని చెప్పి పూర్తిగా చేయకుండా ఎగ్గొట్టారు. టీడీపీ ప్రభుత్వానికి, వైసీపీ సర్కారుకు తేడా గమనించండి' అని జగన్ పదేపదే చెబుతుంటారు.

తేడా గమనించారా..!

2014 ఎన్నికల్లో గెలిచాక చంద్రబాబు రైతులకు ఒకేసారి రూ.50 వేలు దాకా రుణమాఫీ చేశారు. ఐదేళ్లలో మరో 60-70 వేలు మాఫీ చేశారు. ఒక్కో రైతుకు దాదాపు రూ.లక్ష లబ్ధి చేకూర్చారు. కానీ రైతు భరోసా కింద ఐదేళ్లలో రూ.67,500 ఇచ్చామని జగన్ గొప్పలు చెబుతుండగా.. కేంద్రం పీఎం కిసాన్ కింద ఇచ్చిన రూ.30,000 (ఏటా రూ.6వేలు) ఇందులో నుంచి మినహాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం చేసిన సాయం 37,500 మాత్రమే. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, విత్తన రాయితీ, రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా వంటి పథకాలన్నీ పాతవే. టీడీపీ ప్రభుత్వం రాయితీపై అమలు చేసిన సూక్ష్మసేద్యం, వ్యక్తిగత వ్యవసాయ యాంత్రీకరణ, ఉచితంగా సూక్ష్మపోషకాల పంపిణీ వంటి వాటిని జగన్ సర్కారు అటకెక్కించింది. అన్నివిధాలా చంద్రబాబు ప్రభుత్వంలోనే రైతులకు ఎక్కువగా మేలు జరిగింది. మరి జగన్ చెప్పిన తేడా ఏంటో వైసీపీ నేతలకే తెలియాలి..!

సాగుకు సున్నం..

రైతుకు దుఃఖం!

వ్యవ'సాయం' విస్మరించిన జగన్



31 లక్షల మందికి సాయం సున్నా

హామీ: పెట్టుబడి సాయం కింద ఏటా ప్రతి రైతు కుటుంబానికీ రూ.12,500 చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు జగన్ హామీ ఇచ్చారు.

వాస్తవం: జగన్ అధికారంలోకి వచ్చాక గొప్ప కోసం మరో రూ.వెయ్యి పెంచి రూ.13,500 ఇస్తామన్నారు. కానీ పీఎం కిసాన్ కింద ఏటా కేంద్రం ఇచ్చే రూ.6 వేలను మినహాయించి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.7,500 మాత్రమే ఇస్తున్నారు. ఏటా రూ.13,500 చొప్పున ఒక్కో లబ్ధిదారుకు రూ.67,500 అందాల్సి ఉండగా, రూ.37,500 మాత్రమే ఇచ్చి రూ.30 వేలు కోత పెట్టారు. రాష్ట్రంలో 64 లక్షల మంది భూ యజమానులు ఉండగా అనేక సాకులతో 16 లక్షల మందికి మొండిచేయి చూపారు. అలాగే 16.5 లక్షల మంది కౌలు రైతులు ఉండగా 15 లక్షల మందికి ఎగనామం పెట్టారు. అగ్రవర్ణ కౌలురైతులకు నయాపైసా ఇవ్వలేదు. మొత్తంగా 31 లక్షల మంది రైతులకు సాయం సున్నా.

రబీ బీమా ఎగవేత

హామీ: రైతు నయా పైసా కట్టకుండా వారి వాటా ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని, వైఎస్సార్ ఉచిత పంటల బీమా ప్రతి రైతుకూ అందిస్తామని జగన్ హామీ ఇచ్చారు.

వాస్తవం: రాష్ట్రంలో 60 లక్షల మందిపైగా రైతులు పంటలు సాగు చేస్తుండగా, ఈ-క్రాప్ తప్పనిసరి నిబంధనతో సగం మందికి కూడా బీమా కల్పించడం లేదు. 2019లో 9.48 లక్షల మందికి, 2020లో 15.15 లక్షల మందికి, 2021లో 15.60 లక్షల మందికి, 2022లో 10.20 లక్షల మందికే పరిహారం ఇచ్చారు. ఖరీఫ్‌లో తప్ప రబీ పంటలకు బీమా అమలు చేయలేదు. 2022-23 రబీ పంటల బీమా పరిహారం గత డిసెంబరులో ఇస్తామని ఇప్పటికీ ఇవ్వలేదు. 2023-24 బీమా పరిహారం వచ్చే జూన్‌లో వస్తుందని జగన్ చెప్పారు. దీంతో రబీ పంటల బీమా ఇచ్చే అవకాశం కనిపించడం లేదు. నిరుడు ప్రధానమంత్రి ఫసల్ బీమాను అమలు చేస్తామన్న ప్రభుత్వ పెద్దలు ఆ మాటా నిలబెట్టుకోలేదు.

పావలా వడ్డీ ఎత్తివేత

హామీ: రైతన్నలకు వడ్డీలేని పంట రుణాలిస్తామని జగన్ హామీ ఇచ్చారు.

వాస్తవం: పంట రుణాలకు టీడీపీ ప్రభుత్వంలో రూ.లక్ష వరకు సున్నా వడ్డీ, రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు పావలా వడ్డీ అమలు చేశారు. జగన్ అధికారంలోకి వచ్చాక రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వర్తించే వడ్డీ రాయితీని నిలిపివేశారు. రూ.లక్షలోపు రుణాలకు అసలుతో పాటు వడ్డీ వసూలు చేస్తున్నారు. సున్నా వడ్డీ సొమ్మును ఏడాది తర్వాత ఎప్పుడో రైతుల ఖాతాల్లో జమ చేసే పద్ధతి పెట్టారు. సవాలక్ష నిబంధనలతో సున్నా వడ్డీని అందరికీ వర్తింపజేయడం లేదు. పావలా వడ్డీ రుణాల పథకానికి కేంద్రం రాయితీ వాటా ఇస్తున్నా.. రాష్ట్ర వాటా విడుదల చేయట్లేదు. దీంతో రూ.లక్షపైన అప్పు తీసుకున్న రైతులు 7% వడ్డీ భరించాల్సి వస్తోంది.

ఉసురు తీస్తున్న అప్పులు

హామీ: వ్యవసాయంలో నష్టాలతో అప్పుల పాలై ఆత్మహత్య చేసుకునే రైతులు, కౌలురైతుల కుటుంబాలు రోడ్డున పడకుండా పునరావాస ప్యాకేజీ కింద రూ.7లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇస్తామని జగన్ ప్రకటించారు.

వాస్తవం: ఈ ఐదేళ్లలో వరుస విపత్తులు, మద్దతు ధర లేక నష్టపోయిన సన్నకారు రైతులు, కౌలురైతులు అప్పులపాలై బలవన్మరణాలకు పాల్పడిన ఘటనలు కోకొల్లలు. కానీ ఈ ఉదంతాలన్నీ రికార్డులకు ఎక్కడం లేదు. ఎంతమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటనే లేదు. కానీ వైఎస్సార్ ఫార్మర్ సూసైడ్ ఎక్స్‌గ్రేషియా వెబ్‌సైట్ సమాచారం ప్రకారం బలవన్మరణాలకు పాల్పడిన రైతు కుటుంబాలకు రూ.7లక్షల చొప్పున 1,316 క్లెయిమ్‌లు సెటిల్ చేసి, రూ.92.12 కోట్లు పంపిణీ చేసినట్లు ఉంది.

కేంద్రం సొమ్ముతో జగన్ ప్రచారం

జగన్ సర్కార్ తెచ్చిన రైతుభరోసా పథకానికి కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్‌ను కలిపి వైఎస్సార్ రైతుభరోసా-పీఎం కిసాన్ అని పేరు పెట్టారు. కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ సొమ్మునూ తామే ఇచ్చినట్లు జగన్ సర్కారు బిల్డప్ ఇచ్చింది. అత్త సొమ్ముతో అల్లుడి సోకు అంటే ఇదే కదూ? ఐదేళ్లలో ఒక్కో రైతుకు రూ.67,500 చొప్పున రైతుభరోసా కింద రూ.34,288 కోట్లు ఖర్చు చేశామని జగన్ చెప్తున్నారు. వాస్తవానికి ఐదేళ్లలో రైతుభరోసా కింద ఇచ్చింది రూ.19,860 కోట్లు మాత్రమే. పీఎం కిసాన్ కింద కేంద్రం రూ.14,428 కోట్లు ఇచ్చింది. కేంద్రం అనుమతితో పీఎం కిసాన్ పథకాన్ని దత్తత తీసుకుని ఉంటే.. ఈ పథకం ప్రకటనల్లో ప్రధాని మోదీ ఫొటో ప్రచురించాలి. కానీ ఐదేళ్లలో ఏనాడూ మోదీ ఫొటో పెట్టలేదు. ఇదే విషయంపై కేంద్ర మంత్రులు, రాష్ట్ర బీజేపీ నేతలు అనేక సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

పంట నష్ట సాయం అరకొరే

హామీ: ప్రకృతి విపత్తులు సంభవించినపుడు రైతులను ఆదుకుంటామని, రూ.4 వేల కోట్లతో విపత్తు సహాయ నిధి ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు.

వాస్తవం: ఈ ఐదేళ్లలో ఏ బడ్జెట్‌లోనూ రూ.2 వేల కోట్లు మించి కేటాయించలేదు. వరుస విపత్తులతో లక్షల ఎకరాల్లో రూ.వేల కోట్ల విలువైన పంట నష్టపోగా, ఐదేళ్లలో ఇన్‌పుట్ సబ్సిడీ కింద రైతులకిచ్చింది రూ.3,262 కోట్లు మాత్రమే. అది కూడా కేంద్రం రాష్ట్రానికి ఇచ్చే విపత్తు సహాయంతోనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నారు. 2019లో అధిక వర్షాలు, 2020, 2021లో కొవిడ్ కారణంగా ఆక్వా, ఉద్యాన పంట ఉత్పత్తులకు ఎగుమతులు లేక రైతులు నష్టపోయారు. వారికి ప్రత్యేక సాయమేదీ అందించలేదు. 2022లో తుఫాన్లు, అకాల వర్షాలు, 2023లో తీవ్ర వర్షాభావం, మిచౌంగ్ తుఫాన్‌తో భారీ నష్టం వాటిల్లింది. పంట నష్టానికి కూడా ఈ-క్రాప్ తప్పరిసరి చేసి, 33%పైన నష్టపోయిన రైతులకే ఇన్‌పుట్ సబ్సిడీ అనే నిబంధన పెట్టారు. కౌలుసాగుదారులందరికీ సాయం అందలేదు.

ధరల స్థిరీకరణ నిధి మిథ్య!

హామీ: 'రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తాం. పంట వేసే ముందే మద్దతు ధరలు ప్రకటించి, ధర తగ్గితే మార్కెట్ జోక్యంతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది'.. అని జగన్ అనేక సార్లు చెప్పారు.

వాస్తవం: తొలి రెండేళ్లు ధాన్యం తప్ప ఇతర ఉత్పత్తులను చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. ఏ సీజన్‌లోనూ పండిన ధాన్యంలో 40% కూడా కొనలేదు. ధాన్యం అమ్మిన రైతులకు ఈ ఏడాది మొదట్లో తప్ప ఎప్పుడూ 21 రోజుల్లోపు డబ్బులిచ్చిన దాఖలా లేదు. ధరల స్థిరీకరణ నిధితో ఉల్లి, టమాటా తప్ప ప్రధాన పంటలు నామమాత్రంగా కూడా కొనలేదు. సుబాబుల్, జామాయిల్ కర్రలకు టన్ను రూ.5 వేలు వచ్చేలా చూస్తామని చెప్పి.. రైతుకు రూ.2 వేలు కూడా రాకపోతే ఈ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. చంద్రబాబు ప్రభుత్వం మిర్చి, శనగ, జొన్న, మొక్కజొన్న పంటలకు ధరలు తగ్గినప్పుడు రైతులకు బోనస్ ఇవ్వగా, జగన్ సర్కార్ అలాంటి సాయమేమీ చేయలేదు.

ఉచిత బోర్లు తూచ్

హామీ: రైతుకు నయాపైసా ఖర్చు లేకుండా వైఎస్సార్ జలకళ పథకంలో ఉచితంగా బోర్లు వేయిస్తామని జగన్ హామీ ఇచ్చారు.

వాస్తవం: అధికారం చేపట్టిన ఏడాది తర్వాత జలకళ పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు రైతుల నుంచి దాదాపు 2.4 లక్షల దరఖాస్తులు రాగా, సుమారు 24 వేల బోర్లు మాత్రమే వేశారు. 2023-24లో 20 వేల బోర్లు వేయిస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. లక్షలాది మంది రైతులు బోర్లు అడుగుతుంటే వేలల్లో కూడా వేయలేదు. వేసిన బోర్లకు కరెంట్ కనెక్షన్లు సగం కూడా ఇవ్వలేదు. పంపు సెట్లు అమర్చింది కేవలం మూడు అంకెల్లోనే! మరోవైపు వ్యవసాయ రంగానికి పగటి పూట 9 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని జగన్ హామీ ఇచ్చి, రోజులో 7 గంటలు కూడా ఇవ్వట్లేదు. పైగా వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు బిగించాల్సిందేనని రైతులపై ప్రభుత్వం ఒత్తిడి చేసింది.

ఆక్వా రైతుకు అవస్థలు

హామీ: 'ఆక్వా రైతులకు యూనిట్ రూపాయిన్నరకే విద్యుత్ ఇస్తాం. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ రూ.9కు పెంచుతాం' అని జగన్ ప్రకటించారు.

వాస్తవం: రాష్ట్రంలో 4.70 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు అవుతుంటే.. జోన్ పేరుతో ఆక్వా సాగును విభజించారు. 10 ఎకరాల్లోపు సాగు చేసే ఆక్వా రైతులకు రూపాయిన్నరకు కరెంటు ఇస్తున్నారు. 10 ఎకరాలపైన ఆక్వా సాగు చేసే రైతులకు విద్యుత్ రాయితీ పూర్తిగా ఎత్తేశారు. దీంతో దాదాపు లక్షన్నర మందికి విద్యుత్ రాయితీ అందకుండా పోయింది. జోన్ బయట వాడే కరెంట్‌కు కమర్షియల్ రేటు వసూలు చేస్తున్నారు. మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ సమయంలో రూ.10వేలు ఇస్తున్నామంటూ ఇతర రాయితీ పథకాలు కట్ చేస్తున్నారు. చంద్రబాబు హయాంలో బోట్లు, వలలు, ఇతర పరికరాలు రాయితీపై ఇవ్వగా, ఈ ప్రభుత్వం అరకొరగా కూడా పంపిణీ చేయలేదు.

గిడ్డంగులు ఏవీ?

హామీ: ప్రతి నియోజకవర్గంలో శీతలీకరణ గిడ్డంగులు, గోదాములు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం' అని జగన్ హామీ ఇచ్చారు.

వాస్తవం: రూ.1,845 కోట్ల నాబార్డు రుణంతో రెండు దశల్లో 2,400 గిడ్డంగులు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుని, మొదటి దశ లక్ష్యంలో సగం కూడా నిర్మించలేదు. బిల్లులు ఇవ్వకుండా రెండో దశను అటకెక్కించారు. రూ.3,600 కోట్లతో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో 26 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని సగం కూడా పెట్టలేదు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

జగన్ వచ్చాక రైతులకు నష్టం

చంద్రబాబు పాలనలో వ్యవసాయ రుణాల మాఫీతో 58.29 లక్షల మంది రైతులు రూ.15,279 కోట్లు లబ్ధి పొందారు. అయితే 4,5 విడతల సొమ్ము విడుదల చేసినా ఎన్నికల కోడ్ వల్ల రైతుల ఖాతాలకు చేరలేదు. ఎన్నికల ముందు రూ.4 వేల చొప్పున దాదాపు 54.89 లక్షల రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ కింద చంద్రబాబు ప్రభుత్వం లబ్ధి చేకూర్చింది. కానీ రైతులకు లబ్ధి కలిగితే తమకు రాజకీయంగా నష్టమని భావించిన వైసీపీ నేతలు అన్నదాత సుఖీభవపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ సర్కార్ రైతు రుణమాఫీ ప్రక్రియను రద్దు చేసింది. మధ్యలో ఆగిపోయిన చెల్లింపుల ప్రక్రియను కొనసాగించక పోవడంతో అప్పట్లో ఒక్కో రైతు రూ.50 వేలు దాకా నష్టపోయారు.

గుసగుసలు



ఒంటరి.. వ్యూహం!

అనంతపురం జిల్లాలో ఫ్యాక్షన్‌కు పేరు మోసిన ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు సామాజిక వర్గాల మధ్య తీవ్ర వైరం ఉంది. సాధారణంగా ఈ రెండు వర్గాలు ఒకే పార్టీకి ఓటు వేయవు. కానీ... జగన్ పాలన దెబ్బకు తమ ప్రత్యర్థి సామాజిక వర్గం వారిలో కూడా మార్పు వచ్చిందని టీడీపీ అభ్యర్థి పసిగట్టారు. ఏదైనా గ్రామానికి తమ పార్టీ వారితో కలిసి వెళ్తే వారిని ఊరి బయటే ఉంచి... ఆ అభ్యర్థి ఒక్కరే ఆ గ్రామంలోని ప్రత్యర్థి సామాజికవర్గం వారి ఇళ్లకు వెళ్లి కలుస్తున్నారు. వారు కూడా అభ్యర్థిని సాదరంగా ఆహ్వానిస్తున్నారు. అభివృద్ధి జరగాలంటే తమను గెలిపించాలని ఆ అభ్యర్థి కోరుతుండగా వారి నుంచి సానుకూల స్పందన వస్తోంది. వారు కూడా తమ బాధలు చెప్పుకొంటున్నారు. అందరి ముందూ అయితే మనసు విప్పి మాట్లాడుకోరని గ్రహించి ఒంటరిగా వెళ్లి కలవడం ఫలితాన్నిస్తోందని ప్రచారం జరుగుతోంది.

నేల మీదే నడిచే 'రాజు'



విజయనగరం రాజుల కుటుంబంపై ఆ ప్రాంతంలోని గ్రామీణ ప్రాంత ప్రజల్లో గౌరవాభిమానాలు అధికం. ఎన్నికల సమయంలో ఇటువంటి గౌరవం బయటకు వస్తుంటుంది. కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి ఈసారి విజయనగరం అసెంబ్లీ సీటుకు పోటీ చేస్తున్నారు. ఆమె తరఫున అశోక్ ప్రచారానికి వెళ్తున్నారు. ఆయన ప్రచారానికి వస్తుంటే గౌరవసూచకంగా కొన్ని గ్రామాల్లో ఆ వీధుల్లో చీరలు పరుస్తున్నారు. గతంలో అనేక గ్రామాల్లో ఈ దృశ్యం కనిపించేది. ఇప్పుడు కొన్ని గ్రామాలకే పరిమితమైంది. 'రాజు గారు' తమ వీధుల్లో నేల మీద నడవకూడదన్నది వారి అభిప్రాయం. కానీ... అశోక్‌కు ఇలాంటివి నచ్చవు. ఆయన అటువంటి గ్రామాలకు వెళ్లే సమయంలో తనతో ఒక కర్ర తెచ్చుకొంటున్నారు. పరిచిన చీరలను కర్రతో పక్కకు జరుపుతూ వీధుల్లో నేలపైనే ఆయన నడుస్తున్నారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

ఆనాటి ముచ్చట

ఓటరు గుర్తింపు 'పుస్తకం'!



1987 నాటి ఓటరు గుర్తింపు కార్డు

అవును.. మీరు చదివింది నిజమే. ఇది ఓటరు పుస్తకమే. కానీ, 1987 నాటిది. అప్పట్లో ఓటర్లకు ఇలా పుస్తకాలే ఇచ్చేవారు. ఇప్పుడంటే అరిచేతిలో ఇమిడిపోయేంత గుర్తింపు కార్డులు వచ్చేశాయి కానీ.. ఒకప్పుడు రెండు పేజీలతో కూడిన చిన్నపాటి పుస్తకాన్ని ఓటర్లకు ఇచ్చేవారు. పైన క్లాత్‌తో బైండింగ్ చేసి లోపల ఫొటో అతికించి ఉండేవి. వివరాలన్నీ అచ్చు తెలుగులో ఉండేవి. ఫొటోపై 'సాక్ష్యాంకణ అధికారి' సంతకం ఉండేది. అధికారికంగా ఫారం-1 అనేవారు. ఫొటోతోపాటు ఓటరుకు సంబంధించిన రెండు పుట్టుమచ్చల వివరాలను కూడా పొందుపరిచేవారు. ఫొటో, పుట్టుమచ్చలు, ఓటరు జాబితాలో పేరు చెక్ చేసి ఓటు వేయడానికి అనుమతించేవారు. అయితే, వీటిని ఎక్కువకాలం భద్రపరిస్తే చిరిగిపోవడం, ఫొటోలు ఊడిపోవడం వంటి సమస్యలు వచ్చేవి. దీంతో తర్వాత కాలంలో కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు కార్డుల విషయంలో అధునాతన సాంకేతికతను తీసుకువచ్చింది. అప్పటి నుంచి కేవలం అరిచేతిలో ఇమిడిపోయే సైజులో ఓటరు గుర్తింపు కార్డులను అందిస్తున్నారు. వీటినే ఎలక్టర్స్ ఫొటో ఐడెంటిటీ కార్డు(ఈపీఐసీ-ఎపిక్ కార్డు) అంటున్నారు. వీటిని 1993లో అప్పటి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ టీఎన్ శేషన్ ప్రవేశ పెట్టారు. ప్రస్తుతం ఓటరు గుర్తింపు కార్డులు మరిన్ని రూపాలు సంతరించుకున్న విషయం తెలిసిందే.

- రాజమహేంద్రవరం, ఆంధ్రజ్యోతి



స్థలానికే ఇన్నేళ్లు.. ఇక ఇళ్లకు ఎన్నేళ్లో!

'పేదలందరికీ స్థలాలు ఇచ్చేశామని... ఇళ్లు కట్టేశామని' వైసీపీ చెబుతోంది. కానీ... ఇదంతా ఉత్తి బిల్డప్ మాత్రమే! ఇళ్ల స్థలాల కొనుగోలు పేరిట వైసీపీ నేతలు బాగా 'క్యాష్' చేసుకున్నారు. పేదలకు వివాదాస్పద భూములూ అంటగట్టారు. దీంతోపాటువివిధ కారణాలవల్ల పేదలకు ఇంటిస్థలం అందని ద్రాక్షలాగే మారింది. అనంతపురం జిల్లా యాడికి మండల పరిధిలోని రాయలచెరువులో జరిగిన ఉదంతమే దీనికి నిదర్శనం. ఈ గ్రామంలోని లబ్ధిదారులను నాలుగున్నరేళ్లు పట్టాల పేరుతో ఆడుకున్నారు. వివాదాస్పద స్థలాన్ని ఎంపిక చేయడమే దీనికి కారణం. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఈ ఏడాది జనవరిలో హడావుడిగా 118 మందికి వేరేచోట స్థలాలను కేటాయించి, పట్టాలను ఇచ్చారు. స్థలం ఇవ్వడానికే ఐదేళ్ల కాలం సరిపోతే.. ఇక ఇళ్ల నిర్మాణానికి ఇంకెన్నేళ్లు కావాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

అట్లుంటది అన్నతోని..



అబ్బ ఛా!




చేయలేనిది జగన్ చెప్పరు!

తాయిలాలు ప్రకటించి ఓట్లు వేయించుకోవాలనే ఆలోచన మాకు లేదు. జగన్ ఎప్పుడూ చేయలేని పని చెప్పరు. ఇచ్చిన హామీ నుంచి వెనక్కి పోరు.

- సజ్జల రామకృష్ణా రెడ్డి, ప్రభుత్వ సలహాదారు



అప్పుడలా...



గ్రామ సీమలను తీర్చిదిద్దేందుకు చంద్రబాబు ప్రభుత్వం గ్రామాల దత్తత కార్యక్రమాన్ని ప్రోత్సహించింది. రాష్ట్రంలో ప్రతి ఊరు, వార్డును కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులు, ఎన్ఆర్ఐలు దత్తత తీసుకునేలా స్మార్టు వార్డు-స్మార్టు విలేజ్ పథకాన్ని రూపొందించారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా 2015 జనవరి 18న పశ్చిమగోదావరి జిల్లా వెలివెన్ను గ్రామంలో ఈ కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా 18 కిలోమీటర్ల పాదయాత్ర కూడా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు తమ ప్రాంతాల్లో పాదయాత్రలు చేసి స్మార్ట్ విలేజ్-స్మార్ట్ వార్డుకు ప్రచారం కల్పించారు. పలువురు ప్రముఖులను ప్రభుత్వం ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసింది. గ్రామసీమలను, పట్టణాల్లో వార్డులను వారంతా ఎంపిక చేసుకుని ఆర్థిక సహాయం అందించి పాఠశాలలు, శ్మశానాలు, తాగునీటి సౌకర్యాలు, రోడ్లు, ఆటస్థలాలు, ప్రార్థనా మందిరాల అభివృద్ధి కోసం ఇతోధికంగా సాయం అందించారు. సినీ, రాజకీయ ప్రముఖులు పలు గ్రామాలను దత్తత తీసుకున్నారు. ఈ క్రమంలో విదేశాల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డ యువత కూడా ముందుకొచ్చింది. అలాంటి వారందరికీ అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ప్లాట్‌ఫారం కల్పించింది. అధికారులను నియమించి వారికి ప్రభుత్వపరంగా సహకారమందించింది. ప్రభుత్వం కూడా నిధులు సమకూర్చింది. ప్రతి సంక్రాంతికి గ్రామాలను దత్తత తీసుకున్న శ్రీమంతులకు అవార్డులు ప్రదానం చేసింది.

ఇప్పుడిలా..



జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్మార్ట్ వార్డ్-స్మార్ట్ విలేజ్ పథకాన్ని రద్దు చేసింది. దాని స్థానంలో "కనెక్ట్ ఆంధ్రా" పేరిట ఎన్ఆర్ఐల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటుచేసింది. అయితే ఈ సంస్థ కాన్సెప్ట్ ఏ ఒక్క ఎన్ఆర్ఐలో కూడా స్ఫూర్తిని కల్పించలేకపోయింది. ఎన్ఆర్ఐలు, దత్తత తీసుకునే ప్రముఖులు నిధులిస్తే, ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని కనెక్ట్ ఆంధ్రా పథకం అధికారులు చెప్తుండటంతో ప్రముఖులు మొహం చాటేస్తున్నారు. కొన్ని ప్రభుత్వ సంస్థల సీఎస్ఆర్ నిధులను పాఠశాలలకు అందించేందుకు మాత్రమే 'కనెక్ట్ ఆంధ్రా' పనికి వచ్చింది. గతంలో మాదిరిగా సొంత గడ్డకు కొంత మేలు చేద్దామని వచ్చే ఇతర ప్రాంతాల్లో నివసించే శ్రీమంతులకు ప్లాట్‌ఫారం లేకుండా చేశారని పలువురు ఆరోపిస్తున్నారు.

పో.. పోరా.. శ్రీమంతుడా!

దత్తత వద్దు... పల్లెలు బాగు చేయొద్దు...
ఎన్ఆర్ఐలకు జగన్ మార్క్ బెదిరింపులు

ఎన్ఆర్ఐలకు 'జన్మభూమి'పై ఉండే సెంటిమెంటును గ్రామ అభ్యుదయానికి పెట్టుబడిగా మలచడంలో చంద్రబాబు, ఆయన తెచ్చిన 'స్మార్టు వార్డు-స్మార్టు విలేజ్' పథకం సఫలీకృతమయ్యాయి. దీని స్థానంలో జగన్ ప్రభుత్వం తెచ్చిన 'కనెక్ట్ ఆంధ్రా' కాన్సెప్ట్ ఎన్ఆర్ఐల పట్ల ద్వేషాన్ని ప్రదర్శించింది. ఎన్ఆర్ఐలను బూచీల్లా, ఒక 'సామాజిక వర్గం' మనుషులుగా దుష్ప్రచారం చేసింది. ఎన్ఆర్ఐల వల్ల కలుగుతున్న రూ.కోట్ల మేలును కాలదన్నేలా ప్రవర్తించింది. వారిని రాష్ట్రం వదిలిపెట్టి పోయేలా వేధింపులకు గురిచేసింది. ఈవిధంగా 'కనెక్ట్ ఆంధ్రా' కాన్సెప్ట్‌ను సర్కారే చంపేసింది.



- బూచీల్లా చిత్రీకరిస్తూ వారిపై విషపు ప్రచారం
- సాయానికి వస్తే 'సామాజిక వర్గం' ముద్ర
- జగన్ నిర్వాకంతో దత్తతకు గ్రామాలు దూరం
- టీడీపీ హయాంలో సొంత ఊరికి సేవచేసే వీలు
- స్మార్ట్ వార్డు- స్మార్టు విలేజ్ పేరిట కార్యక్రమాలు
- ఎన్ఆర్ఐల నిధులకు కొంత తనవీ కలిపి పనులు
- ఆ స్ఫూర్తిని ఘోరంగా దెబ్బతీసిన జగన్
- 'నిధులు మీవి..నిర్ణయాలు మావి' అన్నట్టు తీరు
- సర్కారుపై విశ్వాసం కోల్పోయిన ఎన్ఆర్ఐలు

గ్రామాల్లో జన్మించి ఉద్యోగాలు, వ్యాపారాలపరంగా విదేశాల్లో స్థిరపడిన ఎన్ఆర్ఐలకు జన్మభూమికి సేవచేసే అవకాశాన్ని వైసీపీ ప్రభుత్వం కాలరాచింది. స్మార్టు వార్డు-స్మార్టు విలేజ్ పథకాన్ని అధికారంలోకి రాగానే సీఎం జగన్ రద్దు చేశారు. దాని స్థానంలో తెచ్చిన 'కనెక్ట్ ఆంధ్రా' కాన్సెప్ట్...ఎవరికీ కనెక్ట్ కాలేదు. తమ డబ్బును తమ చేతులతో ఖర్చుపెట్టాలని ఏ దాత అయినా అనుకుంటారు. వారి సెంటిమెంటును టీడీపీ ప్రభుత్వం గౌరవిస్తూ... 'కొంత మీరు పెట్టండి.. కొంత మేం సమకూరుస్తాం' అన్న పద్ధతిలో కార్యక్రమాలు చేసింది. కానీ, జగన్ తెచ్చిన 'కనెక్ట్ ఆంధ్రా' దీనికి రివర్స్. 'డబ్బులు మీరివ్వండి...గ్రామానికి ఏంచేయాలో మేంచేస్తాం' అన్నట్టు ప్రభుత్వ వైఖరి ఉండటంతో, ఎన్ఆర్ఐలు, దాతలు ముఖం చాటేశారు. మేమిచ్చిన నిధులు గ్రామాలకు ఖర్చు పెడతారని నమ్మకమేమిటి అని శ్రీమంతులు ప్రశ్నించారు.

20 అంశాల కార్యక్రమం..

ఆంధ్రప్రదేశ్ ప్రణాళికాశాఖ...యునిసెఫ్‌తో కలిసి స్మార్టు గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించి గ్రామాలను దత్తత తీసుకునే వారికి అందించింది. దత్తత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, మాతాశిశు సంరక్షణ, పిల్లల చదువు, పర్యావరణ పరిరక్షణ, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన తదితర 20 అంశాలతో ముందుకెళ్లింది. శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, మండలాధ్యక్షులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, స్వచ్ఛంద సంస్థలు, సినీ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయవేత్తలు, ఇతర కళాకారులు తమకు నచ్చిన గ్రామాన్ని దత్తత చేసుకుని అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలనేది ప్రభుత్వ ఆకాంక్ష. ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉన్న ప్రతి ఒక్కరూ గ్రామాన్ని లేదా వార్డును దత్తత తీసుకుంటే స్మార్ట్ ఏపీని సాధించవచ్చనేది ప్రభుత్వ అభిప్రాయం. సంస్థలు, వ్యక్తులు దత్తత తీసుకోగా మిగిలిన ఊళ్లను ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, రాష్ట్ర ఉన్నతోద్యోగులు దత్తత తీసుకుని అభివృద్ధి చేశారు. దత్తత తీసుకున్న వారు ఆ గ్రామానికి వెళ్లి అక్కడ సామాజికాభివృద్ధి, హక్కుల పరిరక్షణ, సామాజిక భద్రత, పర్యావరణం తదితర అంశాలను పరిశీలించి పురోగమనానికి దోహదం కలిగించారు. ఆయా గ్రామాలకు వచ్చే వనరులను సమీకరించి ఎలా ఖర్చు పెడితే అవి అభివృద్ధి చెందుతాయో దత్తత తీసుకున్న వారు, గ్రామాధికారులు కలిసి నిర్ణయించారు. జన్మభూమి కార్యక్రమంలో సేకరించిన సమాచారాన్ని పోర్టల్‌లో అందుబాటులో ఉంచి, దేశవిదేశాల్లో ఉన్న గ్రామీణులు ఆన్‌లైన్ ద్వారా గ్రామాన్ని, వార్డును ఎంపిక చేసుకునేలా ఏర్పాట్లుచేశారు. ఇందుకోసం ప్రత్యేక యాప్ రూపొందించారు. దత్తత కోసం గ్రామ పంచాయతీ/వార్డులు లేదా వివిధ రంగాల జాబితాను రూపొందుతున్న పబ్లిక్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. పలువురు ప్రముఖులు, కార్పొరేట్ సంస్థలు తాము దత్తత తీసుకున్న గ్రామాల్లో ప్రభుత్వ సహకారంతో, తమ సొంత నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వం కూడా వారిని ప్రోత్సహించేందుకు పలు స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాలు చేపట్టింది. సంక్రాంతికి గ్రామాలకు వచ్చిన ఎన్ఆర్ఐలను పురస్కారాలతో సన్మానాలు చేసింది. స్మార్టు విలేజ్ కార్యక్రమంలో ఎవరెవరు ఏమి చేయాలనే విషయంపై మార్గదర్శకాలను కూడా ఏపీ ప్రణాళికా శాఖ, యూనిసెఫ్ సంయుక్తంగా అప్పట్లో రూపొందించి అమలు చేశాయి.

ప్రముఖులెందరో నాడు కదిలొచ్చె..

టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు విశాఖ జిల్లా అరకులోయను, ఆయన సతీమణి భువనేశ్వరి కృష్ణా జిల్లా కొమరవోలును, కుమారుడు నారా లోకేశ్ తాత ఎన్టీఆర్ గ్రామం నిమ్మకూరును, కోడలు బ్రహ్మణి చిత్తూరు జిల్లా నారావారిపల్లెను దత్తత తీసుకున్నారు. మంత్రి నారాయణ తాను జన్మించిన నెల్లూరు జిల్లా తోటపల్లిగూడురును, తాను పెరిగిన నెల్లూరు నగరంలోని హరనాథపురాన్ని(18వ వార్డును) దత్తత తీసుకుని అభివృద్ధి చేశారు. బాలీవుడ్ నటుడు వివేక్ ఓబెరాయ్ అనంతపురంలోని ముత్తంకుంట్ల గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు పరిటాల రవీంద్ర 10వ వర్ధంతి రోజున ప్రకటించారు. ప్రిన్స్ మహేశ్‌బాబు తన తండ్రి గ్రామమైన గుంటూరు జిల్లా బుర్రిపాలేన్ని దత్తత తీసుకున్నారు. కృష్ణ కుమార్తె, ఎంపీ గల్లా జయదేవ్ సతీమణి పద్మావతి కంచర్ల గ్రామాన్ని తీసుకున్నారు. డీజీపీ రాముడు తన స్వగ్రామం అనంతపురం జిల్లా ధర్మవరం సమీపంలోని నరసింహపల్లిని దత్తత తీసుకున్నారు.

పుణ్యానికి వస్తే పాపం అంటగట్టి..

దత్తత స్ఫూర్తిని సమాధి చేసిన అధికారపక్ష నేతలు, మరో అడుగు ముందుకేశారు. రాష్ట్రానికొస్తున్న ఎన్ఆర్ఐలను సోషల్‌మీడియా వేదికగా వేధిస్తున్నారు. ఎన్ఆర్ఐల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ రాష్ట్రానికి వారి సేవలందకుండా అడ్డుకుంటున్నారు. ఇటీవల ఎన్ఆర్ఐలు బాహాటంగానే ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతూ ప్రకటనలు చేశారు.

- అమరావతి,ఆంధ్రజ్యోతి

నోట్ దిస్ పాయింట్!

గల్లంతే.. గల్లంతే!

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 69 పార్టీలు తమ అభ్యర్థులను బరిలో దింపి అదృష్టాన్ని పరీక్షించుకున్నాయి. అసెంబ్లీలోకి అడుగుపెట్టింది మూడంటే మూడు పార్టీలు.. వైసీపీ, టీడీపీ, జనసేన. ఇక ధరావతు కోల్పోయిన పార్టీల విషయానికొస్తే.. ఈ మూడు పార్టీలు మినహా మిగతా 66 పార్టీల నుంచి 876 మంది బరిలో నిలిచారు. వారిలో ఒక్కరంటే ఒక్కరికి కూడా డిపాజిట్ దక్కలేదు. ఇక మూడు ప్రధాన పార్టీల్లో.. టీడీపీ అభ్యర్థి ఒకరికి కూడా డిపాజిట్ గల్లంతవగా, జనసేన నుంచి పోటీ చేసిన 137 మందిలో 121 మంది ధరావతు కోల్పోయారు.

మొత్తం అభ్యర్థులు	2,118
డిపాజిట్ గల్లంతైనవారు	1,752

దటీజ్ జగన్



సచివాలయానికి వెళ్లని సీఎం జగన్ సరికొత్త రికార్డు

టీచరు బడికి పోవాలి! పూజారి గుడికి పోవాలి! అలాగే... ముఖ్యమంత్రి సచివాలయానికి వెళ్లాలి. కానీ... జగన్ తీరే వేరు. కేబినెట్ భేటీ ఉంటే తప్ప ఆయన సచివాలయం గడప తొక్కలేదు. ప్రజల బాధలూ వినలేదు. ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల దాకా అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. దీనిని 'విజిటర్స్ టైమ్'గా పిలుస్తారు. జగన్ ఒక్కరోజు కూడా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించలేదు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి రెండు నెలలు మాత్రమే అయిష్టంగా సచివాలయానికి హాజరయ్యారు. ఆపై కొన్నాళ్లకే అమరావతిని అటకెక్కించి 'మూడు ముక్కలాట'కు తెరలేపారు. తర్వాత.. తప్పనిసరి తంతు తరహాలో కేబినెట్ సమావేశాలకు మాత్రమే సెక్రటేరియట్‌కు వెళ్లారు. అది కూడా ఇష్టంలేకుండానే! 'సీఎం ఎక్కడి నుంచైనా పని చేసుకోవచ్చు' అంటూ తాడేపల్లి ప్యాలెస్‌లోనే క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. ఎప్పుడైనా బయటకు వెళితే పరదాలు, బారికేడ్లే!

- అమరావతి, ఆంధ్రజ్యోతి

ది లీడర్



ఆనాడు ఎన్నికల ప్రచారం కోసం సామర్లకోట వచ్చిన ఇందిరాగాంధీని తోడ్కొని వెళ్తున్న పీవీ నరసింహారావు, ఎమ్మెల్యే అభ్యర్థి మహ్మద్ ఇస్మాయిల్

ఢిల్లీ నుంచి గల్లీకి!

ప్రచారానికి సామర్లకోట వచ్చిన ఇందిరమ్మ

అది 1967. దేశంలో సార్వత్రిక ఎన్నికల సమరం సాగుతున్న సమయం. అదే సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే.. దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రచారాన్ని భుజాన వేసుకున్న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ.. తన అభిమాన అభ్యర్థి కోసం ప్రత్యేకంగా రాష్ట్రానికి వచ్చారు. ఆయన తరఫున ప్రచారం చేశారు. ఇలా ఇందిరమ్మ అభిమానాన్ని చూరగొన్న అభ్యర్థి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సామర్లకోటకు చెందిన మహ్మద్ ఇస్మాయిల్. అప్పట్లో ఆయన పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. పార్టీని ముందుకు తీసుకువెళ్తూ రాష్ట్రంలో పుంజుకునేలా చేయడంలో ఇస్మాయిల్ బాగా కష్టపడ్డారు. ఇదే.. ఇందిరాగాంధీకి ఆయనపై అభిమానం ఏర్పడేలా చేసింది. దీంతో ఆమె తన అత్యంత సన్నిహితుల జాబితాలో మహ్మద్ ఇస్మాయిల్‌ను చేర్చుకున్నారు. అంతేకాదు, ఆయనను అసెంబ్లీకి పంపాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. కొత్తగా ఏర్పడిన సామర్లకోట నియోజకవర్గం నుంచి ఇస్మాయిల్‌ను నిలబెట్టారు. ఆయన కోసం ప్రత్యేకంగా ఢిల్లీ నుంచి వచ్చిన ఇందిరాగాంధీ.. అప్పటి సీనియర్ నాయకుడు పీవీ నరసింహారావుతో కలిసి సామర్లకోటలో ప్రచారం చేశారు. ఇందిరమ్మ ప్రభావంతో ఇస్మాయిల్.. సీపీఐ అభ్యర్థి ఉండవల్లి నారాయణమూర్తిని ఓడించారు.

- సామర్లకోట

దివ్యాంగులు, కొవిడ్ బాధితులకు కూడా

ఎన్నికల విధుల్లో పాల్గొనే అత్యవసర సిబ్బంది, జర్నలిస్టులకు అవకాశం

వయోవృద్ధులకు ఇంటి నుంచే ఓటు



పోస్టల్ బ్యాలెట్ వినియోగంలో పొరపాటు చేస్తే గల్లంతే



పోస్టల్ బ్యాలెట్‌ను ఏ కేటగిరికి చెందిన వారు ఎక్కడ ఉపయోగించుకోవాలి? దాని వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి? దీనిపై ఎన్నికల సంఘం వివరణాత్మక ప్రకటన విడుదల చేసింది.

- అమరావతి,ఆంధ్రజ్యోతి

ఎవరు ఎక్కడ ఓటు వేయాలి?

- సర్వీస్ ఓటర్లు... ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫర్ పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలి.
- ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు... రిటర్నింగ్ అధికారి నిర్దేశించిన తేదీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓటర్స్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలి.
- దివ్యాంగులు (ఏవీపీడీ), 85 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు (ఏవీఎస్‌సీ), ప్రస్తుతం కొవిడ్ బాధితులుగా ఉన్న ఓటర్లు (ఏవీసీఓ)... రిటర్నింగ్ అధికారి ఏర్పాటు చేసిన పోలింగ్ సిబ్బంది సహకారంతో ఓటరు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.
- అత్యవసర సేవలుగా గుర్తించబడిన ప్రభుత్వ శాఖల సిబ్బంది, ఎన్నికల విధుల్లో ఉండి... ఈసీ గుర్తింపు కార్డును పొందిన పాత్రికేయులు (ఏవీఈఎస్)... రిటర్నింగ్ అధికారి నిర్దేశించిన తేదీల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ ఓటింగ్ సెంటర్‌లో వినియోగించుకోవాలి.



తెలుసుకోవాల్సిన విషయాలు... తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

1. మీ ఓటు ఉన్న పోలింగ్ స్టేషన్, పార్ట్ నంబరు, ఓటర్ల జాబితాలో మీ ఓటు క్రమసంఖ్య తెల్సుకోవాలి. ఎపిక్ కార్డు లేదా కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొన్న ఏదైనా ఇతర గుర్తింపు పత్రం, తన ఎన్నికల విధుల నియామక పత్రం తీసుకొని ఫెసిలిటేషన్ సెంటర్ వద్దకు వెళ్లాలి.
2. ప్రతి ఓటరుకు పోస్టల్ బ్యాలెట్ పేపరుతో పాటు కొన్ని ఫారాలు, కొన్ని కవర్లు ఇస్తారు. అసెంబ్లీ బ్యాలెట్ పేపరు, కవర్లు 13 బీ, 13 సీ... పింక్ కలర్‌లో ఉంటాయి. లోక్‌సభ బ్యాలెట్ పేపరు తెలుపు రంగులోను, కవర్లు 13 బీ, 13 సీ గ్రీన్ రంగులో ఉంటాయి.
3. పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగంలో ఉండేవి ఇవే...
   ఏ. ఫార్మ్ 13 ఏ - డిక్లరేషన్
   బీ. ఫార్మ్ 13 బీ - కవర్ ఏ(చిన్నది... లోపల కవర్)
   సీ. ఫార్మ్ 13 సీ - కవర్ బీ(పెద్దది... బయట కవర్)
   డీ. ఫార్మ్ 13 డీ - ఓటరుకి సూచనలు.
4. ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి, బ్యాలెట్ పేపరు మీద ఓటును మీకు నచ్చిన అభ్యర్థికి క్రాస్ మార్క్, లేదా టిక్ రూపంలో నమోదు చేయాలి.
5. బ్యాలెట్ పేపరు మీద ఎట్టి పరిస్థితుల్లో సంతకం చేయకూడదు. ఓటరు గుర్తింపు తెలిపే ఏ విధమైన గుర్తులు రాయకూడదు.
6. ఫార్మ్ 13 ఏ - డిక్లరేషన్‌లో మీ బ్యాలెట్ పేపర్ సీరియల్ నంబరును వేయడం, సంతకం చేయడం తప్పనిసరి.
7. ఓటరు గుర్తింపును, ఫార్మ్ 13 ఏలో గెజిటెడ్ అధికారి(ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద అందుబాటులో ఉంటారు) తప్పనిసరిగా ధృవీకరించాల్సి ఉంటుంది.
8. ఓటు నమోదు చేసిన బ్యాలెట్ పేపర్‌ను ఫార్మ్ 13 బీ అంటే కవర్ ఏ లేదా లోపలి కవర్‌లో పెట్టి సీల్ వేయాలి.
9. దానిపై మీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చిరునామా రాయాలి. తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సీరియల్ నంబరు వేయాలి.
10. ఈ లోపలి కవర్‌లో బ్యాలెట్ పేపర్ తప్ప మరి ఏ ఇతర డాక్యుమెంట్లు ఉండరాదు.
11. సీల్ చేసి సిద్ధం చేసిన కవర్‌ను, మీ డిక్లరేషన్ ఫార్మ్‌ను విడివిడిగా ఫార్మ్ 13-సీ అనగా కవర్ బీ (బయట కవర్)లో పెట్టి సీల్ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారి చిరునామా పూర్తి చేయాలి.
12. ఈ కవర్‌పై ఓటరు తప్పనిసరిగా సంతకం చేసి, అక్కడ ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలి.

ముఖ్య గమనిక.. ఓట్ల లెక్కింపు కేంద్రంలో కవర్ బీ (బయటి కవర్)ని తెరవగానే.. కవర్ ఏ, ఓటర్ డిక్లరేషన్ ఫార్మ్ విడివిడిగా ఉండాలి. లేకపోతే మీ పోస్టల్ బ్యాలెట్ కవర్ ఏను పరిగణలోకి తీసుకోరు.

వంద బాదాడు.. వెయ్యి నొక్కాడు!


కోడుమూరులో కురుబలు ఇచ్చిన గొర్రెపిల్ల, కంబళితో చంద్రబాబు దరహాసం

(మొదటి పేజీ తరువాయి)

దగా చేసిన వైసీపీని మే 13న ఓటుతో భూస్థాపితం చేయాలని ప్రజలకు పిలుపిచ్చారు. ప్రజాగళంలో భాగంగా ఆదివారం కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం, కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరులో జరిగిన భారీ బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. జగన్ 99.5% హామీలు అమలు చేశానని చెబుతున్నాడని.. మద్య నిషేధం చేశాడా? జాబ్ కేలెండర్ ఇచ్చాడా? ఒక్క డీఎస్సీ అయినా ఇచ్చాడా అని ప్రశ్నించారు. చివరకు చెత్తపై కూడా పన్నులు వేసిన చెత్త ముఖ్యమంత్రి అని దుయ్యబట్టారు. ఇంకా ఏమన్నారంటే..

..34 మందిని చంపేశావ్

జగన్..! నీ రాజకీయ పిచ్చి కోసం గత నెలలో వృద్ధులను మండుటెండల్లో రోడ్లపైకి తీసుకొచ్చి 34 మంది వృద్ధులు చనిపోవడానికి కారణమయ్యావ్. పేదవారి జీవితాలతో ఆడుకోవద్దు. సీఎస్ ఒకటో తేదీనే ఇళ్ల వద్దకే పింఛన్ పంపించే ఏర్పాట్లు చేయాలి. పింఛన్ పథకం మొదలు పెట్టింది ఎన్టీఆర్.. ఆ పింఛన్‌ను. రూ.200 నుంచి ఐదు రెట్లు పెంచి రూ.2 వేలు చేసింది నేను. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వస్తాయి. మన ప్రభుత్వం రాగానే పింఛన్ రూ.4 వేలు పెంచి ఏప్రిల్ నుంచే ఇస్తాం. మళ్లీ మన ప్రభుత్వం వస్తుంది. ఆడబిడ్డలకు నెలనెలా రూ.1,500 చొప్పున ఐదేళ్లలో రూ.95 వేలిస్తాం. తల్లికి వందనం కింద బడిలో చదివే పిల్లలందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తాం. ఇంట్లో నలుగురు పిల్లలు ఉంటే రూ.60 వేలు వస్తుంది. దీపం పథకంలో మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షలు వడ్డీ లేని రుణాలు ఇస్తాం. సైకో ఇచ్చిన ఇంటి స్థలాను రద్దు చేయను. పేదలందరికీ రెండు మూడు సెంట్ల స్థలాలు ఇస్తాను. అందరి కీ ఇళ్లు కట్టిస్తాను. రేషన్ పథకంలో మన ప్రభుత్వం 8 రకాల సరుకులు ఇస్తే.. ఈ జగన్ కేంద్రం ఉచితంగా ఇస్తు న్న ఐదు కేజీలు బియ్యం మాత్రమే ఇస్తూ తన స్టిక్కర్ వేసుకున్నాడు. పేదరికం లేని సమాజం చూడాలన్నదే నా సంకల్పం. ఏటా 4 లక్షల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాను. మారుమూల గ్రామం కౌతాళం, గూ డూరులో కూర్చొని అమెరికా కంపెనీలతో పని చేసే లా తీర్చిదిద్దుతాను. అదీ నా విజన్. నిరుద్యోగులకు రూ.3 వేలు భృతి ఇస్తాను. మెగా డీఎస్సీపైనే తొలి సంతకం.

> • పాదయాత్రలో తలలు నిమిరాడు.. ముద్దులు పెట్టాడు.. మీరేమో ఐస్‌లా కరిగిపోయారు. ఆ తర్వాత ఐదేళ్లు బాదుడే బాదుడు. మీ సంపద పెంచాడా..? మీ జీవితాలను అంధకారంలోకి నెట్టేసిన ఈ దుర్మార్గుడికి మళ్లీ ఓటేస్తారా..?
>
> • జగన్ మాయమాటలు.. గారడీ మాటలకు మళ్లీ మోసపోతే ఉద్యోగాల కోసం యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. టీడీపీ కూటమిని గెలిపిస్తే పనుల కోసం ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి రావాలి. అదీ మన విజన్.
>
> • జూన్ 4 తర్వాత మన ప్రభుత్వం వస్తుంది. సంపద సృష్టించి పేదల జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత నేను తీసుకుంటాను. ఈ జగన్‌ను ఇంటికి పంపించే బాధ్యత మీరు తీసుకోండి.. అందుకు సిద్ధమా..?
>
> \- చంద్రబాబు

ముస్లిం రిజర్వేషన్లపై దుష్ప్రచారం

ఎన్డీయే ప్రభుత్వం వస్తే ముస్లిం రిజర్వేషన్లు తీసేస్తామని జగన్ విష ప్రచారం చేస్తున్నారు. దీని ని నమ్మకండి.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ కోటా తొలగించం. రాష్ట్ర అభివృద్ధి కోసమే జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్నాం. 3 పార్టీలు రాష్ట్ర అభివృద్ధి కోసం త్యాగం చేశాయి. ఓడిపోతామనే భయంతో ముస్లింలలో విషబీజం నాటేందుకు జగన్ కుట్రలు చేస్తున్నాడు. ఆయన గారడీ మాటలు చెల్లవు. ఉద్యోగులకు జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేశాడు. మేం అధికారంలోకి రాగానే న్యాయం చేస్తాం.

రతనాల సీమగా రాళ్ల సీమ

రాయలసీమకు ముఖద్వారంగా ఉన్న కర్నూలు ప్రాంతానికి సాగునీరు ఇస్తే రైతులు మంచి పంటలు పండిస్తారు. పరిశ్రమలు వస్తాయి. రాళ్ల సీమ రతనాలసీమగా మారుతుంది. వలసలు ఆగిపోతాయనే దూరదృష్టితో ఆలోచించి నా హయాంలో రూ.1,985 కోట్లతో ఆర్డీఎస్‌కు డి కాలువ ప్రాజెక్టు, రూ.1,942 కోట్లు మంజూరు చేసి వేదవతి ప్రాజెక్టు చేపట్టాను. గుండ్రేవుల ప్రాజెక్టుకు డీపీఆర్ తయారు చేసి నిధులు కూడా ఇచ్చాను. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇచ్చాను. ఈ జగన్ వచ్చి ఏం చేశాడు..? రాయలసీమలో 102 ప్రాజెక్టులను ఆపేసిన దుర్మార్గుడు. కౌతాళం ప్రాంతం నుంచి 80 వేల మంది వలస వెళ్తున్నా రు. వాటి నివారణకు ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తాం. ఈ జలగన్న నకిలీ మద్యం అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడు. ఎక్కడ చూసినా నాసిరకం మద్యమే. భూమ్..భూమ్.. స్పెషల్ స్టేటస్.. ప్రెసిడెంట్ మెడల్ వంటి కంపెనీల మద్యం ఎప్పుడైనా చూశారా..? జే బ్రాండ్ మద్యంతో ఆడబిడ్డల మంగళసూత్రాలు తెంపేస్తున్నాడు. క్వార్టర్ మద్యం ఇప్పుడు రూ.200-250 ఉంది. ఆ డబ్బంతా తాడేపల్లి కొంపకు పోతోంది. కాగా, చంద్రబాబు ఆదివారం రాత్రి గూడూరులో బస చేశారు.


ఆదివారం మంత్రాలయంలో నిర్వహించిన చంద్రబాబు ప్రజాగళం సభలో తెలుగుదేశం జెండాతో చిన్నారి

రిజర్వేషన్లపై జగన్‌ది తప్పుడు ప్రచారం

4% రిజర్వేషన్లపై సుప్రీంలో సొంత ఖర్చుతో పోరాడింది టీడీపీనే

నెల్లూరులో ముస్లింలతో ఆత్మీయ సమావేశంలో చంద్రబాబు


నెల్లూరులో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో బాబు చేతికి రక్ష కడుతున్న ముస్లిం పెద్దలు

నెల్లూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కూటమికి ఓటు వేస్తే ముస్లింల రిజర్వేషన్లు రద్దవుతాయంటూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, సుప్రీం కోర్టులో ఉన్న ముస్లింల 4% రిజర్వేషన్ల కేసుపై సొంత ఖర్చులతో న్యాయవాదులను పెట్టి పోరాడింది టీడీపీనే అని చంద్రబాబు స్పష్టం చేశారు. తాను సీఎంగా ఉన్న సమయంలో ముస్లిం నేతలను ఢిల్లీకి పంపి సుప్రీంకోర్టులో పోరాటం చేసినట్లు గుర్తు చేశారు. ఆదివారం నెల్లూరులోని కోటమిట్ట షాదీమంజిల్‌లో ముస్లింలతో చంద్రబాబు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 'నేను అబ్దుల్ కలాంను రాష్ట్రపతిని చేస్తే జగన్మోహన్‌రెడ్డి అబ్దుల్ సలాం చనిపోయేలా చేశారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను రక్షించుకునేందుకు నరసరరావుపేటలో ఓ వ్యక్తి పోరాటం చేస్తే దారుణంగా చంపేశారు. ఇటువంటి అరాచకాలను టీడీపీ ప్రభుత్వంలో ఎప్పుడైనా చూశారా? అధికారంలో ఉన్న ఐదేళ్లు జగన్మోహన్‌రెడ్డి కేంద్రంలో ఏ పార్టీకి సపోర్ట్ చేశారో ముస్లింలకు సమాధానం చెప్పాలి. సీఏఏ, ఎన్ఆర్‌సీ బిల్లులకు పార్లమెంటులో వైసీపీ సపోర్ట్ చేసింది. ఏ 2 విజయసాయిరెడ్డి సంతకాలు పెట్టడమే కాకుండా మంచి చట్టాలంటూ మాట్లాడారు. నేడు అదే ఏ 2 నెల్లూరుకు వచ్చి ముస్లింలకు అన్యాయం జరుగుతోందని అంటున్నారు. ఇది ముస్లింలకు వైసీపీ చేసిన ద్రోహం కాదా?' అంటూ చంద్రబాబు ప్రశ్నించారు.

ముస్లింలను ఆదుకున్నది మేమే

'2014-19 మధ్య తాము ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నప్పుడు ఏ ఒక్క ముస్లింకు అన్యాయం జరగకుండా చూసుకున్నాం. ఎన్డీయేలో ఉన్నప్పుడే హైదరాబాద్‌లో ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం, హజ్ హౌస్ నిర్మించాం. రాష్ట్ర విభజన తర్వాత ఎన్డీయేలో ఉన్నప్పుడే కడప, విజయవాడలో హజ్ హౌస్‌లు నిర్మించాం. దుల్హన్ పథకం తీసుకొచ్చాం. రంజాన్ తోఫా, విదేశీ విద్య, సబ్సిడీ రుణాలతో ముస్లింలను ఆదుకున్నది తెలుగుదేశం పార్టీ' అని చంద్రబాబు అన్నారు.


మంత్రాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరంలో జరిగిన టీడీపీ, జనసేన ఉమ్మడి సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న పవన్

కుల చిచ్చుకు జగన్ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసినందుకా.. పోలవరం పూర్తి చేయకుండా అన్నదాతలను మోసం చేసినందుకా.. భవన నిర్మాణ కార్మికుల నిధులను మింగేసినందుకా.. రహదారులు నిర్మించకుండా వదిలేసి వెన్నుపూసలు విరగ్గొడుతున్నందుకా..' అని నిలదీశారు. రాబోయే ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలని.. అరాచక పాలన సాగించిన జగన్ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించి బంగాళాఖాతంలో కలిపేయాలని పిలుపిచ్చారు. ఇంకా ఏమన్నారంటే.. కాపు రిజర్వేషన్ల ఉద్యమం వైసీపీ కనుసన్నల్లోనే జరిగింది. రిజర్వేషన్ల కోసం జరిగే సభ సందర్భంగా ఏదో దుర్ఘటన జరుగుతుందని నాకు ముందే సమాచారం వచ్చింది. రిజర్వేషన్లు రావని తెలిసి కూడా వైసీపీ నేతలు మిథున్‌రెడ్డి, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డి తదితరులు రైలు దహనం జరిగేలా చేశారు. కొబ్బరి తోటల్లో కిరాయి మూకలను ఉంచి ఈ ఘటనకు పాల్పడ్డారు. కేసులు మాత్రం అమాయక యువకులపై నమోదవడంతో వారంతా నష్టపోయారు. కొందరు నేతలు నన్ను విమర్శిస్తున్నట్లు నాకు కాపులను తాకట్టు పెట్టే స్థాయి ఉంటే ఇలా ఎందుకు ఉంటాను? ప్రభుత్వాన్ని ఈపాటికే స్థాపించే వాడిని కదా! గత ఎన్నికలకు ముందు తూర్పుగోదావరి జిల్లాకు వచ్చిన జగన్.. కాపులకు రిజర్వేషన్ ఇవ్వను చీ.పో అన్నాడు. అయినా ఆయన్నే గెలిపించారు. కాపులకు రిజర్వేసన్ ఇవ్వని వ్యక్తికి కాపు ఎమ్మెల్యేలు ఎలా మద్దతిస్తారు? ఈబీసీ కోటా ఎందుకు తీసేశాడు? రాష్ట్ర పరిధిలో అయినా కనీసం అర శాతం కూడా ఇవ్వలేదు. మరి జగన్‌కు ఎందుకు ఓటేయాలి?

ఎవరి ఆస్తి ఎవరిది?

ఆస్తుల క్రయ విక్రయాలు చేస్తే ఇకపై స్టాంపు పేపర్లకు బదులు జిరాక్స్‌లు ఇవ్వడం ఏంటి? ప్రభుత్వం నాలుగురోజుల కింద జీవో తెచ్చింది. ఇదే జరిగితే ఒకప్పుడు దున్నేవాడిదే భూమి అనే నినాదం స్థానంలో దున్నని భూమి, ఉండని ఇళ్లు అన్నీ జగన్‌వే అన్నట్లు మారుతుంది. ఎవరి సొమ్ము ఎవరు తీసుకుంటారు? ఆస్తులు మనవా.. జగన్‌వా..? ఆయనకు ఆ హక్కు ఎక్కడుంది? వైసీపీ నేతలకు కూడా చెబుతున్నా.. రేపు మీ ఆస్తులు కూడా జగన్ లాగేస్తారు.

కులాలను విడదీయను.. కలుపుతా

గోదావరి జిల్లాల్లో కాపులకు-దళితులకు మధ్య గొడవలు పెట్టాలని జగన్ కుయుక్తులు పన్నుతున్నారు. కాపు సామాజిక వర్గానికి చెందిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన దళిత డ్రైవర్‌ను హత్య చేసి డోర్‌డెలివరీ చేశాడు. అలాంటి వ్యక్తిని జగన్ వెనకేసుకు తిరుగుతున్నాడు. దీనివల్ల కాపు సామాజికవర్గానికి నష్టం. తద్వారా ఆ సామాజికవర్గంపై దళితులకు ఆగ్రహం వస్తుంది. అలా రెండు సామాజికవర్గాలు కొట్టుకునేలా కుయుక్తి పన్నారు. నేను కులాలను విడదీయను. కలిపే వ్యక్తిని.

> రాష్ట్రానికి ఎంతో కీలకమైన పోలవరం ప్రాజెక్టును జగన్ పక్కనపడేశారు. 74 శాతం పూర్తయిన ప్రాజెక్టును గాలికి వదిలేశారు. అక్కడకు వెళ్లి పరిశీలించాలంటే నిషేధిత ప్రాంతంగా మార్చేశారు.
>
> \- పవన్ కల్యాణ్

పోలీసులకు 'సరెండర్' బాకీలు

రాష్ట్రంలో పోలీసులకు ఇవ్వాల్సిన సరెండర్ లీవ్స్ కింద జగన్ రూ.750 కోట్లు బాకీలు పెట్టేశారు. కానీ వారితో ఊడిగం చేయిస్తున్నారు. చివరకు వారాంతపు సెలవులు కూడా ఇవ్వడం లేదు. సీపీఎస్ విషయమై చంద్రబాబుతో చర్చించి మేనిఫెస్టోలో పెట్టేలా చేస్తా. అధికారంలోకి వచ్చాక ఏడాది లోపు సమస్యకు పరిష్కారం కనుక్కుంటాం. ఈ ప్రభుత్వంలో హోంగార్డులకు జీతాలు అందలేదు. అందుకే పోలీసులు ఆలోచించి ఓటేయాలి. చిన్నపిల్లల చిక్కీలో జగన్ రూ.65 కోట్లు దోచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వరు గానీ వలంటీర్ల సన్మానాలకు రూ.703 కోట్లు ధారాదత్తం చేశారు. కల్తీ మద్యంతో పేదల రక్తాన్ని అమ్ముకున్న రక్తవ్యాపారి జగన్.

అరటి గెలలు పండించుకుందాం..

జగన్ ప్రభుత్వం అరటి పళ్లు తినేసి తొక్కలను మనకు వదిలేసింది. కానీ కూటమి వచ్చాక అరటి గెలలు పండించుకుందాం. అందుకే యువతకు ఒకటే చెబుతున్నా. మీ దండాలు వద్దు.. మీ భవిష్యత్ నాకు కావాలి. నాకు లంచాలు వద్దు. మీకు బంగారు భవిష్యత్ అందితే అదే నాకు సంతృప్తి. కూటమి అధికారంలోకి వస్తే పోలవరం ప్రాజెక్టు నుంచి అన్నదాతల కష్టాల వరకూ తీరతాయి. నిరుద్యోగుల దగ్గర నుంచి భవన నిర్మాణ కార్మికుల వరకు బాధలు తీరతాయి. ప్రత్తిపాడు నియోజకవర్గంలో వంతాడ మైనింగ్ అక్రమాలు అరికట్టేలా స్వయంగా నేనే పర్యవేక్షిస్తా. ఈ నియోజకవర్గంలో ద్వారంపూడి రొయ్యల ఫ్యాక్టరీకి ప్రభుత్వం బ్రిడ్జి కట్టించింది. కానీ ప్రజలు రహదారులు లేకుండా ఇబ్బందులు పడుతుంటే ఏరోజూ పట్టించుకోలేదు. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారంపూడి సహజ వనరులను భారీగా లూటీ చేస్తున్నారు. వీరి సంగతి తేల్చడానికే నేను పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నా.


పులివెందులలో ప్రచారం చేస్తున్న సునీత

మాకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తే తప్పా!

» వివేకానందరెడ్డి కుటుంబానికి అన్యాయం జరిగితే ప్రశ్నించొద్దా

» ఘాటుగా స్పందించిన వివేకా కుమార్తె

పులివెందుల, ఏప్రిల్ 28: "మాటలు జాగ్రత్త!! వివేకానందరెడ్డి కుటుంబానికి అన్యాయం జరిగితే చెప్పకూడదా! ప్రశ్నించ కూడదా? మీఇంట్లో అన్యాయం జరిగితే ప్రశ్నించవా?" అని వైసీపీ కార్యకర్తపై దివంగత వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె డాక్టర్ సునీత మండిపడ్డారు. ఆదివారం సాయంత్రం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం(సారాయిపల్లె)లో సునీత ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ప్రచార రథం పైనుంచి "నాన్నకు న్యాయం చేయండి. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండి" అని కోరారు. ఇంతలో గ్రామంలోని వైసీపీకి చెందిన ఓ కార్యకర్త.. "ప్రచారం చేసుకోండి కానీ, వివేకా కేసుతో మీకేం పని" అంటూ సునీత ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెంటనే అప్రమత్తయిన పోలీసులు అతనిని అడ్డుకుని పక్కకు తీసుకెళుతుండగా.. అతను మరోమారు నోటిదురుసుగా మాట్లాడారు. దీంతో సునీత తీవ్ర స్వరంతో అతన్ని హెచ్చరించారు. "వివేకానందరెడ్డికి అన్యాయం జరిగితే చెప్పడం తప్పా. మీ ఇంట్లో అన్యాయం జరిగితే ప్రశ్నించవా? మాటలు జాగ్రత్తగా రానీ" అన్నారు. పోలీసులు ఆ వ్యక్తిని అక్కడి నుంచి తీసుకెళ్లారు. అనంతరం సునీత ప్రసంగం కొనసాగింది. వివేకానందరెడ్డికి జరిగిన అన్యాయానికి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే న్యాయం జరుగుతుందని సునీత చెప్పారు. ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. షర్మిలకు ఓటు వేస్తే మీకు ఎలాంటి సమస్య వచ్చినా తీర్చేందుకు శాయశక్తులా పోరాడుతామన్నారు. అనంతరం చిన్నరంగాపురం, బ్రాహ్మణపల్లె, నల్లపురెడ్డిపల్లె తదితర గ్రామాలలో సునీత ప్రచారం సాగించారు.

జనసేనకే గాజు గ్లాసు

» కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు

అమరావతి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గాజు గ్లాసు గుర్తును జనసేనకు కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో జనసేన అభ్యర్థులు పోటీ చేయని చోట్ల ఇతరులకు గాజు గ్లాసు గుర్తును కేటాయించారు. జనసేన 21 స్థానాల్లో మాత్రమే పోటీ చేస్తోందని, ఆ పార్టీ అభ్యర్థులు పోటీ చేయని స్థానాల్లో ఇతరులకు గాజుగ్లాసు గుర్తు కేటాయించాలని కొంతమంది ఈసీకి విన్నవించారు. దీనిపై జనసేన గత వారం ఆ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. ఈసీ సూచనల మేరకు గాజుగ్లాసు గుర్తును జనసేనకు కేటాయిస్తున్నట్లు ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా మెమో జారీ చేశారు.

వైసీపీ మేనిఫెస్టో చిత్తు కాగితం

» పాత హామీలు అమలు చేయకుండా.. కొత్త మేనిఫెస్టో విడుదల ఎందుకు..?

» బీజేపీతో బాబు పొత్తు.. బీజేపీకి జగన్ తొత్తు

» కాంగ్రెస్ వస్తే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, ప్రత్యేక హోదా

» ఉత్తరాంధ్ర సభల్లో వైఎస్ షర్మిల



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి), టెక్కలి, పలాస, ఏప్రిల్ 28: 'యువతకు ఉద్యోగాలు లేవు. ఒక్క జాబ్ క్యాలెండర్ లేదు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదు. పట్టుమని పది పరిశ్రమలు కూడా రాలేదు. ఈ ఐదేళ్లలో వైసీపీ రాష్ట్రానికి చేసింది గుండు సున్నా' అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి విమర్శించారు. ఆదివారం ఉత్తరాంధ్రలో విశాఖపట్నం, టెక్కలిలో నిర్వహించిన ఏపీ న్యాయయాత్రలో షర్మిల పాల్గొన్నారు. విశాఖలోని అక్కయ్యపాలెంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. వైసీపీ విడుదల చేసిన మేనిఫెస్టోను చిత్తుకాగితంలా అభివర్ణించారు. సీఎం జగన్ మళ్లీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారని, పాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా కొత్త మేనిఫెస్టో ఎందుకని ప్రశ్నించారు. పైగా పాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

స్టీల్‌ప్లాంటుపై ప్రభుత్వ వైఖరి దారుణం

విశాఖ స్టీల్‌ప్లాంటును విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనా.. అడ్డుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం దారుణమని షర్మిల పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంటును అమ్మేందుకు కేంద్రం సిద్ధమైనా వైసీపీ ఎంపీలు కనీసం పోరాటం చేయలేదని విమర్శించారు. ప్లాంటు పరిరక్షణకు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలే పోరాడుతున్నాయన్నారు. గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాను రూ.600 కోట్లకు అమ్మేశారని, 30 ఏళ్లపాటు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండేలా వైఎస్ఆర్ ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారని, కానీ.. జగన్ అధికారంలోకి వచ్చిన దానిని వెంటనే అమ్మేశారని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంటును అంబానీ, అదానీలకు అమ్మేందుకు సిద్ధపడుతున్నారన్నారు. ప్లాంటుకు అవసరమైన సరుకు, బొగ్గు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని, తద్వారా ప్లాంటు నష్టాల్లోకి వెళ్లేలా చేసి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామని, రెండు లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేస్తామని, పేదింటి మహిళకు ఐదేళ్లలో ఐదు లక్షల ఆర్థిక లబ్ధి చేకూరుస్తామని చెప్పారు. పెన్షన్ నాలుగు వేలు కావాలన్నా, పక్కా ఇల్లు కావాలన్నా కాంగ్రెస్ గెలవాలన్నారు. ఆదివారం ఉదయం స్టీల్‌ప్లాంటు సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో షర్మిల మాట్లాడుతూ.. 2019 ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోను జగన్ అమలు చేయలేకపోయారని, ఇప్పుడు ప్రకటించిన మేనిఫెస్టో వల్ల ఉపయోగం ఏమీ లేదని అన్నారు. వైసీపీ మేనిఫెస్టో చెత్తబుట్టలో చిత్తు కాగితంలా ఉందని విమర్శించారు.



టెక్కలిలో నిర్వహించిన న్యాయ్ యాత్రకు హాజరైన జనం, ప్రసంగిస్తున్న షర్మిల

కేంద్రానికి అమ్ముడుపోయిన టీడీపీ, వైసీపీ

రాష్ట్ర ప్రయోజనాలు కాదని స్వప్రయోజనాల కోసం చంద్రబాబు మోదీ నేతృత్వంలోని బీజేపీతో పొత్తు పెట్టుకుంటే.. జగన్‌రెడ్డి కూడా బీజేపీకి తొత్తుగా మారారని షర్మిల ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోని ఇందిరాగాంధీ కూడలిలో ఆదివారం ఏపీ న్యాయయాత్ర సందర్భంగా షర్మిల మాట్లాడారు. చంద్రబాబు, జగన్‌రెడ్డి ప్రజల ప్రయోజనాలను తాకట్టుపెట్టి కేంద్రానికి అమ్ముడు పోయారన్నారు. పది సంవత్సరాల చంద్రబాబు, జగన్‌రెడ్డి పాలనలో పది పరిశ్రమలు కూడా రాలేదని, వారివి స్వప్రయోజనాలే తప్ప ప్రజా ప్రయోజనాలు కావని అన్నారు. ప్రజలు ఆలోచన చేయాలని, ప్రత్యేక హోదా, అభివృద్ధి, ఉద్యోగాలు కావాలంటే కాంగ్రెస్‌ను ఆశీర్వదించి అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

చేసిన పాపాలకు శిక్ష తప్పదు

క్రైస్తవ మత బోధకుడు బ్రదర్ అనిల్



కడప, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తమ కుటుంబంలో జరిగిన ఘటనలకు కొన్ని సంవత్సరాలుగా బాధపడుతున్నామని, న్యాయం కోసం పోరాడుతున్నామని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భర్త.. బ్రదర్ అనిల్‌కుమార్ అన్నారు. న్యాయం జరిగి తీరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆదివారం కడపలో జరిగిన మత ప్రార్థనల్లో ఆయన పాల్గొని, బోధనలు చేశారు. పాపులను తొక్కిపడేయాలంటే ధైర్యంగా నిలబడాలని, పాపులను విశ్వసించవద్దని, ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. ఎవరూ భయపడొద్దని, పాపాలు చేసినవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ తరఫున కడపలో ఎన్నికల ప్రచారానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ రానున్నారని సమాచారం. వీలైతే రాహుల్ గాంధీ కూడా వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ శ్రేణులు తెలిపాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



కళ తప్పిన అమరావతి

ఆకుపచ్చని చీర పరిచినట్టు నేలంతా పచ్చదాన్ని కప్పుకుని... నిండు చందమామలా తెల్లటి కాంతులు విరమ్ముతున్న విద్యుత్ దీపాలతో.. అందమైన రాజధాని అమరావతికి ఆహ్వానం పలుకుతున్నట్టు కనువిందు చేస్తున్న ఆహ్లాద రూపం కనకదుర్గమ్మ వారధి సమీపంలోని తాడేపల్లి పోలీస్ చెక్‌పోస్టు వద్ద గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది టీడీపీ ప్రభుత్వ పని తీరుకు నిదర్శనం. వైసీపీ అధికారంలోకొచ్చాక దీన్ని గాలికొదిలేయడంతో ఎడారి మాదిరి ఎండిన నేల, విరిగిపోయిన విద్యుత్ స్తంభాలతో కళావిహీనమై వైసీపీ ప్రభుత్వ పని తీరుకు అద్దం పడుతోంది.



కేశినేని నాని చీటర్

● అతనిపై కేసులున్నా అఫిడవిట్‌లో చూపలేదు

● సుజనా చౌదరి వెనుక క్యారేజీలు పట్టుకుని తిరిగి.. ఇప్పుడు ఆయన్నే విమర్శించడం విడ్డూరం ● బుద్దా వెంకన్న ధ్వజం

విజయవాడ(వన్‌టౌన్), ఏప్రిల్ 28 : రాజకీయాల్లో ఎక్కువ రంగులు మార్చిన చరిత్ర కేశినేని నానిదని, అతను ఒక చీటర్ అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని తన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పశ్చిమ నియోజకవర్గంలో పర్యటిస్తూ సుజనాచౌదరి, చంద్రబాబులపై నోరు పారేసుకుంటున్నారు. సుజనాచౌదరి వెనుక క్యారేజీలు పట్టుకుని తిరిగే నాని ఆయన నుంచి ఎంత సాయం పొందాడో మరచిపోవడం విచిత్రం. పశ్చిమ నియోజకవర్గాన్ని బెస్ట్ నియోజకవర్గంగా మారుస్తానని సుజనా చౌదరి చెబుతుంటే కేశినేని నాని తన ప్రచారంలో సుజనా చౌదరి స్థానికుడు కాదని చెప్పడం విచిత్రంగా ఉంది. తాతల కాలం నుంచి సుజనా చౌదరి కుటుంబం విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనే ఉంది. కేశినేని నాని ఇల్లు మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో ఉంది. ఓటమి భయంతో చేతగాని వాళ్లే అనవసర అంశాలను ప్రచారం చేసి వివాదం చేసి లబ్ధి పొందాలని చూస్తారు. కేశినేని నానికి వాళ్ల అమ్మతో సహా కుటుంబ సభ్యులే మద్దతు ఇవ్వలేదు. తమ్ముడు పోటీగా నిలబడితే చెల్లి కూడా కేశినేని నాని వెంట రాలేదు. ఎవరి ద్వారా లబ్ధి పొందారో వారినే తిట్టడం అతని నైజం. డబ్బులు ఎగొట్టినందుకు అతనిపై చీటింగ్ కేసు ఉంది. అఫిడవిట్‌లో చూపించలేదు. పెద్ద చీటర్ గనుకనే చంద్రబాబునాయుడు మెడ పట్టుకుని బయటకు గెంటేశారు. కేసుల విషయం దాచినందుకు నానిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం. అప్పులు చెల్లించి వస్తే అతను నిజాయితీపరుడని అంగీకరిస్తాం. అతనిది లాలూచీ బతుకు' అని బుద్దా వెంకన్న ధ్వజమెత్తారు.


మాట్లాడుతున్న బుద్దా వెంకన్న

ఆర్యవైశ్యుల సమస్యలు పరిష్కరిస్తా : సుజనా

విద్యాధరపురం, ఏప్రిల్ 28 : ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాను పనిచేస్తానని విజయ వాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. భవానీపురం ఎస్ కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయన మాట్లాడుతూ వాణిజ్య, వ్యాపారాలకు కేంద్రంగా ఉన్న విజయవాడలో ఆర్యవైశ్యుల సమస్యలు ఎన్నో అపరిష్కృతంగా ఉన్నాయని చెప్పారు. ఆర్యవైశ్యులందరూ ఐక్యంగా ఉండి ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు మాట్లాడారు. సుజనా చౌదరికి ఆర్యవైశ్యుల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో విజయవాడ అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ, ప్రతినిధులు వక్కలగడ్డ భాస్కరరావు, దరిశి వాసు, వక్కలగడ్డ శ్రీకాంత్, పైలా సురేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సుజనా చౌదరి

ముఠా కార్మికుల సంక్షేమానికి చర్యలు

వన్‌టౌన్ : ముఠా కార్మికుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటానని పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. వన్‌టౌన్ తారాపేటలోని మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ నివాసంలో ఆదివారం జరిగిన ముఠా కార్మికుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ మాట్లాడారు. జనసేన అధికార ప్రతినిధి కన్న రజని, బీజేపీ నాయకుడు పైలా సోమినాయుడు, ఎన్‌డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

కులమతాలు కూడు పెట్టవు

● ఎమ్మెల్యే ఎలా ఉండాలో నిరూపిస్తా

● పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనాచౌదరి

భవానీపురం, ఏప్రిల్ 28 : కులాలు, మతాలు కూడు పెట్టవని, భావి తరాలుపైకి రావడానికి పేదరికాన్ని జయించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ఇచ్చిందని పశ్చిమ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వై.సుజనా చౌదరీ అన్నారు. ఊర్మిళానగర్‌లోని సంస్కృతి ఫంక్షన్ హాల్లోల మాజీ కార్పొరేటర్ ఆలుగుండ్ల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి సంఘం ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సుజనా మాట్లాడారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొనికి కొండయ్య, వి.వెంకటేశ్వరరెడ్డి, బిజెపీ నాయకులు విశ్వేశ్వరరావు, జనసేన నేత కోటి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


బొండా ఉమా సమక్షంలో టీడీపీలో చేరిన 25, 36 డివిజన్లకు చెందిన యువకులు

టీడీపీలో చేరికలు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 28 : 23వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద సంఖ్యలో 25, 36 డివిజన్‌లకు చెందిన యువత, జనసేన, బీజేపీ బలపర్చిన టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. శివ, సాయి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది యువకులు టీడీపీ కండువా కప్పుకున్నారు. బొండా ఉమా మాట్లాడారు.

64వ డివిజన్‌లో..

అజిత్‌సింగ్‌నగర్ : 64వ డివిజన్‌లోని పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు, అభిమానులు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో ఉమాతో సమావేశమయ్యారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ ఆధ్వర్యంలో 100 మందికి బొండా ఉమా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడారు.


దుర్గమ్మ ఉత్సవ విగ్రహం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దుర్గగుడిలో సరస్వతీ హోమం

వన్‌టౌన్, ఏప్రిల్ 28 : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో మూల నక్షత్రం సందర్భంగా ఆదివారం విద్యార్థులకు మేధోసంపత్తి, విజ్ఞానం అభివృద్ధి చెందాలని సర్వజనులు సుఖ సంతోషాలతో భోగభాగ్యాలతో విరాజిల్లాలని సంకల్పిస్తూ సరస్వతి హోమాన్ని నిర్వహించారు. కలశ పూజ అమ్మవారి అర్చన కార్యక్రమాలలో ఈవో కేఎస్ రామారావు దంపతులు పాల్గొన్నారు. భక్తులు విశేషంగా కార్యక్రమాలను తిలకించి జ్ఞానసరస్వతీని సర్వసంపదప్రదాయినీ సరస్వతిదేవిని కొలిచారు. ఆదివారాన్ని పురస్కరించుకుని ఆలయంలో వేదపండితులు, అర్చకులు సూర్యోపాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్గమ్మవారి శిఖర స్వర్ణతాపడ కార్యక్రమానికి విజయవాడ విద్యాధరపురానికి చెందిన చిటికెన వెంకటసత్యనారాయణ, కుటుంబసభ్యులు ఆదివారం ఏఈవో రమేష్ ద్వారా లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. దుర్గమ్మను దర్శించుకోవడానికి ఆదివారం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

● దుర్గమ్మవారిని హైకోర్టు జడ్జి జస్టిస్ వి.శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు.

● ఈవో రామారావు ఆలయంలోని పలు విభాగాలలో ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. కౌంటర్‌లను, మైకు ప్రసార కేంద్రాన్ని పరిశీలించారు. మైకు ప్రసార కేంద్రంలో భక్తులకు ఆలయంలో జరిగే విశేషాలను ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను సూచించారు.

● అమ్మవారికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కిస్తున్నట్లు ఈవో కేఎస్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఘాట్‌రోడ్డులో షాపుల కోసం ఈవోపై రాజకీయ ఒత్తిళ్లు

● షాపు నిర్వాహకుల వద్ద డబ్బు వసూలు చేస్తున్న ఆలయ ఉద్యోగి

● అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు

వన్‌టౌన్, ఏప్రిల్ 28 : కనకదుర్గనగర్‌లో ఉన్న 21 షాపుల లీజుదార్లు సుమారు రెండుకోట్ల రూపాయలకుపైగా బకాయిలు పడ్డారు. సంబంధిత ఆలయ అధికారులు దేవస్థానం ఈవో రామారావు ఆదేశాల మేరకు షాపులకు ఇటీవల విద్యుత్ సరఫరా నిలిపివేశారు. బకాయిలు చెల్లిస్తేనే షాపులకు విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని ఈవో షాపుల లీజుదారులను హెచ్చరించారు. అయినా లీజుదారులు దేవస్థానానికి బకాయిలు చెల్లించడంలో ఏ మాత్రం ముందుకు రావడం లేదు. పైగా కనకదుర్గానగర్‌లో అభివృద్ధి పనుల నిమిత్తం షాపులు తొలగించాలని అధికారులు లీజుదారులకు నోటీసులు ఇచ్చారు.

షాపు నిర్వాహకులు అధికార పార్టీకి చెందిన నాయకులను ఆశ్రయించారు. షాపులు తొలగిస్తే ఘాట్‌రోడ్డులో ఇవ్వాలని ఈవోపై అధికారపార్టీకి చెందిన ముఖ్య నాయకులతో ఒత్తిడి చేయిస్తున్నారు. ఓ షాపు లీజుదారుడు అతనికున్న రెండు షాపులకు రూ.25లక్షలపైగా అద్దె బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేస్తూ ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ తనకు ఘాట్‌రోడ్డులో రెండు షాపులు కేటాయించాలని ఈవోకు తరచూ ఫోన్ చేయిస్తున్నట్టు సమాచారం. మరోపక్క ఆలయంలో ఉద్యోగం చేస్తున్న ఓ ఉద్యోగి బినామీ పేర్లతో రెండు షాపులు నిర్వహిస్తున్నాడు. అతను కూడా తాను ఈవోతో మాట్లాడి షాపు ఘాట్‌రోడ్డులో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని షాపు నిర్వాహకుల వద్ద నుంచి లక్ష రూపాయల చొప్పున వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ ఉద్యోగి దేవస్థానంలో నైట్ వాచ్‌మెన్‌గా చేస్తూ బినామీ పేర్లతో దేవస్థానం షాపులను తక్కువ ధరకు పాడుకుని ఎక్కువ ధరకు ఇతరులకు సబ్‌లీజ్‌కు ఇస్తున్నట్టు పలువురు వ్యాపారస్తులు చెబుతున్నారు. అయితే బకాయిపడ్డ షాపుల అద్దెలు ఏ మేరకు వసూలు చేయాలో సంబంధిత విభాగ అధికారులు ఈవో ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నట్టు తెలుస్తోంది.

దశాబ్దాల సమస్యల పరిష్కారానికి కృషి

కేశినేని శివనాథ్, సుజనా చౌదరి

పాతరాజరాజేశ్వరి పేట, ఏప్రిల్ 28 : వెనుకబడిన పశ్చిమ నియోజకవర్గంలో దశాబ్దాల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్డీయే కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. స్థానిక 56వ డివిజన్, పాతరాజరాజేశ్వరి పేటలోని జేపీ అపార్ట్‌మెంట్ సభ్యులతో ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎన్డీయే కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి సుజనా చౌదరి పాల్గొన్నారు. కేశినేని శివనాథ్ మాట్లాడుతూ పాతరాజరాజేశ్వరి పేట ప్రాంతంలో బస్సు సౌకర్యం లేక డివిజన్ వాసులు, జేపీ అపార్ట్‌మెంట్ వాసులు ఇబ్బందులకు గురి అవుతున్నారని తన దృష్టికి తీసుకువచ్చారని, ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో మినీ సెట్విన్ బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. సుజనా చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఏర్పాటుకు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఎంతో కృషి చేశారని తెలిపారు. తనపై జేపీ అపార్ట్‌మెంట్ వాసులు చూపిన ఆదరాభిమానాలు మరువలేనివని అన్నారు.


మాట్లాడుతున్న కేశినేని శివనాథ్ (చిన్ని), పక్కన సుజనా చౌదరి

సీఎం జగన్ భస్మాసురునిలా కనుమరుగు కాకతప్పదు

● బొండా ఉమా ధ్వజం

పాయకాపురం, ఏప్రిల్ 28 : రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భస్మాసురునిలా కనుమరుగు కాకతప్పదని టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 62వ డివిజన్‌లో టీడీపీ నేతలు ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రకాష్‌నగర్, రైతుబజార్, చేపలమార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై బీజేపీ ఉద్యమించాలి

● ఇఫ్టూ జాతీయ నేత పి.ప్రసాద్

ధర్నాచౌక్, ఏప్రిల్ 28 : బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని ఐక్యంగా ముందుకు తీసుకుపోవడానికి, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు ఈ మేడేను దీక్షా దినంగా జరపాలని ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపునిచ్చిందని ఇఫ్టూ జాతీయ ఉపాధ్యాక్షుడు పి.ప్రసాద్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మేడే కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం విస్తృత ముఖ్య కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం, ఏప్రిల్ 28: మైలవరం గ్రేడ్ - 2 గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 7వ తేదీ వరకు నిర్వహించనున్న వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 28: చిల్లకల్లులో ఒక మహిళ వద్ద 267 తెలంగాణ మద్యం సీసాలను ఆదివారం సెబ్ సీఐ మణికంఠారెడ్డి స్వాధీనం చేసుకున్నారు. గొట్టిముక్కల పార్వతి అనే మహిళ ఇంట్లో పట్టుకుని విచారించగా అదే గ్రామానికి చెందిన శివరాత్రి వెంకటేశ్వరరావు, పీట్ల వెంకటేశ్వరరావు అనే వ్యక్తులు తనకు తీసుకువచ్చి ఇస్తారని వాటిని అమ్ముతున్నానని చెప్పిందన్నారు. వారిద్దరు పరారీలో ఉన్నారని, నిందితురాలిని మద్యం సీసాలతో అదుపులోకి తీసుకున్నామన్నారు.


మంటల్లో కాలుతున్న కలప, ఇతర సామగ్రి

టింబర్ డిపోలో అగ్నిప్రమాదం

● రూ.50 లక్షల ఆస్తి నష్టం

కంచికచర్ల రూరల్, ఏప్రిల్ 18: కంచికచర్లలో విజయవాడ రహదారి పక్కనే విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఉన్న సజ్జనపు బసవాచారికి చెందిన టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం జరిగి సుమారు రూ.50 లక్షల విలువైన ఆస్తి నష్టం వాటిల్లింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో విద్యుత్ సబ్ స్టేషన్‌లో మంటలు చెలరేగి కింద రవ్వలు పడటంతో అందులో ఉన్న గడ్డి, చెత్తకు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. విద్యుత్ సిబ్బంది వారి సబ్ స్టేషన్‌లో మంటలను అదుపు చేసుకోగలిగారు. మంటలు వ్యాపించి దాని సమీపంలో ఉన్న టింబర్ డిపోకు మంటలు అంటుకున్నాయి. అది గమనించిన విద్యుత్ సిబ్బంది ఫైర్ ఇంజన్ కోసం ఫోన్ చేశారు. అగ్నిమాపక శకటం అందుబాటులో లేకపోవడంతో విజయవాడ, జగ్గయ్యపేటలకు ఫోన్ చేశారు. అగ్నిమాపక శకటాలు వచ్చేలోపు మంటలు టింబర్ డిపోను చుట్టుముట్టాయి. మొత్తం నాలుగు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేస్తున్నామని ఫైర్ ఆఫీసర్ తలసిల శ్రీనివాసరావు అన్నారు. మంటలు అదుపులోకి వచ్చేందుకు అర్ధరాత్రి వరకు పట్టవచ్చన్నారు.


తలపడుతున్న క్రీడాకారులు

ఏడో రౌండ్‌కు అంతర్జాతీయ చెస్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 : కానూరులోని షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో జరుగుతున్న తొలి ఇంటర్నేషనల్ ఫిడే చెస్ రేటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆదివారం కూడా హోరాహోరీగా సాగాయి. ఏడు రౌండ్లు పూర్తి అయ్యే సరికి ఎండీ.ఇమ్రాన్ (విజయవాడ), టి. హరీష్‌సాయిరామ్ (విజయవాడ) ముందంజలో నిలిచారు. తర్వాత వరుసలో ఆరు పాయింట్లతో .శ్రీనివాసరావు (ఉయ్యూరు), పి.షణ్ముక్ చాంద్ (తెలంగాణ), హేమల్ వర్షన్ (నెల్లూరు), లక్ష్మీచరణ్ నాయుడు (వైజాగ్), రావు జే.మల్లేశ్వరరావు (విజయవాడ), ఐదు పాయింట్లతో కంది సంతోష్ సాయికార్తీక్ (హైదరాబాద్) కొనసాగుతున్నారు. ఈనెల 30వ తేదీతో టోర్నీ ముగియనుంది. ఐదు లక్షల ప్రైజ్‌మనీతో సాగుతున్న ఈ టోర్నీలో ఏపీ, తెలంగాణ ప్లేయర్లు సత్తా చాటుతున్నారు. పోటీల ఏర్పాట్లను అకాడమీ డైరెక్టర్ తాళ్ల నరేష్ పర్యవేక్షిస్తున్నారు.


రెండు పతకాలను సాధించిన విజయవాడ ఆర్చర్ ధీరజ్

ప్రపంచకప్ ఆర్చరీలో ధీరజ్‌కు స్వర్ణం, కాంస్యం

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 28 : షాంఘైలో జరుగుతున్న ప్రపంచ కప్ స్టేజ్-1 ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో నగరంలోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ యువ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ రెండు పతకాలతో సత్తా చాటాడు. టీమ్ విభాగంలో భారత్‌కు ప్రాతినిథ్యం వహించిన నెంబర్-1 ఆర్చర్ ధీరజ్ తనుదీప్‌రాయ్, ప్రవీణ్ జాదవ్ కలిసి కొరియా జంటపై 5-1 తేడాతో ఘన విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ధీరజ్, అంకిత్‌ల ద్వయం మెక్సికోపై కాంస్యంను ఖాతాలో వేసుకుంది. రెండు పతకాలను సాధించిన ధీరజ్‌ను, అంకిత్‌ను చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ చీఫ్ కోచ్, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెరుకూరి సత్యనారాయణ, స్పానర్లు, వారి తల్లిదండ్రులు అభినందించారు.


పాఠశాలల్లో అందించే సాంప్రదాయ విద్య కరపత్రాన్ని అవిష్కరిస్తున్న నిర్వాహకులు

కామకోటి పీఠం పాఠశాలల్లో వేద విద్య

లబ్బీపేట, ఏప్రిల్ 28 : కంచి కామకోటి పీఠం ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో స్వచ్ఛమైన వేద విద్యను అందిస్తున్నామని, ఈ పాఠశాలలో చేరాలనుకునేవారు మధ్యవర్తులెవ్వరికి ఎటువంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదని ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఇన్‌చార్జి లక్ష్మీ మాంధాత తెలిపారు. లబ్బీపేట లోని వేంకటేశ్వరస్వామి గుడి దేవస్థానం ప్రాంగణంలోని ఆదివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమె మాట్లాడారు.

వైసీపీ మ్యానిఫెస్టో మరో నవమోసాల పుట్ట

విద్యాధరపురం, ఏప్రిల్ 28 : జగన్‌రెడ్డి విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టో మరో నవమోసాల పుట్ట అని టీడీపీ తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర విమర్శించారు. ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ మ్యానిఫెస్టోలో హామీలన్ని పచ్చి అబద్ధాలని ఆత్మస్తుతి పరనింద తప్ప అందులో ఏమి లేదని అంకెల గారడీ చేసి మోసపూరిత మ్యానిఫెస్టోను విడుదల చేశారని నిందించారు. పేదలకు ఉదారంగా ఇచ్చిన హామీలేవి లేవన్నారు. మ్యానిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్ అని చెబుతున్న జగన్ రెడ్డి వాటి పవిత్రతకు భంగం కలిగించారని చెప్పారు.



కార్మిక సంఘాలు దీర్ఘకాలిక ప్రణాళికతో కార్యాచరణ రూపొందించుకోవాలి

ధర్నాచౌక్, ఏప్రిల్ 28 : కార్మిక సంఘాలు దీర్ఘకాలిక ప్రయోజనాలతో ఒక ప్రణాళికబద్ధంగా ఉండాల్సిన అవశ్యకత ఉందని దారి దీపం పత్రిక సంపాదకుడు డీవీవీఎస్ వర్మ తెలిపారు. "మేడే చరిత్ర - ప్రముఖుల ప్రసంగ వ్యాసాలు" పుస్తకావిష్కరణ కార్యక్రమం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే అంటే ఒక ఉద్యమమని, హక్కుల సాధన కోసం జరిగిన పోరాటమన్నారు. ఆ స్ఫూర్తితో నేడు కార్మిక వర్గం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పుస్తకాన్ని పరిచయం చేసిన విశాలాంధ్ర సంపాదకుడు ఆర్‌వీ.రామారావు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఉమామహేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడారు.

ఆటో డ్రైవర్‌పై వలంటీరు దాడి

ఎన్నికల ప్రచార వాహనాన్ని పక్కకు తీయమనడమే నేరం

విజయనగరంలో ఘటన


గాయపడిన ఆటో డ్రైవర్ శ్రీను

భోగాపురం, ఏప్రిల్ 28: విజయనగరం జిల్లా, లింగాలవలస గ్రామంలో బాడితబోయిన శ్రీను అనే ఆటో డ్రైవర్‌పై ఓ వలంటీరు, కొంతమంది వ్యక్తులు దాడి చేశారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లింగాలవలస గ్రామానికి చెందిన బాడితబోయిన శ్రీను భీమిలి పోస్టాఫీసులో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తూ ఖాళీ సమయంలో ఆటో నడుపుకొంటున్నారు. ఆదివారం ఆటోలో వస్తుండగా లింగాలవలసలో రహదారిపై అడ్డుగా ఎన్నికల ప్రచార వాహనం ఉంది. దాన్ని తీయమని శ్రీను కోరగా.. అక్కడే ఉన్న వలంటీర్ మునికిశోర్, మరికొందరు శ్రీనుపై దాడి చేశారు. పిడిగుద్దులు గుద్దారు. దీంతో శ్రీను ముక్కు పైభాగంలో తీవ్రగాయమైంది. వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వలంటీర్ కిశోర్,ముని సన్యాసినాయుడు, ముని సూర్యారావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే రోడ్డుపై అడ్డంగా ఉంచిన ప్రచార రథం వైసీపీ నేతకు చెందినదని స్థానికులు తెలిపారు. దీనిపై బాధితుడు శ్రీను మాత్రం మౌనం దాల్చారు.

మంత్రి అప్పలరాజుపై చర్యలు తీసుకోవాలి

ఆ ఐదుగురు సీఐలూ వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు

సీఈవోకు ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి అమలులో భాగంగా వాహన తనిఖీలు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను దూషించిన మంత్రి సీదిరి అప్పలరాజుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని టీడీపీ నేతలు కోరారు. శ్రీకాకుళం జిల్లా అనంతగిరిలో వైసీపీ జెండాలు, మందీ మార్బలంతో వెళ్తున్న వాహనాలను ఆపి, తనిఖీ చేసిన మహిళా అధికారిణిని... 'ఏంటి తమాషాలు చేస్తున్నారా? మేం ఇలాగే చేస్తాం? ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ మంత్రి అప్పలరాజు బెదిరించారని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఏఎస్ రామకృష్ణ, మన్నవ సుబ్బారావు కలిసి మంత్రి అప్పలరాజుపై ఫిర్యాదు చేశారు. అలాగే మాచర్ల నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఉన్న ఐదుగురు సీఐలు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆ సీఐలను తక్షణమే బదిలీ చేయాలని కోరారు. కోర్టు స్టేతో విధుల్లో కొనసాగుతున్న 167 మంది గ్రూప్-1 అభ్యర్థుల నియామకం సక్రమంగా జరగలేదని హైకోర్టు చెప్పినందున, తక్షణమే వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరారు. అనంతరం రామకృష్ణ, సుబ్బారావు మీడియాతో మాట్లాడుతూ... మాచర్లలో కొందరు పోలీసులే వైసీపీ గూండాల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు.

జగన్ మేనిఫెస్టోలో ప్రజలకు మొండిచేయి: యనమల

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జగన్ విడుదల చేసిన మేనిఫెస్టోలో ప్రజలకు మొండిచేయి చూపించారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ఆరోపించారు. ఆదివారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2019లో ప్రకటించిన మేనిఫెస్టోని అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేశారని తెలిపారు. 99 శాతం హామీలను అమలు చేశామని అబద్ధాలు చెప్పుకోవడమే తప్ప రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి చేసిందేమీ లేదన్నారు. మేనిఫెస్టోలో కొత్తవేవీ చేర్చలేదన్నారు. కనీసం పాతవి అమలు చేస్తామని కూడా చెప్పలేదని తెలిపారు. టీడీపీ హామీలతో పోలిస్తే వైసీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు తుస్సుమన్నాయన్నారు. జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో ఆయనకు, ఆయన అనుచరులకు, వాళ్ల ఆదాయాల్ని కాపాడుకోవడానికి ఉపయోగపడుతుందే తప్ప ప్రజల ఆదాయాన్ని, రాష్ట్ర అభివృద్ధిని కాపాడే విధంగా ఏ మాత్రం లేదని యనమల విమర్శించారు.

పెళ్లి బృందం ముసుగులో వైసీపీ ప్రచారం


పెళ్లి బృందం బస్సు వివరాలను పోలీసులకు చెబుతున్న కోళ్ల నాగేశ్వరరావు

భీమవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పెళ్లి బృందం ముసుగులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైసీపీ కార్యకర్తలను టీడీపీ నాయకులు పట్టుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నియోజకవర్గంలో వైసీపీ నాయకులు ఓ ప్రైవేటు బస్సుకు పెళ్లి బృందం బ్యానర్ తగిలించారు. అందులో వైసీపీ కార్యకర్తలు ఉన్నారు. వారి వద్ద వలంటీర్లు సేకరించిన ఓటర్ల సమాచారం ఉంది. వారు ఇంటింటికీ వెళ్లి గ్లాస్ గుర్తుకు ఓటు వేయొద్దంటూ ప్రచారం చేస్తున్నారు. గ్లాస్‌కు ఓటేస్తే పథకాలు రావని ఓటర్లను బెదిరిస్తున్నారు. ఈ పెళ్లి బస్సును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు తదితరులు బస్సును అడ్డుకుని ఎన్నికల అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన పోలీసులు బస్సును స్వాధీనం చేసుకున్నారు.

మీ మేనిఫెస్టోల్లో మేమెక్కడ?: సెక్స్‌వర్కర్లు

తిరుపతి (కపిలతీర్థం), ఏప్రిల్ 28: 'అన్ని రాజకీయ పార్టీలనూ హెచ్చరిస్తున్నాం. ఎన్నికల మేనిఫెస్టోల్లో మా సమస్యలు ప్రస్తావించి పరిష్కారానికి హామీ ఇవ్వాలి. లేనిపక్షంలో మా ఓట్లన్నీ నోటాకు వేసి నిరసన తెలుపుతాం' అని సెక్స్‌వర్కర్ల ప్రతినిధులు ప్రకటించారు. మానవ అక్రమ రవాణా బాధిత మహిళల ఫోరం సభ్యులు రజని, లక్ష్మీ, ప్రసన్న, శాంతి.. విముక్తి సేవా సంస్థ ప్రతినిధి రామ్మోహన్‌తో కలిసి ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. 'మమ్మల్ని బలవంతంగా సెక్సువర్కర్లుగా మార్చారు. ఏ ప్రభుత్వమూ మా గురించి పట్టించుకోలేదు. రాష్ట్రంలో దాదాపు నాలుగు లక్షల మంది సెక్స్ వర్కర్లు దుర్భర జీవితాలను గడుపుతున్నారు' అని తెలిపారు.

వైఎస్ భారతి ప్రచారంలో కార్యకర్తల ఘర్షణ!

పులివెందుల, ఏప్రిల్ 28: పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలం ఇనగలూరులో వైసీపీలోని మూడు వర్గాలు ఆదివారం బాహాబాహీకి దిగాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతి, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి సతీమణి సమత ఇంటింటి ప్రచారానికి ఆదివారం ఇనగలూరు గ్రామానికి వెళ్లారు. వైసీపీకి చెందిన మూడు వర్గాల నాయకులు, కార్యకర్తలు ఊరి శివార్లలో వారి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రచారాన్ని ఈ వీధి నుంచి ప్రారంభించాలంటే ఈ వీధి నుంచి ప్రారంభించాలంటూ ఆ మూడు వర్గాల మధ్య మాటామాటా పెరిగి కొట్టుకున్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు. అదే సమయానికి భారతి, సమతల కాన్వాయ్ అక్కడికి చేరుకుంది. భారతి, సమత ప్రచారానికి సిద్ధంకాగా, మూడువర్గాల నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుడిపాడులో గోవా మద్యం డంప్

వెయ్యి బాటిళ్లు స్వాధీనం.. వైసీపీ నాయకుడిపై కేసు

చీమకుర్తి, ఏప్రిల్ 28: ఎన్నికల్లో పంపిణీ కోసం వైసీపీ నాయకులు గోవా నుంచి తెప్పించి, నిల్వ చేసిన మద్యం డంపును ఎస్ఈబీ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ ఏఈఎస్ రవికుమార్ చీమకుర్తిలో విలేకరులకు ఆ కేసుకు సంబంధించిన వివరాలు తెలిపారు.ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం ఎర్రగుడిపాడులో మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు గంగిరేకుల వెంకట్రావుకు చెందిన ఆవుల ఫాం షెడ్‌లో గోవా నుంచి తెచ్చిన మద్యం బాటిళ్లను ఉంచారు. ఎస్ఈబీ అధికారులు వీటిపై దాడి చేసి 1,001 బాటిళ్లను స్వాధీనం చేసుకుని, షెడ్ ఓనర్ వెంకట్రావుపై కేసు నమోదు చేశారు. నిందితుడి కాల్‌డేటా ఆధారంగా విచారణ జరిపి కేసులు నమోదు చేస్తామని చెప్పారు. కాగా ఈ మద్యం నిల్వలు మంత్రి, ఎస్ఎన్‌పాడు అభ్యర్థి మేరుగ నాగార్జునవేనని ప్రచారం జరుగుతోంది.


పట్టుబడిన మద్యంతో ఎస్ఈబీ అధికారులు



విశాఖకు తొలి అంతర్జాతీయ క్రూయిజ్

విశాఖపట్నం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నూతనంగా నిర్మించిన టెర్మినల్‌కు ఆదివారం మొట్టమొదటి అంతర్జాతీయ క్రూయిజ్ వచ్చింది. లగ్జరీ విభాగానికి చెందిన 'ది వరల్డ్' విశాఖ టెర్మినల్‌లో బెర్తింగ్ అయింది. నౌకలో వివిధ దేశాలకు చెందిన పర్యాటకులు ఉన్నారు. విశాఖ చుట్టుపక్కల ఉన్న పర్యాటక ప్రదేశాలను సందర్శించనున్నారు. దేశంలోని ఇతర పోర్టులతో పోలిస్తే ఇమిగ్రేషన్ ప్రక్రియను విశాఖపట్నం పోర్టు అధికారులు వేగంగా 45 నిమిషాల్లోనే పూర్తి చేయడంపై షిప్ కెప్టెన్ సంతృప్తి వ్యక్తం చేశారు. నౌకలోని ప్రయాణికులంతా యజమానులుగా చెబుతున్నారు.

కేవలం సీఎం జగన్ మాటిచ్చారన్న కారణంతో.. తగిన కార్యాచరణ.. ముందు చూపూ లేకుండా ప్రారంభించిన 'హైస్కూల్ ప్లస్'లతో ప్రభుత్వం పేద విద్యార్థినుల జీవితాలను పణంగా పెట్టింది!. ఈ ఏడాది హైస్కూల్ ప్లస్‌లలో ఇంటర్ ఫలితాలు దిగజారడానికి అదే కారణమైంది. ప్రతి మండలంలో బాలికల జూనియర్ కాలేజీని ఏర్పాటు చేస్తామని సీఎం జగన్ గతంలో హామీ ఇవ్వడంతో.. అప్పటికే బాలికల కోసం కాలేజీలున్న మండలాలు మినహాయించి, మిగిలిన చోట్ల ప్రత్యేకంగా కాలేజీలు నిర్మించాల్సిన అవసరం ఏర్పడింది. అయితే దానికి నిధులు వెచ్చించకుండా ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను ఇంటర్మీడియట్‌కు అప్‌గ్రేడ్ చేసి వాటికి హైస్కూల్ ప్లస్ అనే పేరు పెట్టి పేద పిల్లల చదువులపై ప్రయోగం చేశారు. కనీస వసతులు లేకుండా హడావుడిగా కాలేజీలు ప్రారంభించి అధికశాతం మంది విద్యార్థినులు ఫెయిల్ అవ్వడానికి కారణమయ్యారు.

హైస్కూల్ ప్లస్‌ల ఫలితాలు.. (మొత్తం 294స్కూళ్లు)

ఉత్తీర్ణత శాతం	ఫస్టియర్	సెకండియర్
25శాతం కంటే తక్కువ	132	75
26 నుంచి 50శాతం	89	64
51 నుంచి 75శాతం	19	16
75 నుంచి 99 శాతం	5	6
100శాతం	4	10

సీఎం 'ఇంటర్' ఫెయిల్!

జగన్ మాట కోసం పాఠశాలల్లో బాలికలకు ఇంటర్ విద్య.. లెక్చరర్లు, ల్యాబ్‌లు లేకుండా 'హైస్కూల్ ప్లస్'లు

- ఫలితంగా ఎక్కువ మంది బాలికలు ఫెయిల్
- 25శాతం ఉత్తీర్ణతా సాధించలేని బడులే ఎక్కువ
- అల్లూరి జిల్లాలో ఫస్టియర్‌లో ఆల్ ఫెయిల్
- కడప జిల్లాలోనే 20శాతం ఉత్తీర్ణత లేదు
- అంతా అయ్యాక సప్లిమెంటరీకి చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ చెప్పిన ఒక్క మాట కోసం లెక్చరర్లు, సౌకర్యాలు, పుస్తకాలు లేకుండా ఉన్నత పాఠశాలల్లో 'హైస్కూల్ ప్లస్'ల పేరిట ఇంటర్మీడియట్ కోర్సులు ప్రారంభించి అక్కడ చదివిన విద్యార్థులు ఘోరమైన ఫలితాలు పొందడానికి కారణమైంది. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలను చూస్తే హైస్కూల్ ప్లస్‌లలో చదివిన వారిలో... ఫస్టియర్‌లో 4542 మంది పరీక్షలు రాస్తే కేవలం 1262 మంది (27.79శాతం) ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 2024 మంది పరీక్షలు రాయగా 690 మంది(34.09శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. కేవలం సీఎం జగన్ ఇచ్చిన ఒకే ఒక్క హామీ ఇలా వేలాది మంది బాలికలు ఫెయిల్ చేసింది. హైస్కూల్ ప్లస్‌లు ప్రారంభించే సమయంలో విద్యపై దృష్టి పెట్టని పాఠశాల విద్యాశాఖ అంతా అయ్యాక ఇప్పుడు నష్టనివారణ చర్యలకు దిగింది. సబ్జెక్టు టీచర్లను ఇచ్చినప్పటికీ చాలా తక్కువ ఉత్తీర్ణత శాతం నమోదైందని, అందువల్ల మే 24 నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం కావాలని ఆదేశించింది. ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేకంగా వేసవి క్యాంపులు నిర్వహించాలని, రోజువారీ టెస్టులు పెట్టాలని స్పష్టంచేసింది. అయితే అసలు సౌకర్యాల లేమితో హడావుడిగా ఇంటర్మీడియట్ కోర్సులు ప్రారంభించి, ఎక్కువ మంది ఫెయిల్ కావడానికి కారణమై, ఇప్పుడు సమ్మర్ క్యాంపులు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఏ జిల్లా చూసినా అంతే..

ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో ఫస్టియర్‌లో 67శాతం, సెకండియర్‌లో 78శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్ర సగటు ఇలా ఉంటే హైస్కూల్ ప్లస్‌లు మాత్రం అందులో సగం మేర సాధించడంలో కూడా చాలా దూరంలో నిలిచిపోయాయి. జిల్లాల వారీగా చూస్తే సీఎం సొంత జిల్లా కడపలో ఫస్టియర్‌లో 17.98శాతం, సెకండియర్‌లో 19.7శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఫస్టియర్‌లో 53 మంది రాస్తే 13 మందే పాసయ్యారు. ఇక సెకండియర్‌లో ఇద్దరు రాస్తే ఇద్దరూ ఫెయిలయ్యారు. నంద్యాల జిల్లాలో ఫస్టియర్ విద్యార్థులు 26 మంది పరీక్షలు రాస్తే ముగ్గురే పాసయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఫస్టియర్‌లో ఎనిమిది మందికి మొత్తం ఫెయిల్ అయ్యారు. సెకండియర్‌లో 31 మందికి ఆరుగురే ఉత్తీర్ణులయ్యారు. విశాఖపట్నంలో 278 మంది విద్యార్థుల్లో 47మంది పాసయ్యారు. చిత్తూరు జిల్లాలో ఫస్టియర్‌లో 366 మందిలో 73 మంది, సెకండియర్‌లో 165 మందిలో 44 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇలా ఏ జిల్లాలో చూసినా దారుణమైన ఫలితాలే వచ్చాయి. 294 హైస్కూల్ ప్లస్‌లు ప్రారంభించినా అన్నిట్లో విద్యార్థులు చేరలేదు. దీంతో ఈ ఏడాది ఫస్టియర్‌లో 249 పాఠశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. వాటిలో 132 పాఠశాలలు 25శాతం కంటే తక్కువ ఉత్తీర్ణత సాధించాయి. 89 పాఠశాలల్లో 26 నుంచి 50శాతం, 19 పాఠశాలల్లో 51 నుంచి 75శాతం, 5 పాఠశాలల్లో 75 నుంచి 99శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు ఫస్టియర్‌లో 4, సెకండియర్‌లో 10 మాత్రమే ఉన్నాయి.

జగన్ మాట కోసం..

2022-23 విద్యా సంవత్సరంలో 294 హైస్కూల్ ప్లస్‌లు ప్రారంభించారు. ఆ విద్యా సంవత్సరంలో సుమారు 3వేల మంది బాలికలు వాటిలో చేరగా, కేవలం 12శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో సెకండియర్‌లో చాలా మంది వాటి నుంచి బయటికొచ్చేశారు. అయితే ఇంటర్మీడియట్ కోర్సులైతే ప్రారంభించిన ప్రభుత్వం మొదటి సంవత్సరం అసలు లెక్చరర్లనే ఇవ్వలేదు. అవే పాఠశాలల్లో ఉన్న సీనియర్ టీచర్లనే పాఠాలు చెప్పాలని ఆదేశించింది. దీంతో చదువు సక్రమంగా సాగలేదు. ఈ సీనియర్ టీచర్లకు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్‌గా పదోన్నతి కల్పిస్తామని మాట తప్పింది. తీరా 2023-24 విద్యా సంవత్సరంలో 1754 మందిని పీజీటీలుగా హైస్కూల్ ప్లస్‌లలో నియమించింది. అంటే ఒక ఏడాది టీచర్లు, లెక్చరర్లు లేకుండానే బోధన చేయించిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కింది. ఇక ఇంటర్మీడియట్ కోర్సులకు కచ్చితంగా అవసరమైన ల్యాబ్‌లు ఒక్క పాఠశాలలో కూడా ఏర్పాటుచేయలేదు. హైస్కూల్ ప్లస్‌లలో చదివిన బాలికలకు అసలు ల్యాబ్‌లు అంటే ఏంటో చివరి ఏడాది ప్రాక్టికల్స్ వరకూ తెలియదు. ఇక పుస్తకాలను కూడా సక్రమంగా పంపిణీ చేయలేదు. ఇలా బోధన నుంచి సౌకర్యాల వరకు ఏవీ లేకుండానే ఇంటర్మీడియట్ కోర్సులు ప్రారంభించి జగన్ దృష్టిలో మెప్పు పొందిన పాఠశాల విద్యాశాఖ, విద్యార్థులను ఉతీర్ణులు చేయడంలో విఫలమైంది. సీఎం మాట కోసం ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లు ఫలితాల్లో ఘోరంగా విఫలం కావడంతో ఇది జగన్ ఫెయిల్యూర్‌గా విద్యార్థుల తల్లిదండ్రులు అభివర్ణిస్తున్నారు.

జగన్ కనుసన్నల్లో మైనింగ్ మాఫియా..!

- యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ
- స్మగ్లర్లకూ టికెట్లు కేటాయించిన వైసీపీ
- అనుమతులు లేకుండానే అక్రమ తవ్వకాలు
- ఇసుక అక్రమ తవ్వకాల గుంతల్లో పడి గడచిన ఐదేళ్లలో 114 మంది మృతి
- ఈ మరణాలకు సీఎందే బాధ్యత
- సహజ వనరుల దోపిడీపై కూటమి నేతలు ఫైర్

అమరావతి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి కనుసన్నల్లో వైసీపీ నేతలు రాష్ట్రంలో యథేచ్ఛగా సహజ వనరులను దోపిడీ చేస్తున్నారని కూటమి నేతలు ఆరోపించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో జనసేన పార్టీ నేత తమ్మిరెడ్డి శివశంకర్, బీజేపీ నేత పాతూరి నాగభూషణం, టీడీపీ నేత సయ్యద్ రఫీ మాట్లాడారు. శివశంకర్ మాట్లాడుతూ, 'వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ క్వారీ యజమానుల్ని, మైనింగ్ లీజుదారుల్ని బెదిరించి రూ.కోట్లు దండుకున్నారు. అటవీ, రెవెన్యూ, ప్రభుత్వ భూముల్లోని గనుల్లో అనుమతులు లేకున్నా అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. ఎన్నికల కోడ్ వచ్చాక కూడా నెల్లూరులో రూ.400 కోట్ల విలువైన క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలకు గురైంది. ప్రకాశం, శ్రీకాకుళం, విజయనగరంలో అరుదైన బ్లాక్ గ్రానైట్, పెరల్ గ్రానైట్ గనులున్నాయి. ఆ గ్రానైట్ లీజుదారులు రెన్యువల్ చేసుకోకుండా అధికార పార్టీ నేతలు వారిని బెదిరిస్తున్నారు. ప్రస్తుతం క్వారీల్లో జరుగుతున్న పనులకు వారు అడ్డుపడడం వలన అక్కడ పనిచేసే కూలీలు ఉపాధి కోల్పోతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. పాతూరి నాగభూషణం మాట్లాడుతూ, 'ఇసుక ద్వారా దోచుకున్న రూ.కోట్ల సొమ్మును రానున్న ఎన్నికల్లో ఓటర్లకు పంచేందుకు వైసీపీ నేతలు సిద్ధంగా ఉన్నారు. ట్రక్కు ఇసుక గతంలో రూ.వెయ్యి ఉండగా నేడు రూ.13 వేలకు అమ్ముతున్నారు. శేఖర్‌రెడ్డికి లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం సహకరిస్తోంది. ఐదేళ్లలో ఇసుక అక్రమ తవ్వకాలతో ఏర్పడ్డ గుంతల్లో పడి 114 మంది మృతి చెందారు. ఈ హత్యలకు సీఎం బాధ్యత వహించాలి' అని డిమాండ్ చేశారు. టీడీపీ నేత రఫీ మాట్లాడుతూ, 'నాటి కొందరు అడవి దొంగలే నేడు వైసీపీలో ప్రజా ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. ఎర్రచందనం స్మగ్లర్లకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశమిచ్చిన జగన్ ప్రజాస్వామ్యాన్ని ఏ విధంగా పరిరక్షించగలరు? శేషాచలం అడవుల్లో రూ.కోట్లు విలువ చేసే ఎర్రచందనం స్మగ్లింగ్ అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే జరుగుతోంది. వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి, చిత్తూరు అభ్యర్థి విజయానందరెడ్డి నేతృత్వంలో రూ. 10 లక్షల కోట్ల విలువైన మూడు లక్షల టన్నుల ఎర్రచందనాన్ని కొల్లగొట్టారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌కి అడ్డుకట్ట వేయడంలో సర్కార్ పూర్తిగా విఫలమయింది' అని విమర్శించారు.

దేవుడి స్క్రిప్ట్ భళా!

నాడు పీఎస్సార్ కోసం విశ్వజీత్ పక్కకు.. నేడు పీఎస్సార్‌ను తప్పించి విశ్వజీత్‌కు పగ్గాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)


పీఎస్సార్ ఆంజనేయులు


డీజీ కుమార్ విశ్వజీత్

'కర్మ రిటర్న్స్'... అంటే, నువ్వు ఒకరికి చేసింది ఆ తర్వాత తిరిగి నీకే ఎదురవుతుందని అర్థం. ఇప్పుడు పోలీసుశాఖలో ఇదే మాట వినిపిస్తోంది. ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులును ఎన్నికల కమిషన్ పక్కకు తప్పించిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో అదనపు డీజీ కుమార్ విశ్వజీత్ కొత్త ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమితులయ్యారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు ఒక్కసారిగా పాత సంగతులు గుర్తు తెచ్చుకుంటున్నారు. నాలుగేళ్ల కిందట కుమార్ విశ్వజీత్ ఏసీబీ డైరెక్టర్ జనరల్‌గా ఉండేవారు. ఆయనను జగన్ అవమానకర రీతిలో పక్కకు తప్పించారు. పోస్టింగ్ కూడా ఇవ్వకుండా బదిలీ చేశారు. ఆయన స్థానంలో 'సమర్థుడైన అధికారి' అంటూ పీఎస్సార్ ఆంజనేయులును నియమించారు. అప్పటికే రవాణా శాఖ కమిషనర్‌గా ఉన్న పీఎస్సార్‌కు ఏసీబీ చీఫ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించడం గమనార్హం. ఆ తర్వాత కూడా పోస్టింగ్‌ల విషయంలో విశ్వజీత్ వైసీపీ ప్రభుత్వం నుంచి వివక్ష ఎదుర్కొన్నారు. ఎన్నికల ముందు సీన్ 'రివర్స్' అయ్యింది. పీఎస్సార్ ఆంజనేయులు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉంటే ఎన్నికలు నిష్పాక్షికంగా జరగవని ఎన్నికల కమిషన్ భావించింది. ఆయన 'జగన్ భక్తి'పై అందిన ఫిర్యాదులను పరిశీలించి... బదిలీ వేటు వేసింది. ఆ పోస్టులో కొత్త అధికారిని నియమించేందుకు ముగ్గురి పేర్లు పంపాలని ఆదేశించింది. ఈసీ ఆదేశాల మేరకు కుమార్ విశ్వజీత్, అతుల్ సింగ్, సంజయ్ పేర్లు పంపగా... విశ్వజీత్‌ను ఈసీ ఎంపిక చేసింది. ఈ విషయం బుధవారం రాత్రి బయటికి రావడంతో గురువారం నాడు కొందరు పోలీసు ఉన్నతాధికారుల్లో ఇది కదా దేవుడి స్క్రిప్ట్ అంటే.. అనే వ్యాఖ్యలు వినిపించాయి. విశేషమేమిటంటే... గత ఎన్నికల సమయంలోనూ విశ్వజీత్ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించారు. అప్పట్లో ఏబీ వెంకటేశ్వరరావును ఈసీ బదిలీ చేసింది. రాష్ట్ర పోలీసు నియామక మండలి చైర్మన్‌గా ఉన్న విశ్వజీత్‌ను ఇంటెలిజెన్స్ అధిపతిగా నియమించింది.

విశ్వజీత్‌తో వైసీపీ బంతాట...

జగన్ తనవారి కోసం కుమార్ విశ్వజీత్‌తో బంతాట ఆడుకున్నారు. ముఖ్యమంత్రికాగానే ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా తెలంగాణ కేడర్‌కు చెందిన స్టీఫెన్ రవీంద్రను తెచ్చుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. ఆరు నెలలు ప్రయత్నించినా కుదరక పోవడంతో ఐజీ ర్యాంకు అధికారి మనీశ్ కుమార్ సిన్హాను తెచ్చుకుని... విశ్వజీత్‌ను ఏసీబీ డీజీగా బదిలీ చేశారు. విపక్షాలను టార్గెట్ చేయాలన్న ఆదేశాలు పాటించకపోవడంతో... ఆయన పనితీరు బాగాలేదంటూ ఎలాంటి పోస్టింగ్ లేకుండా జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత రెండు నెలలకు హోంశాఖ కార్యదర్శి పోస్టింగ్ ఇచ్చినా అక్కడా ఎక్కువ కాలం ఉంచలేదు. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలపై అడ్డగోలు ఆంక్షలు పెట్టే జీవో తెచ్చేందుకు అడ్డు తగులుతారనే ఉద్దేశంతో... విశ్వజీత్‌ను ఏ మాత్రం ప్రాధాన్యం లేని రైల్వే ఏడీజీగా పంపారు. రవిశంకర్ అయ్యన్నార్‌ను విశాఖ పోలీసు కమిషనర్‌గా నియమించడంతో ఖాళీ అయిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను విశ్వజీత్‌కు అప్పగించారు. అక్కడ కనీసం నాలుగు నెలలు కూడా ఉండనివ్వలేదు. విపక్షాలపై విరుచుకుపడటమే విధిగా నిర్దేశిస్తూ... కొల్లి రఘురామిరెడ్డికి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు బాధ్యతలు ఇచ్చారు. విశ్వజీత్‌ను తిరిగి రైల్వే ఏడీజీగా పంపారు. తాజాగా ఈసీ ఆదేశాలతో ఆయన ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమితులయ్యారు.


చిరుతను బంధించేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద బోను ఏర్పాటు చేస్తున్న అటవీ శాఖ అధికారులు

శంషాబాద్ విమానాశ్రయంలో చిరుత కలకలం !

ఎయిర్‌పోర్టు పరిధిలోని ఓ సర్వీస్ సెంటర్ వద్ద సంచారం

బోన్లు ఏర్పాటు చేసిన అటవీశాఖ అధికారులు

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) : శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో చిరుతపులి కలకలం సృష్టించింది. విమానాశ్రయం పరిధిలో ఓ చిరుత సంచరిస్తున్నట్టు అధికారులు శనివారం సాయంత్రం గుర్తించారు. అటవీశాఖ, ఎయిర్‌పోర్టు అధికారుల కథనం ప్రకారం.. ఎయిర్‌పోర్టు పరిధిలోని ఓ ఎయిర్ క్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ వద్ద శనివారం సాయంత్రం గస్తీ తిరుగుతున్న సమయంలో పెట్రోలింగ్ సిబ్బందికి చిరుత పులి కనిపించింది. దీంతో అప్రమత్తమైన విమానాశ్రయ అధికారులు వెంటనే అటవీశాఖకు సమాచారం ఇచ్చారు. చిరుత కనిపించిన సర్వీస్ సెంటర్ ప్రాంతంలో అటవీ శాఖ సిబ్బంది గాలించినా దాని జాడ తెలియలేదు. ఈ క్రమంలో విమానాశ్రయ పరిధిలోని గొల్లపల్లి ప్రాంతంలో ఆదివారం ఉదయం చిరుతపులిని చూశామని ఆ గ్రామ ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గొల్లపల్లి ప్రాంతంలో చిరుత పులి పాదముద్రలను అధికారులు గుర్తించారు. దీంతో విమానాశ్రయం, పరిసర ప్రాంతాలను అటవీశాఖ అధికారులు జల్లెడ పడుతున్నారు. చిరుతను బంధించేందకు ఎయిర్‌పోర్టు పరిసరాల్లో బోన్లు ఏర్పాటు చేశారు. చిరుత జాడను గుర్తించేందుకు సీసీ కెమెరాల ఫుటేజీని కూడా పరిశీలిస్తున్నారు. చిరుత సంచారం నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సమీపంలోని గొల్లపల్లి, చిన్నగోల్కొండ, బహదూర్‌గూడ, సంఘీగూడ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులోకి చిరుత వచ్చిందనే వార్త గతంలోనూ ఓసారి కలకలం రేపింది. అయితే అది చిరుత కాదు అడవి పిల్లి అని తేల్చిన అధికారులు అందుకు సంబంధించిన ఫొటోలను కూడా విడుదల చేశారు.

రిజర్వేషన్లకు ఆరెస్సెస్ వ్యతిరేకం కాదు

- అది సోషల్‌మీడియా గూండాల దుష్ప్రచారమే
- ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలు
- రామరాజ్యమూ వస్తుంది: చినజీయర్

హైదరాబాద్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో రిజర్వేషన్లకు తాము ఎప్పుడూ వ్యతిరేకం కాదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) చీఫ్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. అర్హులైన వారికి రిజర్వేషన్లు అందాలని, అసమానతలు తొలగేవరకూ అవి కొనసాగాలని చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగించి సోషల్ మీడియా గూండాలు దుష్ప్రచారం చేసి, విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన నాదర్‌గుల్‌లో 'విద్యా భారతి విజ్ఞాన కేంద్రాన్ని' చినజీయర్‌స్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భాగవత్ మాట్లాడుతూ.. 1952లో ఒక చిన్న గదిలో 15 మంది విద్యార్థులతో ప్రారంభమైన శ్రీ సరస్వతి శిశు మందర్ వేలాది పాఠశాలలుగా రూపాంతరం చెందిందని చెప్పారు. ఇప్పుడు ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభించి దేశభక్తి, విలువలతో కూడిన విద్యను అందిస్తోందని తెలిపారు. సంఘ్ సభ్యులు సమాజానికి ఎంతో సాయం చేసినా, కనీసం కృతజ్ఞతలు కూడా ఆశించరని చెప్పారు. మనమందరం కలిసి ఉన్నంతకాలం సుఖంగా ఉంటామన్నారు. భయం, స్వార్థంతో ఎక్కువ కాలం కలిసి ఉండలేమని తెలిపారు. మన దేశంలో వేర్వేరు ఆచారాలు, ఆహార అలవాట్లు, భాషలు, వస్త్రధారణ ఉన్నప్పటికీ మనమంతా ఒక్కటేనని చెప్పారు. అందరిలో రాముడు ఉన్నాడని, సృష్టి మొత్తం నారాయణుడు వ్యాపించి ఉన్నాడని, అందుకే మనం అందరూ ఒకటేనని అన్నారు. విద్యతో జ్ఞానం వస్తుందని, జ్ఞానాన్ని సమాజ హితానికి వాడాలని సూచించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను మనమే కాపాడుకోవాలన్నారు.

భారత్‌ను విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని కృషి

చదువు, సంస్కారం, విద్యావంతుడైన నాయకుడు ఉంటే దేశం పురోగతి సాధిస్తుందని, 75 ఏళ్ల తర్వాత అలాంటి వ్యక్తి ఆధ్వర్యంలో భారత్ ముందుకు వెళుతోందని త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. భారత్‌ను విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని మోదీ ఎనలేని కృషి చేస్తున్నారని చెప్పారు. ఆయన పాలనలో దేశం గర్వపడే రోజులు వచ్చాయన్నారు. విలువలతో కూడిన విద్యను సరస్వతి శిశుమందిర్‌లో అందిస్తున్నారని కొనియాడారు. దాదాపు 500 ఏళ్ల తర్వాత రాముడు వచ్చాడని, త్వరలోనే రామ రాజ్యం కూడా వస్తుందని చెప్పారు. చదువు సంపాదన కోసమే అనే భావన నేటి విద్యార్థుల్లో ఉన్నదని, సమాజ హితం కోసం కూడా అని వారు తెలుసుకోవాలని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని విద్యాలయాల్లో తెలుగు భాషను విస్మరిస్తున్నారని, ప్రైవే టు పాఠశాలలతోపాటు ప్రభుత్వ బడుల్లోనూ ఆంగ్ల మా. ధ్యమంలో బోధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంగ్లి ష్ నేర్చుకోవడం తప్పుకాదు కానీ, మాతృభాషను మరవకూడదని చెప్పారు. అన్ని మతాల వారిని మనతో కలిసి ఉండేందుకు ఆహ్వానిస్తామని, దాని వల్ల మనకు నష్టం కలిగినా, వారిని ఆదరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరెస్సెస్ అఖిల భారతీయ ప్రచార్ ప్రముఖ్ సునీల్ అంబేకర్, క్షేత్ర ప్రచారక్ సుధీర్, సహ ప్రచారక్ భరత్, విద్యా భారతి విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు తేలుకుంట్ల రమేశ్‌గుప్తా, 14 ఎకరాల స్థలదాత భీమిడి పెద్దనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్టీసీ బస్సు దగ్ధం

డ్రైవర్ అప్రమత్తతో తప్పిన పెనుప్రమాదం

31 మంది ప్రయాణికులు క్షేమం


పూర్తిగా కాలిపోయిన తెలంగాణ ఆర్టీసీ బస్సు

టంగుటూరు, ఏప్రిల్ 28 : తిరుపతి నుంచి హైదరాబాద్ వెళుతున్న తెలంగాణ ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. కొద్ది నిమిషాల్లోనే అది దగ్ధమైంది. డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. ఈ సంఘటన ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం వద్ద ఆదివారం రాత్రి 11 గంటలు దాటిన తర్వాత చోటుచేసుకుంది. బస్సు సూరారెడ్డిపాలెం వద్దకు రాగానే మంటలు రేగాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ బస్సును ఆపాడు. అందులో ఉన్న 32 మంది ప్రయాణికులను కిందకు దించాడు. అతర్వాత కొద్దిసేపటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూటే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.